# నిజముర కృష్ణా...!

నవల

– కమలాగాయత్రి(క్రొవ్విడి)చెనిమెళ్ళ



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 232

కౌముది మాసపత్రికలో

జనవరి 2020 సంచిక నుంచి జూలై 2021 సంచిక వరకూ వచ్చిన

సీరియల్ నవల

**ఫ్లైట్ ఎక్కిన** పదినిమిషాలకి జేబులోంచి లెటర్ బయటికి తీశాను.. వచ్చి ఇరవై నాలుగ్గంటలు కాకపోయినా.., మళ్ళీ, మళ్ళీ తీసి చదవడంతో బాగా నలిగిపోయిందది..

అక్షరాలు అన్నీ కన్నీటితెరల మాటున మసకబారినా పేజీ చివర చిన్ని సంతకం..."తులసి..",

ఊహూ.. కాదు ఓ పెద్ద జ్ఞాపకం.. "మా తులసి.."

కొన్ని గంటలనుండీ సడెన్ గా మారిపోయిన సిట్యుయేషన్స్ గుర్తొచ్చి మనసు భారమైంది..

"సో.. మేడమ్ ముద్రా.. తమరి షాపింగ్ మ్యానియా ఇప్పటికైనా పూర్తయిందా, లేక ఇంకా మిగిలివుందా..?" నవ్వుతూనే అన్నా నా గొంతులో కాస్తంత విసుగు ధ్వనించిందేమో.., పరమ సీరియస్ గా సెల్ లో లిస్ట్ తోటి తాను తెచ్చిన ఐటెమ్స్ టాలీ చేసి అల్మారాలో సర్దుకుంటున్న ముద్ర కళ్ళు తిప్పి నావైపు చూసింది.

"అబ్బా.. ప్లీజ్.. అలా చూడకు ముద్రా... సీ.., వి ఆర్ నాట్ రన్నింగ్ అవే ఫ్రమ్ యూ.ఎస్. వెరీ సూన్ ఆఫ్టర్ అవర్ మ్యారేజ్ రైట్...? సో.. తర్వాత కూడా యూ కేన్.., ఐ మీన్ వి కేన్.. షాప్ నో..? కదా.. ప్లీజ్..?" దీనంగా ముఖం పెట్టి అర్థించాను.

చిన్నగా నవ్వింది, "అయిపోయింది క్రిష్.., ఆల్మోస్ట్ డన్.., ఎక్సెప్ట్ ఫ్యూ శారీస్..", అంది చాలా కూల్ గా.

"ఓ మై గాడ్.. ఇంకా శారీస్ ఆ..? నీ సెలక్షన్ తో ఇప్పటికే మీ మామ్ వీ, మా అమ్మవి.. ఇద్దరి లగేజ్ నిండిపోయింది.., వాట్ మోర్ యూవాన్నా బై స్వీటీ..!!" , నా కళ్ళకో షాపింగ్ మాల్ రెప్లికాలా కనిపిస్తున్న ముద్రని చూసి నవ్వాపుకోలేకపోయాను.

తనూ నా నవ్వుతో శృతి కలుపుతూ చేయి సాచింది, నన్నే చూస్తూ దగ్గరకి రమ్మన్నట్టుగా. కాస్తంత బెట్టుగా తల అడ్డంగా తిప్పాను రానన్నట్టు సూచిస్తూ.

కొంచెం స్ట్రిక్ట్ గా , చాలా సిస్టమేటిక్ గా, ప్రాక్టికల్ గా వుండే మిస్ లోపాముద్రా బక్షీ చాలా రేర్ గా పాంపర్ చేస్తుంది. అలాంటప్పడే నేను కొంచెం బెట్టు చేయగలను. ఆలసించిన ఆశాభంగం క్రిష్.. అంటూ నా మనసు గబగబా సిగ్నల్స్ ఇచ్చేస్తుంది.

అంతలోనే లేచొచ్చి నా మెడ చుట్టూ తన చేతులు అల్లింది. "బేబీ.., వాళ్ళు తెచ్చేవి షో ఆఫ్ అండ్ ఎగ్జిబిషనింగ్ కి, నేను తీసుకునేవి.. మనకోసం.., నీ-నా కోసం.. అర్ధమైందా మడ్ హెడ్..", అంటూ సున్నితంగా నా తలని తన తలతో చిన్నగా ఢీ కొట్టింది.

"హేయ్.. బొమ్మరిల్లు మూవీ చూపించానా లేదా..? మరి ఏంటిది..? పెళ్ళికి ముందు నాకు కొమ్ములొస్తే..? " కోపం నటిస్తూ గదిమాను.

"వస్తే..?", అంటూ నా నుంచి దూరం జరిగి, కార్పెట్ మీదకి జారి, సోఫా కుషన్ తన తలకిందకి లాక్కుంది. "హా.. చెప్పు క్రిష్.. వస్తే..?" అల్లరిగా రెట్టించింది.

"ఆహా.. యూ వాన్నా లుక్ మోర్ రేడియంట్ అండ్ బ్రైటర్ దాన్ మీ.. హా..", అడుగుతున్నట్టే వంగి వెంటనే నా తల తో ఢీ కొట్టబోయాను. అది గ్రహించి ముద్ర చప్పున తప్పుకోవడంతో నా తల కుషన్ మీద లాండైంది. పకపకా నవ్వింది.

"వోంట్ మేక్ మచ్ డిఫరెన్స్ బోయ్.. ఇప్పుడూ, ఎప్పుడూ నీకన్నా నేనే బ్రైట్... అన్ని విషయాల్లో.." వెక్కిరించి దూరంగా తప్పుకోబోయింది. గభాల్న ఆమెని  బలంగా పట్టుకుని ఆపి ఆమె ముఖాన్ని నా అరచేతుల్లోకి తీసుకున్నాను. ఈసారి దూరం జరగలేదు ముద్ర. సూటిగా నా కళ్ళలోకి చూసింది.

చిన్నగా ఆమె తల మీద నా నుదుటితో ఢీకొట్టి, దెబ్బతగిలిన చోట మృదువుగా వేలికొనలతో నిమిరాను.

నావైపోసారి ఆప్యాయంగా చూసి నా భుజానికి తలాన్చి చెప్పింది ముద్ర, "యూ నో క్రిష్.., ఇదే నీలో నాకు నచ్చేది.., నువ్వు మనుషుల్ని ప్రేమిస్తావు, ప్రేమించడంతో పాటూ ప్రేమని చూపిస్తావు..,

నీ దగ్గర నాకు పార్ట్నర్ లో వుండాల్సిన రొమాన్స్, లవర్ లోని ప్రేమ, అటెన్షన్, ఫాదర్ లోని కన్సెర్న్, బ్రదర్ లోని ప్రొటెక్షన్, ఫ్రెండ్ లోని క్లోజ్నెస్.., అన్నీ దొరుకుతాయి...

...అండ్ మోస్ట్ ఇంపార్టెంట్లీ యూ హావ్ ఎ వెరీ గుడ్ సెన్స్.. ఏది ఎప్పుడు అందివ్వాలో తెలుసు నీకు, ఐ ఫీల్ కంప్లీట్ విత్ యూ..", కళ్ళు మూసుకుని డీప్ గా చెప్పుకునిపోతున్న ముద్రని లాలనగా దగ్గరకి హత్తుకున్నాను.

"ముద్రా..! ప్రేమంటే కేవలం మనకి కావలసినది పొందడం మాత్రమే కాదు కదా.., మనం ప్రేమించినవారికి వారికేం కావాలో అది అందివ్వడం.. ప్లస్ మనకు దొరికిన ప్రేమని సరిగ్గా రిసీవ్ చేసుకోవడంకూడా. యూ డోన్ట్ నో వాట్ ఆల్ యూ గేవ్ మీ.. నీ ప్రమేయం, ప్రేమా లేకపోతే నాలో అంత ఇష్టం వచ్చేదా చెప్పూ.., అసలూ..", అంటూ ఇంకేదో చెప్పబోతుంటే చప్పున నా నోటిని సుతారంగా తన చేత్తో మూసింది.,

"..ష్..., ఏదో నీ కంపెనీవల్ల, అదీ.., నీ లక్ కాస్త బాగుండి కొద్దీ నా నోటినుంచి అలా, అలా నాలుగు మంచి మాటలొచ్చాయి. ఎంజాయ్ చెయ్యి బాబూ..! మళ్ళీ ఎప్పుడూ సీరియస్ గావుంటానూ, డైరెక్ట్ గావుంటానూ, స్ట్రెయిట్, బ్లంట్, స్ట్రిక్ట్ అని ఏడవకుండా.."

నవ్వేశాను, "మిస్ లోపాముద్రా బక్షీ.., వన్ డే యూ విల్ గెట్ ఎ వెరీ గుడ్ బ్యాంగ్ ఫ్రంమ్ మీ.., జస్ట్ మార్క్ మై వర్డ్స్..", అన్నాను.

"అహ్హా.. సో కాన్ఫిడెంట్.. క్రిష్ ఏంటి సంగతి.., వాట్స్ ద మ్యాటర్..? పెళ్ళి దగ్గరకొస్తున్న కొద్దీ తమరి టోన్ ఛేంజ్ అవుతోందే..!", అంటూ అల్లరిగా అంది.

దెబ్బతిన్నట్టు చూశాను,"వ్వాట్.., కమ్ అగైన్...?" నాకు తెలియకుండానే నా గొంతులో ఒకలాంటి తీవ్రత చోటుచేసుకుంది.

"ఓ.. సో సారీ క్రిష్.. ఐ డిన్ట్ మీన్ .." కంగారుగా అంది నా ముఖం చూసి.

"నా టోన్ ఛేంజ్ అవచ్చు, అప్పియరెన్స్ ఛేంజ్ అవచ్చు, లేక నా ఎగ్జిస్టెన్సే ఛేంజ్ కావచ్చు.. కానీ.. ముద్రా.. లోపలున్న కృష్ణ మాత్రం ఏనాటికీ మారడు.." సూటిగా చెప్పాను.

చాలా రేర్ గా అలాంటి గంభీరమైన స్టేట్మెంట్స్ ఇస్తాను. యూజువల్ గా ఆరోల్ ముద్రదే. చాలా అరుదుగా జరిగే అలాంటి మాటల్లో తను మౌనంగా వుండిపోతుంది. అందరికీ అలాగే అనిపిస్తుందో లేక నాకు మాత్రమే తోస్తుందో.. ఎందుకో తెలీదు కానీ, నా ఇన్టెన్షన్స్ ఎవరయినా డౌట్ చేస్తే తట్టుకోలేను, అందులోనూ నాకు కావలసినవాళ్ళైతే అసలు భరించలేను..

"కంగారుపడ్డావా..?" నా సీరియస్ నెస్ నాకే ఇబ్బందిగా అనిపించి అడిగాను నన్ను నేను తమాయించుకుంటూ..

"లేదు.., సమ్ కాఫీ..?", అడిగింది చాలా కాజువల్ గా దట్ ఈజ్ ముద్రా.. ఎదుటివ్యక్తి మాట్లాడేదాంట్లో తనకి పాయింట్ కనిపిస్తే వాళ్ళు తననెంత ఇబ్బందిపెట్టినా చాలా క్యాజువల్ గా తీసుకుంటుంది. ఈ ఒక్క పాయింట్ లోనే ఈక్వేషన్ సెట్ కాక చాలా రిలేషన్స్ దెబ్బతింటున్నాయి.. ఐ మస్ట్ థ్యాంక్ గాడ్ నాకు చాలా చక్కటి ఆటిట్యూడ్ వున్న వ్యక్తులను లైఫ్ లో అందించినందుకు..

ఆప్యాయంగా తన తలమీద చిన్నగా ప్యాట్ చేసి, "నేను చేస్తాను.." అంటూ లేచి కిచెన్ వైపు నడిచాను.

"..హేయ్ క్రిష్.., నా రాక్ అరేంజ్మెట్  అయితే అయిపోయింది, ఫైనల్ గా చెక్ చేస్తుంటాను.., బై ద టైం యూ ప్రిపేర్ ఇట్.., ఓ.కే.నా..?", అంటూ నా వెనుకగా వినిపించిన తన మాటలు విని, తలతిప్పి చూసి,.. చిన్నగా నవ్వి.. బొటనవేలితో 'డన్..' అన్నట్టుగా చూపి, కాఫీ చేయడానికి లోపలికి వచ్చాను.

యూ.ఎస్. లో ఎన్నిరకాల కాఫీలు తాగినా నా చేతి ఫిల్టర్ కాఫీకి నేనే సాటి అని నా NRI గ్యాంగ్ లో చాలామంచి పేరుంది నాకు, చెప్పొద్దూ.., కొన్నిసార్లు పొగడ్తలు ఎక్కువైపోయి, ఉద్యోగం మానేసి కాఫీ షాప్ పెట్టయ్యాలన్నంత వుత్సాహం వచ్చేస్తుంది..

అంతలోనే, "బాబూ కృష్ణా.. ఇక చాలు.. వచ్చేయ్.." అంటూ నా అంతరాత్మ నాకున్న కమిట్మెంట్స్ గుర్తుచేసి నాలుగు మొట్టికాయలు వేసి సెట్ చేయగానే స్పృహలోకి వస్తుంటాను.

సన్నగా ఏదో పాట హమ్ చేస్తుంటే డోర్ చప్పుడైంది. నీళ్ళు ఫిల్టర్ లో పోసి కదిలాను.

పక్కఫ్లాట్ లో వుండే రోషన్ భాభీ.., "ఓహ్ మీరా.., సలామ్ భాభీ.., లోపలికి రండి", వీలైనంత హైదరాబాదీ గెశ్చర్ తో లోపలికి ఆహ్వానించాను.

"లేదు భయ్యా, పనుంది.. నిన్నంతా మీరు లేరు..., మీ పార్సెల్ ఒకటి మా లెటర్ బాక్స్ లో వచ్చింది.. ఇండియా నుండి.., ఇద్దామని వచ్చాను.." చేతిలో వున్న చిన్న ప్యాకెట్ పదిలంగా నాకందించింది. ఆత్రంగా అందుకున్నాను.

మరీ తన ముందే చింపి చూసేస్తే బాగోదని ఆగి "ఎట్లీస్ట్ వన్ కప్ కాఫీ.. భాభీ..", అడిగాను.

"ఫిర్ కభీ భయ్యా.., ఇంట్లో మెహమాన్ లోగ్ వచ్చి వున్నారు, మీరు పార్సెల్ కోసం ఎదురుచూస్తుంటారేమోనని వచ్చాను..", మృదువుగా వచ్చీరాని తెలుగులో చెప్పి, బయటనుండే ముద్రకి పలకరింపుగా చెయ్యూపి కదిలింది.

బహుశా వేరే దేశంలో వున్నప్పుడు వుప్పొంగినంత దేశభక్తి మనకి ఇంకెప్పుడూ కలగదేమో.., మా దేశం నుండి అనేసరికి నాలో, రోషన్ భాభీలో మెరిసిన వెలుగు గురించి ఆలోచిస్తూ వెనక్కితిరిగాను.

"ఇండియానుంచా..?", ఆత్రంగా అడుగుతున్న ముద్రలోనూ అదే వుత్సాహం. "బీ ఎ రోమన్ వెన్ యిన్ రోమ్.." అంటూ ఎంత ఖచ్చితంగా మాట్లాడే అమ్మాయైనా, ఎంతైనా ఆ గూటి పక్షే కదా.., వలస వచ్చినంత మాత్రాన ఆ దేశపు గుర్తులు ఎక్కడికిపోతాయి..?

"హూజ్ దట్ క్రిష్.. ఎవరి దగ్గర్నుంచీ..?", కుతూహలంగా అడిగింది.

ఫ్రమ్ అడ్రస్ దగ్గర ఏమీ లేకపోవడంతో "నాట్ ష్యూర్ హనీ..", అంటూ యాధాలాపంగా కవర్ పైన రాసివున్న నా అడ్రస్.. కాదు.. అది రాసిన అక్షరాలు చూసి ఆగిపోయాను.

KRISHNA.. అనే అక్షరాల దగ్గరే నిలిచిపోయాయి నాకళ్ళు. K అనే ఒక్క అక్షరాన్ని అంత అందంగా రాయొచ్చని నాకు తెలిపిన రాత..,

ఒక్క క్షణంలో నా నుదుటి నుండి చెరపబడిన గీత...

"తు..ల..సీ..", అప్రయత్నంగా ఉచ్ఛరించాయి నా పెదవులు.

"ఎవరు క్రిష్..? శ్యామ్ వాళ్ళా.., మామ్ ఏమైనా పంపారా..?" కుతూహలంగా అంటున్న ముద్ర మాటలు నా చెవులనే తప్ప మనసుని, మెదడునీ చేరట్లేదు. పార్సెల్ పట్టుకుని స్థాణువులా నిలబడ్డాను.

నేను రెస్పాండవకపోవడంతో చప్పున లేచొచ్చి, కవర్ పైన చూసింది., "ఫ్రం అడ్రెస్ లేకపోవడం ఏంటీ.. స్ట్రేంజ్..!", అంటూ ఆగి, "హేయ్ హీరో.. ఏంటలా అయిపోయావ్ ..? కైండ్ ఆఫ్.. ఏదో ఆర్డీ ఎక్స్ పోస్ట్ లో వచ్చినట్టు.., ఏమయింది.. అలా వున్నావ్..?" విచిత్రంగా చూస్తూ ప్రశ్నించింది.

"తు.. తు..ల..సి.. తులసి.." అస్పష్టంగా అన్నాను పార్సల్ చూపుతూ. అంతకంటే మాట్లాడలేకపోయాను. మాటలన్నీ నా గొంతులోనే ఆగిపోయాయి.

ఒక్కసారి తెల్లబోయి చూసింది ముద్ర, ఆతర్వాత ఏమీ ప్రశ్నించలేదు నన్ను, కనీసం.., "ఆ సంగతి పార్సెల్ ఓపెన్ చేయకముందే నీకెలా తెలిసిందీ..??" అని కూడా అడగలేదు.

నా భుజాలు పట్టి సోఫాలో కూర్చోబెట్టింది, "ఓపెన్ ఇట్ క్రిష్..", అని చెప్పి కిచెన్ వైపు నడిచింది. అలాగే చూస్తూ కూర్చున్నాను. ముద్ర కాఫీ తీసుకుని నా ముందుకి వచ్చింది. బ్లాంక్ గా చూసానా ట్రేవంక.

ఓసారి నన్ను పరికించి చూసి ట్రే నాముందు వుంచి దూరంగా వెళ్ళి కామ్ గా కూర్చుని సెల్ లో ఏదో చూసుకోసాగింది.

నా రెండు చేతులూ చేర్చి పట్టుకున్నా మోయలేనంత బరువుగా తోస్తోందా పార్సెల్. ఓపెన్ చేసిపెట్టమని ముద్రని రిక్వెస్ట్ చేయాలనిపించింది. నన్ను నేను నిగ్రహించుకుంటూ వణికే చేతులతో కవర్ ఓపెన్ చేసాను. ఏవేవో జ్ఞాపకాలతో తల పగిలిపోతోంది..

చిన్న ప్యాకెట్.., ఓ పేపర్.., బహుశా ఉత్తరమేమో.. వున్నాయందులో. ప్యాకెట్ పక్కనపెట్టి వణికే చేతులతో విప్పదీసానా కాగితం..

ఇన్నేళ్ళతర్వాత.. ఎందుకు, ఏమని రాసుంటుంది తులసి..!

ఏం రాసివుంటుంది..?

ఒకవేళ నా పెళ్ళని తెలిసివుంటుందా తనకి..! మాకు విషెస్ పంపిందా...!!

గతాన్ని చెరిపేసి, అన్నీ వదిలేసుకున్న ఇన్నాళ్ళకు నో.. నో.., ఇన్నేళ్ళకు.. తన దస్తూరి.. మొదటిసారి చూసాను..

నెమ్మదిగా ఆలోచనలని నెట్టి నా దృష్టి లెటర్ లోని అక్షరాలవెంట పోనిచ్చాను..

కృష్ణా..!!

బాగున్నావు కదూ..?

..నీకీ వుత్తరం చేరేసరికి నేను బ్రతికివుండను. ఓడిపోయాను కృష్ణా.. పూర్తిగా ఓడిపోయాను. అందరి దృష్టిలో పతనమైపోయాను.. శాశ్వతంగా తల దించుకుని, తల వంచుకుని వెళ్ళిపోతున్నాను..

కానీ, వెళ్ళేముందు ఈ ప్రపంచం మొత్తంలో  నాకంటూ మిగిలివున్న,  నన్ను తప్పక నమ్మే ఒకేఒక వ్యక్తికి నా గురించి తెలియాలి.. ఆ ఒక్కరికే నేను సమాధానం చెప్పాలి...

..అది నీకే కృష్ణా.., ఈ పరిస్థితుల్లోకూడా నన్ను పూర్తిగా నమ్మగలిగే  ఏకైక వ్యక్తివి నువ్వేనని నాకు తెలుసు. ..అందుకే.. చెప్తున్నా.., నా మనస్సాక్షిగా చెప్తున్నా..

నిజంగా.. నేను ఏ తప్పూ చేయలేదు కృష్ణా..! నమ్ముతావు కదూ..,

శలవ్..

– తులసి

ఒక్క క్షణంపాటు ఏమీ అర్థం కాలేదు. తప్పుగా చదివానేమో అని మళ్ళీ చదివాను కంగారుగా.. అంతేవుంది..

ఇన్నేళ్ళల్లో రాసిన మొదటి లెటర్...

అదీ.. ఇలాంటి.. ఇంత దారుణమైన జోకా..,

నో.. ఇట్స్ నాట్ ఎ జోక్ నోర్ ఎ ప్రాంక్..,

తులసి ఇలాంటి పిచ్చి ప్రాంక్స్ చేసే అమ్మాయి కాదు.., నెవర్..

తెలిసీ ఎప్పుడూ, ఎవ్వరినీ బాధపెట్టదు తను, అలాంటి అమ్మాయి నుంచి ఇలాంటి లెటరా.. నెవర్.., తన గురించి అంత ష్యూర్ గా తెలిసినా అది ఏదో జోక్ అయివుండాలని నా మనసు బలంగా అనుకోసాగింది.

తులసి అక్షరాలు కళ్ళముందునుండి జరిగిపోతున్నాయి.. తల తిరిగినట్టయింది.., గాడ్..

హఠాత్తుగా స్పృహలోకి వచ్చినట్టు ఒక్కవుదుట్న లేచి సెల్ అందుకున్నాను,

శ్యామ్.. తన నంబర్ అప్రయత్నంగానే డయల్ అయిపోయింది నా చేతిలోంచి, సెల్ స్విచ్ ఆఫ్ .. గాడ్..

విసురుగా ముద్రవైపు తిరిగి అడిగాను, "ప్రీతి నంబర్ ఇవ్వు ముద్రా.. క్విక్.."

"వ్వాట్.." తెల్లబోతూ చూసింది ముద్ర, "డూ యూ నో ఇప్పుడు ఇండియాలో టైమ్ ఎంతో తెలుసా.., పైగా వాళ్ళు హనీమూన్ లో..", అంటూ ఆగిపోయింది నా ముఖం చూసి..

చెయ్యి సాచాను. కాన్ట్ వేస్ట్ ఎ సెకండ్. ఒక్క సెకను కూడా లేట్ చెయ్యలేను. తులసి ప్రాణం ఎట్ స్టేక్ అక్కడ. నంబర్ డయల్ చేసి ముద్ర తన సెల్ నాకందించింది..

"హల్లోవ్.." నిద్రగా ధ్వనించింది ప్రీతి గొంతు.

"నేను.. కృష్ణనమ్మా.. శ్యామ్ కోసారి ఫోన్ ఇవ్వు.." చెప్పాను ఏ పలకరింపులూ, ఉపోద్ఘాతాలూ లేకుండా.

"అన్నయ్యా, మీరా, ఈజ్ ఎవ్రీథింగ్.." అంటున్న తన మాటల్ని అబ్రప్ట్ గా తుంచేస్తూ చెప్పాను, "శ్యామ్ కి ఫోన్ ఇవ్వు ప్రీతీ, ప్లీజ్..", నోటితో ప్లీజ్ అన్నప్పటికీ నా గొంతులో రిక్వెస్ట్ కాదు ఆర్డరే ధ్వనించింది.

"కృష్ణా.. ఏమైందీ..?", లైన్లో కి వచ్చిన శ్యామ్ గొంతులో ఆదుర్దా. సడెన్ గా వాడి గొంతు వినగానే ఒక్కసారిగా దిగులేసింది..

"తులసి రా.." అన్నాను అతి కష్టంమీద మాటలు వెతుక్కుంటూ. ఏం చెప్పాలో, ఏమని అడగాలో అర్థంకాలేదు.

"తులసా.." అయోమయంగా అన్నాడు శ్యామ్, వాడి గొంతులోనూ కంగారూ, కన్ఫ్యూజన్ రెండూ ధ్వనించాయి. "తులసేంటిరా.. ఏం జరిగిందీ..!?" అడిగాడు ఆదుర్దాగా.

"లాస్ట్ టైమ్ నువ్వు తులసి గురించి ఎప్పుడు విన్నావు శ్యామ్..?" అడిగేసాను వాడి ప్రశ్నకు జవాబు చెప్పకుండానే.

"మ్... మే బీ సిక్స్ మంత్స్ బ్యాక్.., బృందాకి బాబు పుట్టినప్పుడు.., కబురు చేద్దామంటే వాళ్ళెక్కడికో వెళ్ళారని చెప్పారట తన అత్తింటివాళ్ళు., సో తన హజ్బెండ్ సెల్ కి మెసేజ్ చేసాను అని చెప్పింది బృందా.." వేగంగా జవాబిచ్చాడు నన్నేమీ తిరిగి రెట్టించకుండా.

"తులసి ఎక్కడవుందో తెలియాలి శ్యామ్, వెంటనే.. తనతో మాట్లాడాలి.. ఇమ్మీడియట్లీ.. ఇట్స్ ఎ కైండ్ ఆఫ్ ఎమర్జన్సీ అనుకో.. తన ఫోన్ నంబర్ ఏదైనా వుందా? ఈజ్ దేర్ ఎనీ కాంటాక్ట్ నంబర్ వేర్ వీ కెన్ రీచ్ హర్ అదర్వైజ్.. అని తెలుసుకో శ్యామ్.. వెంటనే..", త్వరత్వరగా చెప్పాను., "నాకో లెటర్ వచ్చింది శ్యామ్.., నీడ్ టూ నో ద ఫాక్ట్స్.. డీటెయిల్స్..", అంటూ ఆపేసాను అంతకంటే ఏమీ చెప్పలేక.

"ఐ విల్ ఫైండ్ అవుట్.." క్లుప్తంగా చెప్పాడు.

"..నేను.. అట్ ద ఎర్లియెస్ట్ ఫ్లైట్ కి ఇండియా వస్తున్నాను.." చెప్పాను.

"ఓ.కే. నేను పొద్దున్నే హైదరాబాద్ వెళ్తాను, వన్ మోర్ థింగ్ కృష్ణా.., ఇంక నీ పెళ్ళికి ఎక్కువ గ్యాప్ లేదు.. హార్డ్లీ 35 డేస్ మాత్రమే.." చెప్పాడు.

"ఎస్.. గుర్తుంది.." గంభీరంగా చెప్పాను.., "..వుంటాను శ్యామ్.., ప్రీతికి నా తరఫున అపాలజీస్ చెప్పు.., మీ హనీమూన్ డిస్టర్బ్ చేస్తున్నందుకు.. టేక్ కేర్"

"చెప్తాను.. యూ టూ టేక్ కేర్.." చెప్పి డిస్కనక్ట్ చేసాడు.

సెల్ పక్కకి పెట్టి, ముద్రవైపు చూసాను. పాలిపోయిన ముఖంతో షాకింగా చూస్తోంది, తెలుగు పూర్తిగా అర్ధమౌతుంది తనకి. తన కోసం నేను–బెంగాలీ, నా కోసం తను–తెలుగూ పోటీ పడి మరీ నేర్చుకున్నాం., ఫ్లూయెంట్ గా మాట్లాడలేకపోయినా, కెన్ అండర్ స్టాండ్ అండ్ మేనేజ్ వెల్.. ఐనా మా మాటల్లో ఎక్కువశాతం ఇంగ్లీష్ పదాలే దొర్లడంతో తనకి విషయం ఈజీగానే అర్ధమయ్యివుంటుంది.

"పోనీ వెడ్డింగ్ పోస్ట్ పోన్ చేద్దామా క్రిష్..?" తేరుకుంటూ అడిగింది.

ఉలిక్కిపడిచూసాను.., దట్ ఈజ్ ముద్ర.. చిన్న చిన్న విషయాల్లో గంటలకొద్దీ ఆర్గ్యూ చేసైనా గెలవాలని చూసే తను నాకు ఏదైనా ఇబ్బంది కలుగుతోందని ఏమాత్రం అనిపించినా. నాకోసం ఎంత పెద్ద అడ్జస్ట్మెంట్ అయినా చేసేసుకుంటుంది..

"లేదు, ఆల్ .. ఆల్ విల్ బీ ఫైన్.. షు..షుడ్ బీ..",అస్పష్టంగా చెప్పాను.

తల పరికించి తన ఫోన్ అందుకుంటూ చెప్పింది, "ఐ విల్ బుక్ ద ఫ్లైట్.., నువ్వు ఛేంజ్ చేస్కుని, బ్యాగ్ ప్యాక్ చేస్కో క్రిష్.., నీ ఆఫీస్ కి లీవ్ కూడా ఇన్ఫామ్ చెయ్యి.." చెప్పింది.

తలూపాను. కదలకుండా వున్న నన్ను చూస్తూ చెప్పింది, "గో క్రిష్.., ఛేంజ్ చేస్కో.."

అలసటగా చూసాను, "ఇలాగే వెళ్తాను ముద్రా.."

"ఓహ్ కమాన్. పాస్ పోర్ట్, సెల్, ఛార్జర్, క్యాష్, కార్డ్స్ అన్నీ ఎక్కడ ఈ ట్రాక్స్ లో క్యారీ చేస్తావ్.., అండ్ ఎక్కడ ఏది అవసరపడుతుందో తెలీదు కదా. బేసిక్ థింగ్స్ ఐతే కావాలి కదా.. జస్ట్ డూ వాట్ ఐ సే. వెళ్ళాలి అనుకున్నావ్, వెళ్ళు.. బట్ ప్లాన్డ్ గా వెళ్ళు" సీరియస్ గా చూస్తూ చెప్పింది.

తలూపాను ఒబీడియంట్ గా. షీ ఈజ్ రైట్.., ఈ సమయంలో ఐ నీడ్ సమ్ వన్ .. టూ టేక్ ఓవర్.., ఈ టెన్షన్ లో నా బదులు ఆలోచించేవాళ్ళుంటే ఎంత బెటర్ గా వుంటుందో ఫస్ట్ టైమ్ తెలుస్తోంది..

"క్రిష్..", మృదువుగా పిలిచింది ముద్ర. ఏంటన్నట్టు చూసాను.

"..చూడు క్రిష్.., నువ్వూ-నేనూ పూర్తిగా ఆపోజిట్ సైడ్స్ ఆఫ్ కాయిన్ లాంటి వాళ్ళం. కానీ యూ నో వాట్ స్టాప్డ్ మీ ఫ్రమ్ గోయింగ్ ఆవే .. నీకు తెలుసా?" ఆగి నన్నోసారి పరికించి చూసి కంటిన్యూ చేసింది,

"..నీ యాటిట్యూడ్ క్రిష్.. ఎంత కష్టంలో, బాధలో, క్రైసిస్ లో, సంతోషంలో , సుఖంలో , ఎక్కడైనా నీ స్టాండ్ చాలా బలంగా వుంటుంది. అండ్ ఇట్ కేన్ గివ్ కాన్ఫిడెన్స్ టూ ఆల్ ద పీపుల్ అరౌండ్. నీ స్థైర్యమే నీ అసెట్. దాన్ని నువ్వు అంత తేలిగ్గా కోల్పోతావు అని నేను అనను."

బట్, ఇన్ని సంవత్సరాల తర్వాత, ఎక్కడో దూరంనుంచి కేవలం నీ మీద వున్న నమ్మకంతో ఓ లెటర్ రాసింది నీ స్నేహితురాలు. ఎంత నమ్మకం లేకపోతే రాస్తుంది చెప్పు..? తన పరిస్థితి ఏంటో, ప్రాబ్లెమ్ ఏంటో నాకు తెలీదు, కానీ నీలాంటి వ్యక్తి మాత్రమే అలాంటి నమ్మకానికి అర్హుడు, దట్ ఐ నో..

సో ప్లీజ్, ఇలా సిట్యుయేషన్స్ కి లొంగిపోయి, సడలిపోకు, ప్రయత్నించు. నీ మీద ఆమెకీ, మాకందరికీ వున్న నమ్మకాన్ని నిలబెట్టు. హెల్ప్ హర్. ఆర్ డూ వాట్ ఎవర్ ఈజ్ రిక్వైర్డ్. బట్ దిస్ ఈజ్ నాట్ ద ఒరిజినల్ యూ క్రిష్. ఇంతకంటే ఏం చెప్పను చెప్పూ..!" అంటూ దిగులుగా చూసి, వంగి నా నుదుటిమీద ముద్దు పెట్టుకుంది.

వెనక్కివాలి కళ్ళు గట్టిగా మూసుకున్నాను. ఎస్.. ముద్రా ఈజ్ ఆబ్సల్యూట్లీ రైట్. నేనే డీలా పడితే అక్కడ తులసి. ఎలావుందో. ఏమైందో ఏంటో.. తల విదిల్చాను.

ఎదురుగా వున్న లెటర్ కవర్ వైపోసారి చూసి, అది పక్కకు పెట్టి పార్సెల్ ఓపెన్ చేసి చూసాను.

ఒక చిన్ని కృష్ణుడి పెయింటింగ్ వున్న ఫ్రేమ్.

చాలా ఇష్టంగా, నేనే స్వయంగా తులసి కోసం పెయింటింగ్ అది.. ఏదైనా స్పెషల్ అకేషన్ లో ఇద్దామని దాచి వుంచాను అప్పట్లో.

కానీ, తనని చివరిసారి కలిసినప్పుడు పార్టింగ్ గిఫ్ట్ గా ఇవ్వాల్సొచ్చింది. డెస్టినీ.

ఎలా వున్నావు తులసీ..!?, ఎక్కడ వున్నావు..!? ఎక్కడవున్నా క్షేమంగా వుండు చాలు. గాఢంగా నిట్టూర్చి వాటిని టేబుల్ మీద వుంచి నారూమ్ వైపు కదిలాను.

వేడినీళ్ళతో స్నానంచేసి, డ్రస్ చేసుకున్నాను. వడివడిగా ఓ వారానికి సరిపడేలా బ్యాగ్ ప్యాక్ చేసుకున్నాను. పాత కాంటాక్ట్స్ వున్న డైరీ, నా గాడ్జెట్స్, పాస్ పోర్ట్ అన్నీ తీసుకుని హాల్లోకి వచ్చాను.

"ఫ్రెష్ గా కాఫీ కలిపాను, తాగు.." కప్పుతో ఎదురొచ్చి నా చేతికి అందిస్తూ చెప్పింది ముద్ర. కాదనకుండా అందుకుని, మరో చేత్తో టేబుల్ మీదున్న లెటర్, పార్సెల్ తీసి నా జాకెట్ పౌచ్ లో పెట్టుకున్నాను.

"డైరెక్ట్ దొరకలేదు క్రిష్, కనెక్టింగ్ ఫ్లైట్స్ బుక్ చేసాను.  కారెక్కాకా డీటెయిల్స్ చెప్తాను. ప్రింటౌట్ కాపీస్ ఈ బ్యాగ్ లో పెడుతున్నా" చెప్పింది పేపర్స్ నా బ్యాగ్ లో చేరుస్తూ.

నా కాఫీ పూర్తయ్యేసరికి ముద్రే లగేజ్ కార్ లోకి షిఫ్ట్ చేయబోతోంటే చప్పున వెళ్ళి అందుకున్నాను. చిన్నగా తలపరికించి "నువ్వు వెళ్ళి కార్లో కూర్చో క్రిష్, నేనోసారి రోషన్ భాభీ కి చెప్పి వస్తా.." అంటూ డోర్ లాక్ చేసింది.

నేనూ తన ఇన్ స్ట్రక్షన్స్ ప్రకారం యాంత్రికంగా కదిలాను. కార్ దగ్గర నిలబడే వరుణ్ కి డయల్ చేసాను.

"హేయ్ క్రిష్.. గుడ్ మార్నింగ్.. ఏంటి వీకెండ్ లో గుర్తుచేసుకున్నావ్ నన్నూ?" అంటూ హుషారుగా పలకరించాడు వరుణ్.

"హలో వరుణ్.. ఒక పర్సనల్ ఎమర్జెన్సీ మీద ఇండియా వెళ్తున్నాను.", చెప్పాను.

"వ్వాట్. అంటే ఎప్పుడూ? యూ మీన్  ప్రాజెక్ట్ మీట్ తర్వాతే గా..?!" కంగారుగా అడిగాడు.

"నో వరుణ్. అంత టైమ్ లేదు. హావ్ టూ గో.  ఫ్యూ అవర్స్ లో ఫ్లైట్ వుంది. లీవింగ్ ఫర్ ద ఎయిర్ పోర్ట్ నౌ, ప్లీజ్ డోన్ట్ మైన్డ్" ప్రాజెక్ట్ గుర్తు రాగానే గిల్టీగా అనిపించింది. “నేను లేకపోతే ఈ టైం లో అందరికీ చాలా ఇబ్బందౌతుంది.. ఐ నో..”

"వెల్.. ఏమనాలి క్రిష్?  హౌ కమ్.. ప్రాజెక్ట్ పీక్ టైమ్.. లాస్ట్ మోమెంట్ లో  ఇలా సడెన్ గా నువ్వూ.. హేయ్.. ఎనీథింగ్ సీరియస్ బ్రో..? మామ్-డాడ్ , నీ ఫ్యామిలీ అందరూ??"

"అంతా ఓ.కే. వరుణ్.. అది కాదు.  ఐనా వాళ్ళే వస్తారు కొద్ది రోజుల్లో..",

"ఐతే ఎన్ని రోజుల ప్లాన్ క్రిష్? వాళ్ళని తీసుకుని వస్తావా?" వరుణ్ ప్రశ్నలమీద ప్రశ్నలు సంధిస్తున్నాడు, నాకే తెలియని జవాబు నేనెక్కడివ్వాలి. విసుగుని ఎక్స్ ప్రెస్ చేయకుండా బలవంతంగా దాచుకుంటూ సమాధానాలు చెప్తున్నాను.

"లేదు వరుణ్. ఇట్ మే టేక్ ఎనీ లెంగ్త్ ఫర్ మీ, ఫ్రమ్ ఎ వీక్ టూ ఎ మన్త్ అనుకో.. నాట్ ష్యూర్.."

"మరైతే నీ వెడ్డింగ్?"

"వచ్చేస్తాను వరుణ్. ప్లీజ్ మ్యాక్స్ కి చెప్పూ, మ్యానేజ్ మెంట్ కి కూడా ఇన్ ఫార్మ్ చెయ్యి. నేను క్రిస్టీకి మెసేజ్ పెడతాను. స్టిల్ నువ్వు కూడా ఇన్ఫార్మ్ చెయ్యి" చెప్పాను సీరియస్ గా.

"యాహ్. చేస్తాను క్రిష్. కానీ, ప్రాబ్లెమ్ కావచ్చు, ప్రాజెక్ట్ లాంచింగ్ టైమ్ లో నీలాంటి కీ పర్సన్ లేకపోతే వాళ్ళు ఎలా రియాక్ట్ అవుతారో మరి, దే మే టేక్ ఇట్ సీరియస్లీ. యూ నో హౌ థింగ్స్ ఆర్ రైట్. స్ట్రాంగ్ గా రికమండ్ చేస్తే ఈవెన్ నాకు కూడా ప్రాబ్లెమ్ కావచ్చు, టు బీ ఫ్రాంక్. ఐ కాన్ట్ ఎఫర్డ్ ఇట్ నౌ. హోప్ యూ అండర్ స్టాండ్. సో.. వై నాట్ ట్రై కమింగ్ బ్యాక్ ఎర్లీ. మే బీ ఇన్ 10 డేస్ ఆర్ సో. యూ కేన్ ఈజీలీ మ్యాచ్ విత్ ద పేస్. ఏమంటావ్?", ఆత్రంగా అడిగాడు.

నేను జవాబిచ్చేలోపే మళ్ళీ తనే అన్నాడు "మోరోవర్ మొత్తం లీవ్ ఇప్పుడే వాడేస్తే, మరి నీ పెళ్ళికి ఎలా, తర్వాత మీ ప్లాన్స్. జస్ట్ థింక్ ఓవర్ బ్రో.."

"ఐ డోన్ట్ హావ్ ఎనీ ఆన్సర్స్ టూ గివ్ యూ ఎట్ దిస్ మొమెంట్ వరుణ్. నాకే ఏమీ తెలియదు, ఇండియా వెళ్ళాకా మే బీ నాకంటూ ఓ క్లారిటీ రాగానే నీకే ఫస్ట్ ఇన్ఫార్మ్ చేస్తా. ఇప్పుడు మాత్రం.. ప్లీజ్.. జస్ట్ వదిలెయ్." చెప్పాను వీలైనంత పొలైట్ గా.

"మ్.., ఓ.కే. క్రిష్. నీ ప్రాబ్లెమ్ త్వరగా సాల్వ్ చేసుకుని వచ్చెయ్. గివ్ ఎ కాల్ ఇఫ్ ఐ కేన్ బీ ఆఫ్ ఎనీ హెల్ప్. ప్లీజ్ టేక్ కేర్" నా టోన్ లో బాధే తెలిసిందో, విసుగే తెలిసిందో తన ప్రీచింగ్ ఆపేసాడు వరుణ్.

"ఓ.కే. థ్యాంక్యూ.", చెప్పి డిస్కనెక్ట్ చేసి, అంతలో ముద్ర రావడంతో సెల్ జేబులో వేసుకుని కారెక్కాను. తను డ్రైవ్ చేస్తూనే నా ఫ్లైట్ స్కెడ్యూల్ ఎక్స్ ప్లెయిన్ చేసింది.

"కృష్ణా. ఎలా చెప్పనూ..!?" శ్యామ్ గొంతు గద్గమైంది.

అయిపోయింది. ఏదైతే కాకూడదని తీవ్రంగా కోరుకున్నానో అదే జరిగిపోయింది..

"వాళ్ళ రెలెటివ్స్ కి కాల్ చేసి తెలుసుకుందిరా బృందా. తు..ల..సి.. మన తులసి లేదురా..,

షీ.. క.. కమిటెడ్ స్యూసైడ్ అంటున్నారు.. దట్ టూ..అది జరిగి కూడా రెండునెలలు పైనే కావస్తోందట. అంత..

...అంత పెద్ద డెసిషన్ ఎందుకు తీస్కుందో తెలీదు. మ.. మనకి కనీసం కబురు కూడా తెలియలేదు" అవతలవైపు శ్యామ్ దుఃఖం తెలుస్తోంది.

నా మైండ్ నంబ్ గా అయిపోయింది. బ్లాంక్ గా ముద్రా వైపు చూసాను. కార్ సైడ్ లోకి తీసుకుని ఆపింది ముద్ర.

"ఈ. .ఈ న్యూస్ నిజమేనా? నిజం అయ్యుండదు శ్యామ్. ఎక్కడో ఏదో మిస్ కమ్యూనికేషన్ అయ్యివుంటుంది. నేను. ఇవ్.. ఇప్పుడే నాన్నకి చేసి శాస్త్రి అంకుల్ ని కాంటాక్ట్ చేయమంటా. చూడు.. చూస్తుండు తులసికేం అయ్యుండదు. ఏంకాదంటున్నా కదా.." నా మాట తడబడుతోంది..,

నిజం మనసుకి తెలుస్తున్నా, ఎక్కడో ఏదో తట్టుకుని ఆపేస్తోంది. నా మైండ్ పని చేయడం మానేసింది, వాడు చెప్పినది నిజమని ఒప్పుకోవడంలేదు.

ఐనా ఇప్పుడేంటి.. శలవంటూ తులసి రాసిన లెటర్ చదివినప్పుడే నా మనసూ, మెదడూ రెండూ పనిచేయడం మానేశాయి..

"నాన్నకి ఫోన్ చేసి, తిరిగి చేస్తా శ్యామ్." చెప్పి వాడి కాల్ డిస్కనెక్ట్ చేసి వాచ్ చూసుకున్నా. ఇండియాలో తెల్లవారుఝాము కావస్తోంది. సాధారణంగా ఈ టైమ్ లో ఎప్పుడూ కాల్ చేయను. ఒక్కక్షణం తటపటాయించి, సెల్ తీసి నాన్నకి డయల్ చేసాను.

"నాన్నా.." నా గొంతు తెలియకుండానే వణికింది.

"ఏమైంది కృష్ణా, ఈ టైమ్ లో. అంతా ఓ.కే. కదా. నువ్వూ. అమ్మాయీ..??",నా కాల్ తీస్తూనే కంగారుగా అడిగారు నాన్న.

"మేం బాగానే వున్నాం నాన్నా, నాకు అర్జంట్ గా ఓ విషయం చెప్పండి, శాస్త్రీ అంకుల్ వాళ్ళూ ఎక్కడున్నారో తెలుసా? తులసి గురించి ఏమైనా ఇన్ఫర్మేషన్ తెలుసా నాన్నా?" గాభరాగా అడిగాను.

"తులసీ వాళ్ళా..!? తెలీదురా. ఐనా పట్టుమని నెల రోజుల్లో పెళ్ళి పెట్టుకుని ఎందుకిలా అడుగుతున్నావురా? నీకూ, ముద్రాకీ గానీ ఏమైనా డిఫరెన్సెస్ వచ్చాయా? లేక..?"

"నాన్నా ప్లీజ్.. నాట్ అగైన్.. నాట్ నౌ అట్ లీస్ట్.." అరిచేసాను నిస్సహాయంగా.,

"తులసి నాన్నా. మన తులసి నాన్నా. తనెలావుందో. అసలుందో లేదో.. కూడా తెలియడంలేదు నాన్నా..!" దాదాపుగా ఏడ్చేసాను.

"ఛ.. ఛ.., ఏమంటున్నావు కృష్ణా. ఏం మాటలవి.? మతివుండే మాట్లాడుతున్నావా?" మందలింపుగా అన్నారు నాన్న, ఆయన గొంతులో కూడా ఒక్కసారిగా కంగారు చోటు చేసుకుంది.

"తను లేదని తెలిసింది నాన్నా. శ్యామ్ కూడా అదే నిజమంటున్నాడు ..నే... నేను బయల్దేరుతున్నాను, ఐ నీడ్ ద యాక్చ్యువల్ ఫాక్ట్స్. మీవల్లే అవుతుంతుంది నాన్నా. అందుకే.." ఆగాను అంతకంటే ఏంచెప్పాలో తెలియక.

అంతలోపే తేరుకున్నారాయన, ఎంతైనా నాకు నాన్నకదూ..

"వుండు కృష్ణా. నేను కనుక్కుని ఫోన్ చేస్తాను. అదేమీ నిజం అయివుండదు, నువ్వేమీ కంగారుపడకు." అంటూ కాల్ డిస్కనెక్ట్ చేసారు, సరిగ్గా నేను శ్యామ్ కి చెప్పినట్టే.

నిశ్శబ్దంగా క్షణాలు లెక్కపెట్టుకుంటూ నన్ను నేను నిగ్రహించుకోసాగాను.

చాలాసేపటి తర్వాత, ఆల్మోస్ట్ మేం ఏర్ పోర్ట్ పార్కింగ్ లో వున్నప్పుడు, నా ఫోన్ మోగింది. వణికే చేతులతో సెల్ ఆన్ చేసాను,

"కృష్ణా.." భారంగా ధ్వనించింది నాన్న గొంతు, సరిగ్గా కాసేపటి క్రితం శ్యామ్ గొంతులాగే. ఆయనేం చెప్పబోతున్నారో అర్ధమౌతూనే వుంది.

"తులసి మనకిక లేదట కృష్ణా. వెళ్ళిపోయిందిరా, రోజుల పసిగుడ్డుని అనాధని చేసి చనిపోయిందట. ఏవేవో వినరాని విషయాలు తెలిసాయాపిల్ల గురించి. శాస్త్రిగారు కనీసం ఫోన్ కాంటాక్ట్ లోకి రావడానికి కూడా ఇష్టపడలేదు. ఆయన బ్రదర్ నుంచి తెలుసుకున్నానురా ఈ వివరాలన్నీ.." చెప్పారు బాధగా.

తు..ల..సి.. ..లేదు.. వెళ్ళిపోయింది..

కాదు.., కాదు.. చనిపోయింది.. ఇది నిజం..

తననిక ఎప్పుడూ కలవకూడదు, చూడకూడదు అనుకున్నాను అప్పట్లో కోపంతో. ఇక చూడను, కలవను. చూడలేను..కనిపించదు మా తులసి.. ఎన్నటికీ.. ఏనాటికీ..

ఇన్నాళ్ళూ ఎక్కడవున్నా క్షేమంగా, సంతోషంగా వుందీ అనుకున్నాను.. కానీ..

ఇప్పుడు తెలుస్తోంది నొప్పి, నాలోంచి ఏదో ఓ శరీరభాగమే తొలగించినంత నొప్పి. తు..ల..సీ..

నిశ్శబ్దంగా వింటున్నాను నాన్న చెప్పేది. రాదర్ నా చెవులు మాత్రమే వింటున్నాయి. ఆయన ఎప్పుడు మాట్లాడడం పూర్తిచేసి కాల్ కట్ చేసారో తెలియనేలేదు.

నా మనసూ, మెదడూ స్పందన కోల్పోయి కాలంతో వెనక్కి పరిగెడుతున్నాయి తులసి గుర్తులతో.. మా జ్ఞాపకాలతో..

నేనూ, తులసీ, బృందా, శ్యామ్...

అమ్మ ఇచ్చిన చిరుతిళ్ళు పంచుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ స్కూల్ కి నడుస్తున్న నలుగురు చిన్నారులు. వారి రూపాలు ఓ అస్పష్టమైన దృశ్యంలా నా స్మృతి పథంలో కనిపిస్తోంది..

ఒకరిచేతులొకరు పట్టుకుని, ఒద్దికగా, జాగ్రత్తగా రోడ్డు దాటుతున్న రోజులు.

పరీక్షలకోసం కలిసి కష్టపడి తెల్లవార్లూ మేలుకుని చదువుతున్న రోజులు.

అమ్మాయిలు పెద్దవారయ్యారూ, కాస్త దూరం మెయిన్టైన్ చేయండని ఆంక్షలు పెట్టిన ఇంట్లోవాళ్ళతో కొట్లాడిన రోజులూ,

అమ్మమ్మ చనిపోయినప్పుడు, కన్నీళ్ళతో తన ఆత్మశాంతి కోసం ఆశ్రమాలూ, గుడులూ తిరిగి అన్నదానాలు చేసిన రోజులూ,

దారేపోయే పోకిరీ సతాయిస్తున్నాడంటూ టీనేజ్ కి వచ్చిన స్నేహితురాళ్ళు ఫిర్యాదుచేస్తున్న దృశ్యం..,

తెచ్చిపెట్టుకున్న హీరోయిజంతో వాడితో గొడవపెట్టుకున్న వైనం..

కొత్త బైక్ తో యాక్సిడెంట్ చేసుకుని చేయి విరగ్గొట్టుకున్న స్నేహితుడికోసం వంతులవారీగా నోట్సులు రాస్తున్న మిత్రబృందం..,

...ఆనాటి ఒక్కో జ్ఞాపకం చిన్నవీ, పెద్దవీ అన్నీ ఒక్కో స్లైడ్ షో లా నా మెమొరీలో ఫ్లాష్ అవుతున్నాయి..

పండుగలూ, పబ్బాలూ, సంతోషాలూ, బాధలూ, కొట్లాటలూ, కన్నీళ్ళూ, అన్నీ పంచుకుంటూ ఒకటీ, రెండూ కాదు.. ఇరవై రెండు ఏళ్ళు..

కలిసి పుట్టీ, కలిసి పెరిగీ, కలిసి తిరిగీ.. కలిసే బ్రతుకుతాం అనుకుంటూనే విడిపోయిన మా కథ చివరికి, ఇలా, ఈ మలుపు తిరుగుతుందని ఏరోజూ అనుకోలేదు.

కలలోనైనా తలవలేదు ఈ దారుణాన్ని.. కడసారి చూపుకుకూడా నోచుకోనంత దూరం మామధ్య ఎందుకు ఏర్పడాలి!?

ఇంత దారుణమైన వార్త వినికూడా నేనింత గట్టిగా, శిలలా ఎలా వుండగలిగాను..?

'వెళ్తాను తులసీ, నేను వెళ్తాను. ఏ అన్యాయం నిన్నా నిర్ణయం తీసుకునేందుకు పురిగొల్పిందో. తెలియదు, ఏ నిస్సహాయత రోజుల పసిబిడ్డను సైతం వదిలి చావువైపు నీ అడుగులు వేయించిందో.. తెలియలేదు, తెలుసుకుంటాను తులసీ, నువ్వు చెప్పకపోయినా నేనేం చేయాలో నాకు తెలుసు. నేను నమ్మిన నిన్నూ-నీ నిజాయితీనీ నిలబెడతాను.. నిజం తులసీ..

ఐ ప్రామిస్. నిన్ను కాపాడుకోలేకపోయాను. నీ గౌరవాన్ని కాపాడతాను. తులసీ..'

లేదు. బాధతో కూలిపోను, ఓడిపోయానన్న మా తులసిని గెలిపించనిదే వూరుకోను. స్థిరంగా నిర్ణయించుకుని, కన్నీటిని రెప్పలమాటున దాచుకుంటూ కదిలాను.

నాకు ఓదార్పునీ, స్థైర్యాన్నీ ఇస్తూ ముద్రా చేయి నా భుజాన్ని నెమ్మదిగా తట్టింది..

-----

ఎప్పుడూ లేనిది, హైదరాబాద్ లో అడుగు పెడుతుంటే నా కాళ్ళు వణికాయి.

బయటికి వెళ్తూనే ఎదురుగా శ్యామ్. విజిటర్స్ లాంజ్ లో. నన్ను చూసి లేచి వచ్చి లగేజ్ అందుకున్నాడు. వాడి కళ్ళలోకి చూస్తే నేను దుఃఖం ఆపుకోలేనేమో అనిపించి ముఖం తిప్పుకున్నాను.

"ఎప్పుడొచ్చావ్? ప్రీతీ ఎక్కడుంది?" అడిగాను కారెక్కాకా, యాంత్రికంగా. తులసి ప్రస్తావన తెచ్చే ధైర్యం రావట్లేదెందుకో.

"నిన్న సాయంత్రం.., ప్రీతి ఢిల్లీ వెళ్ళిపోయింది. లీవ్స్ కేన్సిల్ చేస్కుని ఆఫీస్ జాయిన్ బ్యాక్ అయిపోతానంది." చెప్పాడు అంతే నిర్లిప్తంగా.

కాలనీలోకి కారు మలుపు తిరుగుతుంటే, కళ్ళల్లో నీళ్ళు గిర్రున సుడులు తిరిగాయి. ఇక్కడ. ఈ ప్రతి దారీ, ప్రతి అడుగూ మేం కలిసి పంచుకున్నది కదూ..

దూరంగా వేణుమాధవస్వామి గుడి కనిపిస్తుంటే కారాగిపోయింది. ఇద్దరం నిస్సహాయంగా గుడివైపూ, గుడి కాంపౌండ్ లో కనిపిస్తున్న అర్చకుల ఇళ్ళవైపు చూస్తుండిపోయాం.

ఇక నా వల్ల కాక బాధగా వెనక్కి ఒరిగి కళ్ళుగట్టిగా మూసుకున్నాను, అలా ఎంతసేపున్నానో తెలీదు, గుడి గంటల చప్పుడుకి కళ్ళు విప్పాను, పక్కన చూసేసరికి, స్టీరింగ్ కి తలానించుకుని నిశ్శబ్దంగా దుఃఖిస్తున్నాడు శ్యామ్. ఓదార్పుగా వాడి భుజం తట్టాను, తలతిప్పి చూసాడు, కళ్ళనిండా నీళ్ళూ, ఎర్రని జీరలూ.. అవి చూస్తూనే ఎంత ఆపుకున్నా ఆగని కన్నీటితో నా నిగ్రహం కూడా కట్టలుదాటింది.

కాసేపటికి తేరుకుని కళ్ళతోనే ఒకరికొకరం ధైర్యం చెప్పుకున్నాం. నెమ్మదిగా వాటర్ బాటిల్స్ తీసి నాకోటిచ్చి, తనోటి తీసుకుని కారు దిగాడు. ఇక తప్పదని నేనూ దిగి బాటిల్ ఓపెన్ చేసాను. రోడ్డు పక్కగా వున్న మొక్కల మొదట్లో ఫేస్ వాష్ చేసుకున్నాం.

నిదానంగా కారు మా ఇంటి గేట్లోకి ఎంటరైంది.. ఎదురుగా విషణ్ణవదనాలతో అమ్మ, నాన్న, నేను నమ్మలేనట్టుగా మా ఇంట్లో.. రా.. రాజేషంకుల్..!!

అంత టెన్షన్ లో కూడా కాస్తంత షాకింగానే అనిపించింది.

బృందా పెళ్ళి తరువాత అన్నమాట ప్రకారం.., నిజంగానే నా ముఖం చూడలేదాయన. నేనున్నన్ని రోజులూ మా ఇంటికి ఏ మంచికీ, చెడుకీ కూడా రాలేదు. ఒకటి రెండుసార్లు అనుకోకుండా ఎదురుపడినా వెంటనే మొఖం తిప్పుకుని, తప్పుకునే వారు.

కానీ, ఇప్పుడు పరిస్థితి వేరు. విషయం తులసి కదూ, అందరికీ మతిపోయుంటుంది. అందుకే ఆయనిలా..

శ్యామ్ యాంత్రికంగా అమ్మా, నాన్నలని విష్ చేసాడు. అమ్మ, నాన్నా చప్పున వచ్చి నన్ను దగ్గరకి తీసుకున్నారు. వారి సామీప్యం ఇచ్చిన రిలీఫ్ తో అతి కష్టంమీద రాజేష్ అంకుల్ వైపు చూసి, "హలో అంకుల్.. ఎలా వున్నారు..?" అన్నాను మాటలు పెగుల్చుకుంటూ.

తల పరికించారాయన బదులుగా, "నువ్వెలా వున్నావ్ కృష్ణా. నీ ఫియాన్సే, తనెలావుంది..?" కాసేపటికి తిరిగి ప్రశ్నించారు లోపలికి దారితీస్తూ.., ఎందుకోగానీ.. మళ్ళీ నాకళ్ళనీళ్ళు తిరిగాయి. "యా.. యామ్ ఫైన్ అంకుల్.. షీ ఈజ్ ఫైన్ టూ." చప్పున చెప్పాను నిగ్రహించుకుంటూ.

ఆ తర్వాత అందరం చాలాసేపు నిశ్శబ్దంగా వుండిపోయాం. కాసేపటికి, శ్యామ్ నాన్నవైపు చూసాడు, అక్కడి సైలెన్స్ ని బ్రేక్ చేస్తూ, "అసలేం జరిగిందకుల్? స్యూసైడ్ ఏంటంకుల్? అది కూడా మన తులసి. నమ్మలేకపోతున్నాం. మీరు శాస్త్రి అంకుల్ వాళ్ళ బ్రదర్ తో మాట్లాడారుకదా.. ఆయనేం చెప్పారూ..?",అంటూ నాన్నని ప్రశ్నించాడు.

ఒక్క క్షణం తటపటాయించారాయన, "చూడండీ, తెలిసినవేవీ అంత సరైన విషయాలు కావు, నమ్మదగినవిగాలేవు, కాస్త గుండె నిబ్బరం చేసుకుని వినండి..,

ఇవన్నీ.. సుందరం.. అదే శాస్త్రిగారి తమ్ముడు సుందరం. అతడు చెప్పినవే..

చాలా రోజులుగా తులసి నుంచీ ఏ కబురూ లేదనీ. మధ్యలో ఒక్కసారి ఫోన్ చేసింది కానీ ఏదో భయం భయంగా మాట్లాడినట్టుగా అనిపించిందీ, ఒకవేళ అత్తవారింట్లో ఏదైనా సమస్యేమో తెలుసుకున్నట్టూ వుంటుంది. తన మరిది పెళ్ళని పిలిచారు, చూసి-వచ్చినట్టుంటుందని బయల్దేరారు మా అన్నయ్యా-వదినా అని చెప్పాడతను..,

అక్కడ పెళ్ళిలో ఏం జరిగిందో తెలీదు, సడెన్ గా బంధువులూ, తెలిసినవాళ్ళందరూ తులసి ఆత్మహత్య చేసుకుందనీ, ఎవరితోనో లేచిపోయి తిరిగొచ్చిందనీ, అతని వల్లే బిడ్డని కూడా కందనీ. అలా రకరకాలుగా చెప్పుకోసాగారట.."

"వ్వాట్ట్." కీచుమంటూ షాకింగ్ గా శ్యామ్, నాదీ గొంతుల్లోంచి ఒకేసారి వచ్చింది ఆ మాట. అయోమయంగా ముఖాలు చూసుకున్నాం..,

నాన్న మాకేసి ఓసారి ఇబ్బందిగా చూసి, కంటిన్యూ చేసారు,

"జరిగిందేమిటో తెలుసుకోవడానికి అతను ఎంత ప్రయత్నించినా శాస్త్రిగారిది గానీ, ఆయన భార్యది గానీ, తులసీ, జగదీష్.. అదే తులసి భర్త, అతనిది గానీ., వాళ్ళెవరి ఫోనూ కలవలేదట. అక్కడేం జరిగిందో అని వీళ్ళంతా కంగారు పడుతుండగా, శాస్త్రిగారూ, భార్యా.. చేతుల్లో ఓ పసిబిడ్డతో తిరిగొచ్చారట.

రాగానే ఆయన అక్కడ అర్చకత్వం చేస్తున్న గుడి నుండి వెళ్ళిపోతున్నానని చెప్పి, వున్నపళాన అన్నీ సర్దుకుని వూరు వదలి వెళ్ళిపోయారటరా.

తులసి గురించి ఇలా విన్నామూ, ఏం జరిగిందన్నయ్యా? అని అడిగితే. 'ఏ ప్రశ్నకూ మా దగ్గర జవాబులు లేవు, కాబట్టి మీరు విన్నదే నిజం, అవతలివారు అన్నదే నిజం...చనిపోయినది పాపిష్టిదీ, తుచ్ఛురాలూ ఐనా.. దాని బిడ్డను అనాథను చేయలేక మాతో తీసుకొచ్చాము. కూతురి బిడ్డ అనే పాశమే తప్ప, అది పాల్పడ్డ నీచాన్ని మేం ఎప్పటికీ సమర్థించలేము.

ఏం చేస్తాం, వున్నంత కాలం ఇలా ఈ అవమానభారంతో బ్రతకమని మా తలరాతలు రాసి, అది మాత్రం చాలా సులువుగా ప్రాణం తీసుకుంది.., అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు మా అన్నయ్య..', అని చెప్పాడతను. నమ్మలేకున్నా, తులసి గురించి తెలిసిన దారుణమైన వార్తలివే..." అంటూ పూర్తి చేసారు నాన్న.

అదంతా విన్నాకా చాలాసేపటివరకూ నాకూ, శ్యామ్ కీ నోట మాట రాలేదు. అలాగే శిలావిగ్రహాల్లా కూర్చుండిపోయాం.

తేరుకుంటూనే తల అడ్డంగా తిప్పుతూ, "లేదు నాన్నా.. ఇవన్నీ.. ఇదంతా పెద్ద అబద్ధం. ఎవరో ఏదో.." అంటున్న నన్ను ఆపుతూ,

"కన్నతండ్రే తన కూతురు తప్పుచేసిందని ఒప్పుకున్నాకా మనమింకా అబద్ధం అని ఎలా అంటాము కృష్ణా.??" డైరెక్ట్ గా అనేసారు నాన్న.

తెల్లబోయిచూసాము.. "అంటే. అంటే. తులసి తప్పు చేసిందని వీళ్ళంతా జస్ట్ ఒక్క నిమిషంలో డిసైడ్ అయిపోయారా? వాట్ ద హెల్...? తమ కళ్ళ ముందు పుట్టి, పెరిగిన అమ్మాయే. తన గురించి అంత తేలిగ్గా ఒపీనియన్ మార్చేసుకుంటారా!?"

తులసి నాకు రాసిన లెటర్ సంగతి చెప్పాలని నోటి చివర వరకూ వచ్చిందిగానీ, నాన్న మాటలోని లోతు నన్ను ఆపేసింది.

అసలేం జరిగింది!? ఎందుకింత చెడుగా మాట్లాడుతున్నారందరూ తులసి గురించి? నిన్నటిదాకా బంగారుతల్లి.. సుగుణాల రాశి., మంచితనానికి, మర్యాదకీ-మన్ననకీ మారుపేరనీ, పద్ధతులూ-సాంప్రదాయాల కేరాఫ్ అడ్రస్ అంటూ

అడుగడుగునా పొగిడిన వారే తన కేరక్టర్ నే నీచంగా దింపేశారా!! పైగా అదంతా నిజమంటారా!? ఎందుకని.? ఏం జరిగిందసలు?

శ్యామ్ వైపు చూసాను. వాడి కళ్ళలోనూ అవే ప్రశ్నలు.

లేచి బయటికి నడిచాను. దూరంగా వున్న పారిజాత చెట్టుని చూడగానే ఎంతో పదిలంగా, అపురూపంగా ఆ మాధవుడి పూజ కోసం ఒక్కో పూవునీ ఏరుతున్న తులసి రూపం కళ్ళ ముందు మెదిలింది.

చాలా ఏళ్ళ తరవాత నాకు తెలియకుండానే నా అడుగులు వేణుమాధవుడి గుడివైపూ, నా ఆలోచనలు గతించిన మా సాంగత్యంవైపూ సాగాయి

**ఆ క్షణం** నాకు వచ్చిన కోపానికి చేతన్ ని కొట్టీ, కొట్టీ చంపేసేవాడినే ఏమో, కుమార్ సర్ వచ్చి ఆపారు నన్ను, అంతమందిలో ఆయనొక్కడే కాస్త ధైర్యం చూపి మా దగ్గరకి వచ్చాడు. మిగతా వారంతా భయంతో ఒక దగ్గర చేరి చోద్యం చూస్తున్నారు.

"జరిగిన హంగామా చాలు. అమ్మాయి కూడా చాలా బెదిరిపోయివుంది. ఇంక ఇక్కడ ఈ విషయాన్ని ఫర్దర్ గా పెద్దది చేయొద్దిప్పుడు. పద కృష్ణా." అంటూ నన్ను బలవంతంగా వాడి వైపు నుండి దూరంగా లాగారు.

నన్ను నేను నిగ్రహించుకుంటూ చుట్టూ చూశాను, ఎవరూ కదలట్లేదు. బొమ్మల్లా చలనం లేకుండా నిలబడ్డారంతా.

తులసి.. ఓ మై గాడ్ తనేది? చప్పున స్పృహలోకి వచ్చినట్టు, కంగారుగా చుట్టూ చూశాను.

నా భయం గ్రహించినట్టు, "షీ ఈజ్ ఓకే. డోన్ట్ వర్రీ" అంటూ ప్రిన్సిపాల్ రూమ్ వైపు సూచించారు సర్. అప్రయత్నంగా ఆయన సూచించిన వైపు చూసాను, దూరంగా ప్రిన్సిపల్ రూమ్ బయట గట్టుమీద కూర్చోబెట్టారు తనని. ఏడుస్తోందనుకుంటా, చేతుల్లో ముఖం దాచుకుని వుంది. చాలామంది వుండడంతో క్లియర్ గా తెలియట్లేదు. ఫ్రెండ్స్ అందరూ తన చుట్టూ చేరి వున్నారు. ఒక లేడీ లెక్చరర్ తన భుజం చుట్టూ చేయి వేసి పట్టుకుని వుంది.

"కృష్ణా" శ్యామ్ పిలుపు విని తల తిప్పాను. బ్యాగ్ పక్కన పడేసి నా ముందు కూలబడ్డాడు. చేతన్ వైపూ, నా వైపూ మార్చి-మార్చి చూసి కంగారుగా, "ఏమైందిరా?" అని అడిగాడు.

తల అడ్డంగా తిప్పాను, "ఏం కాలేదు" అంటూ లేవబోయాను. కాలు కలుక్కుమంది.. బాధగా కాలు పట్టుకున్నాను. ఆవేశంలో హీరోయిజం ఓవర్ గా చూపించి తన్నేసానేమో. నేనూ ఏమీ ప్రొఫెషనల్ ఫైటర్ని కాదుగా, ఎప్పుడో 8th క్లాస్ లో నేర్చుకున్న కుంగ్ ఫూ కిక్స్ కదూ. గుడ్ దట్. టైమ్ కి వుపయోగపడ్డాయి. కాకపోతే ఆలోచించకుడా వాడానుగా, రిజల్ట్ తెలుస్తోంది. అందులోనూ మరీ కోపంలో దూరంనుంచే ఎగిరి తన్నడంలో కాలుమీద చాలా ప్రెషర్ పడినట్టుంది.

నాకే ఇలా వుంటే ఇక చేతన్ గాడు లేచి తిరిగేసరికి ఖచ్చితంగా వారమైనా పడుతుంది. చాలా తృప్తిగా అనిపించింది. వాడి వైపు చూసాను. బాగా గట్టిగా కొట్టానేమో. చిన్నగా మూలుగుతూ పొట్టపట్టుకుని ఇసుకలో అలాగే ముడుచుకుని పడున్నాడు. ఒక్క క్షణం కాస్త జాలేసినా. అంతలోనే వాడు చేయబోయిన ఘోరం తల్చుకుని మండిపోయింది. హీ డిజర్వ్స్ ఇట్.

అందరూ దూరంనుంచే చూస్తూవున్నారు గానీ వాడి దగ్గరకి ఎవరూ వెళ్ళట్లేదు. వాడు తెచ్చిన ఆసిడ్ బాటిల్ కాస్త దూరంలో పగిలివుంది.

నెమ్మదిగా సర్ సాయంతో పైకి లేచి నిలబడి కాలు విదల్చబోయాను. ఇంపాజిబుల్. సర్రున నరాల్లో ప్రాకుతున్న నొప్పిని కంట్రోల్ చేసుకుంటూ కాలు ఈడ్చుకుంటూనే చేతన్ వైపు నడిచాను. కంగారుగా వారించబోయిన సర్ వైపు చూసి, "జస్ట్ ఒక్క మాట సర్. అంతే." అన్నాను నిదానంగా. డౌట్ గా తలూపి, సపోర్ట్ గా పట్టుకుని నన్ను వాడి వైపు నడిపించారు.

నేను దగ్గరకి రావడం చూసి బెదురుగా కాస్తంత వెనక్కి జరిగాడు, "ఇంకోసారి. ఇంకొక్కసారి. ఐ డోన్ట్ వాన్ట్ టూ సీ యూ ట్రబ్లింగ్ తులసి. గుర్తుపెట్టుకో చేతన్ బాగా గుర్తుపెట్టుకో" చెప్పాను తీవ్రంగా. గబగబా తలూపాడు భయం-భయంగా చూస్తూ.

శ్యామ్ అయోమయంగా కుమార్ సర్ వైపు చూసాడు, "చేతన్ ట్రైడ్ టూ అటాక్ తులసి.. ఆసిడ్ తో" చెప్పారాయన.

"వ్వాట్. ఓ మై గాడ్. ఐతే తులసీ" అంటూ కంగారుగా చుట్టూ చూశాడు. దూరంగా వున్న తులసిని చూపుతూ చెప్పారు సర్,

"లేదు. లేదు. షీ ఈజ్ సేఫ్. కంగారుపడింది. అంతే. చేతన్ కేవలం తనని భయపెట్టాలనుకున్నానని చెప్తున్నాడు. నిజమో అబద్ధమో తెలీదుగానీ, లక్కీలీ టైమ్ కి కృష్ణ చూసి ఆపడంతో తనకేంకాలేదు. థాంక్ గాడ్." అన్నారు జరిగింది వివరిస్తూ.

"ఆసిడ్ వేయాలనుకోవడం ఏంటి సర్? తనేం చేసిందనీ? కృష్ణా ఏంటిరా ఇదంతా?" మా ఇద్దరినీ చూస్తూ అయోమయంగా అన్నాడు.

"ఆ సంగతి వాడినడుగు శ్యామ్. అమ్మాయికి ఇష్టం లేదని చెప్తే ఆసిడ్ వేసేస్తారా? పాపం వాళ్ళ ఒపీనియన్స్ కి ఏం విలువే లేదా? అసలు ప్రేమించిన అమ్మాయిమీద దాడి చేయడం ఏం ప్రేమరా? అసలు వాణ్ణి" అంటూ ఆవేశంగా వాడి వైపు వెళ్ళబోయాను. చప్పున ఆపారు కుమార్ సర్, శ్యామ్ ఇద్దరూ చెరోవైపునుంచీ నన్ను పట్టుకుని.

"వద్దు కృష్ణ చచ్చిపోతాడు. ఇంక కొడితే చాలు. అతనికి ఏమైనా ఐతే నీ కెరీర్, లైఫ్ మొత్తం స్పాయిల్ అయిపోతాయి. పద వెళ్దాం ముందిక్కడ్నుంచి" అంటూ నన్ను బలవంతంగా పార్కింగ్ ప్లేస్ వైపు నడిపిస్తూ పీటర్ సర్, వైపు చూసి "సర్, ప్లీజ్ కాల్ ఇన్ ఫర్ సమ్ మెడికల్ హెల్ప్" అని చెప్పారు .

పీటర్ సర్ షాక్ నుండీ తేరుకుంటూ తడబాటుగా తలూపి, జేబులోంచి సెల్ బయటికి తీసారు.

కాలు ఈడుస్తూ, కష్టం మీద పార్కింగ్ ప్లేస్ చేరుకునేసరికి, ఇక ఓర్చుకోలేక ఎదురుగావున్న పోల్ ఊతంగా కింద కూలబడ్డాను, నొప్పి తాళలేక..

"కృష్ణా ఆర్ యూ ఓకే?" ఆదుర్దాగా అడిగారిద్దరూ ఒకేసారి..

"ఓ.కే. బట్ చాలా నొప్పి. ఐ థింక్ స్ప్రెయిన్ ఆర్ మేబీ మైల్డ్ ఫ్రాక్చర్" పళ్ళబిగువున నొప్పిని ఓర్చుకుంటూ చెప్పాను.

"ఓహ్ గాడ్" అంటూ కంగారుగా నా కాలుకున్న షూ, సాక్స్ తీసేసి, ప్యాంట్ పైకి జరిపి కాలు పరిశీలించారు. బాగా వాచిపోయివుంది మడమదగ్గర.

శ్యామ్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అది చూసి నా బాధని దాచుకుంటూ ఏం కాలేదన్నట్టు చిన్నగా నవ్వి, వాడి చెంపమీద తట్టాను.

కాసేపటిలో అంబులెన్స్ సౌండ్ తో క్యాంపస్ గేట్లు తెరుచుకున్నాయి. వెనకే ఛైర్మన్ సర్ కారు కూడా లోపలికికి ఎంటరయ్యింది. ప్రిన్సిపల్ సర్ ముఖం పాలిపోవడం మాకు ఇంత దూరంనుండి కూడా స్పష్టంగా తెలుస్తోంది. క్యాంపస్ లో ఏంజరిగినా ఆయనేగా రెస్పాన్సిబుల్. పైగా ఇక ఇదేమీ చిన్న విషయం కాదు కదా. ఆబ్వియస్లీ ఛైర్మన్ సర్ వూరుకోరు..

చేతన్ నీ, నన్నూ కూడా ఒకే అంబులెన్స్ లో హాస్పిటల్ కి తీసుకొచ్చారు. నేను కనిపించగానే అంత నొప్పితో విలవిల్లాడుతునున్నవాడు కూడా స్ట్రెచర్ మీదనుండి లేవబోయాడు భయంతో. అంబులెన్స్ లో వున్న స్టాఫ్ చప్పున వారించి పడుకోబెట్టారు వాడిని.

అటువైపు ఓసారి చిరాగ్గా చూసి కళ్ళుమూసుకుని కూర్చున్నాను. ఎక్కడ ఆవేశపడతానో అని నాతోపాటూ కుమార్ సర్ ని కూడా అంబులెన్స్ లో పంపారు ప్రిన్సిపల్ సర్ వెనకే బైక్ మీద పీటర్ సర్, శ్యామ్ బయల్దేరారు.

హాస్పిటల్ లో మా గాయాలకి మందులూ, స్ప్రెయిన్ అయిన కాలికి క్రేప్ బ్యాండ్ తో అలంకరించి కూర్చోబెట్టారు, పేరెంట్స్ వచ్చాకా పంపుతామంటూ.!

ఇదంతా తెలిసాకా, నాన్న రియాక్షన్ ఎలా వుంటుందో అని ఆలోచించసాగాను, అర్థం చేసుకుంటారని గట్టి నమ్మకం వున్నా ఏదో తెలియని చిన్న ఇబ్బంది.., ఇక అమ్మైతే పాపం చాలా కంగారుపడిపోతుంది.., నొప్పితగ్గేందుకు ఇచ్చిన పెయిన్ కిల్లర్స్ ఎఫెక్ట్ ఏమో, కాస్తంత మగత కమ్మడంతో అలసటగా కళ్ళు మూసుకుని కూర్చున్నాను.

"హౌ ఆర్ యూ ఫీలింగ్ కృష్ణా..?", అన్న గంభీరమైన పలకరింపుకి కళ్ళువిప్పాను. ఎదురుగా ఛైర్మన్ సర్. కంగారుగా లేవబోయాను, నొప్పితో వున్న కాలు సహకరించలేదు.

అంతలో ఆయన నన్నువారిస్తూ "నో నో ప్లీజ్ సిట్. ఎలావుందిప్పుడూ?" అడిగారు బెంచ్ మీద నా పక్కనే కూర్చుంటూ.

"బెటర్ సర్" బెరుగ్గా చూస్తూ చెప్పాను.

"కంప్లెయింట్ ఇస్తానన్నావట చేతన్ మీద.. నిజమేనా? " సూటిగా చూస్తూ అడిగారు.

తలూపాను, నా ముఖం కోపంతో ఎర్రబడింది, "అవును సర్ ఏదో టీజ్ చేయడం అంటే ఓ.కే. కానీ హీ ట్రైడ్ టూ అటాక్ హర్ వూరుకుంటే తులసికి డేంజర్ కదా అందుకే" చెప్పాను.

"వద్దు కృష్ణా స్కూల్ పరువుకోసమో, లేక భయపడో కాదు. వీటిల్లో పడొద్దు. చేతన్ పేరెంట్స్ తో మాట్లాడతాను, టీ.సీ ఇచ్చివేరే కాలేజ్ కి పంపేద్దాం ఓ.కే. నా? బట్ అతని కెరీర్, లైఫ్ అన్నీ పోతాయి ఒక్కసారి పోలీస్ కేస్ లో ఇరుక్కుంటే ఫర్గివ్ హిమ్ మై బోయ్. గివ్ హిమ్ ఎ ఛాన్స్"

"ఐ కెన్ అండర్ స్టాండ్ సర్ కానీ" ఆగిపోయాను తులసి మీదకి ఆసిడ్ బాటిల్ తో వాడు విరుచుకుపడ్డ దృశ్యం కళ్ళముందు మెదిలింది.

నేను అనుకుంటున్నది ఆయనకి అర్థమైనట్టుంది.

"లేదు. మీ ఫియర్స్ నాకు తెలుసు. తులసి విల్ బీ సేఫ్. ఆ అమ్మాయికి ఎలాంటి హానీ జరగకుండా చూసే పూచీ మాది. చేతన్ పేరెంట్స్ తో మాట్లాడాను. మీ ఫాదర్ తో కూడా. హీ ఆల్సో ఒపైన్స్ ద సేమ్. పైగా తులసి వాళ్ళ ఇంట్లో ఇదంతా తెలిస్తే తనని కాలేజ్ కి పంపడానికే భయపడతారూ అని హీ ఈజ్ మోర్ వర్రీడ్ అబౌట్ ఇట్. వి హావ్ టూ అండర్ స్టాండ్ దెయిర్ కన్ సెర్న్స్ ఆల్సో కదా. ఎనీవే ఇదంతా మాకు వదిలెయ్ కృష్ణా. మమ్మల్ని ఆలోచించనీ" అంటూ మాట్లాడారు వివరంగా.

ఇక తప్పక అంగీకారంగా తలూపాను. ముఖ్యంగా ఆయనన్నట్టు తులసి చదువు ఆపేస్తారేమో అనే భయంవల్ల.

"దట్స్ గుడ్ మై బోయ్. మిష్టర్ శంకర్, యూ కెన్ టేక్ హిమ్ హోమ్ ప్లీజ్" అన్నారు. ఆ మాటతో చప్పున తల తిప్పి చూసాను. ఎప్పుడొచ్చారో తెలీదుగానీ, నా వెనుకగా కుమార్ సర్ తోపాటూ నిలబడివున్నారు నాన్న.

కాస్త బెరుగ్గా చూసి "నాన్నా" అన్నాను.

నా దగ్గరకి వచ్చి ఆప్యాయంగా నా తల నిమిరారు. 'నీకెందుకొచ్చిన గొడవరా' అంటూ తిట్టలేదు సరికదా నా కాలు తడిమిచూసి "నొప్పిగావుందా కన్నా?" అని అడిగారు.

నా కళ్ళలో నీళ్ళూరాయి. లేదన్నట్టు తలతిప్పాను.

"సారీ నాన్నా" బాధగా చెప్పాను.

"ఎందుకురా?" లాలనగా అడిగారు.

"మీకు మీకు ఇలాంటి గొడవలూ, కొట్లాటలూ నచ్చవు కదా. అనుకోలేదు నాన్నా రేపు సాయంత్రం డిన్నర్ ప్రోగ్రామ్ వుందని కొంతమంది ఫ్రెండ్స్ కి చెప్పడం మర్చిపోయి, అనుకోకుండా వెనక్కివెళ్ళాను. అప్పుడే సడెన్ గా అదంతా జరిగిపోయింది డాడ్ ఇట్ వాజ్ అవుటాఫ్ సడెన్ ఇంపల్స్. నాట్ ఇంటెన్షనల్. అసలూ"

"ష్. కూల్ డౌన్ కన్నా నాకెందుకురా ఎక్స్ ప్లనేషన్ ఇస్తావు. నాకు తెలియదా నీ గురించి" మృదువుగా వారించారు నాన్న. ఎంతమంది తండ్రులామాట అనగలరు? ఇలా మాట్లాడితే కొడుకు తన చేయి దాటిపోయాడని బాధపడే పరిస్థితి బహుశా ఏ తండ్రికీ రాదేమో?

కానీ, ఒకవేళ చేతన్ తండ్రికూడా ఇలాగే మాట్లాడితే, జరిగినదానికి వాడిని మందలించకుండా సమర్థించుకుని వస్తే? ఆ ఆలోచనకే వులిక్కిపడ్డాను.

జరిగిన ప్రతి విషయాన్ని ముందు అర్థం చేసుకోవాలి. తర్వాతే ఎటు మాట్లాడాలో నిర్ణయించుకోవాలి. అలా చేయాలంటే మంచి-చెడుల గురించి ఎంతో విచక్షణుండాలి అంటూ నాన్న చెప్పే మాటలు గుర్తొచ్చాయి. వాటి మీనింగ్ మొదటిసారి అర్థమైంది.

మేం బయటకివచ్చేసరికి శ్యామ్ తులసిని తీసుకునివచ్చేసాడు కాలేజ్ నుంచి. వెనుకే నాలుగైదు బైక్స్ లో మా గ్యాంగ్ బృందా, రఘు, వివేక్, రమ్య, కౌశిక్ వస్తూనే నన్ను చుట్టుముట్టేసారు 'ఎలావుందంటూ?'

బండి దిగుతూనే వర్రీడ్ గా నావైపు పరుగునవచ్చింది తులసి "కృష్ణా" అంటూ. అంతలో నా వెనుకే వచ్చిన నాన్నను చూసి ఆగిపోయింది.

"రా తులసీ. ఏరా తల్లీ నీకేం కాలేదుగా?" ఆప్యాయంగా అడిగారు నాన్న.

లేదన్నట్టు తల అడ్డంగా తిప్పింది.

నా తలకీ, కాలికీ వున్న బ్యాండేజ్ చేతికివేసిన ప్లాస్టర్లు చూసి తన కళ్ళనిండా నీళ్ళు ఎగచిమ్ముతున్నాయి. చున్నీతో ముఖం అద్దుకున్నట్టుగా కళ్ళు వత్తుకుంటోంది. మధ్య-మధ్యలో దిగులుగా నావైపు చూస్తోంది. నేనేం మాట్లాడలేదు.. తననే గమనిస్తున్నాను.

మాకెవ్వరికి ఏమైనా మరొకరి కంట్లో నీళ్ళు తిరగడం వింతేం కాదు. అంతెందుకు? కాసేపటి క్రితం శ్యామ్ కూడా నా గాయాలు, పెయిన్ చూసి ఏడ్చేశాడు. వాళ్ళలా బాధపడుతుంటే నాకూ చాలా బాధనిపిస్తుంది..

కానీ లైఫ్ లో ఫస్ట్ టైమ్. మొదటిసారి తులసి నాకోసం కన్నీళ్ళు పెట్టుకుంటుంటే నా కోసం చా..లా.. చాలా తృప్తిగా అనిపించింది. ఇట్స్ ఎ స్ట్రేంజ్ ఫీలింగ్.

నాన్న ముందుకు నడిచి తులసి తల మీద చేయుంచారు "ఏంకాలేదురా వాడికి, చిన్న గాయాలే. డోన్ట్ వర్రీ టూ మినిట్స్ వెయిట్ చేయండి. కారు పార్కింగ్ లోవుంది తీసుకుని వస్తా" అంటూ శ్యామ్ వైపు మమ్మల్ని చూసుకోమన్నట్టు ఇండికేటింగ్ గా చూసి, వాడు తిరిగి తలూపాకా కదిలి పార్కింగ్ వైపు నడిచారు.

తులసి వైపు చూసాను, ఎర్రబడిన ముఖం, వాచిన కనురెప్పలూ, చెదిరిన జుట్టూ, కిందపడినప్పుడు కందిన చెంప దిగాలుగా వదనంతో జాలిగొలిపేలావుంది.

శ్యామ్ ముఖంమీదకి నవ్వు తెచ్చిపెట్టుకుంటూ తులసి భుజంచుట్టూ చేయి వేశాడు, "చాలిక. ఆపెయ్యండి మేడమ్. ఐనా ఈ కంటి తుడుపు ప్రోగ్రామ్ మన టీ.వీ. సీరియల్స్ లా ప్రొలాంగ్డ్ కాకుండా, చిన్నగా షార్ట్ ఫిల్మ్ లా వుంటే బాగుంటుందేమో" అంటూ.

కోపంగా చూసింది బృంద "షటప్ శ్యామ్. అన్నీ జోక్స్ యేనా నీకు, కృష్ణకేమయ్యిందో, ఎన్ని దెబ్బలు తగిలాయో అని మేమెంత వర్రీ అయ్యామో తెలుసా నీకసలు..?" అంటూ అరిచింది వాడిమీద. అలా అంటూనే నా దగ్గరకొచ్చి "ఎలావున్నావ్ కృష్ణా?" అడిగింది.

"యామ్ ఓ.కే. బృందా" అంటూ ఆగి "డోన్ట్ పానిక్" అన్నాను నెమ్మదిగా తులసి వైపు చూసి. సరేనన్నట్టు తలూపి కళ్ళు దించుకుంది.

నవ్వాడు శ్యామ్, "హెలో మేడమ్ బృందా ఏమడిగావూ? ఎలా వున్నావ్ అనా? చూడు బంగారం ఆ ముక్క వీడితో తన్నులు తిన్నవాడిని అడగాలి. డోన్ట్ ఎవర్ అండర్ ఎస్టిమేట్ అజ్. గాట్ ఇట్?" అన్నాడు కాలరెగరేస్తూ వెక్కిరింతగా.

"ఛా కొట్టింది వాడైతే నీకెందుకురా అంత ఫీలింగ్?" తిరిగి వెక్కిరించింది బృంద.

చిన్నగా తల కొట్టుకున్నాడు రఘు "అబ్బా! శ్యామ్ అండ్ బృందా మళ్ళీ మొదలు పెట్టారా మీరూ. ప్లీజ్ ఆపండ్రా బాబూ ఐనా ఇదా టైం మీకు? కనీసం ఒక్క క్షణమైనా పడదు మీకు. అసలు కలిసెలా పుట్టార్రా మీరు?" అన్నాడు ఆశ్చర్యం నటిస్తూ.

అందరూ నవ్వేశారు. అప్పటివరకూ టెన్షన్ తో నిండిపోయిన వాతావరణం కాస్త తేలికయ్యింది.

తులసి వైపు చూసి చిన్నగా నవ్వాను. నా నవ్వు చూసిన తన కళ్ళలో సన్నటి మెరుపు.., ప్రతిగా నవ్వి కళ్ళు తిప్పేసుకుంది.

తులసిని ఇంట్లో దింపడానికి నాన్న వెళ్ళారు. జరిగింది చెప్పి తులసి తప్పేంలేదని మేనేజ్మెంట్ వాళ్ళు చేతన్ ని కాలేజ్ నుంచీ పంపిచేసారనీ, అతనితో అతని పేరెంట్స్ తో మాట్లాడారనీ తులసి కాలేజ్ కి వెళ్ళడానికి మరేం భయంలేదనీ చాలా కష్టంమీద శాస్త్రి అంకుల్ ని కన్విన్స్ చేసి మరీ వచ్చారు..

కానీ, శాస్త్రి అంకుల్ తులసిని సేఫ్ గా వుంచడానికి తనకి వీలైనంత త్వరగా పెళ్ళి చేసి పంపేయడమే మార్గమనుకుంటారని మాకూ తెలియలేదు.

ఫైనల్స్, తర్వాత ఎమ్.సెట్., తర్వాత వేరే కాంపిటీటివ్ ఎగ్జామ్స్.. తర్వాత రిజల్ట్ టెన్షన్.., వీటిల్లోపడి ఆ సంఘటనని దాదాపుగా మర్చిపోయాం..,

కాకపోతే, తన సేఫ్టీ మాత్రం మర్చిపోలేదు, తులసి ఎక్కడికి కదలాలన్నా ఎస్కార్ట్ గా మేం తన వెనకే పోయేవాళ్ళం.

"ఏంటి సంధ్యా ఇది. ఆపిక. ఇప్పుడేమైందనీ? వాడికేంకాలేదు కదా?" నాన్న అమ్మని ఓదారుస్తూనే చిన్నగా మందలిస్తున్నారు.

ఒళ్ళునొప్పులకో ఏమో రోజూకంటే ఎర్లీగా మెలుకువ వచ్చేసింది. కాఫీ అడుగుదామని అమ్మ కోసం లాన్ వైపు వెళ్ళబోయి వాళ్ళు సీరియస్ గా మాట్లాడుకోవడం గమనించి ఆగిపోయాను..

"కాలేదు కాబట్టి సరిపోయింది. ఏమన్నా అయ్యుంటే? అంత సాహసం చేస్తారా ఎవరైనా?" కోపం బాధా కలగలిసిన స్వరంతో అంది అమ్మ.

వెనుదిరిగి వెళ్ళిపోవదామనుకున్నాను. కానీ నాన్న ఏమంటారోనన్న కుతూహలంతో చాటుగా వారి మాటలు వినడం సభ్యత కాదని తెలిసినా అప్రయత్నంగా అక్కడే వుండిపోయాను.

"వాడికి మార్షల్ ఆర్ట్స్ నేర్పించాలని పట్టుబట్టింది నువ్వే కదా? మరి ఇప్పుడు అవి వుపయోగిస్తే ఎందుకలా ఏడుస్తావ్?" నవ్వారు నాన్న.

"చాల్లెండి శంకర్. మార్షల్ ఆర్ట్స్ నేర్పింది సెల్ఫ్ డిఫెన్స్ కోసం. ఇలా స్ట్రీట్ ఫైట్స్ కోసం కాదు" కోపంగా అంది.

"డోన్ట్ టాక్ రబ్బిష్. వాడు చేసింది స్ట్రీట్ ఫైట్ కాదు సంధ్యా. వాడో జీవితాన్ని కాపాడాడు. డూ యూ గెట్ దట్" తీవ్రంగా అన్నారు నాన్న.

అమ్మ మౌనంగా వుండిపోయింది. నాన్న కాస్త నిభాయించుకుని అమ్మ తల నిమిరారు.

"సారీరా! ఐ కెన్ అండర్ స్టాండ్ యువర్ కన్సర్న్. కానీ, వాళ్ళు నలుగురూ ఒక్కటిగా పెరిగారు. ఒకరి కోసం ఒకరు ప్రాణం పెడతారు. అలాంటప్పుడు తులసికి ప్రమాదం ముంచుకొస్తే వాడు డిఫెండ్ చేయడా చెప్పు? ఖచ్చితంగా

చేస్తాడు, వాడికి ఏ కుంగ్ ఫూ, కరాటేలు రాకపోయినా చేస్తాడు. మన అదృష్టమేమిటంటే వాడికి తనని తాను కాపాడుకుంటూనే వేరే వారిని కాపాడగలిగే విద్య వచ్చు. అందుకు సంతోషించు. వాడికొచ్చిన విద్యని ఓ మంచి పనికోసం వినియోగిస్తే తప్పేంటి సంధ్యా? మనమే ఇలా ఆలోచించి డీలా పడితే ఎలా చెప్పు?" అన్నారు నాన్న.

"మ్. మీరు చెప్పేదీ నిజమే కానీ" ఆగిపోయింది అమ్మ.

"ఇంకే ఆలోచనలూ పెట్టుకోకు సంధ్యా. హీ డిడ్ ఎ రైట్ థింగ్. వాడు గానీ అడ్డుపడకపోతే రోజూ పేపర్లో చదువుతున్నామే ఆడపిల్లల మీద రకరకాల అఘాయిత్యాలు. అలాగే మరో వార్త అయివుండేది మన తులసి జీవితం."

"ఛ..ఛ.. అలా అనకండి. అమ్మో తలుచుకుంటేనే గుండెలదిరిపోతున్నాయి. ఎంత గండం తప్పిందాపిల్లకీ?" గుండెలమీద చెయ్యివేసుకుని భయంగా అంది.

"కదా! అంతా మనవాడి మంచి బుద్ధి, సాహసం వల్లే కదా. చెప్పాలంటే నీ పెంపకమే సంధ్యా. ఎంత చక్కగా కొడుకుని పెంచావూ. ఇప్పుడు మనమంతా గర్వపడేలా చేసాడు చూడూ" చిన్నగా తన భుజం తట్టారు నాన్న.

"ఆహా. చెప్పండిక కబుర్లు" నవ్వింది అమ్మ కాస్తంత రిలాక్సవుతూ.

"లేదు, లేదు. నేనేమీ కబుర్లు చెప్పటం లేదు. నీ కొడుకు ప్రయోజకుడయ్యాడు సంధ్యా. వాడి కాలేజ్ ఛైర్మనూ, ప్రిన్సిపాలూ, లెక్చరర్సూ, తోటి పిల్లలూ, శాస్త్రిగారి ఫ్యామిలీ అందరూ ఎంతలా పొగిడారో వినుంటే పొంగిపోతావు తెల్సా.."

"అవునా? ఏమన్నారేంటీ?" సంతోషంగా అడిగింది.

"ఎంతో పొగిడారు. వాడిలాంటి కుర్రాడు తమ కాలేజ్ లోవుండడం గర్వకారణం అన్నారు, వాడి ఛైర్మన్ ఐతే.. 'మా కాలేజ్ పరువు దక్కించాడు. ఏదైనా జరగరానిది జరిగివుంటే అదీ కాలేజ్ ప్రిమిసెస్ లో. అమ్మాయికి జరిగే డామేజే కాకుండా కాలేజ్ పేరూ నాశనమైపోయేది. అమ్మాయినే కాదూ, కాలేజ్ నీ, మా అందరినీ కాపాడాడు మీ వాడు' అన్నారు.

వాళ్ళ కాలేజ్ లెక్చరర్ ఒకాయనన్నారూ 'కాలేజ్ ఇబ్బందుల్లో పడివుంటే మా అందరి జాబ్స్ కీ ముప్పొచ్చేది సర్. పైగా మీరంతా వుండి ఏంచేస్తున్నారంటూ జనాలు, మీడియా అందరూ దుమ్మెత్తి పోసేవారు. యువర్ సన్ రియల్లీ సేవ్డ్ అజ్. అవర్ రెప్యుటేషన్.' అంటూ చాలా మెచ్చుకున్నారు. పాపం అతనే మనవాడి వెంటవెంట వుండి హాస్పిటల్ కి కూడా తీసుకెళ్ళింది అని శ్యామ్ చెప్పాడు" చెప్పారు నాన్న.

బహుశా కుమార్ సర్ అయివుండచ్చు అనుకున్నాను. అదంతా విని నా మనసు వుప్పొంగిపోయింది. వారంతా నన్ను మెచ్చుకున్నారు.

కానీ, నాన్నతో కూడా అలా మాట్లాడతారని తెలీదు. నాన్న నాకు చెప్పలేదు కూడా.

"మీరు లక్కీ, వాళ్లు పొగిడిందంతా విన్నారు." కాస్తంత కినుకగా అంది అమ్మ.

నవ్వారు నాన్న "ఆహా.. మరైతే ఇంతకుముందేమో వాడలా చేసుండకూడదన్నావ్? అందరూ పొగిడేసరికి పొంగిపోతున్నావ్" వెక్కిరించారు.

"వాడికి డేంజరని వర్రీ అయ్యాను, నేనేమీ వాడు చేసింది తప్పు అనలేదు" ఉక్రోషపడింది అమ్మ.

"సరెసర్లె ఏదో సరదాగా అన్నాను. ఫీలవకు" నవ్వుతూ చెప్పారు నాన్న.

"ఇంతకీ శాస్త్రిగారేమన్నారూ?" కుతూహలంగా అడిగింది.

"జరిగింది తెలియగానే వారంతా ముందు బాగా భయపడిపోయారు. చాలా సర్ది చెప్పి ధైర్యం చెప్పాల్సివచ్చింది. తేరుకున్నాకా శాస్త్రిగారన్నారూ మా ప్రాణాలు నిలబెట్టాడు మీ కృష్ణ ఈ రోజు శంకర్ గారూ. తులసికేమన్నా అయివుంటే మేమేమయిపోయేవాళ్ళం చెప్పండీ. సాక్షాత్తూ ఆ వేణుమాధవుడే మీ కృష్ణలా వచ్చి మమ్మల్ని కాపాడాడు" అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నారు. బరువుగా చెప్పారు నాన్న.

ఆ మాటలకి గర్వంతో నా ఛాతీ మరో నాలుగురెట్లు వుప్పొంగింది..

"అయ్యో పాపం. రమతో వెళ్ళిమాట్లాడివస్తాను, పాపం తులసిని కూడా కాస్త పలకరించినట్టుంటుంది. బెదిరిపోయుంటుంది. పాపం పిచ్చిపిల్ల. ఎలా వుందో ఏంటో" వర్రీడ్ గా అంది.

"మ్ అవును సంధ్యా.. ఓసారి వెళ్ళిరా. పిల్ల బాగుంటే చాలూ. చదువూ వద్దూ, ఏమీ వద్దు అసలింక కాలేజ్ కే పంపమనేసారు శాస్త్రిగారు. చాలా కష్టపడి కన్విన్స్ చేసాను. ఐనా ఏదైతేనేం పెద్ద ప్రమాదం తప్పిందా పిల్లకి" నిట్టూర్చారు నాన్న.

"నిజంగానే తప్పిందంటారా శంకర్?" గంభీరంగా అందమ్మ.

అయోమయంగా చూసారు నాన్న "నువ్వనేదేంటి సంధ్యా..? ఆ కుర్రవాడు ఒకవేళ మళ్ళీ దాడి చేస్తాడనా? లేదు, లేదు, వాళ్ళ ఫాదర్ మాటిచ్చారు వాడికి తగిన కౌన్సిలింగ్ ఇప్పించి, చాలా దూరంగా వేరే కాలేజ్ లో వేస్తాననీ" అంటూ ఇంకేదో చెప్పబోయారు నాన్న.

"నేననేది అతనొక్కడి విషయమే కాదు" అంది.

"మరి?" నాన్న భృకుటి ముడిపడింది.

"ఆ పిల్ల కి అడుగడుగునా పొంచి వున్న ప్రమాదం గురించి "

"అంటే ఏ ప్రమాదం సంధ్యా? కాస్త అర్థమయ్యేలా మాట్లాడు. విచ్ డేంజర్ యూ ఆర్ టాకింగ్ అబౌట్..?",

"తన రూపం. హర్ బ్యూటీ" గంభీరంగా చెప్పింది చెప్పిందమ్మ.

"వ్వాట్..?" తెల్లబోయారు నాన్న. పక్కనుంచి వింటున్న నేను కూడా..!

"అవును శంకర్. తులసిది మతిపోగొట్టే అందం. అద్భుతమైన రూపం. ఇక అంత అందమైన అమ్మాయికి అడుగడుగునా శత్రువులే కదా! యాజ్ ఏ మాటర్ ఆఫ్ ఫాక్ట్ ఆమె అందమే ఆమె శత్రువు. ఈరోజంటే కృష్ణ కాపాడాడు రేపు మరొకరు. కానీ ఎప్పటికీ తనని తాను కాపాడుకోవల్సిందైతే తనేగా..!

❦❦❦

**"కానీ,** అదే చాలా పెద్ద టాస్క్ అవుతుందాపిల్లకి. ఏ వెరీ బిగ్ ఛాలెంజ్. అన్నీ కనిపించే ప్రమాదాలే వుండవు శంకర్. చాటుమాటుగా జరిగే అబ్యూజెస్, టార్చర్స్ మగవాళ్ళనుంచైతే ఈర్ష్యాసూయలతో ఆడవాళ్ళు పెట్టే బాధలు మరి కొన్ని. చాలా సహించాలి. చాలా దాటాలా పిల్ల.. ఎలాగో ఏంటో?" బాధగా నిట్టూర్చింది అమ్మ.

నిజమేనన్నట్టు నెమ్మదిగా తలపరికించారు నాన్న. అవును అమ్మ చెప్పింది నిజమే. మేమంతా చేతన్ గురించి మాత్రమే ఆలోచించాము. వాడు చేయబోయిన అఘాయిత్యం, ఒకవేళ వాడు మళ్ళీ దాడి చేస్తే ఎలా? అనీ ఎట్సెట్రా ఎట్సెట్రా. అమ్మ చాలా కరెక్ట్ గా చాలా దూరం ఆలోచించింది. ఎలాగైనా తులసిని కంటికి రెప్పలా కాపాడుకుంటూవుండాలి మేమిక. శ్యామ్ తో కూడా చెప్పాలి అనుకున్నాను.

"సర్లెండి ఎక్కువ ఆలోచించి బుర్రపాడు చేసుకోకండి. అదంతా ఆడవారి జీవితంలో భాగమైపోయింది. తనకు తనే నేర్చుకుంటుంది. లేకున్నా లోకం నేర్పే తీరుతుంది" చెప్పింది.

"నువ్వు చిన్నతనంలో చాలా పడ్డావు కదూ సంధ్యా?" నెమ్మదిగా అడిగారు నాన్న.

ఉలిక్కిపడ్డాను నేను. గుండె ఫ్రీజ్ అయిపోయినట్లైంది. అమ్మ మాట్లాడలేదు.

అమ్మ జవాబు కోసం నేనూ, నాన్నా కూడా ఎదురుచూస్తున్నాం. నేను భయంగా. మరి నాన్న ఫీలింగ్స్ ఏంటో నాకు తెలియలేదు..

అమ్మ అక్కడనుండి లేచింది, "కృష్ణకి కాఫీ ఇచ్చి వస్తాను శంకర్. వాడు లేచాడేమో?" అంటూ లోపలికి వచ్చి కిచెన్ వైపు వెళ్ళిపోయింది.

లాన్ లో ఛైర్ లో నాన్న, మెట్ల దగ్గర నేనూ అలా చాలాసేపు వుండిపోయాము. అమ్మ బదులివ్వని ప్రశ్నకి మాకు జవాబు అర్థమైపోయింది. బట్, వి ఆర్ జస్ట్ హెల్ప్ లెస్.

నాన్న లేచి వెళ్ళబోతూ నన్ను చూసి ఆగారు, నా తల నిమిరి "పద కన్నా పద వెళ్దాం" అని క్లుప్తంగా చెప్పి ముందుకు నడిచారు..

చాటుగా వారి మాటలు వినడానికొచ్చానని అనుకున్నారేమో అన్న నా గిల్ట్, నాన్న ఇచ్చిన ఆ చిన్న గెశ్చర్ తో పోయింది. వారూ నేనూ వేరు కాదని తెలిపింది. థ్యాంక్యూ గాడ్. థ్యాంక్యూ సో మచ్. నన్ను ఇంత గొప్ప తల్లితండ్రులకు పుట్టించినందుకు. తృప్తిగా కృతజ్ఞతలు తెలుపుకుంటూ నాన్నని అనుసరించాను.

❦❦❦

తులసి ఆలోచనలు చాలా లోతైనవి. గుర్తుపట్టలేనివి. వేరేవారికి ఇబ్బంది కలుగకూడదని తను చేసే పనులు తనని భిన్నంగా నిలబెట్టేవి.

ఆరోజు నాకింకా గుర్తుంది, ఎమ్ సెట్ ఎగ్జామ్ బాగా రాసేసిన రిలాక్స్డ్ మూడ్ లో శ్యామ్ వాళ్ళింటి టెర్రాస్ మీద ఇంట్లోవాళ్లకి తెలీకుండా బీర్ క్యాన్స్ తాగుతూ సెలిబ్రేట్ చేసుకుంటున్నాం నేనూ, శ్యామ్. పరుగున వచ్చింది పైకి బృందా. చప్పున మా చేతుల్లోని బీర్స్ వెనక్కి పెట్టేసాం.

"యూ నో వాట్ తులసి ఎమ్ సెట్ రాయనేలేదు తెల్సా?" రొప్పుతూ చెప్పింది, ఏ ఉపోద్ఘాతంలేకుండా. తెల్లబోయి చూసాం.

"అదేంటి, పగలూ, రాత్రీ కష్టపడి అందరం చదివాం, రాసాం తనెందుకు స్కిప్ చేస్తుంది? పిచ్చి జోకులెయ్యకు" విసుక్కున్నాడు శ్యామ్.

తలడ్డంగా తిప్పింది. "నిజంరా తనే చెప్పింది. కావాలంటే తననే అడగండి."

ఒకళ్ళ ముఖాలొకరం చూసుకున్నాం. పక్కనున్న కార్డ్ లెస్ తీసి తులసి వాళ్ళింటికి డయల్ చేసాడు శ్యామ్.

"తులసీ ఓసారి మా ఇంటికి రా ఇప్పుడే టెర్రాస్ మీదున్నాం, డైరెక్ట్ వచ్చెయ్ లేదు అర్జంట్" శ్యామ్ మాటలు వింటూ అన్యమస్కంగా ఆలోచిస్తున్నాను, ఏమైంది తులసికి, ఎగ్జామ్ మిస్ చేసేంత ప్రాబ్లం ఏమైవుంటుంది?

లేత గులాబీరంగు చుడీదార్ లో అప్పుడే విరిసిన పువ్వంత ఫ్రెష్ గా ప్రత్యక్షం అయింది ఓ పది నిమిషాలకి తులసి "ఏంటంత అర్జంట్ పని శ్యామ్? ప్రసాదం లడ్డూలు చెయ్యడానికి సాయంచేస్తానని చెప్పాను రాధ పిన్నికి తెలుసా? మళ్ళీ పనుందని చెప్పి రావడానికి ఎంత ప్రాబ్లెమో మీకేం తెలుసు బాబూ. వంద ప్రశ్నలడుగుతుంది పిన్ని. తనని తప్పించుకుని వచ్చేసరికి తలప్రాణం తోకకి వచ్చింది. కాస్త ముందే చెప్పొచ్చుగా కలిసేదుందని" కాస్తంత సున్నితంగా తనదైన పంథాలో విసుక్కుంది తులసి.

"మాకూ ముందు తెలీదు కదా! తమరు వుద్ధరించిన ఘనకార్యం. అందుకే అంత హడావిడిగా పిలవాల్సివచ్చింది" వ్యంగ్యంగా ఒకింత కోపంగా అన్నాడు శ్యామ్.

తెల్లబోతూ చూసింది, "నేనేం చేసానూ?" అంటూ. అసలే పెద్దవైన ఆమె కళ్ళు మరింత విశాలమయ్యాయి.

"ఎమ్ సెట్ ఎగ్జామ్ రాయలేదా తులసీ?" ఇంకేదో అనబోతున్న శ్యామ్ ని వారిస్తూ డైరెక్ట్ గా అడిగాను.

మౌనంగా తలొంచుకుంది. నెమ్మదిగాగా తల అడ్డంగా తిప్పింది "లేదు" అంటూ.

"చెప్పు తులసీ, ఎందుకు?" సీరియస్ నెస్ చోటు చేసుకుంది నా గొంతులో.

"నాన్న డిగ్రీ చెయ్యమన్నారు కృష్ణా. ఇంజనీరింగ్ ఎఫర్డ్ చేయలేమన్నారు అందుకే" బెరుగ్గా చెప్పింది.

"మరావిషయం మా దగ్గరెందుకు దాచావ్?" ఖస్సుమన్నాడు శ్యామ్.

"అదంతా చెప్పి అనవసరంగా ఎగ్జామ్స్ మధ్యలో మిమ్మల్నందర్నీ డిస్టర్బ్ చెయ్యడం ఎందుకనీ" ఆగిపోయింది.

"చాలా గొప్పపని చేసావ్ మరి మాతో రాత్రి, పగలు ప్రిపేర్ అయినట్టు కటింగ్ దేనికో" విసుక్కున్నాను కోపంగా.

"సారీ ప్రిపేర్ అవ్వకపోతే మీరు అడుగుతారు వర్రీ అవుతారు. అందుకే అప్లై చేసాను. కాకపోతే రాసి ప్రయోజనం లేదు కాబట్టి రాయలేదు. ప్లీజ్ ఫీల్ కాకండి" మా వైపు చూస్తూ దిగులుగా అడిగింది.

"ఫీల్ కావడం కాదు తులసీ, ముందే తెలిస్తే ఏదో ఒకటి ప్లాన్ చేసేవాళ్ళం కదా. నీకు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ మీద ఎంత ఇంట్రస్ట్ వుందీ  సడెన్ గా ఈ డెసిషన్. నాన్నా వాళ్ళతో అంకుల్ కి చెప్పించేవాళ్ళంకదా. అసలు ఎగ్జామే రాయకపోతే ఎలా, ఏంచేసేదిప్పుడూ?" మందలింపుగా అన్నాను.

"నాన్న చదివించనూ అంటే మాట్లాడించవచ్చు, బట్ ఎఫర్డ్ చేయలేనన్నాకా ఫోర్స్ ఎలా చేస్తాను కృష్ణా?" అంది నెమ్మదిగా.

"మేమంతా లేమా? ఏదో ఒకలా అమౌంట్ అరేంజ్ చేసుకునేవాళ్ళంకాదా?" అన్నాడు శ్యామ్.

"మరీ చిన్నపిల్లల్లా మాట్లాడకు శ్యామ్. ఇంజనీరింగ్ అంటే వెయ్యా, రెండువేలూ కాదు. ఏదో ఓలా అరేంజ్ చేసుకోవడానికి, అందరమూ మిడిల్ క్లాస్ వాళ్ళమే. కాస్త పైనా, కిందా వ్యత్యాసంలో" సున్నితంగా కోప్పడింది.

తన మాటల్లో సత్యాన్ని గ్రహించి కాసేపు అందరం మౌనంగా వుండిపోయాం.

"ఓ ఐడియా" చిన్నగా అరిచింది బృందా మా దిగులుని బ్రేక్ చేస్తూ అల్లరిగా. అదేంటో తెలియకపోయినా తన అరుపులో అల్లరి అర్థమై మా ముఖాల్లో కాస్తంత నవ్వు విచ్చుకుంది.

"ఏంటో ఆ గొప్ప ఐడియా? కాస్త మాకూ శలవివ్వండి మేడమ్" అడిగింది తులసి.

"సింపుల్, ఇంజనీరింగ్ నువ్వే చదవాలనేముంది, అంకుల్ కి చెప్పెయ్ ఓ ఇంజనీర్ బకరానే చూడమని, వాడు కష్టపడి చదువుకుని, జాబ్ తెచ్చుకుని వస్తాడు, నువ్వు ఫుల్ ఎంజాయ్ వాట్ యూ సే?" కొంటెగా కళ్ళెగరేసింది.

నవ్వేసామంతా.

"ఆహా, మీరు చాలా గ్రేటమ్మా ఏం చెప్పావూ " సెల్యూట్ చేసినట్టు అభినయించాడు శ్యామ్.

"థ్యాంక్యూ బ్రదర్. ఇంకో ఐడియా కూడా చెప్పనా, అదేదో ఈ ఇద్దరు ఇంజనీర్స్ లోనే చూస్కో తులసీ, కట్నం కూడా వుండదు. ఫ్రీ. ఫ్రీ. ఫ్రీ" హుషారుగా చెప్పింది. నవ్వాగలేదందరికీ.

"వార్నీ. మాకే పెట్టావా ఎసరు. ఐతే నా దగ్గరా వుందో ఐడియా. శ్యామ్ నువ్వు తులసిని చేస్కో, నేను బృందాని చేస్కుంటా. మొత్తం ఫ్రీ.. ఫ్రీ.. ఫ్రీ ఏమంటావ్?" అడిగాను అల్లరిగా.

అప్పటికే శ్యామ్, తులసీ పడీ పడీ నవ్వుతున్నారు.

"సూపర్రా" మధ్యలో నవ్వాపుకుంటూ కష్టంమీద చెప్పాడు శ్యామ్.

"చంపుతా. అమ్మో పోయి పోయి ఈ రాక్షసుడు నాకా. ఫ్రీగా వచ్చినా ఆఖరికి ఎదురు కట్నమిచ్చినా వద్దు బాబోయ్" భయం నటించింది బృందా.

"ఆ ఏంటీ? రాక్షసుడా. హలో ఎక్స్ క్యూజ్ మీ. ఏమనుకుంటున్నావ్  కాలనీ కృష్ణుడిక్కడ" కాలరెగరేసి, ఫోజ్ కొడుతూ చెప్పాను.

"ఛా ఎవరమ్మా చెప్పింది? అంత సీన్ లేదు తమరికి" వెక్కిరించింది.

"అయ్యో అలా అంటే ఎలా బృందా, పాపం ఏం తక్కువ చెప్పు కృష్ణకి. ఈసారికి ఒప్పేసుకోరాదూ" ఉడికించింది తులసి.

"హే భగవాన్. వున్నావా? అసలున్నావా?" పాట టైప్ లో బాధనటించింది బృందా.

అంతలో స్వామి గుళ్ళో గంటలు వినిపించాయి, రాత్రి హారతికి సూచనగా. చప్పున అటుచూసి, "అమ్మో తొమ్మిదయిపోయింది. ఇక వెళ్తానూ" అంటూ లేచింది తులసి.

"సారీ తులసీ, మేం ఏం చెయ్యలేకపోతున్నాం" నెమ్మదిగా చెప్పాడు శ్యామ్. తియ్యగా నవ్వేసి తలూపింది తులసి. బృందా లేచి మౌనంగా తనని హగ్ చేసుకుంది. లాలనగా తన భుజం ప్యాట్ చేసింది తులసి.

"పద, నిన్ను డ్రాప్ చేస్తాను " చెప్పాను.

"ఇక్కడే కదా మళ్ళీ ఎందుకులే కృష్ణా" ఇబ్బందిగా చూస్తూ అంది.

"లెట్ మీ వాక్ విత్ యూ. ప్లీజ్.  కాస్త దూరంనుంచే వెళ్ళిపోతా సరేనా, మీ రాధ పిన్ని కళ్ళలో పడకుండా" చెప్పాను.

చిన్నగా నవ్వి తలూపింది. మెట్ల వైపు నడుస్తూ చెప్పాను "శ్యామ్ ఇంట్లో చెప్పి వస్తా, రాత్రికిక్కడే వుంటా, బెడ్ పైన వేసెయ్" అంటూ వాడివైపు చూసి అర్థవంతంగా నవ్వాను. బీర్ కాన్స్ దాచిన వైపోసారి చూసి, వాడూ నవ్వి, "డన్" బొటనవేలు పైకెత్తి చూపుతూ చెప్పాడు.

బయటికి వెళ్ళాకా అడిగాను. "ఒక్కమాట కూడా చెప్పలేదెందుకు తులసీ? ఇన్నిరోజుల్లో అందుకేనా ఎమ్ సెట్ ముందు అంత డల్ గా వున్నావు నేను ఎగ్జామ్ టెన్షన్ అనుకున్నాను" బాధగా.

"మ్.. మీరంతా ఫీలవుతారనీ చెప్పలేదు. ఐనా డల్ గా ఎందుకున్నానని నన్నెవరూ అడగలేదుగా చెప్పడానికి" అంది సూటిగా.

తన మాట చురుక్కుమనగా దెబ్బతిన్నట్టు చూసాను, స్ట్రీట్ లైట్ వెలుతురులో తన పెద్ద కళ్ళలో చిత్రమైన భావం, "నన్నడగలేదుగా చెప్పడానికి."

'నువ్వు పెన్సిల్ తీసావా, లేదా అని నన్నడగలేదు టీచర్. పెన్సిల్ ఎందుకు తీసావని కొట్టారు' అంటూ కన్నీళ్ళు పెట్టుకున్న ఆరేళ్ళ తులసి గుర్తొచ్చింది.

"ఎగ్జామ్స్ టెన్షన్ అనుకుని పట్టించుకోలేదు. వి ఆర్ సారీ రా" అన్నాను గిల్టీగా.

తేలిగ్గా నవ్వేసింది," నాకు తెలీదా కృష్ణా. ఏదో అనేసాను. ఫీల్ కాకు." చెప్పింది.

"తులసీ, మేం బాధపడతామని ఇన్ని రోజులు దాచావు సరే మరి మేమంతా ఎమ్ సెట్ రాస్తుంటే నీకు మాత్రం బాధెయ్యలేదూ? అందరి గురించీ ఆలోచించడం మంచిదే, కానీ, నీ బాధెందుకు దాచుకుంటావలా?" అడిగాను మృదువుగా మందలిస్తూ.

నడుస్తున్నదల్లా నెమ్మదిగా ఆగిపోయింది. తన చేతుల్లో మెలిపెడుతున్న చున్నీవైపే చూస్తూ తలొంచుకుని వుండిపోయింది.

లాలనగా ఆమె తలపైన చేయుంచాను, "నాన్న బాధపడతారని గోల్ వదిలేసీ, మేము బాధపడతామని మా దగ్గర దాచీ, ఎందుకదంతా చెప్పూ? ఐనా అన్ని విషయాలూ నువ్వు చెప్పకపోతే మాకర్థంకాదనుకున్నావా ఇడియట్ ఏదో ఈసారి ఎగ్జామ్స్ హడావిడిలో పట్టించుకోలేదుగానీ, మా తులసి సైలెన్స్ మాకర్థంకాదా ఏంటి చెప్పు. ఏదీ ఇటు చూడూ" అన్నాను.

నెమ్మదిగా తలెత్తింది. ఆ పెద్ద కళ్ళల్లో సన్నటి నీటి తెర. చలించిపోయాను.

"ఒక్కమాట చెప్తాను తులసీ, మనం అందుకోవాలనుకున్నది దొరికినప్పుడు వచ్చే సంతోషం కంటే, దొరికినదానిని సంతోషంగా స్వీకరించగలిగినప్పుడే మనిషి తృప్తిగా వుంటాడట ఎక్కడో చదివాను, లైఫ్ లో తృప్తి ముఖ్యం తులసీ, ఇట్ గివ్స్ హ్యాపీనెస్" చెప్పాను గంభీరంగా.

తలూపింది, "గుర్తుపెట్టుకుంటాను కృష్ణా ఎప్పటికీ. నిజంగా థ్యాంక్యూ. తృప్తిలోంచే హ్యాపీనెస్ డిరైవ్ చేస్కోడానికి ప్రయత్నిస్తాను. వస్తా మరీ, థ్యాంక్స్ వన్స్ అగైన్" చెప్పి కదిలింది.

తను వెళ్ళిన వైపు తను కనుమరుగయ్యేంతవరకూ చూసి వెనుదిరిగి ఇంటిదారి పట్టాను. తెలుసు తులసి సర్దుకుపోవడానికే ఎక్కువ ప్రిఫరెన్స్ ఇస్తుంది. కనీసం అందులోనైనా తను సంతోషంగా వుండాలనే అలా చెప్పాను.

కానీ, తనకి ఇష్టమైన వాటికోసం, తన హక్కుకోసం పోరాడమని చెప్పాల్సిందా. ఏమో మరి నాకు కరక్టనిపించింది చెప్పానుగానీ తప్పో, ఒప్పో నాకూ తెలీదు మరి.

**శాస్త్రి** అంకుల్ కోసం తులసి తీసుకున్న నిర్ణయంతో మొదటిసారిగా మా దారులు వేరయ్యాయి. ఆ అవడంతో మొదలుకొని మా ప్రతి దారీ వేరవుతూనే పోయింది.

నేను, శ్యామ్, బృందా ఇంజనీరింగ్ లో, తులసి డిగ్రీ కాలేజ్ లో జాయిన్ అయ్యాము. కాలేజెస్ వేరైనా టెక్నాలజీ పుణ్యమాని మెసేజెస్, మొబైల్స్, మెయిల్స్ తో ఎప్పుడూ టచ్ లోనే వుండే వాళ్ళం. వాటిని (M3) అని పిలుచుకునే వాళ్ళం ముద్దుగా.

ఎంత బిజీ స్కెడ్యూల్ వున్నా రోజులో ఏదో ఒక టైమ్ లో అందరం కలవడానికే ట్రై చేసేవాళ్ళం. కాలేజ్ కి వెళ్ళే ముందో లేక తిరిగివచ్చిన తర్వాతో

సెకండ్ ఇయర్ స్టార్ట్ అయ్యాకా నన్ను హాస్టల్ లో చేరిపోమన్నారు నాన్న. మూడు బస్సులు మారి వెళ్ళాల్సి రావడంతో వెయిటింగ్ లో, ట్రాఫిక్ లోనే చాలా టైమ్ వేస్టవుతోందంటూ.

నాకు ఆ డెసిషన్ పెద్దగా ఇష్టం లేకపోయినా టైమ్ సేవింగ్ కోసం ఒప్పుకోక తప్పలేదు. శ్యామ్, బృందాలు మాత్రం వారి కాలేజ్ లకి బస్ ఫెసిలిటీ వుండడంతో ఇంటి నుంచే వెళ్ళేవారు..

తులసిది కాలనీ దగ్గర్లోవున్న డిగ్రీ కాలేజ్ కావడంతో తను కాస్త ముందుగానే వచ్చేసేది కాలేజ్ నుంచి .

ఇంటర్ నుండీ అలవాటైన ట్యూషన్స్ చెప్పడం ఇంజనీరింగ్ జాయిన్ అయ్యాకా కూడా కంటిన్యూ చేయాలనుకున్నాను. కానీ అలా చేయడం కష్టమయ్యేది. కాలేజ్ దూరం కావడంతో చాలాసార్లు తిరిగి వచ్చేసరికీ ఆలస్యమయిపోయేది. నా క్లాసెస్ కూడా పాపం తులసే తీసుకోవలసి వచ్చేది.

నేను హాస్టల్ చేరిపోయాకా, తులసి పూర్తిగా టేక్ ఓవర్ చేయాల్సి వచ్చింది. ఎప్పుడైనా బృందా తనకి సాయం చేసేది. ముఖ్యంగా స్టూడెంట్స్ కి ఎగ్జామ్స్ టైమ్ లో.

చూస్తుండగానే మేము ఫైనల్ సెమ్ కి వచ్చేసాము. ఆల్రెడీ ప్లేస్మెంట్స్ జరిగిపోయాయి మా బ్యాచ్ కి. లక్కీలీ చాలా మంచి కంపెనీలో నాకు సెలెక్షన్ వచ్చింది. పైగా నేను ఎమ్.ఎస్. చేస్తానంటే కూడా అబ్రాడ్ కూడా పంపిస్తామని చెప్పారు. ఒక్క సెమ్ కష్టపడితే లైఫ్ సెట్ అయిపోయినట్టే. నేను వూహించనంత మంచి ఆఫర్ అది. వెరీ మచ్ థ్రిల్డ్.

బృందాకి కూడా మంచి ప్లేస్మెంట్ వచ్చింది. కాకపోతే శ్యామ్ మాత్రం రిసెర్చ్ కి సంబంధించిన ఆఫర్ వస్తేనే తీసుకుంటానంటూ వేరేవేవీ ఆక్సెప్ట్ చేయకుండా వుండిపోయాడు.

తులసి డిగ్రీ పూర్తయిపోయింది. ఆ పైన చదివించలేనని శాస్త్రి అంకుల్ చెప్పేయడంతో తను ఇంట్లోనే వుండిపోయింది. ఈవెనింగ్స్ మేం స్టార్ట్ చేసిన ట్యూషన్ క్లాసెస్ మాత్రం తీసుకునేది.

కనీసం తను డిస్టెన్స్ లో ఐనా పీ.జీ. చేయడానికి శాస్త్రి అంకుల్ ని ఒప్పించమని నాన్ననీ, రాజేష్ అంకుల్ నీ బలవంతంగా పంపాము. చాలా కష్టంమీద అందుకు ఒప్పుకున్నారాయన, వీళ్ళ మాట కాదనలేక.

మర్చిపోలేని రోజది. తులసి చాలా సంబరపడిపోయిందప్పుడు. నాకు తెలుసు, పాపం తనకి చదువంటే చాలా ఇష్టం.

రోజూ సాయంత్రం లైబ్రరీకి వెళ్ళేముందు సిస్టమ్ ముందు కాసేపు తప్పనిసరి.. నేను హాస్టల్ కి మారాకా మా నలుగురి గ్రూప్ కీ ఛాటింగ్ కోసం మేం ఫిక్స్ చేసుకున్న టైమ్ అది.

శ్యామ్, బృందాల ప్రాజెక్ట్ క్లాసెస్ కూడా అప్పుడే పూర్తవుతాయి. తులసి కూడా ట్యూషన్ క్లాసెస్ కి కాస్త ముందే మా ఇంటికి వచ్చి నా సిస్టమ్ తీస్తుంది.

మాగ్జిమమ్ అందరం జాయిన్ అవుతాము, ఎప్పుడైనా ఒక్కొక్కరం మిస్సవుతుంటాము.

ఆ రోజు శ్యామ్, తులసీ ఇద్దరూ లేరు మెస్సెంజర్ లో. బృందా ఒక్కతే వుంది. చాలా పెద్ద న్యూస్ తో సిద్ధంగా.

"యూ నో కృష్ణా తులసి పెళ్ళట నెక్స్ట్ మంత్" ఏ వుపోద్ఘాతమూ లేకుండా డైరెక్ట్ గా మెసేజ్ టైప్ చేసింది బృందా.

"వ్వాట్.. ఆర్ యూ కిడ్డింగ్.. ఏంటంత సడెన్ గా !?" కంగారుగా తిరిగి టైప్ చేసాను. కాల్ చేద్దామంటే క్యాంపస్ లో సెల్స్ అలౌడ్ లేవు.

"లేదు. కిడ్డింగా నా మొహమా. ఈవెన్ ఐ వాజ్ టెరిబ్లీ షాక్డ్. శాస్త్రి అంకుల్ కాశీకి వెళ్ళారు కదా పొద్దున్నే తిరిగి వచ్చారు. అక్కడెవరో తెలిసినవాళ్ళు కలిసారట. చాలా మంచి ఫ్యామిలీ అట. అంకుల్ సింపుల్ గా సంబంధం ఖాయం చేసుకుని వచ్చేసారు, కనీసం రమా ఆంటీకి కూడా చెప్పనైనా చెప్పకుండా.

తులసికి కూడా కొంచెంసేపటి క్రితమే తెలిసింది. తెలియగానే నా దగ్గరకి వచ్చేసింది. సడెన్ గా కదా. పాపం చాలా నెర్వస్ అయిపోయినట్టుంది" చెప్పుకుపోతోంది బృందా.

"వెయిట్. వెయిట్..యూ మీన్ తులసీ ఈజ్ ఓ.కే. విత్ ఇట్ ? తనకి ఓ.కే.నా? ఇదంతా ఇంత తొందరగా బృందా? "

"మ్. ఏమో కృష్ణా నువ్వొచ్చాకా మాట్లాడు తనతో. నాకైతే అర్థం కావట్లేదు. నీకే తెలియాలిక" చెప్పింది.

"మే బీ. సరే తనేది?" అడిగాను.

"ఏదో పూజట సాయంత్రం. అంకుల్ కాశీ వెళ్ళి వచ్చారుకదా గంగా జలం, ప్రసాదం, అన్నీ అందరికీ పంచుతారట. ఏర్పాట్లలో వుంది" చెప్పింది.

"ఓ.కే. దెన్. మళ్ళీ మాట్లాడతాను బృందా సీ యూ" అంటూ ఛాట్ బాక్స్ క్లోజ్ చేసాను.

లేచి బయటకి వచ్చాను. అప్పటికే రఘు వచ్చాడు లైబ్రరీ టైమ్ అయ్యిందంటూ. రఘు కూడా నా కాలేజే. కాకపోతే వాళ్ళ ఇల్లు దగ్గరే కావడంతో హాస్టల్ అవసరపడలేదు వాడికి. కాలేజ్ లో క్లాసెస్ అయ్యాకా ఇంటికి వెళ్ళి మళ్ళీ వస్తాడు. ఇప్పుడంటే ప్రాజెక్ట్ టైం కాబట్టి లైబ్రరీ అవర్స్ కోసం, అసలైతే వాడొచ్చేది అందరం చేసే టైంపాస్ కోసమే.

"కృష్ణా ఏంటి ఇంకా ఇక్కడే వున్నావ్? వెళ్దామా?" అడిగాడు.

ఎక్కడో ఆలోచిస్తున్న నేను వులిక్కిపడి చూసాను " లేదు రఘూ నేను ఇంటికి వెళ్ళాలి నువ్వెళ్ళు" చెప్పి త్వర త్వరగా కదిలాను.

వెళ్ళాలి వెంటనే. అందరికంటే ముందు అమ్మతో మాట్లాడాలి ఇవ్వాళే. నా మనసులో అనుకున్నది చెప్పాలి.

"సో తులసిని ప్రేమిస్తున్నావన్నమాట" గంభీరంగా అన్నారు నాన్న.

"లేదు నాన్నా" వెంటనే జవాబిచ్చాను తల అడ్డంగా తిప్పుతూ.

"చిన్నా కథలు చెప్పకు, నువ్వేం అడుగుతున్నావని అమ్మ నాకు చెప్పిందో తెలుసా?" నాన్న గొంతులో కోపం స్పష్టంగా వినిపించింది.

"తెలుసు నాన్నా నేనే అడగమన్నాను. తులసిని పెళ్ళి చేసుకుంటానన్నాను" చెప్పాను సిన్సియర్ గా.

"పిచ్చి పిచ్చిగా మాట్లాడకు కృష్ణా. ఓ పక్క ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకుంటానంటూ, మరోపక్క ప్రేమించట్లేదంటావ్ ఎందుకా కథలు? నీకాపిల్లంటే ఇష్టం లేదూ?" అసహనంగా చూస్తూ అన్నారు నాన్న.

"ఇష్టమే నాన్నా. చాలా ఇష్టం, నాకు శ్యామ్ అంటే కూడా ఇష్టమే, కానీ ప్రేమించడంలేదుగా. అలాగే తులసంటే కూడా ఇష్టమే – ప్రేమ కాదు" వివరించాను.

"అంటే శ్యామ్ కీ, తులసికీ తేడాలేదేమిట్రా నీ దృష్టిలో" తెల్లబోతూ అడిగింది అమ్మ నాన్నవైపోసారి అయోమయంగా చూసి.

"ఎందుకు లేదమ్మా? శ్యామ్ తో నా రిలేషన్ లైఫ్ లాంగ్, మేం ఎంతకాలం కావాలంటే అంతకాలం కంటిన్యూ చేయొచ్చు, బట్ తులసితో అలాక్కాదు. ఇట్స్ నెవర్ ద సేమ్. ఆ౯లేడీ బోలెడు రెస్ట్రిక్షన్స్. ఇక రేపు ఫ్యూచర్ లో మాకు ఎవరి లైఫ్ వారికేర్పడ్డాకా కనీసం కలిసేందుకు, మాట్లాడుకునేందుకైనా వుంటుందో లేదో తెలీదు.

అందుకే పెళ్ళి చేసుకుంటానంటున్నాను. సో దట్ తనని లైఫ్ లాంగ్ కోల్పోకుండా వుండేందుకు. అంతే" కన్ఫెస్ చేసాను.

ఇద్దరూ అయోమయంగా చూసారు నావైపు. సడెన్ గా నాన్న నవ్వారు గట్టిగా, తేలిగ్గా. రెండు క్షణాల తర్వాత అమ్మ కూడా శృతి కలిపిందాయనతో.

నేనేం మాట్లాడలేదు. కామ్ గా నిలబడ్డాను. నేనూహించని రియాక్షన్ కాదది.

కాసేపటికి సర్దుకుని తన పక్కనున్న సోఫా వైపు చూపించారు నాన్న, "ఇలా వచ్చి కూర్చో కృష్ణా" అంటూ.

నేను వెళ్ళి పక్కన కూర్చోగానే ప్రేమగా నా భుజం చుట్టూ చేయివేసి దగ్గరకి తీసుకున్నారు.

"సారీ కృష్ణా నిన్ను టీజ్ చేయాలనో, హేళన చేయాలనో నవ్వలేదు. నీ అమాయకత్వం చూసి నవ్వొచ్చింది. అంతే. ప్లీజ్ డోన్ట్ మైండ్" ఆప్యాయంగా అపాలజైజ్ చేసారు.

"ఐ నో డాడ్", చెప్పాను మనఃస్ఫూర్తిగా.

నిజంగానే తెలుసు నాకు వాళ్ళిద్దరూ అలా నన్ను తక్కువచేయలేరని, తమ తప్పుని పిల్లలముందు ఒప్పుకుని క్షమాపణ అడిగేంత ఔదార్యం ఎంతమంది తల్లితండ్రులుకుంటుంది? బట్ ఐ కెన్ ప్రౌడ్లీ సే మై పేరెంట్స్ హావ్ దట్. ఆ గౌరవమే లేకపోతే వారిముందు ఇలా నా మనసుని యధాతధంగా వుంచే ధైర్యం నేను ఎప్పటికీ చేయలేకపోయే వాడినేమో.

"చూడు కృష్ణా ఈ ఏజ్ లో అలాంటి ఫీలింగ్స్ సహజమే. ఇప్పుడున్న ఫ్రెండ్స్ ని వదలలేమనీ, వదిలి వుండలేమనీ ప్రతి స్టేజ్ లో అనిపిస్తుంది. స్కూల్ లో, కాలేజ్ లో, కాలనీలో, ట్యూషన్ లో. ఎవ్రీవేర్.

సర్కిల్ పెరుగుతున్నకొద్దీ మన లైఫ్ లో ప్రయారిటీస్ మారతాయి. కాలంతో పాటూ బంధాల సాంద్రతా తగ్గుతుంది. అది నువ్వు అర్ధం చేసుకునీ" ఇంకా చెప్పబోతున్న నాన్న మాటల్లోకి ఇంట్రూడ్ అవుతూ చెప్పాను.

"నాన్నా. నేను ఇంజనీరింగ్ ఫైనల్ లో వున్నాను. స్కూల్, కాలేజ్, ట్యూషన్, కాలనీ అన్నీ దాటాననే అనుకుంటున్నాను, అయినా నేను ఇంకా అడాలసెన్స్ కూడా దాటలేదని నా మాటలతో మీకు అనిపిస్తోంది కదూ? బట్ అయామ్ ట్రయింగ్ టూ బీ క్లియర్ తులసి నా లైఫ్ లో చాలా ఇంపార్టెంట్. చాలా అంటే చాలా. తనని వదులుకోవాలని లేదు నాకు, కాన్ట్ లూజ్ హర్.

రేప్పొద్దున్న నా సెటిల్మెంట్ అయ్యాకా, నా కోసం ఎవరో ఒక అమ్మాయిని చూస్తారుగా. ఆ అమ్మాయి తులసే ఎందుకు కాకూడదు? మే బీ నేను సెటిల్ అయ్యాకా ఇదంతా మాట్లాడివుంటే ఇట్ వుడ్ హావ్ మేడ్ సెన్స్ ఏమో. బట్ నా దగ్గర అంత టైమ్ లేదు, శాస్త్రి అంకుల్ తులసికి ఏదో సంబంధం ఖాయం చేసుకుని వచ్చారని విన్నాం. సో అయామ్ లెఫ్ట్ విత్ నో అదర్ ఆప్షన్.

ఐనా నాన్నా, నాక్కూడా అంత వుత్సాహం ఏమీ లేదు ఇప్పుడు పరిగెట్టి– పరిగెట్టి ట్వెంటీ టూ ఇయర్స్ కే పెళ్ళి చేసుకుని నన్నూ, నా వైఫ్ నీ కూడా పోషించమని మీ నెత్తిన కూర్చోవడానికి అయామ్ నాట్ లైక్ దట్ లేజీ బగ్గర్ సుభాష్.

మీరు ఒక్కసారి శాస్త్రి అంకుల్ తో మాట్లాడండి, కొన్ని ఇయర్స్ వరకూ ఈ పెళ్ళి థాట్ వాయిదా వేయమని చెప్పండి, ఏ రీజన్ అయినా ఓ.కే. నాన్నా ప్లీజ్, అమ్మా చెప్పు ప్లీజ్. ప్లీజ్ డూ మీ దిస్ ఫేవర్.."

డిస్టర్బ్ చెయ్యకుండా నా వర్షన్ మొత్తం విన్నారిద్దరూ. ఆ తర్వాత కొంతసేపటివరకూ ఇద్దరూ ఏం మాట్లాడలేదు. ఆ కాసేపటి బరువైన నిశ్శబ్దాన్ని నాన్న గంభీరంమైన గొంతు చీల్చింది, నా గుండెతోపాటుగా "చూడు కృష్ణా.., నువ్వు ఓ

అడాలసెంట్ లా మాట్లాడావని మేమేం అనుకోలేదు. వి రెస్పెక్ట్ యువర్ ఫీలింగ్స్ అండ్ థాట్స్. మాతో అవి షేర్ చేసుకున్నందుకు వి ఆర్ వెరీ హాపీ. తులసి నీ లైఫ్ లో ఎంత ఇంపార్టెంటో కూడా తెలుసు,

కానీ కేవలం అందుకోసమే తనని పెళ్ళి చేసుకుంటానని అనుకోవడం దట్స్ ఇన్నోసెన్స్ మై కిడ్. ప్యూర్లీ ఇన్నోసెన్స్. నువ్వు నిజంగా తులసిని ప్రేమిస్తుంటే పెళ్ళి గురించి మాట్లాడినా అర్థంవుంది, అలాంటిదేమైనా వుంటే మాట్లాడచ్చు, అడగచ్చు, రిక్వెస్ట్ చేయవచ్చు. కానీ ప్రేమ లేని చోట ఈ ప్రయత్నాలన్నీ. మ్...

అయినా డూ యూ థింక్ ఇట్స్ ఆల్ సో ఈజీ? ఇలాంటి ఇంటర్ కేస్ట్ మ్యారేజ్ కి శాస్త్రిగారిలాంటి పురోహితుల కుటుంబం ఒప్పుకుంటుందని నీకు అనిపిస్తోందా? పైగా వాళ్ళెంత ఆర్థడాక్స్ ఫ్యామిలీయో నీక్కూడా తెలుసుకదా? చాలా పెద్ద పెద్ద గొడవలవుతాయి. అసలు అలాంటి ప్రస్తావన చేసిన వెంటనే వున్న రిలేషన్స్ ముందు తెగిపోతాయి. డూ యూ అండర్ స్టాండ్ దట్?

అదంతా కేవలం తులసితో స్నేహం కట్ అవకుండా వుండడం కోసమా? మరి మా రిలేషన్స్? జస్ట్ టు రీటెయిన్ హర్ ఇన్ యువర్ లైఫ్ ఫర్ ఎ లాంగ్ టైమ్. వద్దు చాలా సెల్ఫిష్ థాట్ అనిపించుకుంటుంది కృష్ణా. వర్కవుట్ కూడా కాదు. ఐనా నీకెందుకంత భయం? మీరంతా పెళ్ళిళ్ళయ్యాకా దూరమైపోతారని అంత భయం ఎందుకు? ఇప్పుడు సొసైటీ మారింది, పీపుల్ మెయిన్టెయిన్ రిలేషన్స్ అక్రాస్ కంట్రీస్. అలాంటిది లేని పోని భయాలతో డోన్ట్ టేక్ ఎనీ హేస్టీ డెసిషన్స్.

సరే పోనీ ఇదంతా వదిలేద్దాం. ఒకవేళ తులసితో పెళ్ళికి కమిట్ అయ్యాకా ఇఫ్ యూ హాపెన్ టూ మీట్ యువర్ సోల్ మేట్. దెన్? ఏంచేస్తావు? లాంగ్ టర్మ్ కమిట్మెంట్స్ విత్ అవుట్ లవ్ వర్కవుట్ కావు కృష్ణా. వద్దు. డోన్ట్ గెట్ ఇన్ టూ ఆల్ దట్."

"నాన్నా, మీరడిగే ప్రశ్నలకి జవాబులు మీ దగ్గరే వున్నాయి. తులసి నా లైఫ్ లో వుండదని ఎందుకనుకుంటున్నాను అనే ప్రశ్నకి మీరే జవాబివ్వండి. మమ్మల్ని చిన్నప్పట్నించీ చూస్తున్న శాస్త్రి అంకుల్ వాళ్ళూ, రాజేష్ అంకుల్ వాళ్ళూ ఎందుకు భయపడుతున్నారు మా వునికిని చూసి? ఎందుకు మీరంతా పదేపదే మమ్మల్ని గమనిస్తున్నారు?

అదంతా కేవలం మేం కాస్త పెద్దయ్యేవరకే, తర్వాత ఒక్కసారి మాకు పెళ్ళిళ్ళై మేం సెటిల్ అయ్యాకా మా రిలేషన్స్ బాగుంటాయి, ఎవరి పర్మిషన్స్ అవసరంలేకుండా కాజువల్ గా వుంటాయని చెప్పకండి ప్లీజ్."

"వై నాట్ చిన్నా అదే నిజం కదా. ఐనా అదంతా మిమ్మల్ని బట్టీ వుంటుంది. మీరు ఎలా మెయిన్టైన్ చేస్తారనే దానిమీద డిపెండ్ అవుతుంది. హౌ యూ మ్యానేజ్ , హౌ యూ బిహేవ్. అండ్" నాన్న మాట పూర్తయ్యేలోపే అందుకున్నాను..

"మరి మాధవక్క సోషల్ లైఫ్ ఎందుకు నాన్నా కట్ అయిపోయిందీ? పోనీ ఎంతమంది అలా కాంటాక్ట్ లో వుండగలరు? ఇట్ డజంట్ డిపెండ్ ఆన్ హౌ వి బిహేవ్ ఆర్ హౌ వీ మెయిన్టైన్. ఇట్ డిపెండ్స్ ప్యూర్లీ ఎట్ ద మెర్సీ ఆఫ్

వన్స్ పార్ట్నర్ అండ్ అమ్మాయిల విషయంలో ఐతే వాళ్ళ ఇన్ లాస్ మెర్సీ కూడా నీడెడ్. అంతే. ఇట్స్ యాజ్ సింపుల్ యాజ్ దట్.

మీ నెక్స్ట్ డౌట్. హా. మరో అమ్మాయి అని కదూ? రేపొద్దున్న నాకింకో అమ్మాయితో పెళ్ళయ్యాకైనా లవ్ ఆఫ్ మై లైఫ్ కనిపించదు అని ఏం గ్యారెంటీ నాన్నా? అలా చూసుకుంటూ పోతే దానికి అంతేముంది. మీ రిలేషన్స్ పాడుచేయాలనే సెల్ఫిష్ వుద్దేశ్యంతో కాదు.., మా రిలేషన్స్ గురించిన భయంతో అడుగుతున్నాను..

ఇది సెల్ఫిష్నెస్ కానేకాదు నాన్నా నా హెల్ప్ లెస్ నెస్. ప్లీజ్ హెల్ప్..!

ఐనా, లాంగ్ టెర్మ్ కమిట్మెంట్ ఇక్కడ ఎవరో పెళ్ళి చూపుల్లో పదినిమిషాలు కలుసుకున్న వ్యక్తితో కాదు. తులసి నాన్నా. మీకు.. మీ..కు.. తెలుసు" నాకు తెలియకుండానే నా కళ్ళలో నీళ్ళు నిండాయి.

గబుక్కున లేచి, నా రూమ్ లోకి వెళ్ళి తలుపేసుకున్నాను.

నాకు క్లియర్ గా అర్థం అవుతోంది. అమ్మా-నాన్నలకి నేను చెప్పింది నచ్చలేదు. కాదు. కాదు.. అస్సలు నచ్చలేదు అని. ఎందుకంటే నేను బాధ పడుతున్నానని తెలిసి కూడా వారు నా దగ్గరకి రాలేదు అంటే, నేనేదో తప్పుచేసానని వారి హింట్.

**చాలాసేపు అలాగే కూర్చున్నాను**. సాయంత్రం శ్యామ్ వచ్చేవరకూ. జరిగిందంతా ఆల్రెడీ వాడికి నాన్న చెప్పే లోపలికి పంపారు. వాడు అమ్మా, నాన్నలకంటే ఎక్కువే షాక్ అయ్యాడు. నా మనసులో ఏదైనా వుందీ అంటే అది తులసిగానీ, శ్యామ్ గానీ గ్రహించలేకపోవడం చాలా రేర్. ఏదో ఒకరోజు నేను తులసి పేరో, బృందా పేరో తెస్తాననే అనుమానం అమ్మకి వుందనే నా నమ్మకం. వాళ్ళకే ఈ డైరెక్ట్ మ్యారేజ్ ప్రపోజల్ బౌన్సర్ అయితే ఇక శ్యామ్ పరిస్థితి ఇంక అడగద్దు.

రాత్రి బస్ దొరికి రావడం లేటవడంతో ఈరోజు పొద్దున్నే, అమ్మకు చెప్పే ముందు వాడికి చెప్పాను నా థాట్.. నేను హాస్టల్ నుండి వీక్ డేస్ లో సడెన్ గా రావడానికి రీజన్ ఇదీ అని. బట్ హీ థాట్ ఐ వాజ్ కిడ్డింగ్. కాలేజ్ నుంచి వచ్చాకా మాట్లాడతానంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు.

"రేయ్ కృష్ణా! అంటే.. పొద్దున్న నువ్వు చెప్పింది, యూ వెర్ సీరియస్ అబౌట్ ఇట్. రైట్?" నేను రూమ్ డోర్ తీయగానే అడిగాడు.

జవాబివ్వకుండా వాడు లోపలికి రావడానికి చోటిస్తూ పక్కకి తప్పుకున్నాను. లోనికి వస్తూనే డోర్ క్లోజ్ చేసి నావైపు ఇంకా నమ్మలేనట్టు చూస్తూ మళ్ళీ అడిగాడు "ఏరా నిజమా?"

విసుగ్గా చూసాను. "నువ్వొచ్చి ఎంతసేపయ్యింది?"

"హా.. హాఫ్ ఏన్ అవర్" నావైపు కాస్త బెరుగ్గా చూసి అన్నాడు.

"మరైతే ఫుల్ బ్రీఫింగ్, ఐ మీన్ డీటెయిలింగ్ అయిపోయిందిగా ఐనా ఎందుకడుగుతావ్?" కోపంగా అన్నాను.

"నీ వెర్షన్ వినడానికి" క్లుప్తంగా చెప్పాడు.

అక్కడున్న కుర్చీలో కూలబడి అరచేతుల్లో ముఖం వుంచుకున్నాను. కాసేపటి తర్వాత నాన్నతో చెప్పినదే శ్యామ్ కీ రిపీట్ చేసాను, నాన్న రెస్పాన్స్ తో సహా.

"నువ్వు తులసిని పెళ్ళిచేసుకోవాలి అని సీరియస్ గా అనుకుంటే ప్రేమించానని చెప్పెయ్యాల్సిందిరా" సాలోచనగా చూస్తూ అన్నాడు.

"చెప్తాను, అవసరమైతే కానీ బయటవాళ్ళకి, మీఅందరికీ అబద్ధం ఎలా చెప్పాలి శ్యాం? ఎందుకు చెప్పాలి?"

షాకింగ్ గా చూశాడు శ్యామ్ " అయితే ఆలోచించే చెప్పావా అంకుల్ వాళ్ళకి వున్నదివున్నట్టు?"

"అవును ఏం?" అడిగాను.

"ఏంలేదు, ఇప్పుడెలా కృష్ణా? మీ నాన్న ఒప్పుకునే ప్రశ్నే కనపడటంలేదు. ఆయన పట్టుదల మనకి తెలిసినదే కదా."

"నేనాయన కొడుకుని శ్యామ్" నిదానంగా అన్నాను.

"అంటే.. సో.. వేజింగ్ ఫర్ ఎ వార్ యార్... హా..?" అప్పటికే నా సమాధానం అర్థమైన శ్యామ్ ముఖంలో నవ్వు మెరిసింది.

నవ్వేసాను. "ఛ వారా? నా మొఖమా? ఐనా చూద్దాం. ఎందుకొప్పుకోరో?" ధీమాగా అన్నాను.

"అది సరే ఇంతకీ తులసికి ఎప్పుడు చెప్తున్నావ్?" వుత్సాహంగా అడిగాడు.

"ఏం చెప్పాలి?"

"అదేంటి ఇదంతా చెప్పవా? తనని పెళ్ళి చేసుకుంటానని ఇంట్లో గొడవపెట్టుకుంటూ తనకే చెప్పవేంట్రా?"

"తులసి భయపడిపోతుందిరా ఇదంతా వింటే. అయినా తన వ్యూస్ మనకి తెలుసుగా, శాస్త్రి అంకుల్ ఛాయిస్ ఏదయితే అదే తన డెసిషన్. సో నాన్నని కన్విన్స్ చేసి శాస్త్రి అంకుల్ ని ఒప్పించాలి. ఆ తర్వాత చెబ్దాం తులసికి. కైండ్ ఆఫ్ సర్ప్రైజ్. అన్ లెస్ నేను లైఫ్ పార్ట్నర్ గా నచ్చకపోతే తప్ప" నవ్వాను.

"ఆహా ఈ ప్రిన్స్ ని కాదనే అమ్మాయి వుంటుందా హీరో సాబ్" నవ్వేసాడు.

"హోప్ పుల్లీ" నవ్వాను.

"సరే ఇదంతా వదిలెయ్ కాసేపు, ముందు లే.. లేచి రెడీ అవరా బాబూ. మేడమ్ బృందా అదేదో దారుణమైన రెసిపీ నేర్చుకుందట, నిన్ను డిన్నర్ కి తీసుకురమ్మంది. లేకపోతే చంపేస్తుంది" చెప్పాడు.

తలూపి లేచి వాష్ రూమ్ వైపు నడిచాను. ఇంతా ప్రయత్నం తర్వాత తులసికి నేను నచ్చకపోతే? నవ్వుకున్నాను. తులసి కళ్ళతో చూసి నిర్ణయం తీసుకునే అమ్మాయికాదు అని తెలుసు. అయినా ఏదో చిన్న ఫీలింగ్.

వెనుదిరిగి శ్యామ్ వైపు చూశాను, "ఐ నీడ్ ఎ స్మాల్ హెల్ప్ శ్యామ్?" అన్నాను. ఏంటన్నట్టు కళ్ళెగరేశాడు.

"మ్.. ఓసారి తులసిని కలువు, తన మనసులో ఎవరైనా వున్నారా? ఐ మీన్ తనెవర్నైనా ఇష్టపడుతోందా, అనే సంగతి ఓసారి కనుక్కుంటావా?" అడిగాను.

"అలాగే నా.. నా మీద తన ఒపీనియన్ ఏంటో కూడా తెలుసుకుంటే." ఆగాను. కొత్తగా వుంది ఇలా అడగడం.

నవ్వాడు శ్యామ్. "ఐ థింక్ వి నో ద ఆన్సర్. బట్ కనుక్కుని రేపు సాయంత్రానికల్లా జవాబుతో హాజరౌతాను హుజూర్. అంతేనా ఇంకేమైనా కన్వే చేయాలా? మెసెంజర్ ఈజ్ రెడీ హియర్" చిన్నగా బౌ చేసి అల్లరిగా చూస్తూ చెప్పాడు.

ఇక మొహమాటం అడ్డురాగా నవ్వేసి, చప్పున వాష్ రూమ్ లో దూరి తలుపేసుకున్నాను.

వాష్ బేసిన్ పైనున్న అద్దంలో నన్ను నేను ఓసారి పరికించి చూసుకున్నాను. లైట్ గా పెరిగిన గడ్డం కూడా ఓ అసెట్ లాగే కనిపిస్తోంది. 'నాట్ దట్ బ్యాడ్' నా పెదవులమీద పల్చటి నవ్వు విచ్చుకుంది నా ముఖాన్ని మరింత మెరిపిస్తూ..

పాలిపోయినట్టున్న నాన్న ఎక్స్ ప్రెషనే చెప్తోంది ఏదో జరగకూడనిదే జరిగిందని. చప్పున నాన్న వెళ్ళి నాన్న పక్కన కూర్చున్నాను." నాన్నా ఏమైంది? ఎనీ ప్రాబ్లెమ్? ఏంటలా వున్నారు?" కంగారుగా అడుగుతూ అమ్మవైపు చూసాను. అమ్మ పలకరిస్తే ఏడ్చేసేలావుంది. తెలియదన్నట్టు దిగులుగా తల తిప్పింది.

నాన్న బయటినుండి వచ్చాకా మళ్ళీ తులసి గురించి అడుగుదామని రెడీగా కూర్చున్న నన్ను అమ్మ వచ్చి హడావిడిగా పిలిచింది., నాన్న వచ్చేసారు, వచ్చినప్పటినుండి ఎలాగో వున్నారు, అసలు నోరువిప్పి మాట్లాడట్లేదూ అంటూ.

ఎవరికైనా ఏదైనా అయిందా? తాతయ్య, నానమ్మ, బాబాయి, అత్తలు.., అనుకుంటూ త్వరత్వరగా హాల్లోకివచ్చి, నాన్నముందు కూర్చుని ఆయన చేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను, "నాన్నా ఏమైందో చెప్పండి, చాలా భయంగా వుంది మీరలా సైలెంట్ గా వుంటే.. ప్లీజ్.. ఎవరికేమయింది నాన్నా?"

"వెళ్ళాను కృష్ణా. వెళ్ళాను. ఆయన .. ఆయన.." తడబడుతూ అన్నారు, నాన్న కళ్ళనిండా నీళ్ళు.

తెల్లబోయిచూశాను. పుట్టి బుద్ధెరిగాకా నాన్న కళ్ళలో నీళ్ళెప్పుడూ చూడలేదు. అలాంటిది ఆయన అంతలా కన్నీరు పెడుతుంటే చూడలేకపోయాను. తండ్రిని ఓదార్చేంత పెద్దవాడినింకా కాలేదు నేను. ఏం చెప్పాలో తెలియలేదు.

వణికేచేతితోటే ఆయన చేతిని చిన్నగా తడుతూ "నాన్నా ప్లీజ్ కామ్ డౌన్. ఏమైంది? ఎవరికేమైంది? ఆయనంటే ఎవరో చెప్పండి" ఆత్రంగా అడిగాను.

"శాస్త్రిగారు కన్నా. శాస్త్రిగారు" గడగడ వణికిపోయారు నాన్న.

కంగారుగా చూసిందమ్మ, "శాస్త్రిగారికేమైందండీ..? ఇప్పుడసలు మీరెందుకెళ్ళారాయన దగ్గరకి..? కొంపదీసి వీళ్ళ గురించి అడిగారా ఏమిటి? ఆయనకేమీ కాలేదుకదా?! ఏ హార్ట్ అటాకైనా?" హడావిడిగా ప్రశ్నలవర్షం కురిపిస్తున్న అమ్మను ఆపుతూ కంగారులో ఆల్మోస్ట్ అరిచేసాను "నువ్వూరుకోమ్మా. అదేం వుండదు. నాన్నని చెప్పనీ ఏం జరిగిందో?" అంటూ నాన్నవైపు ఆత్రంగా చూశాను.

ఆ కొద్ది సేపటి గ్యాప్ లో ఎంతెంత భయంకరమైన ఆలోచనలు నన్ను ముంచెత్తాయో చెప్పలేను.

"అందుకే వెళ్లాను సంధ్యా. ఆ ఇంటి ఆడపిల్లని అడగడానికే వెళ్ళాను. నా కొడుకుమీదున్న గుడ్డి మమకారంతో ఆలోచించకుండా వెళ్ళానే గానీ, ఆయన్ని అపవిత్రపరచడానికి కాదు అలాంటిది ఆయన ఆ..య..న ఎందర్నో ఆశీర్వదించే చేతుల్తో, ఆ పవిత్రమైన చేతుల్తో నా కాళ్ళు పట్టుకున్నారు" అంటూ ఒక్కసారిగా బావురుమన్నారు నాన్న.

స్టన్ అయ్యి చూస్తుండిపోయాను. శాస్త్రి అంకుల్ నాన్న కా..ళ్ళు.. ..ప..ట్టు..కో..వ..డం.. ఆ దృశ్యం కళ్ళలో మెదలగానే ఒళ్ళు జలదరించింది. బిగుసుకుపోయాను.

అమ్మ కూడా ఏంమాట్లాడలేనట్టుగా, నోట మాటే రానట్టుగా నాన్న పక్కన కూలబడి ఆయన వెన్ను నిమురుతూ వుండిపోయింది.

"అంత గుడ్డిగా ఎలా వెళ్లాను సంధ్యా నేను. శాస్త్రిగారి గురించి అంత తెలిసీ, అలా ఎలా ఆలోచించాను, అసలు ఈరోజు ఈ కొడుకనేవాడంటూ నా నట్టింట్లో తిరుగుతున్నాడంటే అది ఆనాడు ఆయన పెట్టిన భిక్ష కదూ. అలాంటిది నేను అలా ఎ.. ఎలా..? ఓహ్.. గాడ్

వాడి వయసుకి వాడేదో ఆశపడ్డాడూ, ఆలోచించాడంటే అర్థంవుంది. నేనెందుకు సంధ్యా? ఎందుకు? ఆయన చేతులు నా పాదాలని తాకాయని తల్చుకుంటేనే తలబాదుకుని చచ్చిపోవాలనిపిస్తోంది సంధ్యా ఎలా? ఎలా కడుక్కోనీ పాపాన్ని నేను?" నిస్సహాయంగా తలపట్టుకున్నారు పూర్తి హై ఎమోషన్ తో వూగిపోతున్నారు నాన్న.

"అయ్యో అలా మాట్లాడకండీ ఏదో పరిస్థితులు అంతే. మీ తప్పులేదు, పిల్లాడి తప్పూ లేదు" దిగులుగా సర్దిచెప్పసాగింది అమ్మ.

నిర్లిప్తంగా అక్కడ కూర్చున్ననేను తలెత్తి చూసాను. అంత సడెన్ సిట్యుయేషన్ లో కూడా కొడుకుమీదకి బ్లేమ్ వస్తుందేమోనని భయపడి కవర్ చేస్తున్న అమ్మ ఆదుర్దాని గమనించి, ఎంతైనా అమ్మ కదూ అనుకుంటూ జాలిగా నవ్వుకున్నాను.

కొద్దిసేపటికి సర్దుకుని, చిన్నగా నిట్టూర్చి అక్కడినుండి లేచాను. నాన్న వైపోసారి చూసి పక్కనున్న జగ్ లోంచి నీళ్ళు గ్లాస్ లోకివంపి మంచినీళ్ళ గ్లాస్ అందించాను. ఇంకా సన్నగా వణుకుతున్నారాయన. అతికష్టంమీద రెండు గుటకలు తాగించాను.

కొద్దిసేపటికి స్థిమితపడ్డారనిపించాకా అడిగాను "నాన్నా రాత్రి  బస్ కి హాస్టల్ కి వెళ్ళిపోదామనుకున్నాను. పర్లేదుగా?"

వాళ్ళిద్దరూ నావైపు ఆశ్చర్యంగా, ఒకింత అనుమానంగా చూశారు.

"వద్దు కృష్ణా! ఇప్పుడే వద్దు. ఐ హావ్ టూ టాక్ టూ యూ. తర్వాత వెళ్దువుగానీ" అలసటగా చూసి చెప్పారు నాన్న. ఒప్పుకున్నాను కాదనకుండా.

"నేను కాసేపు రెస్ట్ తీసుకుంటాను" అంటూ లేచి తన రూమ్ వైపు భారంగా అడుగులు వేసుకుంటూ కదిలారు నాన్న. నేను స్తబ్దంగా నిలబడ్డానక్కడే.

రూమ్ లోకి వెళ్లబోతూ వెనక్కితిరిగి నావైపు చూసారు "కన్నా ఏ తొందరపాటు నిర్ణయం తీసుకోవనే మా నమ్మకం. మాకున్నది నువ్వేనని మాత్రం మర్చిపోకూ" చెప్పారు.

"మర్చిపోను నాన్నా, డోన్ట్ వర్రీ యూ జస్ట్ రిలాక్స్" వీలైనంత నార్మల్ గా వుండడానికి ప్రయత్నిస్తూ చెప్పాను.

"రాజేష్ కి ఫోన్ చేసి నేనోసారి రమ్మన్నానని చెప్పు" చెప్పేసి రూమ్ లోకి వెళ్ళిపోయారు.

రాజేష్ అంకుల్ శ్యామ్-బృందాల ఫాదర్. నాన్న బెస్ట్ ఫ్రెండ్ వారి స్నేహంవల్లే నాకు శ్యామ్ లాంటి ప్రాణస్నేహితుడు దొరికాడు. వాళ్ళింట్లో ఏం జరిగినా మాకూ, మాకేం జరిగినా వాళ్ళకీ తెలియకుండా వుండే సమస్యే లేదు..

"మన వాళ్ళందరికీ శాస్త్రి అంకుల్ అంటే వున్న రెస్పెక్ట్ లెవెల్ నీకూ తెలుసుకదా శ్యామ్ గుడిలోపల వేణుమాధవస్వామైతే, గుడి బయట ఆయన. ఒక్క మాటలో చెప్పాలంటే వాళ్ళ దృష్టిలో నడిచే దైవం ఆయన కాదూ" అన్నాను నెమ్మదిగా.

"షటప్ రా  ఇవన్నీ నీకీ ప్రపోజల్ పెట్టేముందు తెలీదా? అనవసరమైన త్యాగాలతో మనసు చంపుకోవలనుకుంటున్నావా? ఐనా ఇలాంటివాటిల్లో ఎవరో ఒకరు బాధపడక తప్పదనీ, ఇవన్నీ వుంటాయని, నీకిప్పుడు తీరిగ్గా గుర్తొచ్చాయా?" ఒకింత పదునుగానే అడిగాడు శ్యామ్.

"తెలసురా కొంతవరకూ వూహించాను. పెద్దవాళ్ళు బాధపడతారనీ, కోప్పడతారనీ, ఆర్గ్యూమెంట్స్ అవుతాయి, ఈవెన్ గొడవలు కూడా అవుతాయనుకున్నాను, కానీ ఇది వూహించలేదు" చెప్పాను బాధగా.

"రేయ్ అదో కైండ్ ఆఫ్ ఎమోషనల్ బ్లాక్మెయిల్ రా. దానికి తిరుగుండదని శాస్త్రీ అంకుల్ కి బాగా తెలుసు అయామ్ ష్యూర్ ఆఫ్ దట్. ఐనా రేపొద్దున్న తనకంటే చిన్నవాడికే కాళ్ళుకడిగి, దణ్ణం పెట్టిమరీ కూతుర్నిచ్చి పెళ్లి చెయ్యరా ఏంటీ? నువ్వే చెప్పు? పోనీ, కట్నం విషయంలో తేడాపాడాలొస్తే అబ్బాయి పేరెంట్స్ కాళ్ళు మొక్కరా చెప్పు? అవన్నీ హ్యూమన్ లైఫ్ లో, అదీ మన సొసైటీలో కామన్ రా. ఓవర్ సెంటీ కాకు. ఆల్రెడీ శంకర్ అంకుల్ కాస్తంత ఎక్కువే ఫీలౌతున్నారు. ముందు ఆయన్ని కూల్ చేద్దాం. తర్వాత వి కెన్ థింక్. సరేనా?" ఆప్యాయంగా నాకు స్వాంతన చెప్పాడు.

"లేదు శ్యామ్ ఇట్స్ ఓవర్" కిటికీలోంచి చీకట్లోకి చూస్తూ చెప్పాను. చప్పున నా భుజాలు పట్టి తనవైపుకి తిప్పుకున్నాడు శ్యామ్.

"ఇంకేదో జరిగింది. లేదంటే నువ్వింత పిరికిగా మాట్లాడే టైప్ ఐతే కాదు, ఏమైంది కృష్ణా?" నా కళ్ళలోకి సూటిగా చూస్తూ అన్నాడు శ్యామ్.

నేను సమాధానం చెప్పలేదు. మౌనంగా వున్న నావైపోసారి చూసి చిన్నగా నిట్టూర్చాడు "పోన్లేరా అంతలో అంత సొలేస్ ఏంటంటే నువ్వు తులసిని ప్రేమించలేదు, లేదంటే చాలా కష్టమయ్యేది. కదూ?" నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు.

చాలాసేపటితర్వాత చిన్నగా నవ్వాను, "నీకింకా అదే డౌటుంది కదరా అందరిలాగే, తులసిని ప్రేమించానా అని?" అంటూ అడిగాను. అంతలో గుర్తొచ్చి చప్పున అడిగాను, "తులసిని కలిశావా? మాట్లాడావా?"

"అది తర్వాత. ముందు ఏం జరిగిందో చెప్పు?" సీరియస్ గా చూస్తూ అడిగాడు.

"నిన్నరాత్రి నాన్న నన్ను టెర్రాస్ మీదకి తీసుకుని వెళ్ళారు. అక్కడాయన మనకి తెలియని మన కథ చెప్పారు శ్యామ్. ఏళ్ళనాటి మాట" అంటూ నాన్నమాటల్లోనే చెప్పసాగాను.

"చాలా ఏళ్ళ క్రితంనాటి మాట కృష్ణా మీరింకా పుట్టలేదు. సొంత ఇల్లు కావాలనే కోరికతో వెతికి, వెతికి ఇక్కడ అప్పుడు కొత్తగా వస్తున్న ఈ కాలనీలో ఇల్లు కట్టుకున్నాం మేము. ఆ వేణు మాధవస్వామి టెంపుల్ చుట్టూ తయారు చేస్తున్న వంద-ఇళ్ళ కాలనీలో, సిటీకి కాస్త దూరం కాబట్టి మాబడ్జెట్లో చక్కటి ఇళ్ళు దొరికాయన్న అత్యుత్సాహంతో ఇంకా చూట్టూ కన్స్ట్రక్షన్ జరుగుతుండగానే వుండడానికి వచ్చేశాము.

తిప్పికొడితే పదిళ్ళు కూడా నిండని కాలనీ, సాయంత్రం ఐతే వర్కర్స్ అందరూ పనిముగించుకుని కాస్త దూరంలో వున్న బస్తీకి వెళ్ళిపోయేవారు.

నేను, రాజేష్, గుడిలో శాస్త్రిగారు. అంతే . రోజూ సాయంత్రం మేమే ఒకరికి ఒకరం కంపెనీ. చాలా చిత్రమైన రోజులవి.. ఏ ఎక్స్ ట్రా టైమ్ పాస్ లూ లేకపోయినా, తాగుడూ, పేకాటా, టీవీ, ఇన్టెర్నెట్ లాంటివి లేకపోయినా చాలా హాయిగా గడిచేవి మా డేస్.

ఆఫీస్ నుండి రావడం, కాసేపు గుడి దగ్గర ఆయనతో కబుర్లు, తర్వాత ఇంటి దగ్గర ఫ్యామిలీ టైమ్. చాలా ప్రశాంతంగా సాగిపోతున్న టైమ్ అది. శ్యామ్-బృందా పుట్టిన కొత్తలవి. శాస్త్రిగారి భార్యదీ, మీ అమ్మదీ డెలివరీ డేట్స్ దగ్గర-దగ్గర్లో వున్నాయి..

సడెన్ గా ఓరాత్రి. తుఫాను ముసురు ముంచెత్తింది. వీధులు, ఇళ్ళు చూస్తుండగానే కళ్ళముందే మునిగిపోసాగాయి. సగం కట్టిన బిల్డింగ్స్ కూడా పేక మేడల్లా పడిపోయాయి. ఇప్పుడంటే సిటీ డెవలప్ అయ్యి మన కాలనీ కూడా ఇంత డెవలప్ అయింది కానీ అప్పట్లో ఊరి చివరి కాలనీ మనది. కారులూ, ఆటోలూ, ఏవీ లేని పరిస్థితులు. ట్రాన్స్ఫార్మర్లూ, టెలిఫోన్ పోల్స్ కుప్పకూలిపోయి చీకట్లో, ఏ కమ్యూనికేషనూ లేకుండా ఓపక్కన ఇళ్ళలో నిండిపోతున్న నీళ్ళు, మరోపక్క నీటిలో తేలుతున్న సామాన్లు. భయం, పానిక్.

ఇద్దరూ చంటిపిల్లలూ, బాలెంతరాలైన భార్యతో రాజేష్, నెలలైవున్న మీ అమ్మతో నేను దిక్కుతోచని పరిస్థితుల్లో వున్నాం.

ఆ టైమ్ లో శాస్త్రిగారు ఆ హోరువానలో, తుఫానులో, చిమ్మచీకటిలో మాకోసం పరిగెత్తుకొచ్చారు. స్వామి గుడి ఎత్తులోవుందీ.., అక్కడ తలదాచుకోవచ్చంటూ మాకు ధైర్యం చెప్పి, మమ్మల్ని తనతోపాటూ తీసుకెళ్ళారు.

ఆ తుఫాను రాత్రి, స్వామివారి గుడిలో, శాస్త్రిగారి తల్లి చేతుల్లో పుట్టావురా నువ్వు. ఆ రాత్రి ప్రతి క్షణం మాకొక అగ్నిపరీక్షే. గట్టిగా నెల తిరగని వయసున్న ఇద్దరు పసి బిడ్డలు, మరో పక్క నొప్పులతో మీ అమ్మ. ఇంకోవైపు తాను కూడా నెలలైవున్న శాస్త్రిగారి భార్య. ఈ టెన్షన్స్ లో ఆవిడకేమైనా ఇబ్బందౌతుందేమోననే భయం..,

ఆ రాత్రి మేము పడ్డ నరకం పగవాడికి కూడా వద్దురా కృష్ణా. అసలు ఈ రోజు నువ్వూ, మీ అమ్మ క్షేమంగా వున్నారన్నా, మనం గానీ, రాజేష్ వాళ్ళ కుటుంబం గానీ ఇంత సంతోషంగా వున్నామన్నా కారణం వారి దయేరా కన్నా..!

మేమేమో అప్పటికి చిరుద్యోగులం, ఆయన చూస్తే ఆ సంవత్సరమే అక్కడి గుడిలో పూజారిగా వచ్చినవారు. పైగా, గుడిలో డెలివరీ జరిగిందంటే, అలా ఎలా జరగనిచ్చారంటూ, పరిహారమనీ, మరోటనీ ఆయన్ని గుడి పెద్దలు సఫర్ చేయిస్తారనే భయంతో జరిగిన సంగతి దాచాల్సివచ్చింది మాకు.

తప్పొప్పులు దేవుడి మీదే వేసి జరిగింది ఎవ్వరికీ తెలియకుండా దాచి పెట్టేసాం. తుఫాను వెలుస్తూనే మిమ్మల్ని హాస్పిటల్లో అడ్మిట్ చేసి, అక్కడికి వచ్చే దార్లోనే నువ్వు పుట్టావని అందరికీ చెప్పాం.

అందుకే మీ పేర్లు పెట్టడం దగ్గర్నుంచీ ప్రతి చిన్న విషయానికీ కూడా శాస్త్రిగారి సలహాయే, ప్రతి పుట్టినరోజుకీ ముందుగా ఆయన ఆశీర్వాదమే తీసుకోమని ఎందుకు పంపిస్తామో ఇప్పుడు అర్థమైందా?

"ఆ తుఫానునాటి  అర్ధరాత్రి సాక్షాత్తూ ఆ కృష్ణుడే వెలిసాడు శంకర్ గారూ మీ ఇంట్లో", అన్న ఆయన మాటే నీ పేరయ్యిందిరా. అలాంటిది. అంత సాయం చేసిన మనిషి ఈ రోజు నా... నా కాళ్ళు... గాడ్.. తలుచుకుంటేనే గుండె కోసినట్టుందిరా కన్నా అర్థం చేసుకుంటావుకదూ?" ఉద్వేగంగా చెప్పడం పూర్తి చేసి జవాబు కోసం ఆర్తిగా నా వైపు చూసారు నాన్న.

"నాకూ.. నాక్కొంచెం టైమ్ కావాలి నాన్నా" నిస్సహాయత గుండెల్లో బాధై, బరువై, సుడులు తిరుగుతుంటే అతి కష్టంమీద గొంతు పెగుల్చుకుని చెప్పాను.

"తీసుకో కృష్ణా. టేక్ యువర్ టైమ్. యూ విల్ గెట్ ఓవర్ దిస్. మర్చిపోతావు. మర్చిపోవాలి. లేదంటే శాస్త్రిగారేదైనా దారుణమైన నిర్ణయాలు తీసుకుంటే మనం తట్టుకోలేం. పైగా తులసి ఆయన కుదిర్చిన పెళ్ళికి ఒప్పుకుందట కూడా" చెప్పారు.

గభాల్న తలెత్తాను, "తులసి ఒప్పుకుందా?" అప్రయత్నంగా అడిగాను.

"అవున్రా ఇప్పుడు నువ్వేమీ మాట్లాడి ఆ అమ్మాయిని ఇన్ఫ్లుయెన్స్ చేయకురా. తులసి కాకుండా నువ్వింకే అమ్మాయిని చూపినా, ఎలాగైనా ఖచ్చితంగా నీ మాట నెగ్గించేవాళ్ళం కన్నా.. వి ఆర్ సారీరా"  చెప్పి నా తల నిమిరి అక్కడ నుంచి వెళ్ళిపోయారు నాన్న.

నేనలాగే కూర్చునివుండిపోయాను. తులసి పెళ్ళికి ఒప్పుకుంది.  ఒక్క మాట కూడా చెప్పకుండా.

**చెప్పడం** పూర్తి చేసి శ్యామ్ వైపు చూసాను.. నిశ్శబ్దంగా వుండిపోయాడు శ్యామ్..

చాలాసేపటికి నా భుజం తడుతూ, "కాస్త లైన్సూ, ఎమోషన్ లెవెల్స్ తేడాతో సేమ్ సెషన్ నాకూ–బృందాకీ కూడా అయిపోయిందిరా" అని నవ్వాడు.

తెల్లబోయి చూసాను, రాజేషంకుల్ నాన్నని కలిసి వెళ్ళడం గుర్తొచ్చింది. ఓ. అర్థమైంది, ఎలాగైనా నేను శ్యామ్ తో షేర్ చేస్కుంటానని ముందుగానే శ్యామ్ కీ కౌన్సిలింగ్ చేసేసారు.

"గాడ్ టూ మచ్ ఇదైతే. ఒకవేళ తులసికి కూడా ఇలాగే డామిట్" మనసులో మాట చప్పున పైకే అనేసానని గ్రహించి తల విదిల్చాను.

నావైపే చూస్తున్న శ్యామ్ వంక ఇబ్బందిగా చూసి  "ఇప్పుడదంతా ఆలోచించి నో యూజ్ శ్యామ్" అన్నాను.

శ్యామ్ సీరియస్ గా, "ఏం జరిగింది కృష్ణా?" అంటూ సూటిగా తన ప్రశ్న రిపీట్ చేసాడు.

"ఆ తర్వాత తులసిని కలిశాను శ్యామ్" నెమ్మదిగా చెప్పాను. ఉలిక్కిపడి చూసాడు. ఈసారి ఏమీ ప్రశ్నించలేదు. నన్నే చూస్తున్నాడు.

మెల్లగా చెప్పసాగాను "నాన్న చెప్పిన ఫ్లాష్ బ్యాక్ విన్నాకా నాకు అర్థమైపోయింది శ్యామ్. ఇక మన ఇళ్ళల్లో వారెవ్వరూ నా నిర్ణయాన్ని సపోర్ట్ చేసిదిలేదని. అందుకే ఒక్కసారి తులసితో మాట్లాడితే బెటర్ అనుకున్నాను. నేనేం మాట్లాడకుండా తను నాపక్షాన ఆలోచించాలని ఎక్స్ పెక్ట్ చేయడం మీనింగ్ లెస్ కదా. కానీ, శాస్త్రి అంకుల్ రియాక్షన్ తెలిసాకా తులసిని ఎలా డిస్టర్బ్ చేయను? పైగా తను పెళ్ళికి ఒప్పుకుందని కూడా నాన్న చెప్పారు. ఎలా మాట్లాడాలి, ఏం మాట్లాడాలి? అని నేను ఇంకా ఆలోచిస్తూ తల్లకిందులవుతూవుండగానే అమ్మ వచ్చింది నా రూమ్ లోకి తులసిని తీసుకుని."

"ఎవరొచ్చారో చూడు కృష్ణా. కొత్త పెళ్ళికూతురు వచ్చింది చూడూ శుభవార్తతో. స్వీట్స్ తీసుకునీ" అంది నిండుగా చీరలో అలంకరించి వున్న తులసిని తీసుకుని నా రూమ్ లోపలికి వస్తూ.

నేను రియాక్టయ్యేలోపు, "బాగున్నావా కృష్ణా? హాస్టల్ నుంచి వచ్చాకా ఈసారి గుడికే రాలేదూ?" అంటూ వారి వెనకే రమా ఆంటీ. నేను బలవంతంగా కూడా నా ముఖాన నవ్వు పులుముకోలేదు. ఐ నో అన్నీ తెలిసీ నటిస్తున్నారు వారంతా.

అతి కష్టంమీద నా కోపాన్ని నిగ్రహించుకుంటూ, "నేను బాగున్నానాంటీ, మీరూ?" అడిగాను చాలా ఫార్మల్ గా. నా ముఖంలో సీరియస్ నెస్ ని చూసిన ఆంటీ ముఖంలో నవ్వు మాయమైంది.

నాకు జవాబుగా తలూపి, "ఏంటి తులసీ అలా వుండిపోయావు? నీ బెస్ట్ ఫ్రెండ్ కి నీ స్వీట్స్ ఇవ్వవా ఏంటి?" అన్నారు తులసితో.

తులసి యాంత్రికంగా బాక్స్ నా ముందు ఓపెన్ చేసి పట్టుకుంది, స్వీట్ తీసుకోమన్నట్టుగా.

"ఒక్కటేంటాంటీ మొత్తం స్వీట్ బాక్సే తీసుకుంటాను. అతని గురించిన విశేషాలు మా తులసి దగ్గరనుండి వినద్దా ముందూ" పదునుగా అంటూ స్వీట్ బాక్స్ అందుకుని క్లోజ్ చేసి, ఆవిడవైపు చూస్తూనే తులసితో చెప్పాను "కూర్చో తులసీ నీతో మాట్లాడాలి" అంటూ.

తులసి నావైపు షాకింగా చూసింది. అమ్మా, రమా ఆంటీ కూడా షాక్ తిన్నారు.., ఐ కెన్ గేజ్ దట్..

"అది కాదు కృష్ణా" ఈసారి ఆంటీ ముఖంలో నటనా, వెటకారం లేవు. ఆదుర్దా మాత్రమే వుంది "ఇంకా చాలా చోట్లకి వెళ్ళాలి వాళ్ళ నాన్నగారు కూడా ఎదురు చూస్తూ" అంటూ చెప్పబోతున్న ఆవిడని వారిస్తూ చెప్పాను.

"ఒక్క పది నిమిషాలాంటీ. జస్ట్ టెన్ మినిట్స్. ప్లీజ్" ఈసారి నా మాటల్లోనూ ఆదుర్దాయే వుంది, పదును లేదు. బహుశా తులసితో నేను డైరెక్ట్ గా మాట్లాడే ఆఖరి అవకాశం ఇదే కావచ్చు.

ఆంటీ భయంగా అమ్మవైపు చూసింది. అమ్మ షాక్ నుండి తేరుకుని "రండి కాస్తంత టీ తాగుదాం. పది నిమిషాలే అంటున్నాడుగా" అంటూ నన్నోసారి జాలిగా చూసి, "పదండి రమా. అన్నయ్యగారికి మరీ ఎక్కువ ఆలస్యం ఏమీ కాదులెండి." అని చెప్పింది.

దాంతో ఆంటీ తలూపి" కృష్ణా, తులసీ పది నిమిషాలే. నేను ఇక్కడే వుంటానూ" అని చెప్పి, చాలా అయిష్టంగానే అక్కడ్నుంచి కదిలారు.

తులసి వైపు చూసి కూర్చోమన్నట్టు ఛైర్ చూపి సైగ చేసాను. తలూపి కామ్ గా అక్కడున్న కుర్చీలో కూర్చుంది. నేనూ మరో ఛైర్ లాక్కుని తన ముందు కూర్చుని తన వైపు పరిశీలనగా చూసాను.

నెమలికంఠం రంగు పట్టుచీర. మెడలో నగలూ, చేతులనిండా గాజులు, లైట్ మేకప్ తో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ముఖం. తులసిని అలా చూడడం గమ్మత్తుగా అనిపించింది. అంతలో ఆ అలంకరణ దేనికో గుర్తొచ్చి చేదు తిన్నట్టైంది.

సడెన్ గా అర్థమైంది. తనిప్పుడు పరాయి కాబోతోందని. వేరొకరి సొంతం అయిపోతుంది ఎక్కడికో దూరంగా వెళ్ళిపోతుంది. మమ్మల్నందర్నీ వదిలి.

మళ్ళీ ఎప్పుడో ఎక్కడో అనుకోకుండా కలుస్తుంది. అప్పటికి మా మధ్య దూరం దాటలేనంతగా పెరిగిపోతుంది. చుట్టపు చూపు పలకరింపులే తప్ప ఒకనాటి సాన్నిహిత్యం ఏవిధంగానూ తమని చేరదు.

కానీ, ఇవన్నీ అనిపించేది నాకేనా. తులసికి తెలియదా? ఆమెకి అవసరంలేని బాంధవ్యం కోసం నేను పరుగులు తీస్తున్నానా? మరీ అంత నిస్సహాయంగా, అబలలాగా ఎందుకు చేస్తోంది?

తులసి లేకుండా నా జీవితప్రయాణం వుంటుందీ అంటే ఓ మై గాడ్ ఆ ఆలోచనే నేను భరించలేకపోతున్నానే. కానీ తను అసలు.. అసలు.

తల విదిల్చాను. చాలా హెల్ప్ లెస్ గా అనిపించింది. ఇలా ఆలోచిస్తూ కుర్చుంటే ఈ కొద్ది నిమిషాలూ ఆ ప్రవాహంలోనే కొట్టుకుపోతాయి.

"సో" అన్నాను సైలెన్స్ బ్రేక్ చేస్తూ తనేం మాట్లాడలేదు.

"కంగ్రాట్స్..", అన్నాను కాస్తంత వ్యంగ్యంగా. తను జవాబివ్వలేదు.

"నీకు ఇష్టమేనా తులసీ ఇదంతా. డామ్ ఐ నో నీకు ఇష్టంలేదు కదూ. వై డోన్ట్ యూ టెల్ దట్ డామిట్" అన్నాను కోపంగా.

"నన్ను అడగలేదు కృష్ణా. నాకు ఇష్టమా అని నన్ను నాన్న అడగనేలేదు" బేలగా చెప్తున్న తన మీద కోపం ముంచుకొచ్చింది.

"కానీ, మా నాన్న మీ నాన్నని ఏం అడిగారో ఐతే తెలుసు కదా?" అడిగాను తీవ్రంగా చూస్తూ.

చిన్న పాజ్. తలూపింది నెమ్మదిగా.

"మరి? ఎందుకు ఒప్పుకున్నావ్ పెళ్ళికి? అతను నీకు నచ్చాడా? నువ్వు చూసావా? కలిసావా?" ప్రశ్నల వర్షం కురిపించాను తనమీద.

"లేదు" అన్నింటికీ కలిపి ఒకే సమాధానం చెప్పింది.

"నువ్వొప్పుకోకు తులసీ. నువ్వేమన్నా చిన్నపిల్లవా? వద్దని చెప్పు. ఆ థాటే వాయిదా వెయ్యి నీకు అనిపించేదాకా. అసలు నీకిష్టం లేకుండా ఎలా చేస్తారూ? పైగా కనీసం అతన్ని నీకు కళ్ళతోనైనా చూపించకుండా" అడిగాను.

"నాన్న మాటిచ్చి వచ్చారట కృష్ణా. మాట తప్పితే తను వున్నా లేనట్టే అన్నారు" తన గొంతులో విషాదం తొణికిసలాడింది.

విసుగ్గా చూసాను "ఇది నీ జీవితం తులసీ. ఈ మాటలూ తప్పడాలూ ఇవన్నీ కొన్నేళ్ళ తర్వాత దే వోన్ట్ మ్యాటర్ డోన్ట్ యూ నో దట్? ఏ కాలంలో బ్రతుకుతున్నాం తులసీ? డోన్ట్ ఆక్ట్ లైక్ యూ బిలాంగ్ టూ సమ్ 200 బీ.సీ. టైమ్ డామ్" చెప్పాను.

"నాన్న ప్రాణమా..? లేక నా జీవితమా? అంటే.. ఏది ఎంచుకోవాలి కృష్ణా..?", అంటూ ఒక్క క్షణం ఆగి,

"వాళ్ళు వారణాసిలో చాలా పేరున్న పురోహితుల కుటుంబం అట, అసలు వారబ్బాయికి నిన్ను అడగడమే నీ పూర్వజన్మ పుణ్యం. వారి కుటుంబం లోకి వెళ్ళడమే నీ అదృష్టం. ఆయన అడగ్గానే కళ్ళకద్దుకుని ఒప్పుకున్నాను తల్లీ. వారిది చాలా ఆర్థడాక్స్ ఫ్యామిలీ. స్నేహితులూ, సరదాలూ అన్నీ మర్చిపోవాలి. ఎంతో పద్ధతిగా వుండాలీ అని చెప్పారు" అంటూ నా వైపు చూసింది.,

ఎప్పుడూ వెలుగులు చిమ్మే తన కళ్ళనిండుగా నీళ్ళు. నా గుండె చెదిరిపోయింది. లేచి తన తలమీద నా చేయుంచాను.

పిచ్చి పిల్ల. తన ఇష్టాయిష్టాలనీ, కోరికలనీ అవి ఏపాటీ? తన మొత్తం జీవితాన్నే తండ్రి ఋణం చెల్లించడానికి మూల్యంగా ఇచ్చేస్తోంది.

ఇక నేనెవర్ని? తనకేం చెప్పడానికైనా నా దగ్గర మాటలెక్కడ మిగిలాయి.

అంతటి త్యాగం ఎదుట నా ఆలోచన ఏదుంచినా అది స్వార్థమే అవదూ?

అయిపోయింది. తను నిర్ణయం తీసేసుకుంది. తండ్రా తన జీవితమా అనే క్లాష్ ఏమీ లేదు. తండ్రే తన జీవితం. ఆయన నిర్ణయమే తనకి తిరుగు లేని శిలాశాసనం.

ఐనా, అంత క్లియర్ కట్ ఎమోషనల్ బ్లాక్ మెయిల్ కి లొంగిపోనిది ఎవరు? చాలా తక్కువమంది ఉండగలరంత నిబ్బరంగా తులసిలాంటి సెన్సిటివ్ పర్సన్స్ వల్ల కాని పనది. అర్థమవుతున్నా నాలో ఏదో ఆగని వుక్రోషం.

గడియారం వైపు చూసాను. తొమ్మిది నిమిషాలు గడిచిపోయాయి నేనడిగిన టైమ్ లో.

కోపం, బాధా, కసీ,నిస్సహాయతా అన్నీ కలగలిసిన భావనేదో నా మనసుని కుదిపేస్తుంటే కష్టంమీద నన్ను నేను నిగ్రహించుకుంటూ నా ర్యాక్ వైపు నడిచాను.

తులసి కోసం నేను వేసిన చిన్ని కృష్ణుడి పెయింటింగ్ ఫ్రేమ్ తీసి చూసాను. ఏదైనా స్పెషల్ అకేషన్ లో ఇవ్వాలనుకుని దాచివుంచానది. చివరికి ఇప్పుడు ఇలా ఇవ్వాల్సివస్తుందని ఎప్పుడూ అనుకోలేదు.

నా కళ్ళలో తడి తనకు కనపడకుండా తుడుచుని, తనవైపు నడిచాను.

"తీసుకో తులసీ. గుడ్ లక్. నేను నీకు ఇవ్వగలిగినదిదే నీ పెళ్ళి గిఫ్ట్ ఇదే అనుకో" నెమ్మదిగా అందిస్తూ చెప్పాను.

చప్పున లేచింది "నువ్వు రావా కృష్ణా?" అంది దీనంగా చూస్తూ.

నాకు అంత బాధలోనూ నవ్వొచ్చింది. నేనెలా వస్తాననుకుంటున్నావంటూ నిలదీయాలనిపించింది. కానీ ఇప్పుడిక అదంతా అనవసరం. నిర్లిప్తంగా చూసి "పెళ్ళెప్పుడు?" అడిగాను.

"వచ్చే నెల ఇరవై ఆరునట" చెప్పింది.

థ్యాంక్ గాడ్ . శాస్త్రి అంకుల్ చేసిన ఏకైక వుపకారం నాకిది.

"వచ్చే నెలలో నాకు.. ఐ మీన్.. నాకు ఫైనల్ ఎగ్జామ్స్ ఉ..న్నాయి కదా తులసీ" అన్నాను తడబాటుగా.

నెమ్మదిగా తలూపింది. తనవైపు చూసి కృష్ణుడి పటాన్ని అందించాను. ఈసారి ఏమీ అనలేదు. చాలా యాంత్రికంగా అందుకుని అక్కడ్నుంచి కదిలింది.

"ఐ డిన్ట్ ఎక్స్ పెక్ట్ దిస్ ఫ్రమ్ యూ తులసీ" అనేసాను ఉక్రోషం ఆపుకోలేక..

జాలిగొలిపేలా చూస్తూ, "మర్చిపోకు నన్నూ" అంది.

నిస్తేజంగా చూస్తూ అలాగే నిలబడ్డాను.

తను వెళ్ళిపోయింది. నా రూమ్ లోంచే కాదు బహుశా నా జీవితంలో నుంచే వెళ్ళిపోయింది శాశ్వతంగా.

నావైపు చూసాడు శ్యామ్ "మర్చిపోగలవా కృష్ణా?" అడిగాడు.

"నువ్వు మర్చిపోగలవా శ్యామ్?" తిరిగి ప్రశ్నించాను.

"మేము మర్చిపోవడం, నువ్వు మర్చిపోవడం ఒకటేనంటావా?" సూటిగా చూస్తూ అన్నాడు.

ఆ మాట నాకు గుచ్చుకోగా ముఖం తిప్పుకుంటూ"కాక మరేమిటి? కలిసి పెరిగాం, కలిసి తిరిగాం. సడెన్ గా మర్చిపోమంటే" అంటూ అకస్మాత్తుగా ఆగిపోయాను., నావల్ల కాలేదు.., తలవిదిల్చాను..ధన్నుమని లేచాను..

"పద శ్యామ్, ఇంకొక్క ట్రయల్. లాస్ట్ ట్రయల్. రాజేషంకుల్ తో మాట్లాడి చూద్దాం" అన్నాను.

తలూపి ఒక్కవుదుట్న లేచాడు. ఇద్దరమూ దాదాపు పరుగు పెట్టినట్టే శ్యామ్ ఇంటివైపు కదిలాము.

కానీ, రాజేషంకుల్ కూడా నాన్నలాగే మాట్లాడారు "శాస్త్రి గారితో కూడా మాట్లాడేవాడినేరా ఈ విషయం తనతో మళ్ళీ ఎవరు మాట్లాడినా తన ప్రాణాలడిగినట్టే' అని శంకర్ తో ఆయన చెప్పేసారట. ఇక ఏం చేయగలం చెప్పూ. సారీ కృష్ణా." అనేసారు రాజేషంకుల్..

దాంతో ఇక చేసేదిలేక, సైలెంట్ గా వుండిపోయాను.

తులసి సపోర్ట్ వుండి వుంటే అది వేరు. తను ముందే తండ్రి మాటే వేదం అనే అమ్మాయి. ఇక నా ప్రయత్నానికి అర్థం కనపడలేదు.

చూస్తుండగానే ఒక్కోరోజూ గడిచిపోసాగింది. తన పెళ్ళి హడావిడి మొదలైంది. నేను హాస్టల్ కి వెళ్ళిపోయాను. అందరూ కలిసి చాలా ఘనంగా పెళ్ళిచేసి తులసిని తన అత్తవారింటికి వారణాశికి సాగనంపారు.

ఎన్ని రోజులు గడిచినా నా బాధా, కోపం, ఉక్రోషం తగ్గలేదు. తులసి ఒక్కమాట. తనకీ పెళ్ళి ఇష్టంలేదని ఒక్క మాట ఓపెన్ గా చెప్పివుంటే మా కథే వేరే గా వుండేదనే ఉక్రోషం నాలోంచి పోలేదు. ఐనా ఎలా చెప్తుంది? ఎందుకు చెప్పాలి? తనకీ ఇష్టమేనేమో? నేనే అనవసరంగా ఆవేశపడ్డాను అంటూ మథనపడేవాడిని. వేణు మాధవుడి గుడి వైపు నా అడుగు కదలడం మానేసింది.

ఒక్క శ్యామ్ తో తప్ప అందరితో మాటలు తగ్గించేసాను. ఏదో ముక్తసరిగా మాట్లాడి నా పనిలో నేను వుండేవాడిని. అమ్మా–నాన్నా చాలా బాధపడేవారు. నన్ను ఊరడించడానికి చాలా ప్రయత్నించారు.

కానీ బాధ చూపిస్తే కదా ఎవరైనా ఊరడించగలరు.. స్తబ్దమైపోయిన నన్ను ఏమని ఓదారుస్తారు.

నిజంగానే నేను మారిపోయాను. నాకు తెలియకుండానే నాలో ఒక విధమైన గాంభీర్యం చోటు చేసుకుంది. నా లైఫ్ లోంచి తులసి నిష్క్రమణ. తన ఎగ్జిట్ ఏదో కనిపించని వెలితిని నింపేసింది. ది రియల్ ఫ్లేవర్ ఆఫ్ మై లైఫ్ ఈజ్ గాన్.

అవేవీ ఆలోచించే టైమ్ లేకుండా వుండేందుకేనేమో నేను ఎమ్. ఎస్ కి అప్లై చేసేశాను. నాకు జాబ్ యిచ్చిన కంపెనీయే నా చదువూ స్పాన్సర్ చేస్తానంది. కాకపోతే అక్కడకి వెళ్ళాకా కూడా ఆన్లైన్ వర్క్ చేయాలంది. అక్కడవున్న వారి బ్రాంచ్ లో రిపోర్ట్ చేయమంది. ట్రైనింగ్ కోసం బెంగుళూర్ పంపుతామంది. అన్నింటికీ ఒప్పుకున్నాను.

నాన్న చెప్పడానికి ట్రై చేసారు, చదువూ, జాబ్ రెండూ ఒకేసారి అంటే స్ట్రెయిన్ అవుతానేమో, చదువు పూర్తయ్యాకా జాయిన్ అవుతానని అడగమని. ఇనీషియల్ గా వారదే చెప్పారుకదా అనీ అన్నారు.

కానీ, నేను పట్టించుకోలేదు. ఎవ్వరి మాటా వినదలుచుకోలేదు. నా మాటెవరైనా విన్నారు గనకనా ఇప్పుడు నేను వినడానికి.

తులసి నాతోనే కాదు, శ్యామ్-బృందా లతోనూ కాంటాక్ట్ లో వుండడం మానేసిందట. బృందా కొంచెం ప్రయత్నించింది గానీ, తులసి అత్తవారింట్లోవారికి నచ్చదేమోనన్న రమా ఆంటీ హెచ్చరికతో తనూ వెనక్కి తగ్గింది. వాటన్నింటికీ అతీతంగా నా యూ.ఎస్ వెళ్ళే ప్రయత్నాలలో నేనుండసాగాను.

బృందా ఫర్దర్ గా చదవనంటూ తనకి క్యాంపస్ లో వచ్చిన ప్లేస్మెంట్ టేకప్ చేసేసింది. శ్యామ్ కోరుకున్నట్టే తనకి ఢిల్లీలో ఓ మంచి కంపెనీలో రిసెర్చర్ గా జాబ్ దొరికింది దాంతో తను ఢిల్లీ వెళ్ళిపోయాడు. ఎప్పుడైనా సెలవులున్నప్పుడు వచ్చేవాడు.

నా ట్రైనింగ్ పూర్తయింది. స్థల మార్పుకో పని వత్తిడికో లేక సమయం గడుస్తున్నందుకోగానీ టైమ్ హీల్స్ ఎవ్రీథింగ్ అంటారు కదా. నాలోని బాధ తగ్గకపోయినా నా కోపావేశాలు మాత్రం కాస్త నెమ్మదించాయి. ఇప్పుడెవరిమీదా నో కంప్లైంట్స్ హైదరాబాద్ తిరిగి వచ్చాను.

నా ప్రయాణానికి టికెట్స్ కూడా కన్ఫర్మ్ అయ్యాయి. నేను వెళ్ళే నాలుగు రోజుల ముందు వస్తానన్నాడు శ్యామ్. అందర్నీ కలిసాను. షాపింగ్ చేసాను. అమ్మకీ, నాన్నకీ, రాజేషంకుల్, మాలతి ఆంటీ, శ్యామ్, బృందా అందరికీ నా జీతంతో బట్టలు కొన్నాను. ఒక్క తులసికి తప్ప. ఇప్పుడు నాకా హక్కు లేదుగా.

అమ్మా-నాన్నలకి ప్రత్యేకంగా కపుల్ వాచెస్ కొన్నాను. వాళ్ళు చాలా సంతోషించారు. నేను కొన్న గిఫ్టులకి కాదు నాలో వచ్చిన మార్పుకి. వారి సంతోషం చూసి నాకూ హ్యాపీగా అనిపించింది. వారిని బాధ పెట్టి వెళ్ళదలుచుకోలేదు. జరిగింది జరిగిపోయింది. అయినా నా తలరాతకి వారేం చేస్తారూ.

షాపింగ్ నుండి వచ్చి రిలాక్స్డ్ గా కూర్చున్నా టీ.వీ. లో న్యూస్ చూస్తూ ఎలెక్షన్ హంగామా తో ఛానెల్స్ అన్నీ వేడెక్కివున్నాయి. తాపీగా అమ్మచేతి టీ తాగుతూ ఛానెల్స్ స్విచ్ చేస్తున్నా.

సెల్ మోగింది. బృందా. ఈ టైమ్ లోనా! అనుకుంటూ ఆన్ చేసాను.

"కృష్ణా, నీతో మాట్లాడాలి" బృందా గొంతులో కంగారు.

"సాయంత్రం త్వరగా వచ్చెయ్ మరి ఆఫీస్ నుండి" అన్నాను కాజువల్ గా.

"లేదు. ఇప్పుడే రాగలవా?" ఆత్రంగా అడిగింది.

"వస్తున్నాను" క్లుప్తంగా చెప్పి ఫోన్ పెట్టేశాను.

బృందాకి నాకంటే తులసి, శ్యామ్ లే క్లోజ్. ప్రస్తుతం వారిద్దరూ దగ్గర లేరు. మరి తనకే ప్రాబ్లమ్ వున్నా ఇంకెవరితో చెప్పుకుంటుంది పాపం.

సరిగ్గా గంట తర్వాత బృందాతో తన ఆఫీస్ కాంటీన్ లో కూర్చునివున్నాను.

"చెప్పు" కాఫీ కప్పు టేబుల్ మీదుంచుతూ అడిగాను. నావైపు బెరుగ్గా చూసింది, "కృష్ణా  చిన్న ప్రాబ్లెమ్" అంది తటపటాయిస్తూ.

"ఓ.కే. ఇంతకీ ప్రాబ్లెమ్ పేరేంటి?" చిన్నగా తలపరికిస్తూ అడిగాను.

ఓ చిన్న హెజిటేషన్ తర్వాత అంది నెమ్మదిగా, "విశాల్.. విశాల్ జైన్.."

"ఆహాహెరాస్ చేస్తున్నాడా? తోలు తీసేస్తామని చెప్పూ" అన్నాను వస్తున్న నవ్వుని మునిపంటితో అదిమిపెట్టి సీరియస్ నెస్ నటిస్తూ.

"నో నో చాలా చాలా మంచివాడు కృష్ణా హీ లవ్స్ మీ లాట్" కంగారుగా చెప్తూ నా ముఖంలో నవ్వు చూసి ఆగిపోయింది. ఫకాల్న నవ్వేశాను.

ఎర్రబడ్డ ముఖంతో గట్టిగా నా భుజంమీద కొట్టి, "ఇడియట్ .. నువ్వూ.." అంటూ తనూ నవ్వేసింది.

"లేకపోతే చెత్త ఇన్యదక్షనూ నువ్వూనూ. ప్రాబ్లెమ్ అని చెప్తావా పాపం ఏళ్ళతరబడి చూస్తున్నాం నీ పిచ్చిముఖాన్ని ఆ మాత్రం అర్థంకాదూ మడ్ హెడ్" తన తల మీద చిన్నగా మొట్టికాయ వేసి నవ్వాను.

చిన్నగా నవ్వింది బృందా. తన కళ్ళలో సన్నటి కన్నీటి తెర "డాడ్ వాళ్లు డెడ్ అగైనెస్ట్ వున్నారా. ఆల్రెడీ మాట్లాడాను" చెప్పింది.

"ఆబ్వియస్లీ డాళింగ్. లేకపోతే నువ్వు ప్రేమించాను అనగానే ఎగిరిగంతేసి వావ్.. ఎవరా లక్కీ గై అని అడగడానికి వాళ్ళేం ఫిల్మీ పేరెంట్స్ కాదు కదా. టాక్ టూ దెమ్. కన్విన్స్ అవుతారు కొంచెం టైం పడుతుంది, హావ్ పేషన్స్" తేలిగ్గా నవ్వేసి చెప్పాను.

తలడ్డంగా తిప్పింది "కన్విన్స్ చేసే టైమ్ కూడా ఇవ్వట్లేదని నిన్న నైటే తెలిసింది కృష్ణా"

"అంటే?" నా భృకుటి ముడిపడింది.

"అత్తయ్య వాళ్ళ అబ్బాయితో ఎంగేజ్మెంట్ అంటున్నారు. అది కూడా వాడు ఏదో దిక్కుమాలిన మీటింగ్ కోసం ఫైవ్ డేస్ కి ఇండియా వచ్చాడట, ఎల్లుండి పొద్దున్నే వాళ్లంతా వస్తారట. సాయంత్రం తాంబూలాలట.

..కనీసం శ్యామ్ కి చెప్పే ఆప్షన్ కూడా లేదు.., వాడి సెల్ రేపు ఈవెనింగ్ వరకూ ఆఫ్ లోవుంటుంది.. ఐనా ఎల్లుండి పొద్దున్న ఫ్లైట్ కి వాడొస్తాడు అని కూల్ గా వున్నారు వాళ్ళు.. ఒకవేళ వీలుకాక, వాడు రాలేకపోయినా పర్లేదూ, మళ్ళీ బావ ఆస్ట్రేలియా వెళ్లిపోతాడు, ఆలోపు నిశ్చితార్థం ఐపోవాలీ అని డిసైడ్ ఐపోయి నా ప్రమేయం లేకుండానే అన్ని అరేంజ్మెంట్స్ చేసేసుకుంటున్నారు. బహుశా ఈపాటికి మీ ఇంటికి కూడా ఇన్విటేషన్ వెళ్ళిపోయివుండచ్చు" గబగబా చెప్పింది.

"వాటీజ్ దిస్ బృందా అంత మాత్రం గట్టిగా చెప్పుకోలేవూ, చదువుకున్నావ్, జాబ్ చేస్తున్నావ్ యూ ఆర్ ఏ గ్రోన్ అప్ పర్సన్. నీ అభిప్రాయం ఇంట్లో చెప్పి దాని మీద నిలబడలేవూ!?" మందలింపుగా అన్నాను

"**చెప్పానురా**, చాలా పోట్లాడాను కూడా. అత్తయ్య వాళ్ళంతా వచ్చాకా అందరి ముందూ నాకిష్టంలేదని చెప్తానని బెదిరించాను కూడా. కానీ, డాడ్ హీ ఈజ్ సో యాడమెంట్. అలాంటిదేమన్నా చేస్తే ఆయన... ఆయన.. బ్రతకననీ" బృందా కళ్ళల్లోంచి కన్నీళ్ళు టపటపా రాలాయి.

"ఓహ్ గాడ్" చిన్నగా నుదురు వత్తుకున్నాను. నాట్ అగైన్... ఐనా, మరీ అంత బ్లాక్ మెయిల్ అవసరమా.. ఈ రోజుల్లో కూడా..

"ముందు కళ్ళుతుడుచుకో, ఇంతకీ అసలు సంగతి చెప్పు, అబ్బాయి సెటిల్ కాలేదా, లేక అసలేంటిట అంత స్ట్రాంగ్ అబ్జక్షన్ కి రీజన్?" తెలియకుండానే కాస్తంత వెగటు ధ్వనించింది నా గొంతులో.

"అతను మన మతం కాదు, మన రాష్ట్రం కూడా కాదు. హీ ఈజ్ ఎ గుజరాతీ. జైన్ కమ్యూనిటీ" చెప్పింది.

బిత్తరపోయి చూసాను, "వ్వాట్ట్.. కమెగైన్..", అన్నాను చిన్నగా అరిచినట్టు.

భయంగా చూసింది, " చాలా మంచివాడు కృష్ణా. మన వాళ్లు కాదుగానీ చాలా."

"పిచ్చిపిల్లా, ఇంతాచేసి ప్రాబ్లెమ్ వట్టి మతమా? అది కూడా హిందూస్-జైన్స్ లాంటి అట్మోస్ట్ నియరెస్ట్ సిమిలారిటీస్ వున్న మతాల మధ్య" నవ్వాను.

"మనకి సింపులే కృష్ణా. వాళ్ళలా తీసుకోవడంలేదు. పైగా ఏమైనా చెప్పడానికి ట్రై చేస్తే చాలు, తులసి గురించి చెప్తున్నారు. తనెంత బుద్ధిగా, పద్ధతిగా వాళ్ళ నాన్న చెప్పిన చోట పెళ్ళి చేసుకుని వెళ్ళిందీ, నేనెంత గాలికి తిరిగి పాడైపోయానూ అని తెగ డిస్కస్ చేసి తిట్టిపోస్తున్నారు. యు నో పైగా.."

సీరియస్ గా వింటున్నవాడినల్లా తులసి పేరు వింటూనే అనీజీగా కదిలాను. గుండె లోతుల్లో ఎక్కడో చిన్న మంట. అందరూ కలిసి దూరం చేసిన నా ప్రియ నేస్తం. ఎలా వుందో, ఎక్కడుందో? ఎక్కడున్నా సరే హ్యాపీగా వుంటే చాలు. తల విదిల్చాను.

బృందా ఇంకా ఇంట్లో జరుగుతున్న విషయాలు చెప్తోండడం గమనించి చప్పున తనని వారిస్తూ అడిగాను, "అదంతా సరే, హౌ సీరియస్ ఆర్ యూ బోత్?"

"హౌ అంటే? చాలా సీరియస్ కృష్ణా. తనంటే నాకు చాలా ఇష్టం. తనకీ నేనంటే ప్రాణం. ఎక్కడ ఇంట్లో వాళ్ళు చెప్పినదానికి కన్విన్స్ అయిపోతానో అని తెగ కంగారు పడుతున్నాడు కూడా, శ్యామ్ తో మాట్లాడతానన్నాడు, ఇంత సడెన్ గా ఈ ఎంగేజ్మెంట్ గోల నేను ఎక్స్పెక్ట్ చెయ్యలేదు, అందుకే, ఏంచెయ్యాలో తోచక నిన్ను పిలిచాను" అంది బెంగగా చూస్తూ.

మౌనంగా వుండిపోయాను, ఏం చెయ్యాలి? రాజేష్ అంకుల్ వాళ్ల ఫ్యామిలీ ఇష్యూ ఇది. పైన వారి బంధువులు సైతం ఇన్వాల్వ్ వున్న సిట్యూయేషన్, నా ప్రయాణం చూస్తే. మరో వారంలో శ్యామ్ రాగలిగితే కూడా ఎల్లుండి వరకూ రాలేదు. ఈ విషయంలో బృందాకి హెల్ప్ చేస్తున్నానని తెలిస్తే నాన్న గగ్గోలెత్తిపోతారు. గొడవ గొడవ చేసేస్తారు.

నాకేసి దిగులుగా చూస్తున్న బృందాని చూస్తే జాలేసింది.

"ఏమీ తోచట్లేదురా, భయంగా వుంది, విశాల్ ని తప్ప వేరే వాళ్ళతో లైఫ్ వూహించుకోలేకపోతున్నాను, చాలా కష్టంగావుంది.., ఏదైనా సలహా చెప్పవూ. ఈ ఎంగేజ్మెంట్ కాన్సిల్ చేయడానికి" బేలగా అడుగుతున్న బృందా ముఖం చూసి చలించిపోయాను.

"ఛ. ఏంటిది బృందా? అలా డీలా పడిపోతే ఎలా? నాకు చెప్పేసావు కదా నేను చూసుకుంటాను. ట్రస్ట్ మీ. అలా ఏడుపు ముఖం వేసుకుని తిరక్కు. ఛీరప్ ఫస్ట్. ఇంతకీ ఆ టెస్ట్ మ్యాచ్ క్యాండేట్. అదే మీ బావ నంబరుందా నీ దగ్గర?" అడిగాను.

"లేదు. ఎప్పుడో చిన్నప్పుడు చూడ్డం తప్ప అసలు పరిచయమే లేదు. ఇంతకీ టెస్ట్ మ్యాచ్ ఏంటి?" నా మాటలకి కాస్త నార్మల్ అవుతూ అడిగింది.

"ఐదు రోజుల్లో మీటింగ్, ఎంగేజ్మెంట్. అన్నీ పూర్తి చేసుకుని వెళ్ళిపోదామనుకున్నాడు కదా. అలా ఫైవ్ డేస్ లో అయ్యేది టెస్ట్ మ్యాచే. మ్యారేజ్ మ్యాచ్ కాదు. ఒకవేళ అదంత సింపులని వాళ్ళంతా అనుకున్నా నేనవ్వనియ్యనుగా." అంటూ నవ్వాను.

బృందా ముఖం విప్పారింది "నిజంగా?" అంది ఆత్రంగా. నవ్వి తలూపాను.

"ఎలా? ఏంచేస్తావు?", కుతూహలంగా ప్రశ్నించింది.

"అదంతా నా తలనెప్పి స్వీట్ హార్ట్. ముందుగా మీ హీరో ని కలవాలి, ఈవెనింగ్ ఓసారి రమ్మని ఫోన్ చెయ్యి" చెప్పాను.

"ఇప్పుడు కలవగలవా?" మొహమాటంగా అడిగింది.

"ఓ.కే. సారు మీ ఆఫీసేనా?" అల్లరిగా నవ్వుతూ అడిగాను.

సిగ్గుపడుతూ తలూపింది.

"మరింకేం కాల్ హిమ్. చూసేద్దాం తమరి సెలక్షన్ ఎలావుందో" టేబుల్ మీద చిన్నగా టాప్ చేస్తూ హుషారుగా అన్నాను.

"నీ వెనుక థర్డ్ టేబుల్. బ్రౌన్ షర్ట్" మరింత బిడియంగా చెప్పింది. అదిరిపడి చప్పున వెనక్కి తిరిగి చూసాను. మమ్మల్నే గమనిస్తూ జ్యూస్ తాగుతున్న ఇద్దరు యువకులూ, ఓ యువతి గబుక్కున మొహాలు తిప్పేసుకున్నారు.

బృందావైపు తిరిగి చూస్తూనే ఫకాల్న నవ్వేసాను. సిగ్గుతో ఎర్రగా కందిపోయిన ముఖాన్ని గబుక్కున దించేసుకుంది. బృందాని ఇలా చూడ్డం కొత్తగా వుంది.

"వెరీగుడ్. బానే సెట్ చేసారు మీటింగ్. రమ్మను మరీ. ఓ.. వద్దులే. ఆడపిల్లవాళ్ళం మనమే వెళ్ళాలేమో" సన్నగా కన్నుగీటి కుర్చీలోంచి లేస్తూ అన్నాను బృందాను చూసి.

"యూ.. నౌ డోన్ట్ ఎంబెరాస్ మీ. చంపుతా ఇడియట్. కూర్చో" అంటూ నా చెయ్యిపట్టి లాగి కూర్చోబెట్టి, వారివైపు చూసి రమ్మని సైగ చేసింది.

తను సైగ చేయడమే ఆలస్యం మెరిసే కళ్ళతో, ఉత్సాహంగా ఫ్రెండ్స్ తో సహా వచ్చి మాతో జాయిన్ అయ్యాడు విశాల్ జైన్. కాస్త నల్లగావున్నా కళైన మొహం, కూల్ పర్సన్. అందరిలాగానే నాకు కూడా మా బృందానే బాగుంది. ఆ కుర్రాడు ఏదో యావరేజ్ గా వున్నాడనిపించింది. అలా అనిపించడం సహజమే కదా!! మన వాళ్ళే బాగున్నారూ అవతలివాళ్ళు సో.. సో అని. ఐ థింక్ ఏదో సామెత చెప్తుంది అమ్మ. హా. కాకి పిల్ల కాకి కి ముద్దు అని. యప్. సేమ్ ఫీలింగ్.

కానీ విశాల్ జస్ట్ యావరేజ్ ఇన్ లుక్స్ మాత్రమే. హీ ఈజ్ జస్ట్ ద బెస్ట్ ఎట్ హార్ట్. ఐతే బృందా అంటే ప్రాణం పెడతాడనేది కేవలం మాట వరసకి మాత్రమే కాదనేది కాసేపటి మాటల్లోనే అర్థమైంది. దాంతో కాస్తంత రిలీఫ్ గా అనిపించింది. కాదు చాలా రిలీఫ్ గా అనిపించింది.

కొద్దిసేపటి మాటల తర్వాత సాయంత్రం లోపు ఏదో ఒక మంచి ఆప్షన్ తో ఫోన్ చేస్తానని వారికి హామీ ఇచ్చి బయటకి వచ్చాను.

నన్ను సాగనంపడానికి పార్కింగ్ వరకూ వచ్చింది బృందా, "డాడ్ ఏమైనా అంటే ఫీలవకు కృష్ణా అది నీ గురించి ఏమీ వుండదు, నామీద కోపమే అనుకో" చెప్పింది.

తేలిగ్గా నవ్వేసాను, "ఆ మాట నువ్వు నాకు వేరేగా చెప్పాలా, నాకు తెలియని రాజేషంకులా బృందా? అవన్నీ ఆలోచించకు" చెప్పి కదలబోయాను, చప్పున నా చేయిపట్టుకుని ఆపింది.

"ఎలాగైనా కన్విన్స్ చెయ్యి కృష్ణా. ప్లీజ్.. చేస్తావు కదూ?" బెరుగ్గా  చెప్పింది.

అప్రయత్నంగా అలర్ట్ అయ్యాను, "బృందా, చిన్నమాట, అతనెవరో పూర్తిగా తెలీకుండానే చాలా పెద్ద బాధ్యత తీసుకోబోతున్నాను. కేవలం నీ డెసిషన్ మీదున్న నమ్మకంతో బ్లైండ్ గా. యామ్ గోనా సపోర్ట్ యూ. హోప్ యూ నో వాట్ యూ ఆర్ డూయింగ్. మీ లవ్ లాంగ్ స్టాండిగ్ అని నా నమ్మకం రైట్?" మృదువుగా అడిగాను.

"ఎస్ ఇట్ ఈజ్.  ప్లీజ్ బిలీవ్ అజ్ కృష్ణా యూ ఆర్ అవర్ లాస్ట్ రిసార్ట్" వణికే గొంతుతో అంది.

ఆప్యాయంగా ఆమె తల మీద చేయుంచాను, "ఐ డూ. ఐ డూ బిలీవ్ యూ. చూద్దాం నేనేం చేయగలనో" అంటూ కదిలాను, సరిగ్గా సంవత్సరం తర్వాత మళ్ళీ ఓ ఆడపిల్ల పెళ్ళి గురించి మాట్లాడడానికి..

"కృష్ణా వచ్చేసావా గుడ్ న్యూస్ రా. నీకు వెళ్ళేవరకూ తీరికలేకుండా బోలెడు పని కూడా" చేతిలోవున్న కూరగాయల ట్రే పక్కన పెట్టి వుత్సాహంగా నావైపు వస్తూ చెప్పింది అమ్మ.

అలసటగా సోఫాలో కూలబడి, ఏంటన్నట్టు కళ్ళెగరేసాను..

"మన బృందా పెళ్ళి కుదిరిందిరా. అయిన సంబంధమే. రేణుక అనీ, రాజేష్ అన్నయ్య సిస్టర్. చాలా ఏళ్ళక్రితం చూసావు, నీకు గుర్తుండివుండదులే. వాళ్ళబ్బాయిరా. మంచి కుర్రాడట. చాలురా ఆ వేణుమాధవస్వామి దయవల్ల మీ నలుగురూ సెటిల్ అయిపోయారు.. శ్యామ్ కి వాడు కోరుకున్న రిసెర్చ్ సెంటర్ లో జాబ్ వచ్చింది, నువ్వూ వచ్చేవారం అమెరికా వెళ్తున్నావు, ఇక ఆడపిల్లలిద్దరూ మంచి కుటుంబాల్లో సెటిల్ అయిపోయారు. అంతా ఆ దేవుడి చలవ. శాస్త్రిగారి పూజల పుణ్యం" అంది భక్తిగా.

నిర్వికారంగా చూసాను, "ఆడపిల్లలు మంచి కుటుంబాల్లో సెటిల్ అయిపోతే చాలామ్మా? వారి ఇష్టాయిష్టాలతో ప్రమేయంలేకుండా?" అడిగాను.

కంగారుగా చూసింది,"అదేంట్రా అలా మాట్లాడుతున్నావ్. చిన్నప్పట్నుంచీ అనుకున్న సంబంధమే. బృందా ఏమైనా అందా? ఐనా నువ్వు మధ్యలో తలదూర్చకు. అసలే శ్యామ్ కూడా లేడు వుళ్ళో."

గంభీరంగా అన్నాను,"అవును. వాడూళ్ళో లేడు, అందుకే. తప్పదమ్మా రాజేషంకుల్ ని కలిసొస్తాను." అంటూ లేచాను.

"నాన్నా, అంకుల్ కలిసి ఫంక్షన్ హాల్ కి వెళ్ళారు కృష్ణా. త్వరగా వచ్చేస్తే నిన్ను కూడా అక్కడికే పంపమన్నారు. విషయమేంటి కృష్ణా?", అంటూ గేటు వైపు చూసి లోపలికి వస్తున్న నాన్నా, రాజేష్ అంకుల్ని గమనించి ఆగిపోయింది.

"చెప్తానమ్మా" అంటూ లేచి వారివైపు నడిచాను.

"హల్లో కృష్ణా. మరీ బిజీ బీ అయిపోయావు. శ్యామ్ లేకపోతే ఇంటికే రావడం మానేశావూ. వీసా కూడా వచ్చేసిందటగా, వచ్చే వారమే ప్రయాణమని శంకర్ చెప్తున్నాడు" నా భుజం మీద చేయివేసి లోపలికి దారితీస్తూ అడిగారు రాజేష్ అంకుల్.

అన్ని ప్రశ్నలకీ బదులుగా ఓ చిరునవ్వు నవ్వి ఆయన చేతిలో బరువుగా కనిపిస్తున్న పెద్ద కవర్ అందుకున్నాను.

"అమ్మాయ్. మీకు స్వీట్స్ చేసే పనే లేదు. సరిపడ స్వీట్స్ అన్నీ ప్యాక్ చేయించుకొచ్చేసాం. స్ట్రాంగ్ గా ఒక చాయ్ ఇస్తే చాలనుకో" చెప్పారాయన నవ్వుతూ అమ్మకేసి చూసి..

కాస్త గాభరాగా నావైపోసారి చూసి "మంచిపనిచేసారన్నయ్యా వుండండి టీ తీసుకొస్తాను" అంటూ కదిలింది.

"కుర్రాడు మంచి కంపెనీలో చేస్తాడట కృష్ణా. కలిసినప్పుడు నువ్వే వివరాలు తెలుసుకో. మర్చిపోయాను కంపెనీ పేరదీ" నావైపు సంభాషణ మరలిస్తూ అన్నారు రాజేషంకుల్.

నాన్నకేసి చూసాను "మంచి ప్రొఫైల్ అటరా ముప్పై ఏళ్ళకే బంజారాహిల్స్ లో వాళ్ళ పేరెంట్స్ కోసం ఇల్లు తీస్కున్నాడంటే మాటలా చెప్పు, రేపు ప్రభాకర్-రేణుక రిటైర్ అవగానే జస్ట్ ఒక్క బ్యాగ్ వేసుకుని వెళ్తే చాలట. మొత్తం ఫర్నిష్డ్ హౌజ్ అట.. వెల్ సెటిల్డ్ రా కృష్ణా. ఎంతైనా మన పిల్ల అదృష్టవంతురాల", చెప్పారాయన సంతోషంగా.

"అంతా ఆ మాధవస్వామి దయరా" రాజేషంకుల్ కళ్ళు చెమర్చాయి. ఇబ్బందిగా కదిలాను. అంత గొప్ప సెంటీ సీన్ పాడు చేయబోతున్నందుకు కాస్త గిల్టీగా అనిపించింది.

అమ్మ తీసుకొచ్చిన టీ కప్పులు అందుకుని వారికి సర్వ్ చేసి, నేనూ ఒకటి తీసుకున్నాను. అక్కడనుండి వెళ్ళిపోబోతున్న అమ్మని వుండమని సైగచేసి. తన పక్కన కూర్చున్నాను.

"ఎక్కువ టైమ్ లేదు కృష్ణా. అన్ని పనులూ నువ్వే చూసుకోవాలి" అన్నారాయన.

"విశాల్ ది కూడా చాలా మంచి ప్రొఫైల్ కదా అంకుల్" నెమ్మదిగా అన్నాను. హఠాత్తుగా నేను చేసిన ప్రస్తావనతో వాళ్ళ మాటలు ఆగిపోయాయి.

"కృష్ణా ఊరుకో" మందలింపుగా అన్నారు నాన్న. సో ఐతే నో ఇంట్రడక్షన్ రిక్వైర్డ్. అందరికీ తెలుసు.

రాజేషంకుల్ వైపు చూశాను. ఆయన ముఖంలో నవ్వు ఇంకిపోయింది. గంభీరంగా టీ సిప్ చేయసాగారు.

"బృందాకి ఇష్టం లేదంకుల్. విశాల్ కూడా వెల్ సెటిల్డ్. మంచి ఫ్యామిలీ", అంటూ చెప్పబోయాను.

తీక్ష్ణంగా నావైపు చూసి, టీకప్పు పక్కన పెట్టేసి లేచారాయన సోఫాలోంచి.

"బృందాకి నేనేమీ అడ్డురాలేదు కృష్ణా. తను వెళ్ళిపోవాలనుకుంటే వెళ్ళిపోవచ్చు. కానీ వేరే మతంవాడికిచ్చి వాడెంత గొప్పవాడైనా సరే పెళ్ళి మాత్రం చేయలేను" చెప్పారు.

"ఓ.కే. చెయ్యద్దంకుల్. చేయకండి. మీకిష్టంలేని పెళ్ళి చేయకండి. కానీ, ఈ బలవంతపు నిశ్చితార్థం కూడా చేయకండి. బృందా చిన్నపిల్లేమీకాదు. షీ విల్ బీ హర్ట్. తనకి టైం అయినా ఇవ్వండి ఆలోచించుకోవడానికి. పోనీ టైమ్ ఇస్తే మీకు తగినట్టు తన నిర్ణయం మార్చుకుంటుందేమో చూడండి. బట్ దిస్ ఈజ్ నాట్ ఫెయిర్ అంకుల్. న్యాయం కాదు" అర్థిస్తూ అడిగాను.

నావైపు సూటిగా చూసారాయన "నువ్వు చేసుకుంటావా కృష్ణా? బృందాని నువ్వు చేసుకుంటావా?" అన్నారాయన.

షాకింగా చూసాను, "ఏం మాట్లాడుతున్నారంకుల్?" అన్నాను అతి కష్టం మీద గొంతు పెగుల్చుకుంటూ. అమ్మా-నాన్నా కూడా నిర్ఘాతపోయిచూస్తున్నారు మా డిస్కషన్ ఎక్కడికి వెళ్తోందో అర్థంకాక.

నాన్న వైపోసారి చూసి, "ఐ మీన్ ఇట్ శంకర్ " అని చెప్పి మళ్ళీ తిరిగి నా వైపు చూస్తూ, "నువ్వు చెప్పు కృష్ణా.., నువ్వు చేసుకుంటానంటే చెప్పు నేను క్యాస్ట్ గురించి కూడా ఆలోచించను నా సిస్టర్ వాళ్ళని వద్దని తిప్పి పంపేస్తాను. బంధువులందరి సమక్షంలో నీ కాళ్ళు కడిగి రేపే నా కూతుర్నిచ్చేస్తాను. వారం వర్జ్యం ఏదీ చూడను. చెప్పు. చేసుకుంటానని ఒక్కమాట చెప్పు చాలు. నిజంగా అన్నీ ఆపేస్తాను" చెప్పారాయన ఉద్వేగంగా.

"మీరావేశంలో వున్నారంకుల్" నిస్పృహగా తలాడిస్తూ అన్నాను.

"నో లేదు, నేను ఆలోచించే చెప్పాను కృష్ణా. నేను లవ్ మ్యారేజెస్ కి వ్యతిరేకిని కాదు. ఐ మీన్ అగైన్స్ట్ కాదు. కాకపోతే పరాయి మతంలో పిల్లనిచ్చేంత బ్రాడ్ మైండెడ్ కూడా కాదు. మన మతం వాడు ఎవ్వరైనా సరే కళ్ళు మూసుకుని యాక్సెప్ట్ చేసేవాడిని. నా కూతురి సంతోషం నాకేమైనా చేదా చెప్పు? కానీ ఇది తప్పట్లేదు కృష్ణా.

రేపనే రోజు ఏ ఇబ్బందొచ్చినా నా చెల్లెల్నీ, దాని కొడుకునీ నేను సమాధానపరుచుకోగలుగుతాననే నమ్మకంతోటే ఈ సంబంధం ఖాయం చెయ్యాల్సొచ్చింది.

అయినా ఒక్కసారి ఈ పెళ్ళైపోతే అది హ్యాపీగా వుంటుంది, నాది హామీ, ఏం తులసి లేదూ? ఇంట్లో వాళ్ళు చూసి, చేసిన సంబంధాలలో ఆడపిల్లలకి రక్షణుంటుంది కృష్ణా. ఐనా అందంతా నా ఒపీనియన్. కానీ, మాట మీదుంటానురా నేను. నువ్వు చేసుకుంటానంటే మాత్రం వాళ్ళని తిప్పి పంపేస్తాను.

నిజం శంకర్. నీమీదొట్టు. ఆలోచించుకోండి. ఎంగేజ్మెంట్ కి అరక్షణం ముందు చెప్పినా చాలు ఆపేస్తాను. కానీ వేరే కారణాలకి మాత్రం బహ్మాండం బ్రద్దలైనా నా నిర్ణయం మారదు. వస్తాను ఇంకా చాలా పనులున్నాయ్" చెప్పేసి స్వీట్స్ కవర్ అందుకుని వడిగా బయటకు నడిచారాయన.

స్తబ్దంగా కూర్చుండిపోయామందరం చాలాసేపటివరకూ, "వదిలెయ్ కృష్ణా ఇంక కలిగించుకోకు రాజేష్ మొండివాడు, వినడు ఏదైనా తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటే తర్వాత మనం భరించలేము" తేరుకుంటూ చెప్పారు నాన్న.

ఈ ఒక్క బెదిరింపుతో ఎంతమంది పిల్లల ఆశలు చిదిమేసారో కదూ మన సమాజంలో పెద్దలు.

భయపెట్టి పిల్లల ఆశల్నీ, కలల్నీ చిదిమేస్తే అది పెద్దరికమెలా అవుతుంది?

తలూపి లేచి బయటకి నడిచాను, "ఇప్పుడెక్కడికిరా..?" కంగారుగా అడిగింది అమ్మ. "బృందాతో కూడా మాట్లాడాలి కదమ్మా, ఎంతైనా ఆయన కూతురేగా, మరి తను కూడా ఏ తీవ్రమైన నిర్ణయాలూ తీసుకోకుండా చూసుకోవాలి కదా" వ్యంగ్యంగా చెప్పేసి గుమ్మం దాటాను.

"ఏమైంది కృష్ణా ఎక్కడున్నావు? ఫోన్ కూడా తియ్యలేదూ, రాత్రంతా ఇంటికే రాలేదు" నాన్న గొంతులో ఆదుర్దా ధ్వనించింది.

"ఏంలేదు నాన్నా, రాజేషంకుల్ వాళ్ళింటికి వెళ్తున్నానిప్పుడు, మీరూ, అమ్మా అక్కడికి రండి. ఫైవ్ మినిట్స్ లో వుంటాను" తాపీగా చెప్పాను.

"ఏమైందిరా ఇంత పొద్దున్నే" కంగారుగా అడుగుతున్న నాన్న మాటల్ని కట్ చేస్తూ చెప్పాను, "డ్రైవింగ్ లో వున్నాను నాన్నా వచ్చేయండి మాట్లాడుకుందాం" చెప్పేసి కాల్ డిస్కనెక్ట్ చేసేసాను.

రాజేషంకుల్ ఇంటికి చేరేసరికి అందరూ బయటే వెయిట్ చేస్తున్నారు కంగారుగా, అంకుల్, మాలతీ ఆంటీ, అమ్మ, నాన్న, అంకుల్ వాళ్ళ పేరెంట్స్.

నెమ్మదిగా కార్ పార్కింగ్ లో ఆపి దిగాను, వారివైపోసారి చూసి వెనక డోర్ తీసాను. నా వెనుకే పెళ్ళిబట్టల్లో దిగిన బృందా-విశాల్ చూస్తూనే మొత్తం అందరి ముఖాల్లోనూ డీప్ షాక్.. నిశ్చేష్టులై నిలబడిపోయి చూశారంతా నావైపుకు.

తేరుకుంటూనే విసురుగా నావైపొచ్చి నా భుజాలు పట్టుకుని వూపుతూ, "ఎంతపని చేసావు కృష్ణా. ఐనా నిన్ననేంలాభం. నా ఇంటి బంగారంలో లోటుంటే ఛీ..", అంటూ తోసేసారు రాజేషంకుల్. మౌనంగా వుండిపోయాను.

నిప్పులుకురిసేలా చూస్తూ బృందావైపు తిరిగారు. భయంగా నా వెనుకకు జరిగింది బృందా. ఆమె మీద చెయ్యి చేసుకుంటారేమో అన్నట్టనిపించగా చప్పున ఆమెకి అడ్డంగా నిలబడ్డాను. ఆ క్షణం నాకేసి ఆయన చూసిన చూపు జన్మలో మర్చిపోలేను..

బృందానీ, విశాల్ నీ ఇష్టం వచ్చినట్టు తిట్టారాయన. కాసేపు ఆయన ఆవేశం తిట్ల వర్షం మాలతి ఆంటీ వెక్కిళ్ళతో ఆ ప్రదేశం వేడెక్కిపోయింది.

"అయిందేదో అయిపోయింది. ఇంక వూరుకుని జరగాల్సింది చూడు రాజా" అంటూ సర్ది చెప్పబోయారు తాతయ్య. గయ్యిమన్నారు రాజేషంకుల్.

"ఏంటి నాన్నా అయిపోయేది?, అదేదో తింగరిపని చేసుకొస్తే నాలుగు తగిలించి ఇంట్లోకి తీసుకెళ్ళక ఇంకా నాకు చెప్తున్నారా? ఐనా ఏంటి శంకర్ అలా నిలబడ్డావ్? నీ కొడుకేంచేసాడో చూస్తున్నావుగా. ఏం మాట్లాడవేం?" అంటూ తీవ్రంగా అరిచారు.

తలొంచుకున్నారు నాన్న. నావల్ల అందరిముందూ నాన్న తలొంచుకునే పరిస్థితి రావడం చాలా బాధనిపించింది. చుట్టుపక్కల వాళ్ళు చూడడం గమనించి మాలతీ ఆంటీ భయంగా అడిగారు, "ముందు వాళ్ళని లోపలికి రమ్మనండి రాజేష్. అందరూ మననే చూస్తున్నారు."

"చూడనీ మాలతీ, ఎలాగూ మన పరువు రోడ్డెక్కించారు వీళ్ళంతా కలిసి", అంటూ బృందావైపు చూసారు," చివరిసారి చెప్తున్నా బృందా నీకు ఈ ఇంట్లో కాలుపెట్టడానికి ఆఖరి అవకాశం, జరిగింది మర్చిపోవడానికి సిద్ధంగా వున్నాను, నువ్వూ మర్చిపోయి ఇంట్లోకి వెళ్లు. లేదా మేం చచ్చాం అనుకుని బయటికి నడువు. తేల్చుకో" అన్నారు.

బృందా బావురుమందా మాటలకి, విశాల్ ముఖం పాలిపోయింది. కంగారుగా చూసాడు నావైపు కళ్ళతోనే ఏం కాదని అతనికి అష్యూరెన్స్ ఇస్తూ బృందాని చూసుకోమని సైగ చేసాను. బెరుగ్గా కదిలి బృందాని దగ్గరకి తీసుకున్నాడు ఓదారుస్తూ అసహ్యించుకుంటూ ముఖం తిప్పుకున్నారు రాజేషంకుల్.

ఇక తప్పదని అంకుల్కి సర్ది చెప్పడానికి నేను నోరు విప్పబోతుంటే గేట్ ముందాగిందో టాక్సీ. లగేజ్ తో టాక్సీ దిగుతున్న శ్యామ్ ని చూస్తూనే రాజేషంకుల్ ఆవేశం మళ్ళీ తలెత్తింది.

లోపలికి వస్తూనే బృందా-విశాల్ ని చూసి షాక్ తో నిలబడిపోయాడు శ్యామ్.

"రారా శ్యామ్. రా, చూడు నీ ఫ్రెండ్ చేసిన ఘనకార్యం. పెళ్ళి చేసి తీసుకొచ్చాడు నీ చెల్లెలికి, దారేపోయేవాడినిచ్చి. ముందు ఈ చెత్తని బయటపడేసి, నీ చెల్లెల్ని లోపలికి తీసుకురా శ్యామ్. చెప్పా మూర్ఖురాలికి, జీవితం మొత్తం ఏడవాల్సొస్తుందని" ఆవేశంతో వూగిపోతూ చెప్పారాయన.

చేతిలో బ్యాగ్ కిందపెట్టి ఓ సారి మావైపు చూసి, తండ్రి వైపు నడిచాడు శ్యామ్. నెమ్మదిగా ఆయన చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ, "డాడ్. ప్లీజ్ కంట్రోల్ యవర్ సెల్ఫ్. వాళ్ళు తొందరపడ్డారు కరక్టే. కానీ అతను దారేపోయేవాడైతే కాదు. అలా అయ్యుంటే కృష్ణ వారి ముందలా నిలబడదు డాడ్. మోరోవర్.. నౌ దే ఆర్ ఎ కపుల్.. అలా మాట్లాడకండి. క్షమించెయ్యండి ప్లీజ్" అన్నాడు రిక్వెస్టింగ్ గా.

నమ్మలేనట్టు చూసింది బృందా.

అన్నగారు ఏమీ తెలియకుండా తనని సపోర్ట్ చేస్తాడని తను అనుకోలేదేమో గానీ, నాకు తెలుసు శ్యామ్ గురించి. నేను దగ్గరుండి వారి పెళ్ళి చేసానంటే శ్యామ్ తప్పక నమ్ముతాడని ఎక్కడో నా మనసు చెప్తూనేవుంది. థ్యాంక్యూ సో మచ్ శ్యామ్ అంటూ మనసులోనే వాడికి కృతజ్ఞతలు చెప్పుకున్నాను.

రోషంగా వాడి చేతులు విసిరి కొట్టారాయన. "ఓ.. మరింకేం హారతిచ్చి స్వాగతించు ఆ సంతని, నడిపించు మా శవాలమీదనుండి, నేనూ-మీ అమ్మా ఎలాగూ అవమానభారంతో చావాలి కదా కాసేపట్లో పెళ్ళివారొస్తారు, వారొచ్చేలోపలే మనం పోవాలి పద మాలతీ" అంటూ విసురుగా ఆంటీ చెయ్యి పట్టుకుని బరబరా ఇంట్లోకి లాక్కెళ్ళసాగారు..

ఆ మాటలకి కంగారుగా నాన్న, తాతయ్యగారు, శ్యామ్ ఆయన వెంటే లోపలికి పరిగెట్టారు.

"ఓ మై గాడ్. అంకుల్ నిజంగానే ఏమైనా" అడుగుతున్న విశాల్ ని వారిస్తూ చెప్పాను "మా నాన్నా, శ్యామ్ వున్నారు కదా విశాల్ చూస్కుంటారు. ఏం కాదు, రండి మనమూ వెళ్దాం" అంటూ భయపడుతున్న వారికి నచ్చచెప్పి లోపలికి తీసుకెళ్ళాను.

చాలాసేపటి హై డ్రామా తరువాత అంకుల్ శాంతించారు. కాకపోతే బృందాని ఆదరించడం కలలో మాటని చెప్పేసారు. దాంతో ఏం చేయలేక తాతయ్యగారూ-నానమ్మా ముందుకొచ్చి బృందా-విశాల్ లకి హారతిచ్చి బట్టలు, నగలు పెట్టారు. బృందా బట్టలు మాత్రం తీసుకుని నగలు తిరిగిచ్చేసింది.

మాలతి ఆంటీ కన్నీళ్ళతో బృందాని హత్తుకుంది, విశాల్ వైపు చూసి, చేతులు జోడించి, "ఈయన రియాక్షనే ఇలా వుంటే, మీ ఇంట్లో ఎలా వుంటుందోనని భయంగా వుంది బాబూ. దాన్ని జాగ్రత్తగా చూసుకుంటావుకదూ?" అంటూ దిగులుగా అడిగింది.

"తప్పకుండా ఆంటీ, ఆల్రెడీ మా వాళ్ళకి చెప్పాను, నేనూ-బృందా అనుకోని సిట్యుయేషన్ లో పెళ్ళి చేసుకోవలసివచ్చిందని., వాళ్ళు అర్థంచేసుకున్నారు, దే ఆర్ ఈగర్ టూ రిసీవ్ అజ్. తను చాలా బాగుంటుంది మా దగ్గర. నమ్మండి" అంటూ ధైర్యం చెప్పాడు.

**అమ్మ బృందాని** ఆప్యాయంగా దగ్గరకి తీసుకుని తన చేతి గాజులు తీసి తొడిగింది.

శ్యామ్, నేను బయల్దేరాము బృందాని తన కొత్త జీవితంలోకి సాగనంపడానికి. కారెక్కబోతుంటే వినిపించింది అంకుల్ గొంతు, "కృష్ణా" అప్రయత్నంగా వెనుదిరిగి చూశాను. "ఇది నీ రివెంజ్ కదూ?" అన్నారాయన.

అయోమయంగా చూసాను "అంకుల్!", అంటూ.

"ఎస్. వీళ్ళెవరికీ అర్థంకాకపోవచ్చు, కానీ నేనంత పిచ్చోడినైతే కాదుగా, మేమంతా కలిసి నువ్వు తులసిని పెళ్ళి చేసుకోకుండా చేసామని, ఈ పెళ్ళి దగ్గరుండి జరిపించి తీర్చుకున్నావు కదూ. తప్పు చేసావురా. అది శాస్త్రిగారి నిర్ణయం, కానీ, నీ పంతం మామీద తీర్చుకున్నావు" అన్నారాయన.

షాకింగా చూసాను"లేదు.. లేదంకుల్ మీరు తప్పుగా అర్థంచేసుకుంటున్నారు" అంటూ చెప్పబోయాను.

"అవుట్.. గెట్ అవుట్.. యూ డిచ్డ్ అజ్. ఇక జీవితంలో ఈ గుమ్మంలో కాలు పెట్టకురా. శంకర్ ముఖం చూసి ఇంతకంటే నిన్నేమీ అనలేను. జన్మలో నీ ముఖం చూపించకు మాకు. పో ఇక్కడ్నుంచి" అనేసి వడివడిగా వెళ్ళిపోయారు.

నిశ్చేష్టుడినై నిలబడిపోయాను. గుండెల్లో కోసినట్టైంది, నామీద కోపగించుకున్నా, ఆఖరికి కొట్టినా అంత బాధేసేది కాదేమో? బట్ అంత దారుణమైన ఎలిగేషన్ కి బాధ ముంచుకొచ్చింది.

లేదు, లేదంటూ గట్టిగా అరవాలనిపించింది. కానీ, ప్రయోజనంలేదని తెలుసు. ఆయన అదే నమ్మదలుచుకున్నారు. హీ హేట్స్ మీ. ఆ మాటలు, ఆయన చూసిన చూపూ నన్ను చాలా కాలమే వెంటాడాయి.

శ్యామ్ ముఖం పాలిపోయింది. స్తబ్దంగా వుండిపోయాడు.

కొద్ది క్షణాల నిశ్శబ్దం తర్వాత, "అయాం సారీరా కృష్ణా ఇదంతా నావల్లే" అంటూ కన్నీటితో నా భుజంమీద తలాన్చింది బృందా.

అతి కష్టంమీద తేరుకున్నాను, వీలైనంత నార్మల్ గా నవ్వడానికి ప్రయత్నిస్తూ, "ఛ. పిచ్చిపిల్లా అంకుల్ కోపం ఎన్నాళ్ళనీ? కొన్నిరోజుల్లో అన్నీ సర్దుకుంటాయి. నువ్వు నవ్వుతూ బయల్దేరు, ఇవన్నీ మనసులో పెట్టుకోకు" అని మృదువుగా ఓదారుస్తూ కారెక్కించాను. నావైపు దిగులుగా చూసి కామ్ గా వెళ్ళి ముందుసీట్లో కూర్చున్నాడు శ్యామ్. బాధగా చూస్తున్న అమ్మా – నాన్న వైపు చూసి నిర్లిప్తంగా ఓ జీవంలేని నవ్వు నవ్వి కదిలి, కార్ స్టార్ట్ చేసాను.

ఏదైతేనేం, బృందా జీవితం తనకు కావలసినట్టు మలుచుకునేందుకు హెల్ప్ చేయగలిగాను, తను సంతోషంగావుంటే చాలు. అంకుల్ బలవంతపు నిర్ణయానికి తన లైఫ్ బలి కాకుండా చూడగలిగాం, అది చాలు ఇవన్నీ కాస్త కష్టమైనా భరించేయొచ్చు.

కానీ, ఎంతైనా కాస్త కాదు చాలా కష్టమే. అనుకున్నంత తేలికేమీ కాదు, నిజంకాని నింద భరించడం చా..లా.. కష్టం...

నేను ఎమ్. ఎస్ లో వుండగానే ముద్ర పరిచయమయ్యింది. లోపాముద్రా బక్షీ. అందం, చదువు, ధైర్యం, ఆలోచనా అన్నీ కలగలిసిన చక్కటి బెంగాలీ అమ్మాయి.

అక్కడి నా ఒంటరితనానికి తోడయ్యింది.. తెలీకుండానే నా జీవితంలో ముఖ్యమైన భాగమయిపోయింది. అలా అనుకోకుండా తనతో ప్రేమలో పడడం ఆ వెంటనే ఇరువైపులా ఇంట్లోవారికి చెప్పి వారి బ్లెస్సింగ్స్ తీసుకోవడం వెంట– వెంటనే జరిగి పోయాయి.

ముద్ర దగ్గర నేనేదీ దాచలేదు. జరిగినదంతా నా గతాన్ని ఓపెన్ బుక్ లా తన ముందుంచాను..

చదువు పూర్తయ్యాకా తిరిగి వెళ్ళాలనే వుద్దేశ్యాన్ని వాయిదావేసి, అక్కడే జాబ్ కంటిన్యూ చేయసాగాను. ముద్ర చాలా ఇంపార్టెంట్ ప్రాజెక్ట్ లో వుండడంతో పెళ్ళి కూడా పేరెంట్స్ ని అక్కడికే పిల్చుకుని చేసుకోవాలనే నిర్ణయం తీసుకున్నాం.

అలా చూస్తుండగానే నా జీవిత ప్రయాణం తన దిశ మార్చుకుంది.

"ప్రసాదం తీసుకో బాబూ" అన్న అర్చకుల మాటతో అలసటగా కళ్ళు తెరిచాను. గుడి మండపంలో స్తంభానికి ఆనుకుని కూర్చుని జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయానేమో?

ఎంతసేపయిందో నాకే తెలియలేదు. బహుశా గతం నాలో నింపిన బాధ చాన్నాళ్ళకి ఈ దారుణమైన వార్తలతో బయటికి వచ్చినట్టుంది.

ఇక ఆ గతం నీడలో తులసి జీవితం ఏ మలుపు తిరిగిందో తెలుసుకోవాలి. ప్రస్తుతం నాముందున్న కర్తవ్యం అదే. తన మరణానికో జవాబు వెతకాలి. కారణాలు వీరు చెప్తున్నారు. నిజాలు నేను తెలుసుకోవాలి..

ఏదో ఆవేశంలో రాజేషంకుల్ నన్ను ఒక్కమాటతో గాయపరిస్తేనే భరించలేకపోయాను. అంత దారుణమైన నిందలని తులసి ఎలా తట్టుకుందో? ఎంత విరిగిపోయి ఆ దారుణమైన నిర్ణయాన్నాశ్రయించిందో. నా మనసంతా తనపట్ల జాలితో నిండిపోయింది.

"వెళ్ళిపోండి కృష్ణా. అసలెందుకొచ్చారిక్కడికి?" అప్పటివరకూ స్తబ్దంగా కూర్చుని జపమాల తిప్పుకుంటున్న శాస్త్రి అంకుల్ దిగ్గున లేచారు మమ్మల్ని చూస్తూనే..

ఊహించిన రియాక్షనే కావడంతో నేనూ జంకలేదు,"మిమ్మల్ని డిస్ట్రబ్ చేయాలని కాదంకుల్. తులసి కోసం" అంటూ ఆయన ఎదుట నిలబడ్డాను.

"వద్దు కృష్ణా ఆ పేరు కూడా నేను వినదలుచుకోలేదు, రమా వీళ్ళు బయల్దేరుతున్నారు, పంపి తలుపేసుకో" అంటూ రమా ఆంటీని ఆదేశించి లోపలికి వెళ్ళిపోయారు.

దిగాలుగా ఆంటీ వైపు చూశాం, గుమ్మానికి ఆనుకుని నిల్చునివున్న ఆవిడ చాలా నిర్లిప్తంగా మావైపు చూసి, "వెళ్ళండి బాబూ, చాలా దూరం నుంచి వచ్చారేమో నాకూ పనుంది" అన్నారు.

"ఆంటీ ప్లీజ్" అంటూ మేము మాట్లాడించబోయేంతలో వినిపించింది ఇంటి లోపలినుండి కేరుమంటూ పసిబిడ్డ ఏడుపు..

వెంటనే కదిలిందావిడ, "నాకు పనుంది బాబూ..వెళ్ళండి.." అంటూ లోపలికి నడిచి, "మళ్ళీ రాకండి" అని చెప్పి తలుపులు మూసుకున్నారు.

నిశ్శబ్దం రాజ్యమేలుతున్న ఆ ప్రదేశంలో లోపలినుండి పసిబిడ్డ ఏడుపు మాత్రం లీలగా వినిపిస్తోంది. అది.. తులసి బిడ్డ కదూ! అప్రయత్నంగా తల తిప్పి ఆ డోర్ వైపు చూశాను. గుండెల్లో కోసినట్టైంది.

నిండా రెండు నెలలైనా లేని పసికందు. ఏం పాపం చేసిందని తల్లి నుండి దూరం కావాలి. అంత ఘోరం ఏంచేసిందని మా తులసి తన బిడ్డనుంచీ, తన బ్రతుకునుంచీ వేరు కావాలి? తన తండ్రికోసం అంత ఆలోచించి తన లైఫే ఇచ్చేసిన తులసి తన బిడ్డకోసం ఆలోచించదూ! నాకు తెలిసిన తులసి అలా పురిటి గుడ్డుని తల్లిలేకుండా చేసి వెళ్ళిపోదు. ఎన్నటికీ అలా చేయదు. మరి ఎందుకిలా?

అలా మూసివున్న తలుపుని చూస్తూ ఎంతసేపువున్నానో నాకే తెలియదు. లోపలినుండి ఏ చప్పుడు లేదు. బహుశా బేబీ మస్ట్ హావ్ స్లెప్ట్. కనీసం తన ముఖమైనా చూడలేదు. అసలు బాబో .. పాపో కూడా తెలియదు.

"ఆ తలుపులిక తెరుచుకోవు కృష్ణా", అన్న శ్యామ్ మాటలతో నా ఆలోచనలనుండి తేరుకుని వాడివైపు చూశాను.

"పద వెళ్దాం" చిన్నగా నా భుజం తట్టి అన్నాడు. బరువెక్కిన గుండెతో అక్కడినుండి కదిలాను.

కామ్ గా వచ్చి తన ఇంటి ముందు గట్టుమీద కూర్చుండిపోయిన మమ్మల్ని చూసి వడివడిగా మంచినీళ్ళ బాటిల్ తెచ్చి అందిస్తూ, "మాట్లాడనన్నాడుకదూ నేను చెప్పాను కదయ్యా వాళ్ళు అలాగే చేస్తున్నారు. మనం మాత్రం ఏం చేయగలం? వాళ్ళైనా, మీరైనా, ఎవరైనా ఏం చేయగలరు? పరిస్థితులు అలా వచ్చాయి" అంటూ నిట్టూర్చారు సుందరం అంకుల్.

తలెత్తి చూశాను, "ఎవరూ ఏమీ చేయలేరేమో? నేను కాదు. ఐ మీన్.. మేము కాదంకుల్" వుద్వేగంగా అన్నాను.

బాధగా చూశారాయన, " అది మా కళ్ళముందు పుట్టి పెరిగిన పిల్ల కృష్ణా. మాకు మాత్రం బాధవుండదా చెప్పూ. ఐనా మీరు మాత్రం ఏం చేస్తారు? చేసేదంతా చేసి, అది చక్కా పోయింది. మనకింత కోత మిగిల్చి" అన్నారు.

తల అడ్డంగా తిప్పాను, "తులసి తప్పు చేసిందంటే" నా మాట పూర్తయ్యేలోపే అడ్డుకున్నారు.,

"అది ఎవరో పుట్టించిన పుకారు కాదయ్యా. ఆ విషయం చెప్పింది సాక్షాత్తూ ఆమె తల్లితండ్రులు. అందరిముందూ ప్రూవ్ అయింది. ఆ గిల్ట్ తోనే ఆత్మహత్య చేసుకుంది" అన్నారాయన.

"అందరూ కలిసి ప్రూవ్ చేసినంత మాత్రాన అబద్ధం నిజమైపోదు, ఏం జరిగిందో తెలుసుకోకుండా తనని బ్లేమ్ చేయలేను. మీరేమన్నా చెప్పండి ఐ కాన్ట్ దూ దట్" చెప్పాను కాస్తంత వుక్రోషంగా.

అయోమయంగా చూశారాయన. లేచి నిలబడ్డాను. కంగారుగాలేచి నా భుజం మీద చెయ్యి వేశాడు శ్యామ్,"కంట్రోల్ యువర్ సెల్ఫ్ కృష్ణా" అన్నాడు మృదువుగా.

"తులసిరా" బాధగా అన్నాను. వాడి కళ్ళలోనూ నీళ్ళూరాయి. సుందరంగారి కళ్ళూ చెమ్మగిల్లాయి. లేచి వచ్చి నా తల నిమిరారాయన.

"నీ బాధ మాకర్ధం అవుతోందయ్యా. కానీ.. జరిగింది ఇదీ అని చెప్పడానికి అదా ఈ లోకంలో లేదు. ఈ విషయం డిస్కస్ చేసేందుకు దాని వాళ్ళెవరూ సిద్ధంగానూ లేరు. ఇటు పుట్టింటివాళ్ళు, అటు అత్తింటివాళ్ళూ కూడా ఏంచేస్తాం చెప్పూ. ప్రాప్తం. ఐనా అంతా నిమిత్తమాత్రులం. ఎవరు మాత్రం ఏం చేయగలరు?" అన్నారు వేదన నిండిన గొంతుకతో.

తల అడ్డంగా తిప్పాను, "నేను చేస్తానంకుల్. తెలుసుకుంటాను" అంటూ ఆగి, " నేను వారణాశి వెళ్తాను" అన్నాను స్థిరంగా. ఉలిక్కిపడి చూశారు వాళ్ళు.

"కృష్ణా ఆలోచించే మాట్లాడుతున్నావా?" కంగారుగా అడిగాడు శ్యామ్. తలూపాను.

"అక్కడికి వెళ్ళి మాత్రం ఏంచేస్తావయ్యా? ఇక్కడ అన్నయ్యా వాళ్ళే ఇలా రియాక్టయితే ఇక అక్కడ దాని అత్తింటివాళ్ళింకెలా రియాక్టవుతారు చెప్పూ. ఇప్పటికే కొండంత చెడ్డపేరుతో పోయిందది, ఇక దానికి చిన్నతనంనుంచీ మగపిల్లలతో స్నేహం వుండేదని తెలిస్తే ఇంకెన్ని మాటలొస్తాయో. అర్థం లేని పనులు చేయకు" అంటూ సర్ది చెప్పబోయారు.

"లేదంకుల్. వెళ్ళాలి. చేయని తప్పుకి తులసి లైఫ్ అర్థాంతరంగా ముగిసిపోవడం భరించలేకపోతున్నాను. అయినా, అలా చాటు-మాటు అఫైర్స్ నడిపి, భర్తని మోసగించాలనుకునే పర్సన్ కాదు తను, ఇట్స్ నాట్ హర్ కేరక్టర్. లేదూ అలా జరిగిందే అనుకుందాం. తప్పు ఒప్పుకోలేనంత పిరికిది కాదు మా తులసి.

లేనిపోనివి అంటగట్టి తనని తీవ్రంగా గాయపర్చారు అ.. అందుకే.. అంత పెద్ద నింద భరించలేకే ప్రాణాలొదిలేసింది. ఆ మాట ఎవరునమ్మకున్నా నేను నమ్ముతున్నాను,

నాకు తెలిసిన తులసి అలా పురిటి గుడ్డుని తల్లిలేకుండా చేసి వెళ్ళిపోదు. ఎన్నటికీ అలా చేయదు. మరి.. ఎందుకిలా?

అంటే.

తనకేదో తీరని ఆన్యాయం జరిగింది. అదేమిటో, తనెంత నీతిగల వ్యక్తో నిరూపిస్తాను అందరికీ. ప్రతి ఒక్కరికీ" తీవ్రంగా చెప్పాను.

నా మాటల్లో తీవ్రతే గ్రహించారో, బాధే గుర్తించారో, లేక ఎందుకులే అనుకున్నారోగానీ ఆయనింక మాట్లాడలేదు.

"పద శ్యామ్, మనం వారణాశికి వెళ్తున్నాం" అని శ్యామ్ కి చెప్పి అంకుల్ వైపు తిరిగి చేతులు జోడించాను,

"వుంటామంకుల్. థ్యాంక్స్ ఎ లాట్ ఫర్ యువర్ హెల్ప్. మిమ్మల్నేమైనా ఇబ్బంది పెట్టివుంటే తప్పుగా అనుకోకండి" చెప్పాను.

"అర్ధం చేసుకోగలను. కానీ ఏం చేస్తావో ఆలోచించి చేయి జాగ్రత్తయ్యా" చెప్పారు.

తలూపి "ఏం చేసినా తులసికి చెడ్డపేరు తెచ్చిపెట్టే పనులైతే చేయనని నమ్మకముంచుకోండి అంకుల్ అది చాలు" చెప్పి బయటకు నడిచాను.

ఇంకా షాకింగానే చూస్తున్న శ్యామ్ తేరుకుని ఆయనకి చెప్పి వచ్చి కారెక్కాడు.

"శ్యామ్ నీ ఒపీనియన్ తీసుకోకుండానే డెసిషన్ చెప్పేసాను వెరీ సారీరా", అన్నాను వాడివైపు తిరిగి.

"ఏరా, నీ మాట వేరు, నా మాట వేరుగా మనమెప్పుడైనా వున్నామా? చేసామా?" అడిగాడు సూటిగా చూస్తూ. తల అడ్డంగాతిప్పాను లేదన్నట్టు.

"మరైతే ఇప్పుడేంటి కొత్తగా సారీలు చెప్తున్నావ్" అన్నాడు మందలింపుగా.

నిజమే. బహుశా పరాయిదేశంలోవుండి వుండీ, వుండీ అక్కడి అలవాట్లువచ్చేసాయేమో గిల్టీగా చూసాను.

"సర్లే అది వదిలేయ్ గానీ, టెల్ మీ వన్ థింగ్ కృష్ణా ఆర్ యూ ష్యూర్? ఆలోచించే అన్నావా బెనారస్ వెళ్తానని?" అడిగాడు.

"ఇప్పటికే చాలా ఎక్కువ ఆలోచించేసాంరా, ఇక ఏం జరిగినా సరే తులసికి న్యాయం మాత్రం జరగాలి. అంటే మనం అక్కడికి వెళ్ళాలి. లెట్స్ గో" చెప్పాను స్థిరంగా.

"మిస్సింగ్ యూ క్రిష్ ఎ లాట్" నా వీడియో కాల్ పిక్ చేస్తూనే ముద్ర అన్న మొదటి మాట తన కళ్ళల్లో , మాటలో బెంగ స్పష్టంగా తెలుస్తోంది.

జాలేసింది. నిజానికి ఇది తనకి బొత్తిగా సంబంధంలేని పోరాటం కానీ తననీ ఎఫెక్ట్ చేస్తోంది హాయిగా పెళ్ళి సందడిలో కులాసాగా వుండాల్సిన అమ్మాయికి ఈ టెన్షన్స్. నా వల్ల కానీ, తప్పదు షీ ఈజ్ మై పార్ట్నర్ ఇన్ ఎవ్రీథింగ్. నా పోరాటంలో కూడా.

" మీ టూ. ఎలా వున్నావ్ ముద్రా?" అన్నాను నా ఆలోచనలను పక్కకి పెడుతూ.

"మ్.. గుడ్. నువ్వూ? ఎయిర్ పోర్ట్ లో వున్నావా?" నా పరిసరాలను చూస్తూ అంది.

"హా. ఆన్ అవర్ వే టూ వారణాశి వయా ఢిల్లీ " అంటూ జరిగినదంతా వివరించాను.

జరిగింది విని కొద్దిసేపటి మౌనం తర్వాత అంది, "కేర్ఫుల్ క్రిష్ సుందరం అంకుల్ చెప్పింది కూడా గుర్తుపెట్టుకోండి ఆల్రెడీ ఆ అమ్మాయి గురించి అంత చెడుగా ప్రచారం జరిగింది అక్కడ పీపుల్ ఆలోచించే విధానం కూడా వేరు. దే కేన్ బీ వెరీ ఆర్థడాక్స్ అండ్ రిజిడ్. సో చూసి అప్రోచ్ అవండి. ఐ మీన్ నీకు తెలీదని కాదనుకో. బట్ స్టిల్ చెప్పాలనిపించింది."

ఆప్యాయంగా చూసాను "తప్పకుండా కేర్ఫుల్ గానేవుంటాను ముద్రా థ్యాంక్స్. థ్యాంక్యూ సో మచ్ ఫర్ అండర్ స్టాండింగ్" చెప్పాను.

చిన్నగా నవ్వి తలపరికించింది "ఆహా మిష్టర్ కృష్ణా ఈజ్ బికమింగ్ వెరీ ఫార్మల్ డే బై డే. ఎనీవేస్ యాక్సెప్ట్ చేసేసాన్లే" అంది చిన్నగా చేయి తలకి ఆనించింది అల్లరిగాచూస్తూ.

తన గెస్చర్ కి అప్రయత్నంగా నవ్వాను. చాలాసేపటి తర్వాత అంత అలజడిలో చిన్న రిలీఫ్.

"ఓహ్ క్రిష్. నవ్వావా. థ్యాంక్యూ సో..సో.. మచ్. యూ డోన్ట్ నో హౌ వర్రీడ్ అయామ్ టు సీ యూ లైక్ దట్. అయామ్ సో సారీ ఫర్ వాట్ ఆల్ యూ గైస్ ఆర్ గోయింగ్ త్రూ" అంది లాలనగా.

తలూపాను తులసి గుర్తురాగా చిన్నబోయిన ముఖంతో. అది గమనించి తనూ సీరియస్ మూడ్ లోకి వస్తూ, "ఇంతకీ ఎలా ప్రొసీడ్ అవుతున్నారు?" అంటూ ప్రశ్నించింది.

"వెల్. ప్రస్తుతానికి పక్కా ప్లాన్ అంటూ ఏమీలేదు. ఏంజరిగిందో తెలియాలంటే ముందు అసలక్కడ ఏమైందో తెలియాలి. సో రివర్స్ లో వెళ్తాం. తనని చివరిగా చూసిన వారి దగ్గరనుంచి మొదలుపెట్టి అప్రోచ్ అవుతాం.

తులసిని ఆరోజు ఆంబులెన్స్ లో వారణాశి నుండి ఢిల్లీకి తీసుకెళ్ళడానికి ఒక విమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వాళ్లు వెళ్ళారని సుందరం అంకుల్ చెప్పారు. సో ముందుగా వారిని కలిసి వారికి ఎంతవరకూ తెలుసో కనుక్కోవాలి. వాళ్ళ ఆఫీస్ ఢిల్లీలో వుందట. వారి హెడ్ తో ఇవాళ ఈవెనింగ్ కి అప్పాయింట్ మెంట్ తీసుకున్నాము సో అది పూర్తయ్యాకా రేపు ఎర్లీ మోర్నింగ్ ఫ్లైట్ కి వారణాశి వెళ్తాము. చూడాలి అక్కడ ఏం చెయ్యగలుగుతామో" వివరించాను.

"చెయ్యగలవ్. వి ట్రస్ట్ యూ క్రిష్" చెప్పింది మోటివేటింగ్ గా. చిన్నగా నిట్టూర్చాను. అంతలో ఫ్లైట్ టైమైందంటూ దూరంనుంచే శ్యామ్ వాచ్ చూపించడంతో సర్దుకుంటూ, "ఓ.కే. ముద్రా. ఫ్లైట్ టైమైంది. విల్ మేక్ ఎ మూవ్. వుంటాను మరి. యూ టేక్ కేర్" అన్నాను.

"ఫైన్ దెన్, సే మై హెలో టూ శ్యామ్. కాల్ చేస్తుండు వెన్ ఎవర్ యు గెట్ టైమ్. యూ టూ టేక్ కేర్ అండ్ లవ్ యూ క్రిష్" చెప్పింది నావైపోసారి తదేకంగా చూసి.

"యాహ్. కాల్ చేస్తాను. లవ్ యూ టూ. బై" ఫోన్ డిస్కనెక్ట్ చేసి శ్యామ్ వైపు నడిచాను.

సహారా. ఆప్ కో హమారా భరోసా.

హిందీలో బోర్డ్ పై రాయబడివున్న అక్షరాలు ఎండపడి మెరుస్తున్నాయి. ఆ పెద్ద బోర్డ్ వైపు అభావంగా చూసాను.

ఢిల్లీ మహానగరంలో ఓ పెద్ద ఆవరణ. రకరకాల బ్లాక్స్ లో విధవిధాల బాధితులకీ, ఏ ఆదరణా, దిక్కూ లేనివారికీ వారి అవసరాన్నిబట్టీ, వారికి ఉపయోగపడేరీతిలో సహాయం ఇస్తున్నారక్కడ.

అంటే అందరూవుండి కూడా తులసి ఓ అనాధలా వీరిచేత హాస్పిటల్ కి తీసుకెళ్ళబడిందన్న విషయం అర్థమవుతుంటే గుండెల్లో ఏదో వత్తిపట్టిన ఫీలింగ్.

"తులసి ఫ్యామిలీ ఐతే ఓకే కానీ డూ యూ రియల్లీ థింక్ మనకి వీళ్ళ దగ్గర్నుంచి ఏదైనా హెల్ప్ దొరుకుతుందని కృష్ణా?" అడిగాడు శ్యామ్.

"తెలియదు శ్యామ్. కానీ జరిగింది తెలుసుకోవాలంటే ఎక్కడో అక్కడ ప్రారంభించాలి కదా. సో లెట్స్ బిగిన్ హియర్, కాకపోతే మన తులసిని చివరిగా చూసింది వీళ్ళే. అందుకే వారణాశి వెళ్ళేముందు ఓసారైతే మాట్లాడి చూద్దాం" అంటూ లోపలికి నడిచాను.

"నమస్తే కూర్చోండి, మేడమ్ పిలుస్తారు" అంటూ విజిటర్స్ లాంజ్ లో కూర్చోబెట్టింది అక్కడున్న పీ.ఏ.

అక్కడ మాతోపాటూ ఓ ఐదారుగురున్నారు. వారిలో ఒకామె ముఖం మొత్తం కవర్ చేసుకుని వుంది. అది మామూలు ఘోషా కాదు, ఏదో ఘోరాన్ని కవర్ చేయడానికి కప్పిన పరదా అని తెలుస్తూనేవుంది. ఏం జరిగిందో పాపం.

మా పక్కన ఓ పల్లెటూరి వ్యక్తి కూర్చునివున్నాడు. బిహారీ యాక్సెంట్ వున్న హిందీలో మాట్లాడుతున్నాడు, "మీరు ఎక్కడనుండి భయ్యావచ్చారు?"

"హైదరాబాద్ నుండి" చెప్పాను

"చాలా దూరమే పాపం. నేను కూడా పాట్నా దగ్గర్లో ఓ చిన్న పల్లెనుండి వచ్చాను, మా చెల్లెలికోసం. తన భర్త చనిపోయాడు అతగాడి తరఫు వాళ్ళెవరూ లేరు. తననీ, పిల్లలనీ పోషించే స్థోమత నాకు లేదు. ఐనా ఏదో దాన్ని దగ్గరపెట్టుకుని అందరం తలో పనీ చేసుకుంటూ గడిపేస్తున్నాం భయ్యా.

ఇప్పుడేమో దానికి కేన్సర్ జబ్బుట. అది పనికి వెళ్ళకపోయినా వేళకింత తిండంటే పెట్టగలనుగానీ దాని వైద్యం, పిల్లల చదువులూ ఇవన్నీ నేనెక్కడ మోయగలను? ఓ చిన్న ఎలక్ట్రీషియన్ ని.

మా వూళ్ళో ఎవరో చెప్పారు ఈ సంస్థవాళ్ళు సాయం చేస్తారనీ, మందులిప్పిస్తారనీ, పిల్లలకి చదువుకూడా చెప్పిస్తారనీ. అందుకే పోయన నెల అప్లికేషన్ పెట్టుకుంటే ఇప్పుడు రమ్మన్నారు" అంటూ తన కథ వివరించాడతను.

జాలేసింది. పాపం ఇలాంటి సంస్థలు లేకుంటే సామాన్యులకెంత గడ్డు సమస్య అది.

"ఇంతకీ మీరు ఎవరికోసం వచ్చారు భాయ్? చూస్తే బాగా సంపాదిస్తున్నట్టేవున్నావుగా మరి ఏమైందీ?" అడిగాడు చాలా మామూలుగా.. సహజమైన కుతూహలం కనబరుస్తూ.

ఒక్కక్షణం ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. కానీ ఇతనికే ఆన్సర్ చేయలేకపోతే రేపు వారణాశి వెళ్ళి ఏం చేస్తాను? అందుకే అతను ఏమడిగినా జవాబివ్వడానికే నిర్ణయించుకున్నాను.

"మా ఫ్రెండ్ కోసం వచ్చాము. ఆర్థిక సహాయంకోసం కాదు",చెప్పాను.

"ఫ్రెండ్ కోసమా! ఏం సాయం? ఇక్కడ మగవాళ్ళకి ఆశ్రయం ఇవ్వరు. స్త్రీలూ, చిన్నపిల్లలకు మాత్రమే నీకు తెలియదేమో" అన్నాడు వింతగా చూస్తూ.

"తను స్త్రీయే" అంటూ ఇంకేదో చెప్పేలోపే అతగాడు తీవ్రంగా ఆశ్చర్యపోయాడు, "ఫ్రెండ్. అదీ కేవలం ఓ అమ్మాయి ఫ్రెండ్ తన కోసం ఇంత దూరం వచ్చారా" అంటూ.

అంతవరకూ అతనిపై వున్న సానుభూతి కాస్తా చిరాకుగా మారగా నా ఫీలింగ్స్ కవర్ చేసుకుంటూ చెప్పాను, "తను జీవించి లేదు. తనకి చివరి సమయంలో వీళ్ళు హెల్ప్ చేసారట. కొన్ని వివరాలు తెలుసుకోవడంకోసం వచ్చాము" చెప్పాను.

శ్యామ్ అయోమయంగా చూసాడు, అంత వివరంగా ఎందుకు చెప్తున్నానో అనుకుంటుండచ్చు.

"అయ్యో అవునా! ఆమెకి పిల్లలా?" అడిగాడు కుతూహలంగా.

"హా.. ఓ బిడ్డ. ఏం?" కాస్తంత తెల్లబోతూ అనాలోచితంగా జవాబిచ్చాను.

అతగాడు కాస్తంత అదోలా నవ్వుతూ, "ఓ.. అందుకా. కష్టమే మరి" అన్నాడు.

శ్యామ్ లేచి నిలబడ్డాడు, "పద కృష్ణా.., టీ తాగొద్దాం..", అన్నాడు. వాడి ముఖం ఎర్రగా కందిపోయివుంది.

నేను అయోమయంగా చూసాను, అంతలో ఆ బిహారీ వ్యక్తే నా ముఖంలోకి చూస్తూ, "ఇంతకీ ఆ బిడ్డ మీ ఇద్దర్లో ఎవరి బిడ్డా? అది చెప్పలేదు భాయ్ మీరు?" అన్నాడు.

దిగ్గున లేచాను. శరీరంలో రక్తం మొత్తం ఒక్కసారిగా మరిగిపోవడం అంటే ఏమిటో మొదటిసారి తెలిసింది. అతగాడి మీద చెయ్యి చేసుకోకుండా వుండడానికి అతికష్టంమీద నన్ను నేను నిగ్రహించుకుంటూ, అతనివైపోసారి తీవ్రంగా చూసాను. తను తప్పుగా మాట్లాడానని గ్రహించాడో ఏమో కామ్ గా ముఖం తిప్పుకున్నాడు. తన్నుకొస్తున్న ఆవేశాన్ని అణుచుకుంటూ శ్యామ్ వెంట క్యాంటీన్ వైపు నడిచాను.

"అంత మాట అంటాడా రాస్కల్. ఐనా నాదే తప్పు. ఇతగాడి ప్రశ్నలకే జవాబియ్యకపోతే వారణాశిలో ఎలా అనుకుంటూ నేనే ఇడియట్ లా వాడి ప్రతి క్వశ్చన్ ఆన్సర్ చేస్తూ పోయాను. ఐ షుడున్ట్ హావ్ డన్ దట్. యామ్ సో స్టుపిడ్. సో డంబ్. మైండ్ లెస్ క్రీచర్" కోపంగా నన్ను నేను తిట్టుకున్నాను.

"చాల్లే. ఇక వదిలేయ్ రా, ఎంతని తిట్టుకుంటావ్ నిన్ను నువ్వు ఆపెయ్" మందలించాడు శ్యామ్. పైకి తలూపాను గానీ, లోపల రక్తం వుడికిపోతోంది. తులసికోసం మాట్లాడడానికి వచ్చాను కాబట్టి నిగ్రహించుకున్నానుగానీ లేకపోతే అతడి దవడ అక్కడే పగిలేది నా చేతిలో.

టీ కప్పు టేబుల్ మీదుంచి తలవిదిల్చాను. ఈ క్రాప్ అంతా తలకెక్కించుకుంటే ఫర్దర్ గా కష్టం. ఎక్కువగా ఆలోచించకూడదు. నా ఎయిమ్ వేరు అనుకుంటూ నాకు నేను నచ్చజెప్పుకున్నాను.

మేం లోపలికి తిరిగి వెళ్ళేసరికి మా టర్న్ వచ్చేసింది. దాంతో ఇంక విజిటర్స్ లాంజ్ లో కూర్చున్నవారివైపు చూడకుండా సెక్రటరీ చూపినవైపుకు నడిచాము. పెద్ద ఛాంబర్ లో చుట్టూ వున్న రాక్స్ లో వేల ఫైల్స్ మధ్యలో కూర్చునివుందో నడివయసు స్త్రీ. ది మోస్ట్ హర్డ్ ఆఫ్.

హేమాంగీ దీక్షిత్. ది హెడ్ ఆఫ్ సహారా ఫౌండేషన్.

హేమాంగి గారు ఇంత పెద్ద వెల్ ఫేర్ ఆర్గనైజేషన్ నడిపిస్తున్న వ్యక్తి చాలా సింపుల్ గా వున్నారు. ఎంతో మర్యాదగా రిసీవ్ చేసుకున్నారు "హలో మిష్టర్ కృష్ణా! మీరే కదూ నిన్న కాల్ చేసినది చెప్పండి వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ?"

"తులసి. తన గురించి మాట్లాడదామని వచ్చాము మేడమ్. రెండు నెలల క్రితం మీరు సేవ్ చేయడానికి వారణాశి నుండి ఢిల్లీ తీసుకుని వెళ్తున్నప్పుడు దారిలో" అంటూ ఆగిపోయాను. 'చనిపోయిన అమ్మాయి' అని చెప్పడానికి నోరు రాలేదు.

"ఎస్.. గుర్తుంది చెప్పండి. ఏం మాట్లాడాలి తన గురించి? మీరు తనకేమౌతారు?" అడిగారావిడ గంభీరంగా చూస్తూ.

"చిన్నప్పటినుంచీ మేమంతా కలిసి పెరిగాం మేడమ్. స్నేహితులం. వి ఆర్ ఐ మీన్ వీ వెర్ ఫ్రెండ్స్. మోర్ దాన్ దట్. మోర్ దాన్ ఎనీ వన్ కెన్ డిఫైన్. ఐనా ప్రశ్న మేం తులసికి ఏమవుతాం అనేది కాదు, అసలు మా తులసికేమయ్యింది అనేది..", బాధగా చెప్పాను.

తల పరికించారావిడ," ఐ..సీ. మరి ఆరోజేమయ్యారూ?" సూటిగా అడిగారావిడ. బాధతో విలవిల్లాడిపోయాము. మావైపేచూస్తూ చెప్పసాగారావిడ "మా వాలంటీర్ కి ఒకరికి అనారోగ్యంగా వుంటే చూడడానికని వారణాశి వెళ్ళాము మేము. యూ నో అక్కడ తన బిడ్డని అదీ కేవలం మూడురోజుల పసి బిడ్డని వదిలి పచ్చి బాలింత ఒకామె హాస్పిటల్ బిల్డింగ్ మీదనుండి దూకేసింది. పాపం ఆమె దురదృష్టం తీవ్ర గాయాలతో, కొనవూపిరితో కొట్టుమిట్టాడుతోందంటూ థియేటర్ కైతే తీసుకెళ్ళారు గానీ తన పరిస్థితేం బాలేదు. దాంతో, అక్కడ కష్టం ఏదైనా చేయగలిగితే ఢిల్లీ ఎయిమ్స్ హాస్పిటల్ కి తీసుకుని వెళ్ళమన్నారక్కడి డాక్టర్లు. ఎవరు తీసుకెడతారు? తనొంటరిగావుంది. తనతో వున్నది ఆ ఇన్ఫాంట్ బేబీ మాత్రమే. తన డెలివరీ ఖర్చులు పే చేసి తన తల్లితండ్రులు కూడా వెళ్ళిపోయారట.

దాంతో వాళ్ళు వెంటనే, అక్కడే వున్నానని తెలిసి, సహారా హెల్ప్ కోసం నన్ను అప్రోచ్ అయ్యారు. సో తనని ఆంబులెన్స్ లో మాతో ఢిల్లీ తీసుకొని బయల్దేరాం. బట్ షీ కుడుంట్ మేక్ ఇట్. దారిలోనే" నిట్టూర్చారావిడ.

మా కళ్ళనీళ్ళు ఎంత ఆపుకున్నా ఆగమంటూ ధారలు కట్టాయి అప్పటికే. మావైపోసారి జాలిగా చూసి కంటిన్యూ చేసారావిడ,

"సారీ మిమ్మల్ని బాధపెట్టినందుకు. కానీ నా అనేవారెవ్వరూలేని తన పరిస్థితి చూసాను కదా ఇన్నాళ్ళ తర్వాత ఇప్పుడు మీరు తనకి చాలా క్లోజ్ అంటూ వస్తే కాస్త కోపం వచ్చింది. బట్ ఐ కెన్ అండర్ స్టాండ్. మన దేశంలో చాలామంది ఆడపిల్లలకి స్నేహితులు అని, అదికూడా ఆపోజిట్ సెక్స్ వారైతే పెళ్ళి తర్వాత ఎంత దగ్గరవారైనా సరే, హౌ ఎవర్ క్లోజ్ దే మైట్ బీ వారి జీవితాల్లో ఎంత మాత్రం చోటుంటుందో ఊహించగలను. ఇంతకీ మీరు వచ్చిన పని?" అడిగారావిడ.

కళ్ళుతుడుచుకుని వచ్చిన పని చెప్పాను.

"మనిషే పోయాకా ఇప్పుడు వచ్చి ఏం న్యాయం జరిపిస్తారు మీరు?" ప్రశ్నించింది.

నాన్న, సుందరంగారూ ప్రశ్నించిన విధానం వేరు. ఈవిడ అడుగుతున్న పద్ధతి వేరు. మా గురించి పూర్తిగా తెలిసినా. వాళ్ళే నమ్మలేకపోయారు. నిట్టూర్చి చెప్పాను "తులసి కనుక బ్రతికివుండివుంటే ఏమైనా సరే, నిజానిజాలు బయటపెట్టి తన మర్యాద నిలిపేవాళ్ళం మేడమ్.. ఎవరు నమ్మినా నమ్మకున్నా, ఎవరేమనుకున్నా తననీ, తన బిడ్డనీ మాతో తీసుకుని వెళ్ళిపోయేవాళ్ళం.

అప్పుడైతే ఎవరేమనుకున్నా పర్లేదనుకునేవాళ్ళమేమోగానీ, ఇప్పుడు తన వర్షన్ చెప్పుకోవడానికో, మరి దేనికో తను లేదు. సో ఇది తన గౌరవానికి సంబంధించిన విషయం.

మా తులసేంటో మాకు తెలుసు మేడమ్. ఏ సాక్ష్యాలూ అక్కర్లేదు. కానీ, ఇక ఇప్పుడు కేవలం మేం నమ్మితే చాలదు మేడమ్. అందరూ నమ్మాలి. అందుకే వారణాశి వెళ్తాం. తనకి జరిగిన అన్యాయాన్ని సరిచేయడానికి మా పూర్తి ప్రయత్నం చేస్తాం" ఉద్వేగంగా చెప్పాను.

మెచ్చుకోలు గా చూసారావిడ. "గుడ్ డెసిషన్ మిష్టర్ కృష్ణా! ఈ విషయంలో నేనేమైనా సాయపడగలిగితే చెప్పండి."

"హేమంగి గారూ నీడ్ ఏ స్మాల్ ఫేవర్" అడిగాను తటపటాయిస్తూ.

"చెప్పండి మిస్టర్ కృష్ణా! గో ఆన్" పొలైట్ గా రెస్పాండ్ అవుతూ అన్నారామె.

"అక్కడ ఏ డీటెయిల్స్ అడగలన్నా, లేక ఎవరితో మాట్లాడాలన్నా తులసి ఫ్రెండ్ గా ఐతే చాలా కష్టం. సో కెన్ ఐ యూజ్ ఐ మీన్, ఐ నో దట్ యామ్ ఆస్కింగ్ ఫర్ టూ మచ్. కానీ తప్పట్లేదు అందుకే" ఆగిపోయాను.

"సింపుల్ వర్డ్స్ లో మా ఆర్గనైజేషన్  పేరు యూజ్ చేసుకోవచ్చా అని అడుగుతున్నారు అంతేగా?" సూటిగా అడిగారు హేమాంగి.

మౌనంగా ఉండిపోయాను. నా మైండ్ లో ఏవేవో ఆలోచనలు పాపం తులసికి ఎలా సహించిందో అవన్నీ ఒంటరిగా నిస్సహాయంగా.

"చూడండి మిస్టర్ కృష్ణా"  అంటూ ఏదో చెప్పబోయి నా పరధ్యానం చూసి ఆగారావిడ.

తెలుస్తోంది అలర్ట్ గా వుండాలీ, అన్నీ మాట్లాడాలీ అని. కానీ.

"అర్ యూ ఓ.కే. మిస్టర్ కృష్ణా?" రెట్టించారు.

"యాహ్. వెరీ మచ్ సారీ. చెప్పండి ప్లీజ్" ఆక్వర్డ్ గా ఫీల్ అవుతూ రెస్పాండ్ అయ్యాను.

"ఫైన్ మీ వాట్సాప్ కి ఒక లెటర్ పంపిస్తాను కృష్ణా! మా వాలంటీర్ గా మిమ్మల్నిద్దర్నీ డిక్లేర్ చేసే ప్రూఫ్ అది. ఫిల్ ఇన్ యువర్ డీటెయిల్స్ అండ్ యూజ్ వేర్ ఎవర్ యూ నీడ్ ఇట్" చెప్పారు సింపుల్ గా.

"ఓహ్. రియల్లీ మెనీ థాంక్స్ మామ్. ఐ యామ్ సో గ్లాడ్. సో కైండ్ ఆఫ్ యూ", చాలా రిలీఫ్ గా ఫీలౌతూ గబగబా చెప్పాను.

"నో... నో... ప్లీజ్ డోన్ట్ మెన్షన్  కృష్ణ గారూ. ఇది నా కైండ్నెసో లేక మీకు నేను చేసే ఫేవరో కాదు, ఆ అమ్మాయి తులసి. తన కోసం నేను చెయ్యగలిగింది ఇదే. నేను చూసినంత వరకూ తులసికి అందరూ వున్నారు, ఒక పెద్ద ఫ్యామిలీ, తనేంటో తెలిసిన సొసైటీ.

బట్ తనని నమ్మి నిలబడ్డవారెవ్వరూ అక్కడ మాకు కనిపించలేదు, పోనీ, నమ్మకున్నా సరే తనున్న పరిస్థితికి కనీసం జాలి తలచైనా తనకి తోడొచ్చినవారెవర్నీ మేము చూడలేదు.. తను చనిపోయిన తరువాత మా ఆర్గనైజేషనే తన వారికి తెలియజేసి, వారు ఏమీ చెప్పకపోయేసరికి ఫైనల్ రిచువల్స్ నిర్వహించింది వారణాశిలోనే..

ఐతే, ఆ మర్నాడు, తన పేరెంట్స్ మాత్రం వచ్చి ఆమె బిడ్డని తీసుకుని వెళ్ళిపోయారు. వాళ్ళు నమ్మింది కూడా ఒకటే తను తప్పుచేసి, నిలదీస్తే ఆత్మహత్యచేసుకుందీ అని.

వెల్. నేను ట్రావెల్ చేసాను, బట్ కొద్ది గంటలు మాత్రమే తనతో ఓ అంబులెన్స్ లో. వారణాసి నుండి ఇక్కడ హాస్పిటల్ కోసం తన లాస్ట్ బ్రెత్ నా ముందే వదిలింది. షీ కుడ్ హార్డ్లీ సే ఫ్యూ వర్డ్స్.

'మై బేబీ ఈజ్ సఫరింగ్ విౌట్ అవర్ ఫాల్ట్' తన డెత్ స్టేట్మెంట్ అనుకోండి, చివరి మాటలనుకోండి, అంతే తన మాటలు ఎందుకో నమ్మాలనిపించింది. చాలామందితో డీల్ చేస్తాం తెల్లవారితే నిజానికీ, కల్పితానికీ తేడా అర్ధమౌతుంది. తను అబద్ధం చెప్పట్లేదని అర్థమైంది. కానీ, అది నిజమని ప్రూవ్ చేసే సాక్ష్యం ఏంటీ? అని తరచిచూసే ప్రయత్నం చేయలేదు. అందర్లా ఏంజరిగిందో ఏమోలే అనుకోలేకపోయాను.. బేబీ డీ.ఎన్.ఏ. చేస్తే సరిపోయేది కదా అనిపించింది.

కానీ ఐ కుడ్ నాట్ డూ మచ్ ఫర్ హర్. ఐ ఫీల్ గిల్టీ. ఐనా ఒక చనిపోయిన అమ్మాయికి జస్టిస్ ఇప్పించడంకోసం ఎక్కువ ఫైట్ చేయలేకపోయాం.

మా దగ్గర క్షణక్షణానికీ అటెండ్ చేయాల్సిన కథలూ, వ్యధలూ చాలా వుంటాయి. ఒకరు కాగానే, ఒకరు, ఎందరో. సో వీ గేవ్ ఇట్ అప్ ఆఫ్టర్ ది బేసిక్ ప్రోబ్.. ఐ స్టిల్ ఫీల్ గిల్టీ ఫర్ దట్..

మాకు సహకరించేవారికంటే హేళన చేసేవారే ఎక్కువమందున్నారు. మాటలు చాలామంది మాట్లాడతారు, కానీ సహాయం అడిగితే తప్పుకుంటారు,

కానీ, అంత దూరంనుంచి స్నేహితురాల్ని నమ్మివచ్చి, తన మరణానికో గౌరవం ఇవ్వాలనుకుంటున్న మీ ఇద్దర్నీ చూస్తే , చాలా ధైర్యం వస్తోంది.., ఇంకా ఈ లోకంలో కాస్తంత మానవత్వం మిగిలే వుందీ అని..,

అందులోనూ బహుశా అన్ని బంధాలకంటే.. స్నేహమే అన్నింటికంటే గొప్ప బంధమనే మాట నిజమేనని కూడా అర్థమవుతోంది..

ఎనీవేస్ ఎమోషన్స్ ఎపార్ట్. విషయానికొస్తే కేవలం సహారా ఐడీ మాత్రమే కాదు, మీకు ఏ సపోర్ట్ కావాలన్నా, ఏదైనా, మా సహారా మీవెంట వుంటుంది. మా దగ్గర వున్న వరకూ డీటెయిల్స్ తో ఫైల్ కాపీ నా అసిస్టెంట్ మీకు ఇస్తుంది. గో ఎహెడ్, హోప్ మీరు అనుకున్నది జరగాలి. ఆల్ ద బెస్ట్" చెప్పారు లేచి నిలబడి, మా హ్యాండ్ షేక్ చేస్తూ.

మేము కాకుండా తులసినీ, తన మాటనీ నమ్మిన మరో వ్యక్తికి సగౌరవంగా నమస్కరించి, అక్కడనుంచి భారంగా కదిలాము.

షీ ఈజ్ రైట్. వీ హేవ్ ఎ లాంగ్ వే టూ గో.

వారణాశి. బెనారస్.కాశీ. ఏ పేరుతో పిలిచినా మనందరి కలియుగ కైలాసం. భూలోకంలో శివలోకం. ఇక్కడి గంగలో మునిగితే పురుగు కూడా పునీతమవుతుందంటారు. పచ్చి కసాయికూడా పరమపవిత్రుడౌతాడంటారు.

హిందువైపుట్టిన ప్రతివారూ తమ జీవితంలో ఒక్కసారైనా అడుగుపెట్టాలని కోరుకునే ప్రదేశం. ఇక్కడి గాలి-ధూళి తాకినా చాలు మహా పుణ్యమనుకునే ప్రాంతం..

ఈ చోటు. మా తులసి మెట్టినిల్లు. తన సుఖ-సంతోషాలూ, కష్టాలూ-కడగళ్ళూ.. అన్నీ తనలో దాచుకుని, చివరికి మా తులసినీ తనలోనే కలిపేసుకున్న చోటు.

ఇంకా చీకట్లు విచ్చుకోని వేకువలో గంగ వడ్డున నిలబడి చూస్తున్నాను. చిన్నచిన్న అలలుగా పరవళ్ళుతొక్కుతూ గలగలా ప్రవహిస్తున్న ఆ నదినే చూస్తున్నాను.గంగని నేలకు తేవడానికి భగీరథుడు చేసిన విశ్వప్రయత్నం గురించి ఎప్పుడో, చిన్నప్పుడు టి.టీ.డీ. వాళ్ళ చిన్న పుస్తకాల్లో చదివిన కథ గుర్తొచ్చింది..

ఇప్పుడు ఈ నా చిన్ని పరిధిలో నేను చేయబోయేదీ భగీరథ ప్రయత్నమే.. ఫలిస్తుందో లేదో కాలమే సమాధానం చెప్పాలి..

నామనసంతా చిత్రమైన ఎమోషన్స్ తో నిండిపోయింది..

ఎంత చిత్రమైనదో కదా ఈ మనిషి మనుగడ.. సాధ్యం కాదని తెలిసినా కాలంతో వెనక్కి పరిగెట్టుకుని వెళ్ళిపోవాలనీ.., అలా వెళ్ళి ఏవేవో చేయాలని అనిపిస్తోంది..

అప్పుడు అలా ఎందుకు చేసాను..! ఇలా ఎందుకు చేసానూ..!, ఆ నిర్ణయం తీసుకుని వుంటే బాగుండేది..., ఈ డెసిషన్ తీసుకోకుండావుంటే బాగుండేది.. ఒకటా రెండా ఎన్ని ఆలోచనలు..!

ఐనా మతిలేని యోచనగానీ, పయనిస్తున్న ఆ నది ఎన్నడైనా వెనుదిరుగుతుందా.. మరి ఈ జీవితం వెనక్కి ఎలా వెళ్తుంది...!!

..కృష్ణా..!! ఎందుకీ ఆలోచనలు.. వదిలేయ్.. అంటూ మనసుని మందలించుకుని అక్కడినుండి కదిలాను.

ఓ విశాలమైన బిజీ వీధి అది. ఓవైపు చీరలు, అందమైన వస్తువులూ అమ్మే షాపులూ, మరోవైపు ఇళ్ళూ. ఆ స్ట్రీట్ లోకెల్లా పెద్ద ఇంటి ముందు ఆగాం. మా తులసి మెట్టినిల్లిది. ఇక్కడ ఎవరిని కలవాలో, ఏం మాట్లాడాలో ఖచ్చితమైన ఆలోచన ఏదీ తెలీదు. వారితో మాట్లాడాలి అంతే.

ఇంటి అరుగుమీద కూర్చుని పూజపాత్రలని శుభ్రం చేస్తున్నాడో వ్యక్తి. తటపటాయింపుగా అడిగాను, "జగదీష్ నాథ్ ని కలవాలి" అంటూ హిందీలో.

తలెత్తి విచిత్రంగా చూసి "ఎవరు మీరు? ఏం పని? పత్రికలవాళ్ళా? పోలీసులా? బంధువులా?" అంటూ తిరిగి ప్రశ్నించాడు.

అతనివైపు సూటిగా చూసి, "మీరు జగదీష్ జీయా ?" అడిగాను.

నా మాటలో భావం అర్థమైనట్టుంది, కాదన్నట్టు తల అడ్డంగా తిప్పి, "నాతో రండి" అంటూ లేచి లోపలికి నడిచాడు.

అతని వెంట లోపలికి నడిచాము. మనసంతా ఏదో బరువెక్కిన ఫీలింగ్. ఎదురుగా ఓ పెద్దాయన కూర్చుని ఏదో గ్రంథం చదువుకుంటున్నారు. బహుశా తులసి మామగారు అయివుండవచ్చు. మాతో వచ్చిన వ్యక్తివైపు చూసి, "ఎవరువాళ్ళు?" అన్నట్టు సైగచేసారు.

"జగదీష్ భయ్యా కోసం వచ్చారు" చెప్పాడతను.

"ఎవరు మీరు" మావైపు చూసి అడిగారాయన.

"మేము సహారా అనీ" మా మాట పూర్తికాకుండానే చేతి పక్కనవున్న రాగిచెంబు తీసి, మమ్మల్ని తీసుకొచ్చిన వ్యక్తివైపు విసిరికొట్టాడాయన.

"ఎన్...ఎన్నేళ్ళనుంచి పనిచేస్తున్నావు రఘూ ఇక్కడ. ఎవర్ని లోపలికి తీసుకురావాలో, ఎవర్ని గుమ్మం దగ్గర్నుంచే తరిమేయాలో తెలీదూ?" అంటూ నరాలు చిట్లిపోయేంత గట్టిగా అరిచారు. ఆయన ముఖంలో ఎరుపు, కళ్ళల్లో రౌద్రం చూసి మాకు మతిపోయింది.

షాకింగా చూసాం. అయినా ఇక్కడ మా మొదటి వెల్ కం ఇంతకంటే బెటర్ గా ఏమీ ఎక్స్ పెక్ట్ చేయలేదు నేను. శాస్త్రి అంకులే మమ్మల్ని దగ్గరికి రానీయలేదు. ఇక వీళ్ళు రానిస్తారా. ఏది ఏమైనా కంగారు పడి పారిపోవడానికి కాదుగా మేమొచ్చింది!.

"నమస్తే మీరు అపార్థం చేసుకున్నారు. మేం మిమ్మల్ని ఇబ్బంది పెట్టడానికి రాలేదు" అంటూ నెమ్మదిగా చెప్పబోయాను.

ఆలోపే ఆయన పక్కనున్న స్తంభం ఆసరాగా లేచారు. రఘు అన్న సదరు క్యాండేట్ పరుగున వెళ్ళి, ఆయన చేతికి సపోర్టింగ్ స్టిక్ అందించాడు. కాలు ఫ్రాక్చర్ అయినట్టుంది. లేకపోతే పరుగున వచ్చి మమ్మల్ని చంపేసేవాడే అన్నట్టుందాయన చూపు.

అంతలో "ఎవరూ?" అంటూ వినపడింది మా వెనకనుంచి.

చప్పున తిరిగి చూసాము. ఓ పాతిక, ముప్పై ఏళ్ళ యువకుడు రెండు చేతుల్లో ఏవో బరువైన సంచులతో లోపలికి వస్తున్నాడు. అతడు జగదీష్ కాదు. సుందరం అంకుల్ దగ్గర తులసి పెళ్ళి ఫొటో చూసాను నేను బహుశా అతని తమ్ముడైవుండొచ్చు. పోలికలున్నాయి. తులసి మరిది.

"మీరు?" అని నేను అడుగుతుంటేనే చెప్పారాపెద్దాయన కోపంగా "సహారానుంచటరా" అంటూ తెలుగులో.

"నమస్తే మేము జగదీష్ గారితో కొంచెం మాట్లాడాలి. ప్లీజ్. మేం మిమ్మల్ని ఇబ్బంది పెట్టడానికి రాలేదు" రిపీట్ చేసాను పారట్ లాగా, ఫర్ ఎ ఛేంజ్ తెలుగులో.

అతను అదోలా చూస్తూ, "నాన్నా మీరు లోపలికి వెళ్ళండి రఘూ" అన్నాడు కాస్త ఖంగుమనే గొంతుకతో గట్టిగా తీసుకెళ్ళమన్నట్టు చూస్తూ మమ్మల్ని తినేసేలా చూస్తూనే, రఘు సాయంతో ఆ పెద్దాయన లోపలికి నడిచారు.

"కూర్చోండి" అనిచెప్పి అతను లోపలికి వెళ్ళి చేతిలోవున్న సంచులు లోపల పెట్టిడానికో, లేక తండ్రితో మాట్లాడడానికోగానీ లోపలికి వెళ్ళాడు.

చుట్టూ చూసాను, విశాలమైనలోగిలి. గోడలమీద పెద్దపెద్ద ఫ్రేముల్లో రకరాకాల దేవుళ్ళ పటాలు, ఇంటిపెద్దల ఫొటోలు, వాటి మధ్య ఓ పెద్ద ఫ్రేమ్ లో వారి ఫ్యామిలీ ఫొటోలు. అన్ని నిండివున్నాయక్కడ. అంతలో సతీష్ నాథ్ తిరిగిరావడంతో, వెళ్ళి మాకు చూపిన కుర్చీలో స్థిరపడ్డాను.

మా ఐడీ చెక్ చేసాకా ఎదురుగా వున్న ఛైర్లో కూర్చుంటూ, "చూడండి, జగదీష్ అన్నయ్య ఇక్కడలేడు. వున్నా మీతో మాట్లాడడు. మీకు కావలిసిన వివరాలన్నీ ఇదివరకే తీసుకుపోయారు కదా. మళ్ళీ ఏంటి?" కాస్త విసుగ్గా అడిగాడు.

"మేము ఈ కేస్ కి సంబధించిన క్లోజింగ్ రిపోర్ట్ చేయాలి. మాదగ్గర పూర్తి డీటైల్స్ లేవు వున్న కొద్దిపాటి వివరాలన్నీ మీ అక్క భర్త ఇచ్చినవే. బట్ మేము జగదీష్ తో, ఇక్కడవుండే ఇంట్లోవాళ్ళతో మాట్లాడాలి"

"మీరేమన్నా మాట్లాడాలనుకుంటే సీ.ఐ. చౌదరిగారితో మాట్లాడచ్చు. ఆయన చెప్తారు మీకు కావలసినన్ని వివరాలు. లేదంటే సాయంత్రం టీటైమ్ కి రమ్మని చెప్తాను"వ్యంగ్యంగా చెప్పాడతను.

తలవూపాను, 'మాకు సీ.ఐ. చౌదరిగారు చాలా క్లోజ్, సో బెటర్ బీ కేర్ ఫుల్ వైల్ క్వశ్చనింగ్' అన్న అతని హింట్ అర్థమై నవ్వొచ్చింది.

"తప్పకుండా సతీష్ ముందు మీతో మొదలుపెట్టి, తర్వాత ఆయన దగ్గరికీ వెళ్తాం. షల్ వి స్టార్ట్?" చురుగ్గా చెప్పాను.

కోపంగా చూసాడు, "ఏం మాట్లాడతారు. చూసారుగా నాన్న ఎంత డిస్టర్బ్ గా వున్నారో. అమ్మ మంచంలోవుంది, ఇక అన్నయ్య" అంటూ బాధగా ఆగిపోయాడు. చూసాను తులసి భర్తగురించి ఏమైనా చెప్తాడేమోనని. అతను మౌనంగా వుండిపోయాడు.

ఇక తప్పక మొదలుపెట్టాను "మాకు మీ పరిస్థితి అర్థమౌతోంది, వీ డూ అండర్ స్టాండ్ యువర్ పెయిన్ మిస్టర్" ఆగాను. "సతీష్ నాథ్" తన పేరు అందించాడతను.

"ఓ ఎస్.. ఎస్.., సారీ ఐ ఫర్గాట్ మిస్టర్ సతీష్. కానీ మా డ్యూటీ మేమూ చేయాలి కదా. ఒకవేళ నిజంగా మీరు చెప్పినట్టుగా మీరే నష్టపోయివుంటే ఆ విషయం మా రిపోర్ట్ లో మేమేమీ దాచము" మృదువుగా చెప్పాను.

"నాన్సెన్స్ మీ విమెన్స్ వెల్ఫేర్ వాళ్ళ గురించి బాగా తెలుసు. చాలా చూశాం మీలాంటి వాళ్ళని, ఏం పని మీకు? ఒక్క కాంట్రోవర్షియల్ కేసు దొరికితే పబ్లిసిటీ కోసం వదలరు కదా" హేళనగా అన్నాడు.

చివ్వున తలెత్తాను, హేమాంగిగారు గుర్తొచ్చారు, తులసి గుర్తొచ్చింది. సహారా ఫౌండేషన్ సంరక్షణలో వున్న వందలమంది ఆడవారు, చిన్నపిల్లలూ గుర్తొచ్చారు.

"ఏం చూసారు సతీష్? కాస్త మాక్కూడా చెప్తారా? ఓ సంస్థలో ఎంతమంది ఆడవారూ, చిన్నపిల్లలూ తలదాచుకున్నారో చూసారా? లేక వారికైన శారీరక, మానసిక గాయాలనీ, వాటితో వారు పడే నరకవేదననీ చూశారా?

లేక ట్రీట్మెంట్ లో వారు పడే బాధని చూసారా, వైద్యానికయ్యే ఖర్చునీ, వారి కోసం, వారి తిండి, వసతి–వైద్యాల కోసం, అక్కడి పసివారి చదువులకోసం, అనాధల బ్రతుకులకోసం ఆ సంస్థలు పడే తపనా, చేసే సేవా ఏ ఒక్కటన్నా చూసారా? ఏం చూసారని మాట్లాడుతున్నారు?

ఎవరో కొంతమంది సోషల్ కాజ్ ని కూడా కమర్షియలైజ్ చేసే బ్రూట్స్ ని దృష్టిలో పెట్టుకుని హౌ కెన్ యూ బ్లేమ్ ఆల్?" ఆపకుండా మాట్లాడి కాస్త ఊపిరి తీసుకోవడానికి ఆగి సతీష్ వైపు చూసాను. స్టన్నింగ్ గా నా వైపే చూస్తున్నాడతను నోటమాటరానట్టు.

"ఆడవారి పట్ల అన్యాయం చేస్తే సమాజం వూరుకోదు అనే భయం అందరిలోనూ కలిగిన రోజే అలాంటివి జరగకుండా వుంటాయి. కొందరు నష్టపోయినా అవసరం సతీష్. ఆ పబ్లిసిటీ, కనీసం పరువు భయానికైనా కొందరు ఆగుతారేమో? ఐనా కాంట్రోవర్షియల్ కేసులకి పబ్లిసిటీ ఇస్తే తప్పేముంది? లేదంటే ఎవరు పరిగెట్టి వెళ్ళి అలాంటి సంస్థలకి సహాయం చేస్తారూ, విరాళాలిస్తారు చెప్పండి..? అసలు మీ ఫ్యామిలీ ఇన్వాల్వ్ అయ్యేవరకూ అలాంటి సంస్థ ఒకటుందని మీకు తెలుసా? " అడిగాను సూటిగా. తల అడ్డంగా తిప్పాడు.

"నాకూ తెలియదు మొన్నటివరకూ ఇలాంటి సంస్థలు, అంత చురుగ్గా పనిచేసేవి కూడా వున్నాయి ఇండియాలో అనీ అసలూ" ఆల్మోస్ట్ ఆ సెంటెన్స్ నా నోరు జారేవరకూ, శ్యామ్ పాదం ఖస్సున నా కాలు తొక్కేవరకూ ఆవేశంగా మాట్లేడేసిన నేను చప్పున ఆగిపోయాను.

అప్పటికే జరగాల్సినది జరిగిపోయింది. నోరు జారకుండా వుండడానికి నేనేమైనా ప్రొఫెషనల్ ఇన్వెస్టిగేటర్నా! సతీష్ తెలివైనవాడే వెంటనే పట్టేసాడు.

"అంటే, సహారా గురించి మీకు ఈ కేసుతోనే తెలిసిందా? మరి సహారా మెంబర్ని అన్నారు?" అనుమానంగా చూస్తూ అడిగాడు.

డామ్. దొరికిపోయానా? మొదటే మొత్తం పాడుచేసానా? లిప్తపాటులో చాలా స్పీడ్ గా సర్దుకున్నాను. నా క్రైసిస్ మేనేజ్మెంట్ స్కిల్స్ ఎందుకున్నాయి. అవన్నీ వాడకపోతే ఎలా? వెంటనే చెప్పాను "లేదు, ఒక పర్సనల్ ఇష్యూలో నాకూ మీలాగా ఎక్స్పీరియన్స్ వచ్చేవరకూ ఇలాంటి సంస్థల గురించి తెలియలేదూ అని చెప్తున్నాను. ఆ తర్వాతే వారి వర్క్ నచ్చి, మెంబర్నయ్యాను."

కాస్త ఆగాడు నా సమాధానంతో. అయినా శంకగా చూస్తూ, "మీరు ఇండియాలో వుండరా? ఈ సహారా అబ్రాడ్ లో కూడా వుండేంత పెద్ద సంస్థ కాదుగా..!"అడిగాడు.

"ఎస్.. ఐ యామ్ ఫ్రమ్ యూ.ఎస్. నా పర్సనల్ పని మీద వచ్చి, ఇక్కడే ఆగిపోయాను. వాలంటీర్ గా వుండిపోయాను" సగం నిజాన్ని, సగం అబద్ధంతో జోడిస్తూ చెప్పాను.

తలూపాడు సందిగ్ధంగానే. అతను మరో ప్రశ్న సంధించేలోపలే నేను అలర్ట్ అయిపోతూ సీరియస్ గా చూస్తూ చెప్పాను, "ఇక్కడ ఇష్యూ నా వివరాలది కాదనుకుంటా మిస్టర్ సతీష్. మీ వివరాలది, సో మీరు అవి ప్రొవైడ్ చేస్తే బాగుంటుంది. మా గురించి మీకింకేమన్నా తెలుసుకోవాలని వుంటే ఇక్కడే పక్క గల్లీలోనే హొటల్లో దిగాము, కావాలంటే ఇంకో రోజు మీరు అక్కడికి వస్తే నా బయోడేటా గురించి తీరిగ్గా మాట్లాడుకుందాం.

బట్, నేను ఇప్పుడు పని మీద వచ్చాను. ఇక్కడ అయ్యాకా నేను మీట్ అవ్వాల్సిన వారు చాలామంది వున్నారు, మీ చౌదరిజీ తో సహా. వారందర్నీ వెయిట్ చేయించలేను కదా..!!"

"సారీ. అడగండి" కాస్త తగ్గుతూ చెప్పాడు.

శ్యామ్ వైపు చూసాను. దొరికిపోయాం అనుకున్నాడేమో, సడెన్ గా నా డైలాగ్స్ తో సీన్ మా వైపు తిరిగి సతీష్ కాస్త తగ్గేసరికి నమ్మలేనట్టు చూసాడు.

వాడి చూపులు పట్టించుకుండా చెప్పాను గంభీరంగా, "టేక్ డౌన్ ద పాయింట్స్ శ్యామ్" చప్పున తన బ్యాగ్ లోంచి నోట్ ప్యాడ్ తీసి రాసుకోవడానికి పెన్ బయటికి తీసాడు.

"అసలేం జరిగింది?" అడిగాను. అయోమయంగా చూసాడు. నా ప్రశ్నలో క్లారిటి లేదని అర్థమై సర్దుకుంటూ అడిగడం మొదలుపెట్టాను.

"మీ బ్రదర్ జగదీష్ గారి పెళ్ళి ఎప్పుడైంది?"

"ఆరేళ్ళ క్రితం"

"ప్రేమ వివాహమా?"

"కాదు అమ్మా, నాన్నా చూసిందే."

"తులసి.. తులసిగారిని బాగా చూసుకునే వాడా?" అడిగేసాను.

తులసి పేరు మొదటిసారి నా నోటివెంట రాగానే సతీష్ తలెత్తి చూసి వెంటనే దించేసుకున్నాడు. కాకపోతే, అది నెగెటివ్ రియాక్షన్ కాదని కాస్తంత చెమర్చిన అతని కళ్ళు చెప్పాయి..

"మ్.. బానే వుండేవారు" అనీజీ గా కదులుతూ జవాబిచ్చాడు.

"ఇంట్లో ఏమైనా గొడవలు, కట్నం సమస్యలూ, అత్తాకోడళ్ళ గొడవలూ, లేక ఇంకేమన్నా అప్పుల బాధలూ.. వగైరా.. ఏమైనా వున్నాయా?"

"లేవు ఏ గొడవలూ, సమస్యలూ లేవు, అందరం క్లోజ్ గానే వుండేవాళ్ళం, అక్కల పెళ్ళిళ్ళు కూడా మానాన్న వాళ్ళకోసం చిన్నప్పట్నుంచీ దాచిన డబ్బుతోనే జరిగింది. అప్పులు కూడా ఏమీలేవు. మా అన్నదమ్ములిద్దరి పెళ్ళిళ్ళకీ కూడా

కట్నాలు తీసుకోలేదు" యాంత్రికంగా చెప్పాడు, బహుశా పోలీసులూ, జర్నలిస్టులూ, చాలామంది అడిగీ, అడిగీ వున్న ప్రశ్నలేమో.

"మీ బ్రదర్ ఏం చేసేవారు?"

"ఈ వివరాలన్నీ మీ రికార్డ్స్ లో ఆల్రెడీ"

"వున్నాయి. కానీ టాలీ చేయడం మా పని, ప్లీజ్ చెప్పండి" అతని మాటలు కట్ చేస్తూ చెప్పాను.

"పూజా కమ్ జనరల్ స్టోర్స్ వుంది. గుడి దగ్గర్లోనే. అది చూసుకునే వాడు, ఎప్పుడైనా నాన్నగారికి కుదరనప్పుడూ, బాగా రద్దీ వున్నప్పుడూ పౌరోహిత్యానికి కూడా వెళ్ళేవాడు" చెప్పాడు.

"ఐతే ఆదాయం బానే వుంటుంది కదూ? ", చాలా మామూలుగా అన్నాను.

విసుగ్గా తలూపాడు. శ్యామ్ కూడా మళ్ళీ ఏం తప్పు మాట్లాడతానో అన్నట్టు అనుమానంగా చూసాడు.

"మరి వేరే చోటికి వెళ్ళి బిజినెస్ చేయాలన్న ఆలోచనకి కారణం ఏంటి?" వెంటనే అడిగాను.

"అన్నయ్యకి ఇంట్రస్ట్" అభావంగా జవాబిచ్చాడు.

"సొంత ఇల్లు, షాపు, మంచి ఫ్యామిలీ, మంచి ఆదాయం, ఏ సమస్యలూ లేవు. మరి ఎవరైనా కోరుకునేవివే కదా? మరి ఎందుకు వెళ్ళాడో తెలుసుకోవచ్చా?" అడిగాను.

"చాలామంది అన్నీ వున్నా అమెరికాలూ, ఆస్ట్రేలియాలూ ఎందుకు వెళ్తారు? మీరూ యూ.ఎస్ నుండేగా వచ్చారు మిమ్మల్ని మీరే వేసుకోండి ఆ ప్రశ్న" విసురుగా అన్నాడు.

మౌనంగా వుండిపోయాను. రివ్వున మనసులోతుల్లో నా గతం లీలగా కదిలిన నొప్పి.

"కాస్త సరిగ్గా సమాధానం ఇవ్వండి సతీష్" చెప్పాడు శ్యామ్.

తెలుసు. నా నిశ్శబ్దాన్ని కూడా చదవగలిగినది ఇద్దరే తులసి, శ్యామ్!

మమ్మల్నొదిలేసి ఎందుకలా వెళ్ళిపోయావు తులసీ. తలవిదిల్చాను. తులసి లెటర్ గుర్తొచ్చింది. నా కర్తవ్యం గుర్తొచ్చింది.

"అన్నయ్యకి ఏదైనా డిఫ్రెంట్ బిజినెస్ సెట్ చేయాలనే కల వుండేది. అందుకే ఇంట్లో ఎవ్వరికీ ఇష్టం లేకపోయినా అది నెరవేర్చుకోవాలని వెళ్ళాడు" చెప్పాడతను శ్యామ్ వార్నింగ్ తో కాస్త క్లియర్ గా స్ట్రెయిట్ గా.

తలలూపాం అర్ధమైందన్నట్టు. ఇంక మరీ ఎక్కువ లాగకుండా త్వరత్వరగా అసలు విషయం తెలుసుకోవాలి.

అదే అతి కష్టమైన ఘట్టం. తులసి గురించి, జరిగిన ప్రాబ్లం గురించి.

నా ఫీలింగ్స్ పక్కకి పెట్టి వీలైనంత ప్లైన్ ఫేస్ తో అడిగాను"మీ.. మీ వదిన గారు, మిసెస్ జగదీష్ ఆవిడ గురించి చెప్పండి. అంటే తన నేచర్, బిహేవియర్"

"వదిన కాదు. మిసెస్ జగదీష్ అంతకంటే కాదు. తులసి. ఆమె పేరు తులసి" కళ్ళల్లో బాధ, కోపం స్పష్టంగా తెలుస్తుంటే చెప్పాడు.

మళ్ళీ తనే తిరిగిమొదలు పెట్టాడు. " అయినా ఏం చెప్పాలి. నాకు ఎక్కువ తెలియదు, నేను చూసినంతవరకూ నాకు ఏ తేడా కనిపించలేదు. తను వెళ్ళాకా కూడా ఏరోజూ మాకు అనుమానం కూడా రాలేదు. అన్నయ్య వచ్చి చెప్పేంతవరకూ" అంటూ కసిగా అన్నాడు.

కన్ఫ్యూజ్డ్ గా చూసి, నా ఫైల్లోంచి పాత న్యూస్ పేపర్ కటింగ్స్ తీసాను.

భర్త బిజినెస్ పని మీద పొరుగూరు వెళ్తే, ఇంట్లోవారిని ఏమార్చి ఎవరితోనో వెళ్ళిపోయిందనీ, దాదాపుగా ఏడాదిన్నర తర్వాత నిండు గర్భిణిగా తిరిగొచ్చిందనీ రాసారు.

దాంతో ఇంట్లోవాళ్ళూ, కులపెద్దలూ గొడవ చేసి, నిలదీసేసరికి అక్కడే కుప్పకూలిపోయిందనీ, వెంటనే చాలా సినిమాటిక్ గా అక్కడే నొప్పులు రావడంతో హాస్పిటల్ కి తీసుకెళ్ళారనీ, ప్రసవించిన మూడోరోజే హాస్పిటల్ బిల్డింగ్ మీదనుండి దూకి స్యూసైడ్ చేసుకునే ప్రయత్నం చేసింది, సేవ్ చేయడానికి డాక్టర్లు విశ్వప్రయత్నం చేసినా బ్రతకలేదనీ రాసివుంది అందులో.

"మరి ఇదేంటి? ఏడాదిపాటు ఆమె ఇక్కడా లేక, తన దగ్గరా లేకపోతే మీ అన్నయ్య, ఎప్పుడో సంవత్సరం తర్వాత రియాక్టై, గొడవచేయడం ఏమిటి? సంథింగ్ ఫిషీ. కాస్త ప్రాపర్ గా అర్థమయ్యేలా చెప్పండి సతీష్" అడిగాను.

"ఫిషీ కాదు సర్. ట్రిక్కీ. ఆవిడ మమ్మల్నందర్నీ గాడిదల్ని చేసింది. అన్నయ్య మాఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయాడు బిజినెస్ కోసం. కేవలం తనని మాత్రమే నమ్మి, తనకు మాత్రమే చెప్పి.

కానీ, తను.. ఆమె కూడా మాకు సర్దిచెప్పినట్టే చెప్పి, అన్నయ్యని ఒప్పించి తిరిగితీసుకొస్తానని చెప్పి, వాడు వెళ్ళిన కొద్దిరోజులకే వెళ్ళిపోయింది. అక్కడి నుండి ఒకట్రెండు ఫోన్లుకూడా చేసింది వాడిని నెమ్మదిగా ఒప్పించి తీసుకొస్తానంటూ ఎన్నో తియ్యని కబుర్లు కూడా చెప్పింది.

కానీ, చివరకి నా పెళ్ళిరోజువరకు కూడా అన్నయ్య రాకపోయేసరికి మాకు చాలా బాధేసింది. పెళ్లికి వచ్చిన ఆమె తల్లితండ్రులు కూడా బాగా బాధపడ్డారు.

సంవత్సరంగా ఆమె తమవద్దకు రాలేదనీ, ఎప్పుడైనా ఫోన్లు మాత్రమే చేసేదనీ, కనీసం పెళ్ళిలోనైనా కూతుర్నీ, అల్లుడినీ చూద్దామనుకున్నామనీ చెప్పారు. దాంతో అన్ని రోజులుగా మాట్లాడని అన్నయ్య గురించి భయం వేసింది, ఏ సమస్యల్లో ఐనా ఇరుక్కున్నారేమో, మా దగ్గర దాచిపెట్టి అన్నావదినలిద్దరూ సఫర్ అవుతున్నారేమో అని కంగారు పడ్డాం. ఏం చేయాలో పాలుపోలేదు, అందుకే అన్నయ్యకోసం మేమే రామ్ గడ్ వెళ్ళాలనుకున్నాము.

ఓపక్కన పెళ్ళి. మరోపక్క అన్నయ్యగురించి కంగారూ. కానీ, పెళ్ళి తతంగం, వ్రతం ముగిసాకే బయల్దేరాలనీ, అలా పూర్తికాకుండా వెళ్తే మంచిదికాదని కొందరు పెద్దలు చెప్పారు. కనీసం, వేరే ఎవర్నైనా పంపుదాం, మేం కాకపోయినా అని ఆలోచించేంతలోపు అంతలో మా అన్నయ్య ఒక్కడే తిరిగొచ్చాడు, వ్యాపారంలో సెటిలయ్యానని చెప్పడానికి సగర్వంగా. నా పెళ్ళైందని తెలిసి నివ్వెరపోయాడు. ఆసంగతే తనకి తెలీదన్నాడు.,

తులసి తనతో లేనేలేదనీ, తాను పిలవలేదనీ, ఏనాడూ తన దగ్గరకి రాలేదనీ చెప్పాడు. అన్నినాళ్ళలో ఏరోజూ తనతో కనీసం ఫోన్ లో కూడా మాట్లాడలేదనీ చెప్పాడు. తాను అన్నాళ్ళుగా వున్నది రామ్ గడ్ కాదూ మాతా టేక్డీ అని చెప్పాడు''

**మాకేమీ** అర్థం కాలేదు. ఏదో జరుగుతోందని అనుమానం వచ్చింది. పోనీ పూర్తిగా మాయమైపోతే వేరే విషయం, మాతో ఫోనుల్లో మాట్లాడుతుంది. అన్నయ్య వ్యాపారం గురించి చెప్తోంది. ఏదో తేడా ఐతే వుంది అనుకున్నాం. కానీ, పోలీస్ రిపోర్ట్ ఇస్తే పరువు పోతుంది కదా అనే తర్జనభర్జనల్లో మేముండగానే, హఠాత్తుగా మా చుట్టాలలో ఒకరు, రామ్ గఢ్ దగ్గర ఓ గుడి ఉత్సవంలో ఎవరితోనో ఆమెని చూసామనీ, ఆ జనంలో వెళ్ళి పలకరించేలోపు కనిపించకుండా పోయిందనీ, మా పెదనాన్నగారికి తెలియజేసారు.

ఆమెకేమీ జరగలేదనీ, తను కావాలనే వెళ్ళిపోయిందని మాకు నెమ్మదిగా అర్థమవ్వసాగింది. అన్నయ్య పిలిచాడంటూ తను చెప్పడమొక మోసం, అలా వెళ్ళిపోవడమే కాకుండా మధ్యమధ్యలో ఫోన్స్ చేస్తూ మావాళ్ళతో టచ్ లో వుండడం అంతా ఒక నాటకం తల తిరిగిపోయిందందరికీ ఆ మోసానికి.

అంతలో. ఎవ్వరూ వూహించని విధంగా, మేమింకా ఆ షాక్ లో వుండగానే, తులసి టాక్సీ దిగింది. నిండు గర్భిణిగా, చాలా నిబ్బరంగా. అందరం నివ్వెరపోయామామె తెగింపుకి.

ఏ ధైర్యంతో ఆమె అలా, ఇక్కడికి వచ్చిందో నాకింతవరకూ అర్థం కాలేదు. అంతవరకూ ఆమె గర్భవతి అనే విషయం మాకే కాదు, ఆమె తల్లితండ్రులకు కూడా తెలియదు. ఇట్ వాజ్ ఏ బిగ్ షాక్.

ఇదేమిటని అన్నయ్య నిలదీస్తే ఆబిడ్డ అతని బిడ్డేననీ, అతడే తప్పుగా చెప్తున్నాడంది. అన్నయ్య బాధకీ, కోపానికి అంతులేదు.

దాంతో చాలా పెద్ద గొడవైంది. అప్పటికప్పుడు కుల పెద్దల పంచాయితీ కూడా జరిగింది. అందరూ నిలదీసారు. అన్నయ్యవంక చూసిందే తప్ప నోరు విప్పలేదు.

వారు ఆమెని కులంనుంచి వెలేసారు. మా కుటుంబాన్ని, తరతరాలుగా ఆలయాన్నే నమ్ముకున్న మా అందర్నీ ఆలయసేవ నుండి తొలగించారు. మమ్మల్ని కొన్ని తరాలపాటు ఏ గుడి సేవకీ అర్హులం కాదని తీర్మానించారు.

అంతలో నొప్పులు రావడంతో ఆమెని హాస్పిటల్ కి తీసుకుపోతే బిడ్డని కని, ఆ వెంటనే ప్రాణం తీస్కుంది. ఇక వార్త టీవీలకీ, పేపర్లకీ ఎక్కింది. నలుగురూ నానా విధాలుగా మాట్లాడారు.

అలా అప్పటి వరకూ ఇక్కడ చుట్టుపక్కల మాత్రమే అల్లరైన మేము దాదాపుగా జిల్లా మొత్తం, కులం మొత్తం అల్లరయ్యాము. పరువుకంటే ముఖ్యంగా మోసపోయాము. మా కుటుంబసభ్యురాలి చేతిలోనే ఘోరంగా మోసపోయాము. తనకి ఇష్టంలేకుంటే చెప్పాల్సింది, లేదా తిరిగి రాకుండావుండాల్సింది. అంతేగానీ అంత మోసం అవసరంలేదు. అదే అదే మమ్మల్ని దారుణంగా క్రుంగదీసింది."

మాట్లాడ్డం ఆపి జేబులోంచి కర్చీఫ్ తీసి ముఖం తుడుచుకున్నాడు సతీష్ "కాకపోతే, ఓవిధంగా ఆమె చనిపోయి మంచిదయింది, లేకుంటే చాలా ఘోరమైన పరిస్థితిలో వుండేది., అప్పటికే అందరూ ఆమె ముఖాన వుమ్మేసే పరిస్థితి వచ్చింది, ఆమె తల్లితండ్రులతో సహా. అందుకే చచ్చిపోయి బ్రతికిపోయింది" విపరీతమైన బాధ, ద్వేషం ముఖంలో, మాటల్లో ప్రతిఫలిస్తుంటే పూర్తిచేసాడు చెప్పడం.

శిలాప్రతిమల్లా కూర్చుండిపోయాం కొద్దిసేపటివరకూ "ఇది.. ఇదంతా నిజమేనా?", హీనస్వరంతో అడిగేసాడు శ్యామ్. నన్ను బయటపడద్దని కంట్రోల్ చేసిన వాడి ముఖం ఇప్పుడు పూర్తిగా పాలిపోయివుంది.

కానీ అది పట్టించుకునే స్థితిలో సతీష్ లేడు, "నమ్మలేకపోతున్నారు కదూ, ఓ స్త్రీ, అదీ ఓ సంప్రదాయ కుటుంబంలో పుట్టి–పెరిగి, మరో మంచి కుటుంబానికి కోడలిగా వచ్చినది, ఇంత చేసిందంటే, మీరే నమ్మలేకపోతే మరి మా పరిస్థితేంటి సర్. చెప్పండి?", విషాదంగా అన్నాడు.

లేచామిద్దరం ఇంకేమీ అడిగే శక్తీ, విని తట్టుకునే ధైర్యం రెండూ లేవు మాలో. ఆ క్షణాన అక్కడ కూలిపోకుండా హోటల్ వరకూ వెళ్ళడమే ఈ పరిస్థితుల్లో మాకు చాలా ఎక్కువ. చేతులు జోడించి కదలబోయాం.

ఓసారి వీధి గుమ్మం వైపు దృష్టి సారించి, "బయట వాన పడుతోంది పర్లేదు, కాసేపు కూర్చోండి. కుసుమా చాయ్ తీసుకురా" మా సమాధానంకోసం చూడకుండా భార్యకి వినిపించేలా అరిచాడు.

వద్దని చెప్పే ఓపిక కూడా లేక యాంత్రికంగా తిరిగి కుర్చీల్లో కూలబడ్డాం. అతను లేచి పక్కగుమ్మం దగ్గరున్న వాష్ బేసిన్ దగ్గరకెళ్ళి ముఖం కడుక్కున్నాడు. టవల్ తో ముఖం అద్దుకుని మా వైపు చూసి, "ముఖం కడుక్కుంటారా? బాత్రూమ్ కావాలంటే ఆ పక్కన వుంది" చెప్పాడు. శ్యామ్ లేచి అతను సూచించినవైపు నడిచాడు. నేను అలాగే కూర్చున్నాను.

అతని భార్య వచ్చి మంచినీళ్ళూ, టీ గ్లాసులూ వున్న ట్రే అక్కడున్న చిన్న టేబుల్ మీదుంచి వెళ్ళిపోయింది. అతను ఆఫర్ చేసేలోపే నీళ్ళగ్లాసందుకుని గటగటా తాగాను. తలతిప్పి బయటిగుమ్మంవైపు చూసాను. వాన వెలిసింది.

శ్యామ్ ముఖం కదుక్కుని వచ్చాడు. ముఖమంతా పూర్తిగా పాలిపోయివుంది. కళ్ళల్లో ఎర్రటి జీరలు. బలవంతంగా టీ తాగామనిపించి, లేచాము.

తులసిని గుర్తుచేసుకుని, మాట్లాడడానికి కష్టంమీద గొంతుపెగుల్చుకున్నాను, "వస్తాము సతీష్ మిమ్మల్ని బాధపెట్టినందుకు సారీ. మేమింకా వేరేవారిని కలవాలి. మళ్ళీ ఏదైనా కావలసివస్తే డిస్టర్బ్ చేస్తాము. వుంటాము" చెప్పేసి అక్కడ్నుండి కదిలాము.

గుమ్మం దాటబోతూ ఆగిపోయాను, అప్పుడు స్ఫురించిందా ప్రశ్న. అంతసేపూ తట్టనిది, ఎంతైనా మగవాడినే కదా, బహుశా అందుకే ఇంతసేపూ స్ఫురించలేదు కాబోలు.

తప్పు జరిగిన ప్రతిసారీ స్త్రీని మాత్రమే సెంటర్ పాయింట్ గా చూసే సగటు మేల్ చావనిజమ్ నరనరాల్లో నిండిపోయింది మా జాతి అందరికీ. నేను ఇక్కడికో స్త్రీ తరుపునవచ్చాను కాబట్టి, అదీ తులసి కాబట్టి కనీసం ఇప్పుడైనా తట్టింది. నాలో బాధ స్థానంలో, ఒకలాంటి కసి ముంచుకొచ్చింది గిరుక్కున వెనుదిరిగాను.

"అతను.. అతనెవరు తులసి వెళ్ళిపోయిందెవరితో? అతనేడీ? ఏమయ్యాడు? మీ కులం, పెద్దలూ, పరువూ అతన్ని శిక్షించలేదా? పంచాయితీకి పిలవలేదా?", పదునుగా అడిగాను.

అతని ముఖం ఎర్రబడింది. "వాడా వాడెవడో-ఏంటో ఎవరికి తెలుసు? ఐనా వాడెప్పుడో పారిపోయుంటాడు. అందుకేగా అన్నయ్య నీడకోసం తను ఇక్కడికి వచ్చింది" నిర్లక్ష్యంగా చెప్పాడతను.

"అంటే కేవలం మీవైపు నుండి ఆలోచించే తప్పు డిసైడ్ చేసేసారా? తననేం అడగలేదా? అతడెవరూ, ఎందుకలా చేసిందని, ఒకవేళ చేసినా, ఎందుకు తిరిగి వచ్చిందనిగానీ"

"అడిగితే ఎవరైనా నిజం చెప్తారా?" అన్నాడు విసురుగా.

వన్ సైడెడ్ జడ్జ్ మెంట్. ఆత్మ వంచన. వేరే వ్యక్తులు చేసిన తప్పులకు ఈజీగా పెద్ద పెద్ద శిక్షలు విధించేవరకూ వెళ్ళిపోయేవారు తమ వరకూ వచ్చేసరికి తప్పులెన్నువారు-తమ తప్పులెరుగరు అని ఎప్పుడో నేర్చుకున్న మాట ఎల్లవేళలా నిజమనిపించేలా బిహేవ్ చేస్తారు.

నిర్వికారంగా చూసాను, "అంటే మీకు అతని గురించేమీ తెలియదా సతీష్. అంటే అసలేం జరిగిందో తెలియదు. తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. రైట్?" అన్నాను. సతీష్ ముందు మాట్లాడలేదు.

తర్వాత, "రైట్. ఐనా నిజం నిప్పులా మాముందుంటే మాకేమవసరం" అంటూ ఆగిపోయాడు.

నేనేం మాట్లాడలేదు. అతని కళ్ళలోకి సూటిగా చూసాను. నా ప్రశ్న తగలాల్సిన చోట తగిలిందేమో. నా కళ్ళలోకి చూడలేనట్టు తలొంచుకున్నాడు.

ఇంక ఈ ఇంట్లో నాకేం పనిలేదు. కదిలామక్కడినుండి.

ఎలా రూమ్ కి చేరామో, ఎలా తలుపు తీసి లోపలికి వెళ్ళామో తెలీదు. చాలా సేపటి వరకూ రూమ్ లో చెరోవైపూ ప్రాణమున్న శిలల్లా పడున్నాం రతన్ వచ్చి హడావిడి చేసేవరకు.

"ఏంటి భయ్యా, అరగంట అని చెప్పి అంతసేపు వుండిపోయారూ. ఎంతసేపు ఎదురుచూసానో తెలుసా? వానపడుతోందని చాచా తిడితే వెళ్ళిపోయాను. మీకోసం ఇంటినుంచి భోజనం కూడా తెచ్చాను. లేవండి లేవండి" వుత్సాహంగా చెప్పాడు.

"మూడ్ లేదు రతన్ తర్వాత తింటాం, అక్కడ పెట్టు" విసుగ్గా అన్నాను.

"అదేం కుదరదు భయ్యా. నిన్న సాయంత్రం సేఠ్ తిడితే మీరెంత ప్రేమగా నాకు మీరు తెచ్చుకున్న భోజనం పెట్టి ఓదార్చారు. ఇప్పుడేమో, నేనే మా ఇంటినుండి మీకోసం స్పెషల్ గా చేయించి తెస్తే కాదంటే ఎలా.., నా చేతుల్తో పెట్టకపోతే మా అమ్మ కూడా బాధపడుతుంది భయ్యా. తినండి ప్లీజ్" బతిమాలాడు ఆప్యాయంగా.

ఒక్కరోజు పరిచయంలో మామీద వాడు చూపిస్తున్న ఆదరణకి ఏమనాలో తెలియక, శ్యామ్ వైపు చూసాను. అలాగే పడుకునివున్నాడు. నాలో లేని నవ్వుని పెదాలమీదకి తెచ్చుకుంటూ, "సర్లే కలిసి తిందాం. మరి నువ్వూ ప్లేట్ తెచ్చుకో" అని రతన్ కి చెప్పి వాడు బయటికి వెళ్ళగానే శ్యామ్ భుజంమీద చేయివేసి చెప్పాను.,

"మనం వూహించనిదేమీ కాదు కదా శ్యామ్. ఇంకా నయం కనీసం కొన్నైనా వివరాలు దొరికాయి ఆ సహారా ఫౌండేషన్ వల్., హేమాంగి గారి దయ వల్ల, లేకపోతే ముఖంమీదే తలుపైనా వేసుకునేవాళ్ళు లేదా నానా చెత్తా వాగేవాళ్ళు. కనీసం అదృష్టవంతులం అంతవరకూ, లే ఇంకా మనం చేయాల్సినది చాలావుంది. ముందీ పసివాడిని బాధపెట్టడం ఎందుకు, ఐనా మనమూ కడుపుకాల్చుకుని, దిగులుపడితే సొల్యూషన్ వెతికేదెవరు చెప్పూ? లే శ్యామ్ ప్లీజ్."

లేచి కూర్చున్నాడు, "నీ అంత బాగా బాధని గుండెల్లో దాచుకోవడం రాదురా నాకు, నీకంటే ఏళ్ళనుండి ప్రాక్టీస్ కదా" బాధా, జాలీ, కోపం, ఉక్రోషం కలగలిసిన స్వరంతో అన్నాడు శ్యామ్.

నేను రియాక్టవలేదు. యాంత్రికంగా కదిలి ఎదురుగావున్న క్యారేజ్ ఓపెన్ చేసాను,

"తులసి లేదని ఏడవాలో, ఈ దారుణమైన విషయాలు విని ఏడవాలో తెలియట్లేదురా" శ్యామ్ గొంతు జీరబోయింది.

"తులసి తప్పు లేదని, తప్పుడు మనిషి కాదనీ నిరూపించేవరకూ ఏ బాధకీ, వేదనకీ చోటులేదు శ్యామ్. ఇప్పటికే మనకి చాలా ఆలస్యంగా తెలిసాయీ విషయాలన్నీ. కొద్దిగా కూడా టైం వేస్ట్ చేయలేం మనం. అందరి జ్ఞాపకాల్లోంచీ వివరాలు మరుపుకువచ్చి, ఒక గాసిప్ స్టోరీగా మన తులసి కథ మిగిలిపోయేలోపు వీలైనన్ని వివరాలు కలెక్ట్ చేయాలి.

ముందు అనుకున్నాను నిన్ను ఇన్వాల్వ్ చేయద్దని, అందుకే నాతో రావద్దన్నాను. కానీ ఇక్కడికొచ్చాకా అర్ధమైంది శ్యామ్ ఒక్కడినీ చెయ్యలేను. నావల్ల కాదు, ఐ నీడ్ యూ, నాట్ వితౌట్ యువర్ హెల్ప్" శ్యామ్ వైపు చూడకుండా తలొంచుకుని అక్కడున్న రెండు ప్లేట్లల్లో వడ్డిస్తూ చెప్పాను.

అంతలో రతన్ వచ్చాడు ప్లేట్ తీసుకుని. వాడి ప్లేట్ కూడా అందుకుని వడ్డిస్తోంటే శ్యామ్ వచ్చి నా పక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు. తలతిప్పి చూసాను. చిన్నబోయిన ముఖంలోకి చిరునవ్వుని అరువుతెచ్చుకుంటూ నాభుజంమీద చిన్నగా తట్టాడు. తలూపాను నెమ్మదిగా.

"ఈ భోజనం చాలా స్పెషల్ భయ్యా. వారణాసి మొత్తంలో ఇంత బాగా చెయ్యడం మా అమ్మకే వచ్చు తెలుసా?" హుషారుగా చెప్పాడు రతన్.

"ఆహా. అవునా. ఏమంటారు ఈ కూరనీ", అంటూ వాడితో మాటల్లోపడ్డాము. రతన్ తో కబుర్లలో కాస్త వేరే విషయాలు మర్చిపోయి నాలుగుముద్దలు తినగలిగాం. భోజనాలయ్యాకా కూడా ఏవేవో చెప్తూ కూర్చుని, కాసేపటి తర్వాత సేఠ్ తిడతాడంటూ లేచాడు వాడు అయిష్టంగానే.

వెళ్లబోతూ ఏదో గుర్తొచ్చినట్టు అడిగాడు రతన్, "భయ్యా, మీరు వెళ్ళిన ఇంట్లో కొన్ని నెలల క్రితం చాలా గొడవైందటగా? వాళ్ళ కోడలు లేచిపోయిందనీ" చివ్వున తలెత్తాడు శ్యామ్. వాడిని కళ్ళతోనే వారిస్తూ రతన్ ని అడిగాను, "ఎవరు చెప్పార్రా నీకూ?"

"చాచా అంటున్నాడు, సారీ భయ్యా అందుకే అడిగాను" బెరుగ్గా చెప్పాడు.

"చాచా?" ప్రశ్నార్ధకంగా చూసాను.

"నేను మీకోసం ఎదురుచూసానే ఆ టీ కొట్టు మా చాచాదే భయ్యా. అదే మీరెళ్ళిన పండిత్ వాళ్ళింటెదురుగా. ఏదైనా తప్పుగా మాట్లాడానా భయ్యా?" భయంగా చూస్తూ అడిగాడు.

లేచి వాడి భుజం మీద చెయ్యివేసి చెప్పాను, "లేదురా.., పెద్ద సాయం చేసావు, ఇంకో సాయం కూడా కావాలి. పద మీ చాచాని కలవాలి వెంటనే."

"వాళ్ళెలాంటి వాళ్లు రాజూ?" అడిగాను టీ సిప్ చేస్తూ కాస్తంత దూరంలోనే కనిపిస్తున్న తులసి వాళ్ళింటివైపు చూస్తూ.

"మంచివాళ్లే సార్. ఏ గొడవలూ పెద్దగా వుండేవి కాదు కూడా. పెద్దాయనకీ, కొడుకులకీ కూడా మంచి పేరుంది" చెప్పాడు రాజు, రతన్ వాళ్ల చాచా. ఓ ముప్పై, నలభై ఏళ్ళుంటాయతనికి, రతన్ లాగే బాగా యాక్టివ్ గా వున్నాడు. రతన్

మాగురించి బాగా చెప్పడంతోనేమో చాలా క్లోజ్ గా మాట్లాడసాగాడు కలిసిన కొద్దిసేపట్లోనే. పక్కా యూ.పీ స్లాంగ్ తో కూడిన కూడిన హిందీ. స్వచ్ఛమైన ఉచ్చారణతో వుందతని మాట.

"అక్కడ గొడవ జరిగినరోజు నువ్వున్నావా? నీకేమైనా తెలుసా?" అడిగాడు శ్యామ్.

"నేనేంటి సాబ్, అక్కడారోజు వాడ వాడంతా వుంది. చాలా పెద్ద విషయం, అందులోనూ పండిత్ కుటుంబంలో అంత పెద్ద సంగతి. చాలా రోజులు మాట్లాడుకున్నామందరం. చూడబోతే గుళ్ళో దేవతలాగా వుంటుందామె, అంత కథ నడిపిందా అని. రకరకాలుగా చెప్పుకున్నారు" అంటూ ఏదేదో మాట్లాడసాగాడు తులసి గురించి. అనీజీగా కదిలాం, కానీ తప్పదు.

"అసలేం జరిగింది?" అడిగాను డైరెక్ట్ గా పాయింట్ లోకి వస్తూ.

"ఆ గొడవకి ఒకరోజో, రెండురోజులో ముందు వాళ్ళింట్లో చిన్న కొడుకు పెళ్ళైంది, పెద్దకొడుకు, కోడలు రాలేదు. వాళ్ళో ఏడాది పైనే అయింది.. ఏదో వేరే రాష్ట్రంలో దుకాణం పెట్టడానికి పోయారని విన్నాం. పెళ్ళైన మర్నాడు జగదీష్ బాబు. అదే ఆయన పెద్దకొడుకు దిగాడు, ఇక అక్కడ్నుంచి గొడవ మొదలు. ఏవో పెద్దగా మాటలు వినిపించాయి. అసలే ఇంటినిండా చుట్టాలుకదా, ఏదో గోల గోలగా వుందిలే అనుకున్నాం.

అంతలో ఆ మర్నాడే అతని భార్యా వచ్చింది, అదికూడా.. నిండు నెలలై. ఒక్కసారిగా పెద్ద గొడవ, రభస. ఆమెని ఇంట్లోకి రానీయలేదు వాళ్ళు.

సడెన్ గా వాళ్ళ కులపెద్దలొచ్చారు, వీధి అరుగుమీద అదిగో ఎదురుగా కనిపిస్తోందే, అక్కడే కూర్చున్నారు. ఆ అమ్మాయిని వచ్చిన దగ్గరనుండి వీధిలోనే నించోబెట్టారుగా. నలుగురూ నాలుగు మాటలన్నారు, మాట్లాడారు, దూరంనుండి చూస్తూ వుండబట్టలేక మేమూ వెళ్ళాము.

ఎవరితో పోయావు? వాడెవడు? ఎన్నేళ్ళుగా సాగుతోందిదంతా, ఇన్నాళ్ళూ మీరెక్కడవున్నారు? ఎప్పుడు కలిసారు? వెళ్ళినదానివి తిరిగి ఇక్కడికి ఎందుకు వచ్చావు? సతీష్ పెళ్ళని నీకెవరు చెప్పారు? అన్ని అబద్ధాలెందుకు చెప్పావ్ ఫోన్లో? కడుపుతో వున్నావనే విషయం ఎందుకు దాచావు? ఇలా ఎన్నో, ఏవేవో అడిగుతూనే వున్నారు. వారడిగిన ఏ ప్రశ్నకీ ఆమె జవాబివ్వలేదు. ఏడుస్తూనేవుంది.

చివరికి ఆమె భర్త, ఆమె ముందుకెళ్ళి 'నీ కడుపులో బిడ్డకి తండ్రెవరంటూ' అని అరిచి మరీ అడిగాడు. అదీ అందరిముందూ"

"వ్వాట్?" ఒకేసారి వచ్చింది నాదీ, శ్యామ్ గొంతులోంచి కీచుమంటూ ఆమాట.

తలూపాడతను "అవును భాయ్ దెబ్బకి ఒక్కసారిగా అందరూ షాకైపోయారు. అతగాడామె దగ్గరకి పోయి ఏదేదో మాట్లాడాడు. ఆమె కూడా అతనితో చాలాసేపు మాట్లాడింది కానీ, మొత్తానికి మోసం బయటపడిపోయినట్టుంది,

పెద్దలు మరోసారి గట్టిగా నిలేసి జవాబు రాకపోవడంతో శిక్ష చెప్పేసారు. అయినా మాట్లాడలేదామె. అలాగే నిలబడింది. మరికాసేపైతే గెంటేసే వారేమోగానీ, అంతలోనే కాసేపటికి, ఆమె వున్నచోటే కుప్పకూలిపోయింది. గర్భిణి కదా అంతసేపు నిలబెట్టేసరికీ. ఒక్కసారిగా అందరికీ గుండెపిండేసినట్టైంది..,

వెంటనే ఎవరో జాలిపడి ఆస్పత్రికి తీసుకుపోయారు. బిడ్డని కన్నాకా, తర్వాత అక్కడే బిల్డింగ్ పైనుండి దూకేసిందట. ప్రాణం మీదకొచ్చిందీ మావల్లకాదని ఇక్కడ ఆస్పత్రివాళ్ళు చెప్పారో ఏమోగానీ అంబులెన్స్ వ్యానులో ఢిల్లీ ఆసుపత్రికి తీసుకుపోతుంటే పాపం చచ్చిపోయిందట.

పోలీసులు, ఈ ఆడవాళ్ళ కేంద్రాలు, లోకల్ టీవీ వాళ్ళు, పేపర్లవాళ్ళు చాలామందొచ్చారు. వారణాసి మొత్తం పేపర్లకెక్కింది ఆ నెలంతా. జిల్లా పేపర్లలో తెగ రాసారు, ఆ వెంటనే ఎన్నికలుండబట్టిగానీ లేకుంటే దేశమంతా పెద్ద ఛానెల్స్ లో కూడా వచ్చేసేదే. అమ్మో అలాంటి కుటుంబంలో" చెప్పుకుపోతున్నాడతను.

మా గుండెలు బరువెక్కి పోయాయి.

తులసీ.. అంత అవమానం, అంత హింస.., ఎలా భరించగలిగావు? గట్టిగా పిలిస్తే మొహమాటపడే సున్నితమైన స్త్రీని, నిండు గర్భిణిని రోడ్డుమీదే గంటలకొద్దీ నిలబెట్టిన అమానుషత్వం ఎవరిది?

మా జాతిదా? ఎవరిదీ?

జరిగింది తప్పే అయితే, పాపమే అయితే మరి అందులో సమాన భాగమున్న భాగస్వామిని ప్రశ్నించదేం ఈ సంఘం?

కృష్ణాష్టమి రోజు గుడి మొత్తం కృష్ణపాదాలతో అలంకరించే తులసి, తులసితీర్థం తాగి తప్ప ఉపవాసం బ్రేక్ చేయకూడదంటూ కాలేజ్ ప్రాక్టికల్స్ లో రోజంతా నిలబడి వర్క్ చేయాల్సివచ్చినా కూడా పచ్చి మంచినీళ్లైనా ముట్టని తులసిని, పవిత్రంగా మడికట్టుకుని అందరికీ ప్రసాదం వండిపెట్టే మాతులసిని పతనమైందంటూ, పంచాయితీలు పెట్టీ, పేపర్లకెక్కించీ, చివరికి కన్నవారూ, కట్టుకున్నవాడూ కూడా నమ్మని పరిస్థితుల్లో భగవాన్ నిన్ను వేడీ, కొలిచిన కటాక్షమేనా ఇదంతా? నా కళ్ళల్లో చిప్పిల్లిన నీళ్ళను కనపడకుండా అతికష్టంమీద జాగ్రత్తపడుతూ, కర్చీఫ్ తీసి కళ్ళూ, ముఖమూ తుడుచుకున్నాను.

"అతనెక్కడ రాజూ? ఆమె ఎవరితో వెళ్ళిపోయిందన్నారో అతగాడేడీ?", తేరుకుంటూ కసిగా అడిగాను.

"రాలేదు సార్. అసలువాడు ఎవడో, ఎక్కడున్నాడో కూడా తెలీదు. అసలా జగదీష్ నాథ్ మీదే మాకు అందరికీ డౌటొచ్చింది.., ఎంతసేపూ తప్పో తప్పో అని వాడు గోల చెయ్యడం తప్ప నిజానిజాలు తేల్చిన తర్వాత మాట్లాడచ్చు కదా. ఇతడిలో ఏంలోపముందో మరి, అందుకే ఆ అమ్మాయి తల్లికావడానికే తప్పటడగు వేసిందో, మరింకేం విషయముందో ఏమో? పెద్దిళ్ల కథలేంటో బయటకి రావుకదా..,

మా దగ్గరైతే ఈ గొడవంతా లేదు. ఆడైనా, మగైనా తప్పుకట్టేసి, దేవుడి దగ్గర మళ్లీ తప్పు చేయము అని వేడుకుంటే అంతా సరైపోతుంది. అన్యాయంగా ఓ ఆడపిల్ల వుసురుపోయింది ఈ గోలలో" నిట్టూర్చాడు.

"ఆమె ఎవరితో అయినా క్లోజ్ గా వుండేదా? స్నేహితులూ, బయటకి వెళ్ళడం.. అలా" ఇబ్బందిగా చూస్తూ అడిగాను.

"పెద్దగా తెలియదు సాబ్. నేను చూసినంతవరకైతే అత్తాకోడళ్ళు, లేదంటే జగదీష్ బాబువాళ్ళ చిన్నక్క, వారితోనే వెళ్ళేది. హా కాస్తంత ఆ పక్కింట్లో చిన్న కోడలితో చనువుగా వుండడం అప్పుడప్పుడు గుళ్ళకీ, షాపులకీ వెళ్ళడం చూసినట్టు గుర్తు"

"ఆవిడని కలిస్తే ఏమైనా తెలుస్తుందేమో..", చప్పున అనేసాను శ్యామ్ తో.

వెంటనే అందుకున్నాడు రాజు "అబ్బో చాలా కష్టం సార్. మీరా ఇళ్ళకెళ్ళి అడిగినా పెద్దవాళ్ళు చెప్పేదేమీ వుండదు, చిన్నవాళ్ళని మాట్లాడనివ్వరూ, పైగా ఆమె అత్తామామా పరమరాక్షసులు.

అయినా అంత పెద్ద పండిత్ ఇంట్లోనే అలా జరిగేసరికీ వాడలో వేరే కుటుంబాల్లో కోడళ్ళందరి జీవితాలు మరీ దారుణం అయిపోయాయి. వాళ్ళు కాస్త తలెత్తినా చూసినా, పండిత్ పెద్ద కోడలి పేరు తీసి వీళ్ళందర్నీ కాల్చుకుతింటున్నారు" అన్నాడు.

నివ్వెరపోయి చూసాము. ఇది మేమెరుగని మరో కోణం. ఈ సమస్యలో తులసితో పాటూ వేరే బాధితులు కూడా వున్నారా! దేవుడా.. ఇదేం ఘోరం?

"ఏ అవకాశం లేదంటావా రాజూ ఆ అమ్మాయిని కలవడానికి?" చివరి ప్రయత్నంగా అడిగాను.

"ఒక్కటుంది సాబ్. కానీ, ఏమైనా ప్రాబ్లెమ్ వస్తే, నేను చెప్పానని తెలిస్తే నన్ను ఇక్కడే నరికేస్తారు. వాళ్ళు పండిత్ కుటుంబంలా మామూలు వాళ్లు కాదు. చాలా ప్రమాదకరమైనవాళ్ళు అందుకే" భయంగా నసిగాడు.

"నీకు మాటిస్తున్నాం రాజూ ఏ ఇబ్బందీ రాదు. మేము ఓ ఆడపిల్లకి న్యాయం జరిపించడానికి వచ్చాము, మరెవ్వరికీ అన్యాయం చేయడానికి కాదు. భయపడకు" సిన్సియర్ గా చెప్పాను.

ఆ సమాధానంతో కాస్త తృప్తిగా తలాడించి, "రోజూ తెల్లవారుఝామునే ఐదింటికి పక్కవీధిలో గుడికి వెడుతుంది ఆ అమ్మాయి దాదాపు గంట పైగా అక్కడే వుంటుంది. చాలాసార్లు చూసాను. అది వాళ్ళ కులదైవం గుడి కదా"

ఉత్సాహంగా తలూపి,"థ్యాంక్స్ రాజూ థ్యాంక్యూ వెరీమచ్", అంటూ కదలబోయాను.

శ్యామ్ చిన్నగా తల కొట్టుకుని చెప్పాడు, "రేయ్ మనమున్నది కాశీలో వీధికి వంద గుళ్ళున్నాయిక్కడ ఎక్కడికని తిరుగుతాం. పైగా ఆమెని ఎలా గుర్తుపడతాం? కాస్తాగు, కూర్చో కాసేపు" అంటూ రాజు దగ్గర వివరాలు రాసుకుని వచ్చాడు.

❀❀❀

తెల్లవారుఝామునే రాజు టీకొట్టుముందు ప్రత్యక్షం అయ్యాం. రాజు చెప్పిన వివరాలన్నీ వున్నా, ఆ అమ్మాయే అని కన్ఫర్మ్ చేసుకుంటే బెటర్ అని, కాస్త రిస్క్ ఐనా ఇంటి దగ్గరనుంచీ ఫాలో అవడానికే నిశ్చయించుకున్నాం.

తలమీదుగా చున్నీ కప్పుకుని సల్వార్ లో ఓ అమ్మాయి చేతిలో పూలసజ్జతో, తులసి వాళ్ళ పక్కింట్లోంచి బయటికి వచ్చింది. జాగ్రత్తగా ఆమెని అనుసరిస్తూ గుడికి చేరాము.

పూజ, ప్రదక్షిణలు పూర్తయ్యాకా గుడి పక్కనే వున్న గంగా ప్రవాహాన్ని చూస్తూ మెట్లమీద కూర్చుంది. నెమ్మదిగా వెళ్ళి ఆమె కి కాస్త దూరంలో కూర్చున్నాము. ఈ ఏజ్ అండ్ స్టేజ్ లో అమ్మాయిని, పైగా ఇలా పెళ్ళైన అమ్మాయిని ఫాలో అవ్వడం చాలా ఆక్వర్డ్ గా వుంది.

"మీతో కొద్దిగా మాట్లాడాలి" చెప్పాము భయంగా చూస్తూ. గట్టిగా అరిచిందంటే గుళ్ళో పట్టుకుని చావకొడతారేమో అని ఓపక్క గుండెలదురుతున్నాయి.

"చెప్పండి, అందుకేగా వచ్చారు" అంది నిదానంగా. షాకింగా చూసాము. "మీరు.. మీకు" తడబడ్డాము.

"మీ ఇద్దరిలో కృష్ణగారు ఎవరు?", తూటాలా పేలిందామె ప్రశ్న మా మధ్యలో.

నివ్వెరపోయి ముఖముఖాలు చూసుకున్నాము. ఎవరికి తెలిసింది..? ఎలా..? ఎక్కడ తప్పుచేసాము..!!

"కృష్ణెవరూ, మీరు పొరబడుతున్నారు" కవర్ చేయబోయాడు శ్యామ్. చప్పున చేయి లేపి వారించాను, ఎందుకో ఇంక దాచే ప్రయత్నం చేయాలనిపించలేదు. ఏం జరిగినా సరే.

"నేనే. మీకెలా తెలుసు?" సూటిగా అడిగాను.

ఆమె కొబ్బరిచెక్కపగలకొట్టి, మా ఇద్దరికీ చెరో ముక్క చేతిలోవుంచింది, "ప్రసాద్ లీజియే" అంటూ.

రిలీఫ్ గా చూసాడు శ్యామ్.

"మా గురించి తులసి చెప్పుండచ్చు. కానీ మేమొచ్చామని ఎలా తెలిసింది?" జవాబు రాకపోవడంతో అసహనంగా తిరిగి ప్రశ్నించాను.

"తులసి లెటర్ మీకు పంపింది నేనే" చెప్పిందామె.

చూస్తుండిపోయామలా. నిజమే మాకా ఊహే రాలేదు. తులసి జీవితం వేగంగా మూడురోజుల్లో తీవ్రమైన మలుపులు తీసుకుంది, మరి నాకా లెటర్ ఎప్పుడు పంపివుంటుంది, పైగా ఆ కృష్ణుడి పటం. నా అడ్రస్ కూడా తులసి రైటింగ్ తోనే రాసి వుండడంతో అసలటువైపు ఆలోచించలేదుకూడా.

"తులసిని డెలివరీ కి హాస్పిటల్ కి తీసుకెళ్ళాకా, ఆమెకి సంబంధించిన వస్తువులున్న బ్యాగ్ వాళ్లు పూర్తిగా తనిఖీ చేసారు. వారి పెళ్ళి ఫొటోలూ, కృష్ణుడి ఫ్రేమ్, బట్టలూ తప్ప ఇంకేమీ దొరకలేదు. దాంతో దాన్ని అలాగే బయటవదిలేసారు, ఏదో అంటరాని వస్తువులా.

మర్నాడు తెల్లవారుఝామున గుడికి బయల్దేరిన నాకు ఆ బ్యాగ్ కనిపించింది, దాన్ని తీసుకుని సరాసరి హాస్పిటల్ కి వెళ్ళాను. తులసితో మాట్లాడాను. తను లెటర్ రాసి ఆ ఫ్రేమ్ తోపాటూ నాకు ఇచ్చింది. కృష్ణ అడ్రస్, ఎప్పుడో బృంద దగ్గర తీసుకున్నానంటూ ఓ పేపర్ మీద రాసి ఇచ్చింది. ఈ ఒక్క పేపర్ పంపినా చాలు కృష్ణ గుర్తుపట్టడానికి అని రాస్తున్నప్పుడు చెప్పింది" చెప్పి ఆగింది కోమల్.

ఆ మాటకి మా కళ్ళల్లో నీళ్ళాగలేదు, ఈసారి నిగ్రహించుకునే ప్రయత్నమూ చేయలేదు మేము.

కొద్దిక్షణాల నిశ్శబ్దం తర్వాత తిరిగి చెప్పిందామె, "అందుకే మీకు ఆ పార్సెల్ పంపేటప్పుడు తను రాసిచ్చిన అడ్రెస్ కాగితమే అతికించాను ఆ కవర్ మీద"

"మా తులసి ఏమైనా చెప్పిందా మీకు. అసలేంజరిగిందో, అక్కడ జరిగిన అవమానం ఏం తక్కువది కాదు గానీ వేరే ఏదైనా కారణంతో తను విరక్తి చెంది చావుగురించి ఆలోచిస్తున్నట్టుగా ఏమైనా" కళ్ళు తుడుచుకుంటూ అడిగాను.

"లేదు, అక్కడ పొరపాటు నాదే. నా దగ్గర వున్న టైం తక్కువ, పైగా అక్కడెవరైనా చూస్తారనే భయం. మీకు లెటర్ రాసింది కదా, మీరొచ్చి ప్రాబ్లెం సాల్వ్ చేస్తారూ, లేదంటే ఆమెని అక్కడనుండి తప్పిస్తారనుకున్నాను. పైగా అప్పటికే తను చాలా నలిగిపోయివుంది అంతకంటే ఏంమాట్లాడలేకపోయాను. నా అర్ధంలేని భయానికీ, ఆలోచనారాహిత్యానికీ ఖరీదు తన ప్రాణమైంది"విషాదంగా చెప్పిందామె.

"అలా అనుకోకండి. చివరి క్షణాల్లో తనపట్ల కనీసం ఒకరికైనా సానుభూతి, గౌరవంవున్నాయన్న భావన తనకి కలిగించారు. అందుకోసం ఎంతో రిస్క్ చేసారు. చాలా చాలా థ్యాంక్స్ మీకు" మాట్లాడలేక ఆగిపోయాను.

తలొంచుకుందామె.

వాచ్ చూసుకుంటూ అన్నాడు శ్యామ్, "ఆరవుతోంది, పర్లేదా? వెళ్తారా? రేపు వస్తాం, మీరు ప్రాబ్లెమ్స్ లో పడకండి" భయంగా చెప్పాడు.

**"పరవాలేదు** రేపట్నుంచీ మా ఇంట్లో పూజవుంది అందరం కలిసే వస్తాం దాదాపు పదిరోజులపైన మాట్లాడలేము"

"కానీ, ఈ రోజు లేటుగా వెళ్తే" మా వల్ల ఈ పిల్ల సంసారం ఇబ్బందులపాలు కాకూడదు, రాజు చెప్పిన మాటలు గుర్తొచ్చి శంకగా అన్నాను.

"పర్వాలేదు, ఒక్కసారికి" అంది క్లుప్తంగా. అంతకంటే పెస్టర్ చేయడం బాగోదని ఆగిపోయాము.

"కొన్ని వివరాలు కావాలి. మీకు తెలుసున్నవి చెప్పగలరా? అసలు తులసి ఎవరితో వెళ్ళింది? అతడు ఎవరో మీకు తెలుసా?, ఎలాంటి వాడు? అతన్ని తులసి ఎలా కలిసింది?  వాళ్ళింటికిగానీ అతడి రాకపోకలూ గొడవలూ, ఏమైనా ఇష్యూస్ వున్నాయా?" గబగబా అడిగేసాను.

"వాళ్ళింటికి ఎవరో ఒకరు వచ్చిపోతూనే వుంటారు. కరెక్ట్ గా ఎవరు, ఎవరో నాకు తెలీదు, తనూ నాకేమీ చెప్పలేదు. తను కూడా ఎక్కడికీ ప్రత్యేకంగా వెళ్ళడం, లేదా ఎవరైనా తనకోసం రావడం చూసిన గుర్తులేదు. వస్తేమాత్రం అంత ప్రైవసీ వుండే ఇల్లుకాదు వారిది, అంత పెద్ద కుటుంబంలో భర్తతో ఏకాంతసమయం దొరకడమే కష్టం ఇక పరాయివారితో. దాదాపు అసంభవమే" వివరించింది.

"తను వెళ్ళలేదు, అతడు రాలేదు, మరి వారికి రాకపోకలే లేనప్పుడు, అతనితో వెళ్ళిపోయేంత స్నేహం ఎలా కుదిరింది తులసికి?", అయోమయంగా చూస్తూఅడిగాను.

"అదే నాకూ అర్థం కావట్లేదు కృష్ణగారూ, ఇదంతా జగదీష్ భయ్యాకే తెలుసు, తులసి మాటలబట్టీ చూస్తే అతడే ఏదో మోసగించాడనిపించింది. ఏదో వుంది " అందామె.

"బేసిక్ కదా. కోమల్ తనెందుకు వస్తుంది ఇక్కడికి. తనే వెళ్ళిపోయివుంటే అంత ధైర్యంగా.  సరే, ఒకవేళ తిరిగి రావాలనుకున్నా ముందు తన పరిస్థితి జగదీష్ కి ఏ ఫోన్ లోనో, విడిగా కలిసో వివరించి తర్వాత వచ్చివుండేది కదా. జగదీష్ దగ్గరైతే ఫోన్ వుంది కదా" అన్నాను నేను.

"మీరు చెప్తున్నవి నిజమే. అంత కూడా ఆలోచించలేదు మేము, అందరూ తలోటీ మాట్లాడారు, ఎవరికి తోచింది వాళ్ళు వూహించుకున్నారు. కథలల్లుకుని మాట్లాడుకున్నారు, కాకపోతే, జరిగినదేంటో ఆ జగదీష్ భయ్యాకే తెలియాలి"అంది సాలోచనగా.

"లేక ఆ మరోవ్యక్తికి ఐనా" అన్నాను.

"హా.. కానీ అతడెక్కడున్నాడో మరి, మా మామగారు వాళ్ళు మాట్లాడుతుంటే విన్నాను అతన్ని పోలీసులైతే ఎంక్వైరీ చేసారట భయ్యా" ఆగిపోయింది. "సారీ.. అలవాటులో"అంది బెరుగ్గా.

"పరవాలేదమ్మా మా చెల్లెలిలాంటి దానివే. భయ్యా అనే పిలువు" చెప్పాను.

తలూపి నిర్లిప్తంగా నవ్వింది, "భయ్యా అనేది మాకో సెక్యూరిటీ పదమే తప్ప అందులో ఏ ఫీలింగ్ వుండదండీ, మేం పరాయి మగవాళ్ళతో మాట్లాడాలంటే సమాజం వేలెత్తకుండా వుండేందుకో కవర్ అంతే. అందుకే మా దగ్గర ఆల్రెడీ భయ్యా-భాభీ పదాలు చాలా చులకనైపోయాయిూమధ్య"

మౌనంగా వుండిపోయాము, అన్నీ తెలిసినా అందరమూ ఏమీ తెలియనట్టే నటించే ఫాల్స్ రూల్స్ ఆఫ్ చావనిస్ట్ సొసైటీ.

"మీరెలాగైనా జగదీష్ ని గానీ, అతడిని గానీ కలిసుకోగలిగితే అంతా తెలిసిపోతుంది. ముఖ్యంగా జగదీష్ భయ్యానైనా" మరోసారి ఇన్సిస్ట్ చేస్తూ చెప్పింది.

"జగదీష్ ఎక్కడున్నాడో మీకేమైనా తెలుసా?" అడిగాను.

"లేదు, మా ఆయన సతీష్ కి చాలా మంచి ఫ్రెండ్, ఆయనకి ఖచ్చితంగా తెలుస్తుంది, ఇరుకున పెట్టి అడగండి చెప్పేస్తారు" చెప్పిందామె.

"మీ ఇంట్లోవాళ్ళంతా ఫుల్ హైపర్ అని చెప్పుకుంటున్నారు, మీరేమో ఇరుకునపెట్టమంటున్నారు?" డౌటుగా అన్నాడు శ్యామ్.

"అదంతా పదిమంది వెనకున్నప్పుడే. విడిగా పట్టుకోండి మీకే తెలుస్తుంది" నవ్వేసింది తేలిగ్గా.

"సరే నేనిక బయల్దేరతాను. మీరు జాగ్రత్త" అంది.

తలలూపాము.

"నాకు తెలుసున్నవి చెప్పాను, మీరే కనుక్కోవాలి మిగిలినదంతా" అంటూ కదలబోయి చప్పున ఆగింది.

"తులసి నాకు అక్కడ్నుంచి రెండు, మూడు వుత్తరాలు కూడా రాసింది భయ్యా" అంది.

"అవునా! ఏమని రాసింది? ఎప్పుడు?" ఆత్రంగా అడిగాను.

"వెళ్ళిన కొద్దిరోజులకి ఒకటి, తను ప్రెగ్నెంట్ నని తెలిసినప్పుడు ఒకటి, మధ్యలో మరోటి అంతే. మా పుట్టింటి అడ్రెస్ కి రాసేది, ఇక్కడెవరికీ తెలీదు" చెప్పింది.

"ఏమని రాసింది? అవి మేము చూడొచ్చా?" అడిగాను కాస్తంత ఉద్వేగంగా. చాలాసేపటి తర్వాత ఏదో తెలియబోతున్న ఫీలింగ్.

"ప్రత్యేకంగా ఏమీ లేదు, బిజినెస్ పెట్టాకా భయ్యా కాస్త ప్రశాంతంగా కనిపిస్తున్నాడనీ, ఇప్పుడు కొద్దిగా వర్క్ వల్ల ఇంటికి లేటుగావచ్చినా సంతోషంగా వుంటున్నాడనీ, త్వరలోనే అతనికి తండ్రి మీద అలక తగ్గితే కన్విన్స్ చేసి తీసుకుని రావాలనుకుంటున్నానని ఒకదాంట్లో, ఇంకో లెటర్లో తాను ప్రెగ్నెంట్ ననీ, ఇంట్లో చెప్దామంటే భర్త చెప్పొద్దన్నాడనీ, బిజినెస్ ప్రాబ్లమో ఏమోగానీ, అతని కోపం చూస్తే ధైర్యం చాలట్లేదనీ రాసింది. మరో లెటర్లో ఎక్కువేం రాయలేదు. ఏదో బాధగా రాసింది అంతే" గుర్తుచేసుకుంటూ చెప్పింది.

"కాకపోతే... లెటర్స్ నా దగ్గర లేవు. తులసి చనిపోయాకా ఎవరికైనా తెలిస్తే నన్ను చంపేస్తారనే భయంతో వాటిని పడేసాను. వెరీ సారీ" అంది గిల్టీగా.,

"ఛ.. డోన్ట్ సే సో, వి కెన్ అండర్స్టాండ్" చెప్పాము.

జగదీష్ నీ, అతడినీ కలవాలి. ఎట్ ఎనీ కాస్ట్ ఎవరెంత దాచిపెట్టినా సరే. అనుకున్నాను నాలో నేనే స్థిరంగా.

"ఒక్క విషయం నాకు ఇప్పటికీ అర్ధంకాలేదు భయ్యా. వీళ్ళందరి దృష్టిలో తను ఎవరితోనో పారిపోయింది, ఆ విషయం దాచిపెట్టింది. సరే. మళ్ళీ ఇక్కడికెందుకొచ్చినట్టూ? పోనీ, అందరితోనూ అబద్ధాలు చెప్పిందే అనుకున్నా పనిగట్టుకుని నాకు విడిగా రాసిన లెటర్స్ లో అబద్ధాలు రాసే అవసరం ఏముంది? అసలా విషయాలేవీ రాయకుంటే కాదా?" అంది.

తలూపాను సాలోచనగా,"అవే మా డౌట్స్ కూడా. ఎక్కడో ఏదో అపశృతి వుందనే కోమల్.."అన్నాను.

"ఐనా నాకో పెద్ద డౌట్. మీకు ఇంకా ఈ లెటర్స్ గోలేంటి, పాలవాడూ, పూలవాడూ అంటూ, ప్రతి వాళ్ళదగ్గరా సెల్ ఫోన్లున్న ఈ రోజుల్లో యూ.ఎస్ కి నంబర్ తెలియకో, ఐ.ఎస్.డీ. చేయలేకో తులసి కృష్ణకి లెటర్ రాసిందంటే అర్ధముంది. మీక్కూడా ఈ లెటర్స్ ఏంటి ?" అడిగాడు శ్యామ్ అయోమయంగా చూస్తూ.

"మా ఇళ్ళలో కోడళ్ళకి విడిగా ఫోన్లు వుండవు. భర్తదే వాడుకోవాలి. లేదా ఇంట్లో ల్యాండ్ ఫోన్. అంతే. మరో విషయం తులసి వాళ్ళు వున్నది ఓ కొండమీద గుడి దగ్గర. అక్కడ పెద్దగా సిగ్నల్స్ వుండవు. వున్నా జగదీష్ భయ్యాకే కాల్ చేయాలి. అందుకే" వివరించింది కోమల్.

నిస్సహాయంగా తల పట్టుకున్నాను. దేశం అడ్వాన్స్ అవడం అంటే ఏమిటో నాకు నిజంగా అర్ధంకాలేదు. బయటికి వెళ్ళాలంటే పర్మిషన్స్. ఫోన్ మాట్లాడాలంటే రూల్స్, ఇవన్నీ ఇంకా జరుగుతున్నాయంటే నమ్మబుద్ధి కావట్లేదు. కానీ, ఇవన్నీ నిజాలు. నమ్మలేని-నమ్మాల్సిన నిజాలు.

"నువ్వేమైనా రాశావా తులసికి. అక్కడి అడ్రస్ వుందా నీ దగ్గర" చప్పున గుర్తొచ్చి అడిగాను.

బెరుగ్గా తలూపింది. "రెండుసార్లు. తన అడ్రస్ నాకు తెలుసని ఎవరికీ చెప్పలేదు. తులసి బ్యాగ్ లోకూడా నా వుత్తరం లేదు కదా అందుకే ఎవరికీ తెలియలేదు" చెప్పింది భయంగా.

"ఆ అడ్రస్ ఇవ్వగలవా కోమల్ ప్లీజ్" అడిగాను.

ఒక్కక్షణం ఆలోచించి,"ఇస్తాను, రేపు గుడికి రండి" చెప్పింది.

"కానీ ఎలా, రేపు నీతో మీ వాళ్ళుంటారేమో కదా?" అడిగాను.

"నేను మేనేజ్ చేస్తా. మీరైతే రండి. అదిగో అక్కడ కనిపించే చిన్న వినాయకుడి విగ్రహంవుంది చూడండీ, అక్కడికి నేను ప్రదక్షిణలు చేయడానికి వచ్చినప్పుడు మీరు కూడా అక్కడే వుండండి.. విగ్రహం పక్కన పెడతాను అడ్రస్ కాగితం..,

వెళ్తానిక. వుంటాను భయ్యా. మళ్ళీ మనం జీవితంలో ఎప్పుడూ మాట్లాడుకోకపోవచ్చు, కానీ మీలాంటివారిని కలిసినందుకు చాలా సంతోషంగా వుంది. ఓ ఆడపిల్ల తప్పుచేసింది అని ఆమె తల్లితండ్రులతో సహా అందరూ ఒప్పేసుకున్నా, ఆమెని నమ్మి తనకి న్యాయం చేయడానికి వచ్చిన మిమ్మల్ని చూస్తే ఇంకా మగవాళ్ళలోనూ మనుషులు మిగిలున్నారనిపిస్తోంది" చెప్పేసి వడివడిగా అక్కడినుంచి వెళ్ళిపోయింది.

అప్పటికే కాస్త వెలుగు పరుచుకోవడంతో గుళ్ళోకి జనాలు రావడం మొదలయ్యింది. అలాగే గంగా ప్రవాహాన్ని చూస్తూ కూర్చుని చాలాసేపటికి లేచి బయటకి కదిలాము.

"ఏం చేద్దాం ఈరోజు ఆమె భర్తని కలుద్దామా?",అడిగాడు శ్యామ్.

"వద్దు, ముందు తను అడ్రస్ ఇవ్వనీ, రేపు మళ్ళీ గుడిలో మనని గుర్తుపడితే కష్టం. ఈ రోజు చౌదరీజీని కలుద్దాం. కలిసి మాట్లాడదాం" చెప్పాను.

"అంటే.. యూ మీన్.. సతీష్ చెప్పిన సీ.ఐ. కదూ" అన్నాడు శ్యామ్.

"ఎస్స్... అతనే" చెప్పాను.

"రిస్కవుతుందేమో కృష్ణా. మనం తులసి తరఫున వచ్చామని తెలిస్తే మొదటికే మోసం రావచ్చు"

"లేదు శ్యామ్, తప్పదు, సహారా రిపోర్ట్ లో కూడా ఎక్కువ వివరాలు లేవు, అందరూ ఆ ఇన్సిడెంట్ గురించే మాట్లాడుతున్నారు. ముఖ్యంగా 'అతడి' గురించేమైనా తెలుస్తుందేమో? పైగా జగదీష్ తో వివరంగా మాట్లాడింది కేవలం పోలీసులూ, కుటుంబసభ్యులే. అతడా మనకి దొరకట్లేదు. ఫ్యామిలీ మెంబర్స్ మనకేమీ చెప్పరు. కాస్త ట్రై చేస్తే పోలీసులే చెప్తారు"

"పోలీసులేమీ వెర్రివాళ్లు కాదు కృష్ణా. మనం అడగగానే కోమల్ లాగా, రాజులాగా దడదడా తెలుసున్నవన్నీ చెప్పడానికి, వారికేం ఇంట్రస్టు కూడా వుండదు, వాళ్ళకి ఇది సవాలక్ష కేసుల్లో ఒకటి.."

"ఎగ్జాక్ట్లీ. దేర్ యూ ఆర్. వాళ్ళకి మరీ ఎక్కువ ఇంట్రస్ట్ వుంటేనే ప్రాబ్లెమ్. లక్షలో ఒకటైతే కాదు. హేమాంగిగారికో మాట చెప్పి వెళ్దాం" డెసిషన్ లాగే చెప్పేసాను.

శ్యామ్ అయిష్టంగానే ఒప్పుకున్నాడు.

"మీ సహారావాళ్ళు అప్పుడే ఏదో రాసుకుని వెళ్ళారు కదా. మళ్ళీ దొంగలుపడ్డ ఆర్నెల్లకు కుక్కలు మొరిగినట్టు ఇప్పుడేంటి?" మమ్మల్నే పరిశీలనగా చూస్తూ అడిగాడు చౌదరీజీ,

"డీల్ చేసిన కేసులవి రిపోర్ట్ రాసి ఫైల్ క్లోజ్ చేసే ముందు పూర్తి వివరాలు రాసుకుంటాం సర్" వినయంగా చెప్పాను హేమాంగి గారి సూచనలను తూ.చ. తప్పకుండా పాటిస్తూ.

తల పరికించాడు. "ఇప్పుడు మీకు వివరాలు చెప్పకపోతే పేపర్లకెక్కి గోల-గోల చేస్తారుగా" గట్టిగా నవ్వేసాడతను తన జోక్ కి తానే.

బలవంతంగా నవ్వుపులుముకున్నాం మాముఖాలకి. ఆయన్ని కలిసిన రెండునిమిషాల్లోనే అర్థమైపోయింది మాకు ఆయన వేసే కుళ్ళు జోకులకీ, సెటైర్లకీ నవ్వక తప్పదని.

"సరే అడగండి. ఏం కావాలి?" అన్నాడు.

"ఇన్సిడెంట్ డీటెయిల్స్ వున్నాయి సర్, ముఖ్యంగా తులసితో వెళ్ళిన వ్యక్తిదిగానీ, జగదీష్ ది గానీ స్టేట్మెంట్స్ లేవు. ఇతర ఫ్యామిలీ మెంబర్స్ ఇచ్చిన వేగ్ స్టేట్మెంట్స్ తప్ప కరెక్ట్ వివరాలు లేవు. పోనీ వారినే కలుద్దామంటే వారి వేర్ అబౌట్స్ చెప్పట్లేదు ఎవరూ, మీరే హెల్ప్ చేయాలి" అడిగేసాను డైరెక్ట్ గా. శ్యామ్ భయంగా చూశాడు.

కాకపోతే చౌదరి కూల్ గానే రియాక్టయ్యాడు, "మాకిలాంటివి కామనే గానీ, బయట చాలానే జరుగుతూ వుంటాయి. కానీ, వాళ్ళకి ఇదో పెద్ద కల్చరల్ షాక్ కదా. మూడు కుటుంబాలనీ షేక్ చేసిపడేసింది. ఐ మీన్ నాలుగు కుటుంబాలు ఆ పిల్ల ఫ్యామిలీని కూడా కన్సిడర్ చేస్తే బాగా ట్రెడిషనల్ ఫ్యామిలీ, వాళ్ళు మా ఇంట్లో హోమాలు, పూజలూ కూడా చేయించారు. వారణాశిలో చాలా మంచిపేరున్న పండిత్ కుటుంబం కదా పెద్దపెద్దవాళ్ళిల్లో ఏ శుభకార్యాలున్నా ముందు చూసేది పండిత్ కోసమే, అలాంటిది  వాళ్ళింట్లో అంత పెద్ద వ్యవహారం, చాలా పెద్ద దుమారమే లేచింది. ఆయన అన్నదమ్ములు ముగ్గురికీ ఎఫెక్ట్ పడింది.

జగదీష్ కూడా బాగా క్రుంగిపోయాడు, అవమానం, పరువు నష్టం ఓవైపు. మరి భార్య అంత పెద్దమోసం చేయడం తక్కువ షాకా. అదో బాధంటే, మరోవైపు అందరూ అతన్ని బాగా క్రిటిసైజ్ చేసారు, వ్యాపారమంటూ బయల్దేరి అన్నీ నాశనం చేసాడని, అక్కడికేదో బిజినెస్ చేసేవాళ్ళ పెళ్ళాలందరూ లేచిపోతున్నట్టు..", గట్టిగా నవ్వాడు మళ్ళీ. వెంటనే లేచి వెళ్ళి పోవాలనిపించినా అతికష్టంమీద నన్ను నేను నిగ్రహించుకున్నాను.

"జగదీష్ ఎవ్వర్నీ కలవట్లేదు కృష్ణ గారూ. అతను మానసికంగా కృంగిపోయి అందరితో మాట్లాడడమే మానేసాడట. పాపం ఇప్పుడు ట్రీట్మెంట్ కూడా ఇప్పిస్తున్నారు ఎక్కడో హాస్పటల్లో పెట్టి" చెప్పాడతను.

"అయ్యో పాపం పండిత్ గారికి ఈ వయసులో పెద్ద దెబ్బే" అన్నాను చిన్నగా జాలి నటిస్తూ.

తలూపాడు వెంటనే "అవును పాపం" నిట్టూర్చాడు.

"విషయం ఏదైనా అంత అవమానం తట్టుకోవడం అలాంటి సంప్రదాయమైన కుటుంబానికి కష్టమే" జాగ్రత్తగా ఆచితూచి మాట్లాడుతూ అన్నాను. స్త్రీ సంక్షేమ సంస్థనుండి వచ్చి, మిగిలినవారందరి మీదా ఎక్కువ జాలి చూపచ్చోలేదో మాకు తెలీదు, అలాంటి సంస్థల పనితీరు, వారి మెంబర్లు మాట్లాడే విధానం కూడా తెలీదు. ముఖ్యంగా పోలీసుల దగ్గర. కాస్త భయంగానే వుంది. కానీ ట్రై చేసాను.

"మీరు కలిసినా జగదీష్ దగ్గర ఏ వివరాలూ రాసుకోలేరు ఎలాగూ అతగాడు ట్రీట్మెంట్లోనే ఏమీ మాట్లాడట్లేదట. డాక్టర్లు మొత్తుకుంటున్నారని పండిత్ జీ మొన్న కలిసినప్పుడు చెప్పుకుని బాధపడ్డారు కూడా" చెప్పాడాయన.

**"అయ్యో అవునా** " అని శ్యాంవైపు చూస్తూ అన్నాను,

"మేడంకి ఫోన్ చేసి ఇన్ఫామ్ చేసెయ్యి శ్యాం. ఆవిడ, మిగతా టీం వాళ్ళెంత సతాయించినా, ఒంట్లో బాలేని మనిషిని ఏం ఇంక్వైరీ చేస్తాము చెప్పు? అంతేకద్సార్?" అన్నాను చౌదరినికూడా మా సంభాషణలో కలుపుకుంటూ.

శ్యాం కంగారుగా చూశాడు, " సర్లే కృష్ణా ఇక చాలు, అవన్నీ రూమ్ కి వెళ్ళి మాట్లాడుకుందాంలే. సర్ టైమ్ వేస్ట్ చెయ్యకుండా బయల్దేరితే బాగుంటుంది మనంకూడా" అన్నాడు ఇంక విషయాన్ని తెగేవరకూ లాగకు అన్నట్టుగా నా వైపు చూస్తూ.

"పరవాలేదులెండి, మీ డ్యూటీ మీరూ చెయ్యాలి కదా ఆ మేడమ్ ని చూసాం మేము మహా గట్టి కాండేట్ మాతోనే అలావుందంటే, ఇక మీ అందరి సంగతీ చెప్పొద్దు, చావగొడుతుండచ్చు" అని "జోగేందర్" అంటూ పిలిచాడు తన అసిస్టెంట్ ని.

"ఆ విశ్వేశ్వర్ పండిత్ గారింటి ఫైలుంది కదా. అదే ఆ అమ్మాయి ఎవడితోనో లేచిపోయి, తిరిగొచ్చి, తర్వాత దూకి చచ్చిపోయిన పిల్ల కేసు, తులసి. ఆ ఫైలు తెచ్చి వీళ్ళకి కావల్సిన వివరాలు ఇవ్వు రాసుకుంటారు" చెప్పాడు.

గుండెని ఎవరో కోసినట్టనిపించింది. తులసి గురించి ఇంకెన్నిసార్లు వినాలో ఇవన్నీ, మాకే ఇలా వుంటే పాపం. తులసి తల్లితండ్రుల పరిస్థితి. శాస్త్రి అంకుల్ మాటలు గుర్తొచ్చాయి.

చౌదరి లేచి టోపీ తలపై అమర్చుకుంటూ చెప్పాడు నాకు, "జోగేందర్ మీకు డీటెయిల్స్ ఇస్తాడు, తీసుకోండి, ఏదైనా వుంటే నా నంబర్ కి కాల్ చెయ్యండి, కాస్త అర్జెంట్ వర్క్ మీద వెళ్తున్నాను."

గబగబా తలూపి చెప్పాను, "చాలా థ్యాంక్స్ చౌదరిగారూ, సో కైండ్ ఆఫ్ యూ."

"పరవాలేదు, ఎవరైనా ఇబ్బందిపడుతుంటే చూడలేను కృష్ణగారూ, నా జాబ్ కి సూటయ్యే గుణం కాకపోయినా అలవాటైపోయింది అందరికీ సాయం చెయ్యడం" చెప్పాడతను.

"సో నైస్ ఆఫ్ యూ సర్. మీ లాంటి జెమ్స్ ఇంకా వుండబట్టే పోలీసులంటే ఎంత భయమున్నా, జనాలకి ఇంకా కాస్తైనా గౌరవం మిగిలుంది."

ఆమాటకి చౌదరి ముఖం వెలిగిపోయింది. "అందరూ అంటుంటారనుకోండి కానీ నాకీ పొగడ్తలు నచ్చవు. ఏదో వీలైన సాయం" అన్నాడు ఆనందంగా.

"అలా అనడం మీ మోడెస్టీ సర్" చెప్పాను భక్తిగా ముఖంపెట్టి. మోడెస్టీని హిందీ లో ఏమంటారో తెలియనందుకు కాస్త బాధపడ్డాను. ఇంకాసేపు నాతో భజన కొట్టించుకునే మూడ్ వున్నా టైమ్ లేకపోవడంతో తప్పనిసరై కదిలాడతను.

కోమల్ ముఖంలో కాస్తంత కంగారు తెలుస్తోంది. బెరుకుగా చూపు పక్కకు తిప్పుకున్నాం., తులసి కోసం చేసే ప్రయత్నంలో ఈ అమ్మాయి లైఫ్ కాంప్లికేట్ కాకూడదు.., అలాంటిదేమైనా జరిగితే తులసి మమ్మల్ని జన్మజన్మలకీ క్షమించదు..

మౌనంగా గణేశ ప్రతిమ చుట్టూ ప్రదక్షిణలు మొదలుపెట్టాను, రెండు క్షణాల తర్వాత కోమల్ వచ్చి గరికమాలలూ కొన్ని పువ్వులతో దేవుడిని పూజించసాగింది. అతి కష్టంమీద అడుగులు వేస్తున్నాను. శ్యామ్ కాస్తంత దూరంలో కూర్చుని గమనిస్తున్నాడు.

పూజ పూర్తిచేసుకుని వెళ్లబోతున్న కోమల్ ఆగి, అక్కడున్న చిన్న గంట మోగించి కదిలింది. ఆమె అక్కడ్నుంచి కదులుతూనే, నేను వెళ్ళి వేగంగా నా ప్రదక్షణ ముగించి, గణేశుడి విగ్రహం ముందు నిలిచాను. వణికే చేతులతో దేవుడికి నమస్కరిస్తూ కళ్ళుమాత్రం పైకెత్తి శ్యామ్ వైపు చూశాను. శ్యామ్ కదలలేదు.

అదిరే గుండెని చిక్కబట్టుకుంటూ, నా దగ్గరవున్న చిన్న కవర్లోంచి పువ్వులని తీసి దేవుడిమీద వుంచసాగాను. నా కళ్ళు మాత్రం శ్యామ్ వైపే చూస్తున్నాయి. రెండు క్షణాల తర్వాత శ్యామ్ తల చిన్నగా పరికిస్తూ నిదానంగా లేచి నిలబడ్డాడు.

నేను గాఢంగా వూపిరి తీసుకుని దేవుడికి విగ్రహాన్ని స్పృశించి దణ్ణంపెడుతున్నట్టుగా చేస్తూ విగ్రహం కుడివైపు తడిమాను, చిన్న కాగితం దొరికింది, దానివైపోసారి చూసి చటుక్కున నా పూల కవర్లో పెట్టుకున్నాను. మరోసారి దేవుడికి ప్రణమిల్లే నెపంతో అక్కడింకే పేపర్లూ లేవని కన్ఫర్మ్ చేసుకుని కదిలాను.

కోమల్ వాళ్ళ కుటుంబం హోమం ఏర్పాట్లలో బిజీగా వున్నారు. వారివైపు ఓరగా చూసి బయటకి నడిచాను. చెప్పులు వేసుకుంటున్న శ్యామ్ కేసి కనీసం తిరిగి చూడకుండా హోటల్ దారిపట్టాను. రూమ్ తలుపు తీసి దాదాపు అక్కడున్న సోఫాలో కూలబడ్డాను. టెన్షన్ తో, చెమటలు పట్టి తడిసి ముద్దయ్యానప్పటికే. నా వెనకే శ్యామ్ లోపలికి వచ్చాడు. వాడిదీ అదే పరిస్థితి.

గబగబా నీళ్ళ జగ్ అందుకుని గటగటా తాగాడు.

"దేవుడా! ఇంత టెన్షన్ నా జీవితం మొత్తంలో ఎప్పుడూ పడలేదురా. నీ సంగతేంటి, ఆర్ యూ ఓ.కే?" అడిగాడు.

తలూపాను యాంత్రికంగా. గుండె ఇంకా దడదడా కొట్టుకుంటోంది.

"నీ మొహం ఓ.కే. ఒక్కసారి వెళ్ళి అద్దంలో చూస్కో, ఎలావున్నావో" అంటూ నీళ్ళందించాడు.

నీళ్ళు తాగి జగ్ పక్కనపెడుతూ, "మనకే ఇలా వుంటే పాపం ఆ అమ్మాయి ఎంత భయపడుంటుందో కదూ! పాపం పిచ్చిపిల్ల" అన్నాను కోమల్ ని తలుచుకుంటూ.

"యా. కరెక్టే పాపం చాలా రిస్క్ చేసింది, అన్నట్టూ, ముందు త్వరగా చూడు, ఏం డీటైల్స్ వున్నాయో ఆ పేపర్లో."

తలూపి కవర్లోంచి కాగితం తీసాను. హిందీలో నాలుగు ముక్కలు రాసివుంది.

భయ్యా,

క్షమించండి, అడ్రెస్ దొరకలేదు. ఊరిపేరు మాత్రం గుర్తుంది. రామ్ గడ్. ముక్తేశ్వర్ గుడికి వెళ్ళేదారిలో వచ్చే చిన్న కొండ ప్రాంతం.

"మ్.. పోన్లే కనీసం వూరి పేరన్నా తెలిసింది, చూద్దాం వాట్ బెస్ట్ వీ కెన్ డూ" నిట్టూర్చాను.

"బృందా పోనీ, మన బృందాని ఓసారి శాస్త్రి అంకుల్ వాళ్ల వేరే రిలేటివ్స్ మాట్లాడమంటే ఐ మీన్ సుందరం అంకుల్ కాదు వాళ్ల కజిన్, ఆ లక్ష్మక్క వాళ్ళున్నారు చూడూ, వాళ్ళకైతే పక్కా తెలుస్తుందేమో ఏదైనా ఇన్ఫో ట్రై చెయ్యొచ్చేమో.. ఏమంటావ్?" సాలోచనగా అన్నాడు శ్యామ్.

"మైట్ బీ. వాళ్ళుండేది కూడా హైదరాబాదే కదరా ఓ ట్రయల్ వేస్తే తప్పేంలేదుగా. కాల్ అయితే చెయ్యి బృందాకి అడ్రస్ దొరికితే మంచిదే లేదంటే వూరిపేరైతే మనకి ఆల్రెడీ సహారావాళ్ళూ, పోలీసులూ ఇచ్చిన వివరాల్లో ఎలాగూ వుంది. ఆరోజు సతీష్. ఇప్పుడు కోమల్ కన్ఫర్మ్ చేసింది కూడా అదేగా వెళ్ళి కనుక్కుందాం. మే బీ లోకల్ గా అడిగితే ఏదో ఒకటి తెలియొచ్చులే" చెప్పాను.

"అడ్రెస్ దొరికిందిగా బృందా?" ఆత్రంగా అడిగాడు శ్యామ్. తులసి వున్న ప్లేస్ వివరాలూ, జగదీష్ బిజినెస్ చేసిన ప్లేస్ వివరాలూ, ఏవి దొరికితే అవి లక్ష్మక్క దగ్గర్నుంచి తీసుకోమని తోసాం బృందాని. తప్పలేదు. ఏం చేస్తాం ఊళ్ళ పేర్లు తప్ప ఎక్కడా పూర్తి వివరాలు దొరకలేదు. ఆవిడే అటు తులసీ వాళ్ళకీ, జగదీష్ వాళ్ళకీ కూడా కామన్ బంధువు, ఓవిధంగా వారి పెళ్ళి కుదిరింది కూడా ఆవిడ వల్లే.

"ఇక చాలురా." స్పీకర్ లోవున్న ఫోన్ లోంచి జీరగా ధ్వనించింది బృంద గొంతు. "తెలుసుకున్నది చాలు. వచ్చెయ్యండిక. తులసి గురించి ఇంకేం చెయ్యొద్దు. ఏమీ తెలుసుకోవక్కర్లేదు" ఏడుపాపుకుంటూ చెప్పింది బృంద.

"ఏమైంది చిన్నీ? ఎవరైనా అంటే ఎవరైనా, ఏమైనా అన్నారా?" భయంగా, దిగులుగా అడిగాడు.

"వాట్ మోర్ కెన్ వీ ఎక్స్పెక్ట్?" బృంద గొంతులో విషాదం తొణికిసలాడింది "అందరూ చాలా చీప్ గా మాట్లాడుతున్నారు శ్యామ్ వినడం చాలా చాలా కష్టంగావుంది. తులసి తప్పే చేసిందో, ఒప్పే చేసిందో తన గురించి అందరికీ గుర్తు చేసి మరీ తిట్టించడం ఘోరంరా. చాలింక. మీరిద్దరూ తిరిగి వచ్చెయ్యండి."

"ఏం జరిగింది?", మరోసారి అడిగాడు శ్యామ్ వాడిపోయిన ముఖంతో.

"తననొక క్యారెక్టర్ లెస్ పర్సన్ లాగా, చాలా పెద్ద నెరజాణ అన్నట్లుగా మాట్లాడుతున్నార్రా అందరూ, చాలా దగ్గర బంధువులూ, వాళ్లు కూడా. పైగా అతడెవరో అతనిగురించిగానీ, జగదీష్ గురించి ఎవరికీ పట్టింపులేదురా. అందరి

ఇంట్రస్టు తులసిని చీప్ గా మాట్లాడ్డం గురించీ, అసలామె ఎందుకు పరాయిమగవాడితో సంబంధం పెట్టుకోవలసివచ్చింది అనే విషయం మీద రకరకాల వంకర ఊహలు, వ్యాఖ్యలూ తప్ప ఇంకేం లేవు" దీనంగా చెప్పింది బృంద.

టేబుల్ మీదున్న ఫోన్ ని చూపుడువేలితో నావైపు తిప్పుకున్నాను, "బృందా నేను" అన్నాను నిదానంగా. "విన్నావుగా కృష్ణా. అర్థం చేసుకోండి, ఇంక ఆపెయ్యండి" అంటూ అదే విషయాన్ని రిపీట్ చెయ్యబోతున్న బృంద మాటల్ని కట్ చేస్తూ అడిగాను "ముందు అడ్రస్ చెప్పు బృందా రాసుకుంటాను."

రెండు, మూడు క్షణాల మౌనం తర్వాత నెమ్మదిగా చెప్పింది, "ఊళ్ళపేర్లు తప్ప వాళ్ళకీ ఏం తెలియదట కృష్ణా."

చిన్నగా నిట్టూర్చి చెప్పాను. "పోనీ మేం చూసుకుంటాంలే. ఇకపోతే తులసి గురించి తప్పే చేసిందో, ఒప్పే చేసిందో అన్న ఆలోచన మనలో సైతం కలిగేంతగా తనకి వచ్చిన ఆ అపనిందకి గల కారణం తెలుసుకోకుండా పాసివ్ గా వుండిపోయి, ఏం చేస్తాం అని అనుకుంటూ, అందరిలా సరిపెట్టుకోలేను బృందా.

బట్. డోన్ట్ గెట్ అఫెండెడ్. వెయిట్ చెయ్యి మాట్లాడిన ప్రతి ఒక్కరికీ సమాధానం చెప్పేరోజు తప్పక వస్తుంది. వుంటానూ" చెప్పేసి ఫోన్ డిస్కనెక్ట్ చేసి శ్యామ్ వైపు చూసాను.

కామ్ గా లేచి సెల్ తీసి జేబులో వుంచుకుని కదిలాడు శ్యామ్.

"ఇక్కడ. సహారా నుండి వచ్చినది మీరేనా? " అడిగాడా యువకుడు. లోకల్ హిందీ పేపర్ కష్టపడి చదువుతున్న నేను చప్పున పేపర్లోంచి తలెత్తాను.

సన్నగా, పొడుగ్గావున్నాడతను. ముఖంలో చికాకు తెలుస్తోంది.

"ఎస్ ప్లీజ్, మీరెవరు? " అడిగాను.

"మా చెల్లెలు అమాయకురాలు. తనని అనవసరమైన విషయాల్లో కలిగించుకోవద్దంటే వినట్లేదు, దాంతో నాకు మిమ్మల్ని కలవకతప్పట్లేదు" చెప్పాడు కాస్త వుక్రోషంగా.

"ఎక్స్ క్యూజ్ మీ. వన్ మినిట్. అసలు ఎవరు మీరు? మీ చెల్లెలెవరు?" ఆశ్చర్యంగా చూసి సోఫాలోంచి లేస్తూ అడిగాను.

"కోమల్ ప్రధాన్. తెలుసుగా మీకు. కోమల్ బ్రదర్ని నేను. నా పేరు కునాల్ దర్శన్."

"ఓహ్. ఓ.కే. బట్ మీరూ. ఇక్కడా?" సందిగ్ధంగా చూస్తూ అన్నాను.

"రాక తప్పలేదు సర్, ఫోన్ల మీద ఫోన్లు చేసి గొడవచేస్తుంటే, ఏం చేస్తాను? అందుకే వచ్చాను. ఆ అమ్మాయి. అదే ఆ తులసి మా చెల్లెలికి రాసిన వుత్తరాలున్నాయి మా అమ్మగారి దగ్గర. తను చెప్పడానికి భయపడి అవి కాల్చేసాననో,

పడేసాననో మీకు చెప్పాననీ, అలాచేసి తప్పుచేసాననీ, సారీ చెప్పి, మిమ్మల్ని అర్జెంట్ గా కలిసి ఈ లెటర్లివ్వమని కోమల్ చాలా బ్రతిమాలింది. తను బాధపడకూడదని వాటిని తీసుకుని వచ్చాను" చెప్పాడతను. నమ్మలేనట్టు చూశాను. ఇది వూహించని సాయం.

"తను పిచ్చిది. తెలీక ఇలాంటి విషయాలలో జోక్యం చేసుకుంటోంది. మీరు దయచేసి తన పేరు బయటికి రానివ్వకండి. చచ్చిపోయిన అమ్మాయికి మీరేం న్యాయం చేస్తారో తెలీదుగానీ, బ్రతికున్న వాళ్ళకి అన్యాయం జరక్కుండా చూడండి చాలు.

ఆ అమ్మాయి తులసి, తనతో లెటర్స్ రాసుకునేంత స్నేహం వుందని తెలిస్తే మా చెల్లెలి ముఖం కూడా చూడరు వాళ్ళింట్లో వాళ్లు తన కాపురం సర్వనాశనం అయిపోతుంది. అర్థం చేసుకోండి." బాధగా చెప్పాడతను.

"ప్లీజ్ మిస్టర్ కునాల్ ముందు మీరు కూర్చోండి." అన్నాను.

తల అడ్డంగా తిప్పాడు. "లేదు వెళ్తాను సర్. తీస్కోండి" అంటూ జేబులోంచి ఓ కవర్ తీసి నాకు అందించబోయాడు.

**నేను తీసుకునే ప్రయత్నం చేయలేదు**, "చూడండి కునాల్ మేము ఇక్కడకి వచ్చింది ఓ అమ్మాయికి న్యాయం చేయడానికి, ఆ ప్రయత్నంలో మరో అమ్మాయికి అన్యాయం చేయడానికి కాదు. మా ఇళ్ళల్లోనూ అక్కచెల్లెళ్ళున్నారు కోమల్ పేరు ఎక్కడా ఏవిధంగానూ బయటపెట్టం మీరు వర్రీ అవకండి. ఐనా ఈ లెటర్స్ వున్నాయి అని కోమల్ చెప్తేనేగా మాకూ తెల్సింది, అసలు తెలియనేలేదనుకుంటాం. వేరే విధంగా మా ప్రయత్నాలు చేస్తాం. మీరు ధైర్యంగా తిరిగి వెళ్ళండి. వాటిని నిజంగానే డెస్ట్రాయ్ చేసేయమని కోమల్ కి చెప్పండి. నో ప్రాబ్లెమ్ ఎటాల్" స్థిరంగా చెప్పాను.

అప్పటికే స్నానం ముగించి వచ్చి మా సంభాషణ వింటూ తలతుడుచుకుంటున్న శ్యామ్ షాకింగా నిలబడిపోయాడు.

కునాల్ నా వైపో రెండు క్షణాలు చూసి, "ఆర్ యూ ష్యూర్?" అంటూ ప్రశ్నించాడు.

"ఆబ్సల్యూట్లీ" స్థిరంగా చెప్పాను. కవరు తిరిగి జేబులో పెట్టుకుని వెనుదిరిగాడు.

స్తబ్దంగా నిలబడ్డాను. అతని దగ్గర్నుంచి తులసి లెటర్స్ తీసుకోవాలనే కోరిక ఎంత బలంగా వున్నా, కోమల్ జీవితం పాడుచేయొద్దనే సంస్కారం నన్నాపింది. చిన్నగా నిట్టూర్చి శ్యామ్ వైపు చూసాను, "వెళ్దామా. రెడీయా.?" అడిగాను.

నావైపోసారి సూటిగా చూసి తలూపి, "ఒక్క పది నిమిషాలు. రెడీ అయిపోతాను" చెప్పాడు క్లుప్తంగ. వాడి చూపుల్లో వున్న ప్రశ్నలకి నా దగ్గర జవాబులేదు. అందుకే వాడిని ఫేస్ చేసే ప్రయత్నం చేయకుండా, వీలైనంత వేగంగా వెళ్ళి పర్స్, పెన్ను జేబులో పెట్టుకుని, షూ వేసుకోసాగాను.

"మీరు రామ్ గడ్ కి వెళ్తున్నారా?" అన్న ప్రశ్నకి వులిక్కిపడి ఇద్దరం రూమ్ డోర్ వైపు చూసాం. కునాల్.

"లేదు, వేరే పని మీద వెళ్తున్నాం. ఎందుకలా అడిగారు?", అతన్ని పరిశీలనగా చూస్తూ అడిగాను.

"మీరింకా వెళ్ళలేదా?" అనేశాడు శ్యామ్ ఆశ్చర్యంగా.

"లేదు, ఇవి మా దగ్గరవుండి మరుగునపడిపోవడంకంటే మీకు వుపయోగపడడమే న్యాయమనిపించింది. మీరన్నమాటే మా చెల్లెలికోసం మరో అమ్మాయికి అన్యాయం చేయలేను కదా" చెప్పి కవర్ నా చేతిలోవుంచాడు. ఈసారి కాదనలేదు నేను. పదిలంగా అందుకున్నాను వాటిని.

నిజంగా ఆక్షణం చాలా రోజుల తర్వాత రిలీఫ్ గా అనిపించింది. ఈలోకంలో మంచి ప్రయత్నానికి సాయపడేవాళ్ళు చాలామందేవున్నారు.

"థ్యాంక్స్. థ్యాంక్యూ సో మచ్ కునాల్ గారూ" మనఃస్ఫూర్తిగా చెప్పాను.

వణికే చేతులతో మొదటి లెటర్ విప్పాను. హిందీలో వుందా వుత్తరం. తులసికి లెటర్స్ రాసేంత హిందీ వచ్చని నాకు తెలీదు. బహుశా అన్నేళ్ళ వారణాశి వాసం నేర్పిందేమో.

**కోమల్,**

ఎలావున్నావు? పాప బాగుందా? అమ్మ ఆరోగ్యం ఇప్పుడు సెటిల్ అయిందా? నీ పూజలు ఎంతవరకూ వచ్చాయి?

మేము వేరే స్టేట్ కి వెళ్ళలేదు కోమల్. యూ.పీ. లోనే వున్నాం. కాకపోతే ఆయనకి ఇష్టం లేదు ఎవరికీ తెలియడం. చాలా మారిపోయారు అక్కడ ఇంట్లోవాళ్ళతో కొట్లాడి ఇక్కడికి వచ్చాకా. ఎవరో కొత్త వ్యక్తిని చూస్తున్నట్టేవుంటుంది. ఒకససారి చాలా ప్రేమగా, మృదువుగా వుంటే, మరోసారి మరీ రాక్షసంగా వ్యవహరిస్తారు. చాలా భయంగా గడుపుతున్నాను. అమ్మా, నాన్నలకు కూడా చెప్పలేదు. అత్తయ్యకి మాత్రం నెలకోసారి ఫోన్ చేయనిస్తున్నారు. నాలుగు మాటలు ఓదార్పుగా మాట్లాడేసరికి చాలంటూ ఫోన్ పెట్టించేస్తున్నారు.

త్వరలో ఆయన కోపం తగ్గాలనీ, ఆయన కోరుకున్నట్టే బిజినెస్ పెరగాలనీ ఆశిస్తున్నాను. ఇక్కడి వాతావరణం చాలా బాగుంది, ఇంటివారూ బాగానే వున్నారు. ఇంటి ఆవరణ విశాలంగా వుంది. కొన్ని పూలమొక్కలు కూడా పెంచుతున్నాను. నీ విశేషాలతో లెటర్ రాయి. ఆయనకి కోపం వస్తుంది, ఎవరితోనూ చెప్పకు సుమా.

**–తులసి**

**కోమల్,**

నేను బాగున్నాను, నీ లెటర్ అదృష్టం కొద్దీ వారు షాప్ కి వెళ్ళినప్పుడే వచ్చింది. నీకో శుభవార్త. ఆరేళ్ళుగా మేము ఎదురుచూస్తున్న ఘడియ వచ్చింది. నిజం. నీకో మేనకోడలో, మేనల్లుడో రానున్నారు.

ఇప్పుడీ చోటుకి మారినందుకు చాలా సంతోషంగా వుంది. కానీ, అటు అమ్మకీ, ఇటు అత్తయ్యకీ కూడా చెప్పలేకున్నాను. కొత్త బాధ్యత పెరిగిందంటూ ఆయన మరింత వర్రీ అవుతున్నారు. తిరిగి వెళ్ళిపోతే బాగుండునని నాకు ఎంతైనా వుంది. వట సావిత్రి వ్రతం చేసి వుపవాసం వుంటానంటే ఇంటావిడ వొప్పుకోలేదు, పూజలు ఎన్నైనా చేసుకో ఈ పరిస్థితుల్లో వుపవాసాలొద్దని చెప్పారు.

మీరంతా బాగున్నారని ఆశిస్తాను. వివరాలిస్తున్నానూ, ఈసారి ఇంటావిడ పేరు రాయి లెటర్ కవర్ మీద, నేను అక్కడినుంచి తీసుకుంటాను.

**– తులసి**

**ప్రియమైన కోమల్,**

పాపకి స్కూల్లో సీట్ దొరికినందుకు చాలా సంతోషం., నేను బాగానే వున్నాను. మొన్న కొద్దిసేపయినా పక్కింటివారి ఫోన్ నుండి నీతో మాట్లాడగలిగినందుకు చాలా హ్యాపీగా వుంది. త్వరలో మీ అందరినీ కలవాలనీ, లేదా మా వాళ్ళింటికైనా వెళ్ళాలనీ ఆశిస్తున్నాను. ఈ పరిస్థితిలో సన్నిహితులూ, స్నేహితులూ పక్కనుంటే బాగుంటుందేమో.

**వుంటాను,**

**–తులసి**

మరో రెండు వుత్తరాలు అలాగే పొడి, పొడిగా వున్నాయి.

చివరిగా తీసాను కోమల్ పుట్టింటినుంచి తిరిగెళ్ళిపోయాకా తులసి రాసిన ఆఖరి వుత్తరాన్ని, కోమల్ కూడా తెరవలేదా లెటర్.

**కోమల్,**

ఎలా వున్నావు? నేను బాగాలేను కోమల్. ఏదో తెలీని నరకం చవిచూస్తున్నాను. ఎలా చెప్పను? నీతో ఆరోజు చెప్పుకున్న బాధే. ఆయన ప్రవర్తన రాత్రైతే భయపెట్టేదిగా వుంటోంది. పగలంతా సరదాగా, కులాసాగా వుండే ఆయనేనా అనిపిస్తోంది. ఇన్నాళ్ళూ ఎలాగో భరించానుగానీ, ఇప్పుడు బిడ్డ సేఫ్టీ గురించి భయంవేస్తోంది.

అన్ని రోజులు ఎదురుచూసిన ఫలం కోసమైనా ఆయన తిన్నగా ప్రవర్తిస్తారనుకుంటే, అదేమీలేదు. నువ్వు చెప్పినట్టే నిదానంగా మాట్లాడి కూడా చూసాను, కానీ ప్రయోజనం లేదు, ఆయనకి చెప్పకుండా తిరిగివెళ్ళిపోతే అయినా బిడ్డ క్షేమంగా బయటపడతాడేమో అనిపిస్తోంది. ఆ వికృతచేష్టలు భరించే ఓపిక ఇక నా శరీరంలో లేదు, మరో ప్రాణి కూడా వుందిగా నాతోటి. ఈసారి ఆయన సామాను తేవడానికి వెళ్ళినప్పుడు నేనే తెగించి వారణాశి వెళ్ళిపోతాను, అత్తయ్యే ఒక్కరే ఆయనకి సర్దిచెప్పగల సరైన వ్యక్తి. నీవిక వుత్తరాలేమీ రాయకు. నేనే వస్తున్నానుగా.

**వుంటానూ.**

**–తులసి.**

అయోమయంగా ముఖాలు చూసుకున్నాం. తులసి వున్నది వేరెవరితోనో అని జనం చెప్తున్నారు, మరి తులసి జగదీష్ ని కించపరుస్తూ రాసిన ఈ ఉత్తరాలేంటి, అసలు తులసే రాసిందా వీటిని? రైటింగ్ తనదే కాబట్టి తనే రాసింది.

కానీ, ఏదో జరిగింది. తులసి తనతో రెండుసార్లు ఫోన్లో మాట్లాడినట్టు కోమల్ చెప్పింది. అలా చూసుకుంటే మాతా టేక్డీ లో వున్నది వేరెవరో అయ్యుండచ్చా? జగదీష్ ట్రిక్ చేసాడా? మరి ఎప్పుడు తులసి దగ్గరకి చేరాడు,

ఆయన అంటూ తులసి మెన్షన్ చేసిన ఆ వ్యక్తి ఒకవేళ వేరేవ్యక్తి ఐతే కాదు. లెటర్ లో అబద్ధాలు రాసే అవసరం తులసికేముంది? సంథింగ్ ఫిషీ. పైగా అత్తయ్యే తనకి చెప్పగలవ్యక్తి అంటూ రాసుకుందంటే జగదీష్ గురించి అనేగా.

కానీ, ఒకటైతే నిజం అది జగదీషో, వేరెవరో తెలియదుగానీ తులసిని నరకయాతనలకి గురిచేసాడా వ్యక్తి. హీ డిజర్వ్స్ ఎ సివియర్ పనిష్మెంట్.

"జగదీష్ నీ, అతడినీ కలవాలి శ్యామ్. తోలు వలిచైనా నిజం చెప్పించాలి" కసిగా అన్నాను.

తలూపాడు శ్యామ్. "ఏదో జరిగింది, తెలుసుకోవాలి. కానీ ఎలా కృష్ణా? మనమా పోలీసులమూ కాము, ఆర్గనైజేషన్ వాళ్ళమూకాము. ఎలా? ఎలా రీచౌతాము వాళ్ళని. దాచేసారా ఇద్దరు వెధవలనీ. ఏదో చేసారు వాళ్ళే. తులసిని చాలా హింసించారు. తెలుస్తూనే వుంది" బాధగా అన్నాడు.

స్తబ్దంగా వుండిపోయాను కొద్ది క్షణాలు. వీ హావ్ టూ ట్రేస్ దెమ్. తులసి కోసం. ఇప్పుడైతే ఇక వెనుతిరిగే ప్రశ్నేలేదు. మేమెవరమో తెలిసిపోయినా సరే, నిజం తెలుసుకునే తీరతాము. బలంగా నిర్ణయించుకుంటూ లేచాను.

"పద కోమల్ భర్త ను కలుద్దాం" అన్నాను సాలోచనగా,

ఆశ్చర్యంగా చూసాడు," కానీ వాళ్ళూ." అన్నాడు సందిగ్ధంగా చూస్తూ.

"మర్చిపోయావా కోమల్ చెప్పిన మాటలు, ఒంటరిగా పట్టుకుందాం, ఇద్దరినీ, సతీష్ నాథ్ నీ, కోమల్ భర్తనీ, ఖచ్చితంగా వాళ్ళు చెప్తారు, మనం చెప్పిద్దాం, వీళ్ళెక్కడ దొరుకుతారో. పాతాళంలో దాక్కున్నా పైకి రప్పిద్దామిక. నిజం కక్కిద్దామిక" కసిగా చెప్పాను.

"మనం తులసి నుండి కాస్తంత ఎక్కువే ఎక్స్పెక్ట్ చేస్తున్నామనిపించడంలేదా కృష్ణా?" శ్యామ్ ప్రశ్న అర్థం అయ్యీ కానట్టువుంది.

తుంచిన రోటీ ప్లేట్లో జారవిడుస్తూ అడిగాను, "అంటే?"

"వెల్.. ఎలా చెప్పనూ.., ఓ.కే. చూడు కృష్ణా మనకెవరికీ తులసి పెళ్ళైన తర్వాత టచ్ లోనే లేదు రైట్?" అడిగాడు. తలూపాను.

"ఈవెన్ బృందా తో కూడా రిలేషన్ దూరమైపోయింది తనకి, ప్లస్ తన పేరెంట్స్, రిలేటివ్స్ అందరూ చాలా దూరంలో వున్న చోట తన పెళ్ళైంది రైట్?" గ్లాస్ లో వున్న నీళ్ళు కొద్దిగా సిప్ చేసి నావైపు చూసి కంటిన్యూ చేసాడు,

"సో ఎవ్వరికీ జగదీష్ గురించి సరిగ్గా తెలియదు, రాదర్ అసలేం తెలీదు. తన ఇంటి గురించీ, ఇంట్లోవారి గురించీ. నో వన్ నోస్ ఎనీథింగ్. రైట్? మరి తులసి అక్కడ ఎలాంటి లైఫ్ అనుభవించిందో, తను విసిగిపోయిందో తన జీవితంతో, అందులో కష్టనష్టాలు, బాధలు, భయాలు ఏమీ తెలియవు., కొత్తగా తనకెవరైనా స్నేహితులయ్యారా అనిగానీ, తను తర్వాత ఎలా వుండేది, ఎలా మారింది? ఏమీ? అంతెందుకు మనకి కోమల్ తులసికి పక్కింట్లో వుంటుందని మాత్రమే తెలుసు, లెటర్స్ రాసుకునేంత స్నేహం వారిమధ్య వుందని మనకి తెలుసా. లేదుగా?"

"ఏం చెప్పాలనుకుంటున్నావ్ శ్యామ్. ఇవన్నీ మనకి తెలియవనే కదా ఇక్కడ తిరుగుతున్నాం తెలుసుకోవడానికి. వై ఆర్ యూ డీటైలింగ్ మీ అగైన్. నాకు తెలిసినవే ఐ మీన్ మనకి తెలిసినవే మళ్ళీ మళ్ళీ నెమరేస్కుంటే ఏమొస్తుందిరా?" విసుగ్గా అడిగాను.

"తెలుసున్న యాంగిల్ లో కాదు, తెలియని యాంగిల్ లో కూడా ఆలోచిద్దాం అంటున్నాను కృష్ణా" చెప్పాడు శ్యామ్.

"కాస్త క్లారిటీ గా ఏడుస్తావా?" చిరాగ్గా ముఖం పెట్టి అన్నాను.

"ఒకవేళ తులసి. మన తులసి. తను కూడా మనిషే కదరా. తను నిజంగానే వేరెవరిదో తోడు కోరుకునే వెళ్ళిందేమో అని ఎందుకు ఆలోచించకూడదు మనం?" ఆగి నావైపు చూశాడు.

సముద్రాలూ పొంగలేదు, షాక్ తగిలి నేను బిగుసుకుపోనూలేదు, కోపంతో శ్యామ్ దవడ పగలగొట్టనూ లేదు, నిశ్చేష్టుడిని అంతకన్నా కాలేదు. స్తబ్దంగా శ్యామ్ వైపోసారి చూసి నా ప్లేట్ మరింత దగ్గరకి లాక్కుని ఆపిన డిన్నర్ కంటిన్యూ చేయసాగాను.

టేబుల్ మీదున్న నా రెండో చేతిమీద తన చెయ్యుంచాడు శ్యామ్.

" అయామ్ సారీ కృష్ణా. ఎందుకో నాకు స్ట్రాంగ్ గా అలా అనిపించింది. లైఫ్ తో విసిగిపోయి ఓ తోడు కోరుకుందేమో? ఇక్కడ ఏ కబంధ హస్తాలనుండి పారిపోవడానికింకో భ్రమని ఆశ్రయించిందో, అతడేం వంచించాడో అని డౌటొచ్చింది. తప్పేముందిరా? అడుగు తడబడిన ప్రతి వ్యక్తీ అపవిత్రుడైపోడుగా?"

నేనేం సమాధానం చెప్పలేదు. నా ప్లేట్ లో వున్న భోజనం కంప్లీట్ చేసి తలెత్తాను. శ్యామ్ నావైపే చూస్తున్నాడు నా రెస్పాన్స్ కోసం.

"శ్యామ్ తులసి తప్పొప్పుల గురించో, తన డెసిషన్స్ గురించో నాకు తెలుసుకునే వుద్దేశ్యం లేదు. నాకనవసరం కూడా. ఐనా నువ్వన్న ఆ యాంగిల్ లో ఆల్రెడీ చాలామంది ఆలోచించేసారు. కోమల్, బృందా, హేమాంగిగారు, తులసి తల్లితండ్రులూ, అలా చాలామంది.

ఐనా తులసిని నమ్మడానికి నాకే రుజువులూ, సాక్ష్యాలు కావాలా. తను నా ఫ్రెండ్ అది చాలదూ. తన గురించి తెలీదూ.

కానీ నేను వచ్చింది ఒకే ఒక్క రీజన్ తో. తులసి తన ఆఖరి మాటగా ఒక విషయం చెప్పింది, తనే తప్పూ చేయలేదు. కేవలం నమ్మమని. నో ఎక్స్ప్లనేషన్ నథింగ్. ఇట్ వజ్ ఎ డెత్ స్టేట్మెంట్. అందులో డిజ్గైజ్డ్ గా వున్న నిజాన్ని, నొప్పిని నేను నమ్ముతున్నాను. కేవలం నమ్మడం మాత్రమే కాకుండా, నేను నమ్మిన నిజాన్ని ప్రూవ్ చేయాలనే నా ఈ ప్రయత్నం అంతా.

అందరూ భావించినట్టు తన అడుగే తప్పయినా, లేక మరే మోసానికి బలైనా దానివెనుక ఏదో బలమైన కారణం వుండే వుంటుంది. అదేంటో తెలుసుకోవాలి, ఈ జనాలందరికీ కాకపోయినా కనీసం తనవారికైనా తెలియజేయాలి. అంతే. తన నిజాయితీ ఎవరికీ పట్టకపోయినా రేపన్నరోజు అట్లీస్ట్ తన చైల్డ్ కి తల్లిమీద ఇష్టాన్ని చంపేయకుండా వుండడానికి పనికొస్తేచాలు.

ఐనా తులసి నన్నేమీ కోరలేదు, నమ్మమని తప్ప ప్రూవ్ చేయమనలేదు. నా నమ్మకాన్ని తులసికి తెలియజేయాలి. ఎక్కడవున్నా తనకి. జస్ట్ ఎ. ఐ మీన్. ఇట్స్ ద ఓన్లీ ట్రిబ్యూట్ ఐ కెన్ పే హర్. అంతే." చెప్పేసి లేచి ధాబా బయటికి వచ్చి చేతులు, ముఖం కడుక్కున్నాను.

జేబులోంచి కర్చీఫ్ తీసి ముఖం తుడుచుకున్నాను. తెలుస్తోంది. చాలా రోజుల తర్వాత నా కళ్ళతోపాటూ, మనసూ తడుస్తోంది.

తలెత్తి దూరంగా కనిపిస్తున్న నగరం వైపు చూసాను. గంగానది తల్చుకున్నాను. రకరకాల మాలిన్యాలు కలిసినంత మాత్రాన గంగ పవిత్రత ఇసుమంతైనా తగ్గదంటూ మొక్కే మనం. కాస్తంతకే పొరపాట్లకే మన వారి కళ్ళనుండి నెత్తుటి నదులు ప్రవహింపజేస్తాము. హౌ మీన్.

నా భుజం చుట్టూ చేయి బరువుగా పడింది. చప్పున కర్చీఫ్ తో ముఖం మరోసారి అద్దుకుని వాడి వైపు చూసి అడిగాను, "తిన్నావా పూర్తిగా?",

ముఖంలోకి నవ్వు తెచ్చుకుంటూ చెప్పాను, "లేదంటే నువ్వూరుకునే రకమా?" నవ్వి తలపరికించాను.

టాక్సీ స్టాండ్ వైపు దారితీసాము, " సారీరా", చెప్పాడు సిన్సియర్ గా. తేలిగ్గా నవ్వేశాను.

"ఐ వాజ్ జస్ట్ .. గాట్ సో క్యారీడ్ అవే విత్ ద సిట్యుయేషన్స్ అండ్" అంటూ చెప్పబోతున్న వాడిని చప్పున వారించాను.

"ఏం చెప్పనవసరం లేదురా. తులసి మనకి ఏమిటో, మనం ఒకరికొకరం ఎక్స్ ప్లెయిన్ చేసుకునేంత దుస్థితిలో లేము మనం.

ఏ బంధం లేకుండా పెళ్ళి గట్టిగా నెల కూడా తిరక్కుండా భార్యనీ, ఫ్యామిలీనీ, ఎంజాయ్ చేసే టైమ్ నీ వదిలి ఇలా రోడ్లు పట్టుకుని తిరగరింకెవరూ. సో.. డోన్ట్ సే ఎనీథింగ్. పద తినడానికి ఇంతసేపు అంటే ఆ టాక్సీవాడు వెయిటింగ్ ఛార్జెస్ కింద ఆస్తులడుగుతాడు" చెప్పాను.

నవ్వి తలూపాడు వాడు,"కరక్టే పద పద"

కోమల్ చెప్పిన రామ్ గఢ్ లో ఎక్కువ వెతకక్కర్లేకుండానే తులసి వాళ్ళ అడ్రస్ దొరికిపోయింది, ఒకేఒక పెద్దగుడి, ఆ గుడికి దగ్గర్లోనే జగదీష్ (?!) షాపు, అది మూసేవుంది మేం చూసేసరికి, ఆ వెనకే ఓ చిన్న ఇంట్లో వాటాలో కాపురమని అక్కడ అడగగానే తెలిసిపోయింది ఎక్కువేం అడగకుండానే.

"చాలా మంచి వారిలాగే అనిపించారు. మాతో కూడా స్నేహంగా, కలివిడిగా వుండేవారు. కొండమీద గుడి దగ్గరే వాళ్లుండేది. ముందువైపు షాపు, వెనుకవైపు ఇల్లు. వాళ్ళిద్దరే వుండేవాళ్ళు.  రెండువాటాల ఇంట్లో వీళ్ళదో పోర్షన్, గుడి ఆఫీసులో పనిచేసేవాళ్ళదో పోర్షనూ" చెప్పాడు త్రిపాఠీ అనబడే ఆ ఇంటి ఓనర్.

"అతడు ఎలాంటి వాడో చెప్పగలరా సర్?"

"అతడా... ఓ.. మర్చిపోయాను అతని అసలు పేరు తెలియదుకదూ, అతగాడు తనపేరు జగదీష్ అనే చెప్పాడు మాకందరికీ. చాలా చక్కటి మాటకారి. ఎన్నో విషయాలు తెలుసు అతనికి. ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూ వుండేవాడు, చురుకైన కుర్రవాడు. షాపు బాగా నడిపేవాడు. వచ్చేవారి అవసరాలు గమనించి రకరకాల కొత్త కొత్త వస్తువులు తెచ్చేవాడు.

వాళ్ళిద్దరూ మంచి భార్యాభర్తల్లాగానే కనిపించారు. పైగా కాశీలో బాగాపేరున్న పండిత్ జీ కొడుకూ, కోడలు వచ్చారనేసరికీ మాకు వేరే వివరాలు తెలుసుకోవాలనే ఆలోచనే రాలేదు. వాళ్లూ చాలా పద్ధతిగావుండేవాళ్ళు. షాపు, ఇల్లు,

గుడి. వాళ్ళపనేదో వాళ్ళదిలాగా. ఆ అమ్మాయి కూడా మా ఇంట్లోవాళ్ళతో బాగానే కలివిడిగా వుండేది. ఏడాదిన్నర పాటు ఇక్కడవున్నా ఎలాంటి హంగామా లేకుండా రోజులు గడిపిన సాధారణమైన జంటలాగే కనిపించారు.

హఠాత్తుగా అర్జంటు పనుందంటూ ఆ అమ్మాయి నెలలైవుండగా ఒకరోజు హడావిడిగా వెళ్ళినవాడు రెండు, మూడు రోజులైనా తిరిగిరాలేదు. తన మరిది పెళ్ళివుందనీ, ఇంట్లోవారి మీద అలిగి భర్త వెళ్ళద్దన్నాడుగానీ, బహుశా మనసాగక అటే వెళ్ళుంటారనీ, తానూ వెళ్తానంటూ, మేం వద్దన్నా వినకుండా ఒంటరిగానే ఆ పిల్ల బయల్దేరింది. నేనే కొండ దిగువ వరకూ తోడుగా వెళ్ళి టాక్సీ కట్టించి పంపాను ఆమెని, పాపం ఒక్కత్తీ ఎలా వెళ్తుందని. తర్వాత పోలీసులు ఇంక్వైరీకి వచ్చేవరకూ తెలియలేదు ఆ పిల్ల చనిపోయిన సంగతి" నిట్టూర్చారా పెద్దాయన.

"అతడి గురించి మీకెప్పుడైనా ఏదైనా సందేహం వచ్చేలా ఏదైనా ఇన్సిడెంట్?" అడిగాను.

"లేదు బాబూ, అలాంటిదేమీ లేదు" చెప్పారు.

"ఆ అమ్మాయి గురించీ?" కాస్త బెరుగ్గానే అడిగాను.

"లేదు, మాకే సందేహమూ కలగలేదు. అసలు ఏ భయంలేకుండా, అంత ధీమాగా ఓ లేచిపోయొచ్చిన జంట అలా ఈ చిన్న పల్లెటూళ్ళో ఎలా వున్నారా అనేది నాకిప్పటికీ ఆశ్చర్యమే!"

"మీ ఇంట్లో వాళ్లతో మాట్లాడవచ్చా సర్" వీలైనంత రిక్వెస్టింగా అడిగాను. అప్పటివరకూ నిదానంగా సమాధానాలు చెప్తున్న ఆయన నుదురు చిట్లించారు. ఏదో అనబోయి, మళ్ళీ మనసు మార్చుకున్నారేమో, "రండి", అంటూ లేచి లోపలికి నడిచారు. లోపలివైపున్న మండువాలాంటి పెద్దగదిలో మంచంమీద ఓ పెద్దావిడ కూర్చుని జపమాల తిప్పుకుంటున్నారు. మరో మూల టీవీలో ఏదో ప్రోగ్రామ్ చిన్నవాల్యూమ్ తో చూస్తూ ఓ నడివయసు స్త్రీ కూరలు కోస్తున్నది.

"మా అమ్మగారు, నా భార్య. పిల్లలంతా ఉద్యోగాలూ, పెళ్ళిళ్లూ అయ్యాకా వేర్వేరు చోట్ల సెటిల్ అయ్యారు, అప్పుడప్పుడూ వచ్చిపోతుంటారు. ఇక్కడవుండేది మేమే" చెప్పారాయన.

వారికి నమ్రతగా చేతులు జోడించాము. ముసలావిడ మంచం పక్కగా వున్న చిన్న బల్లమీద కూర్చున్నాము.

వేడిగా టీ, సమోసా తీసుకునివచ్చి ఇచ్చారాయన భార్య. ప్రయాణం హడావిడిలో మర్చిపోయిన ఆకలి బాధ చప్పున గుర్తొచ్చి మొహమాటానికి కూడా కాదనకుండా తినేసాము. టీ కూడా కడుపులో పడ్డాకా కాస్త బుర్ర పనిచేయడం మొదలు పెట్టింది.

"సారీ. మీకు ట్రబుల్ యిచ్చాము" మొహమాటంగా చెప్పాము.

"అదేం పరవాలేదు. చాలా దూరం నుండి వస్తున్నారు ఆమాత్రం చేయలేమా?" చెప్పిందావిడ.

"వాళ్ళకు ఆ అమ్మాయికి సంబంధించిన వివరాలు కావాలట" చెప్పాడాయన.

"ఎందుకు? తెలుసుకుని ఏంచేస్తారు?" అడిగిందావిడ.

మేం తయారు చేయాల్సిన రిపోర్ట్ గురించి అందరికీ చెప్తున్న స్టోరీయే రిపీట్ చేసాను. సూటిగా చూసిందామె., "కేవలం ఒక రిపోర్ట్ లో రాయడానికి అన్ని వివరాలెందుకు? ఏం రాసినా ఏం లాభం? ఆ అమ్మాయా బ్రతికిలేదు. పోనీ మీ రిపోర్టు ఆమెకు ఆర్థికంగానో, సామాజికంగానో, లేక కుటుంబపరంగానో సాయపడడానికి. మరి ఏకారణంతో వివరాలు సేకరిస్తున్నారు? కేవలం అందుకే ఇంత దూరం వచ్చారా?" అడిగింది ప్లెయిన్ గా.

ఒక మారుమూల ప్రాంతంలో నివసిస్తున్న స్త్రీకి వున్న అంత చక్కటి లాజికల్ ఆలోచనకి ముచ్చటేసింది. ముద్ర గుర్తొచ్చింది. అచ్చం ఇలాగే మాట్లాడుతుంది తను.

"ఈ రోజు ఈ రిపోర్ట్ ఓ కాగితం ముక్కే అయినా ఆమెకి కావలసిన వారికి ఏనాటికైనా ఇది ఉపయోగపడుతుందని మా నమ్మకం, రేప్పొద్దున్న ఇది ఆమె యొక్క కేరక్టర్ సర్టిఫికెట్ లాంటిదమ్మా. ఆమె తల్లితండ్రులకీ, బిడ్డకీ, తనవారికైతే తెలియాలి కదా జరిగిందేమిటో. నిజమేమిటో."

"అంటే మీ ఆర్గనైజేషన్ ఆమె తప్పులేదని నమ్ముతోందా? ఆమెని సమర్థిస్తోందా?" ఊహించని ఆ ప్రశ్నకి ఉలిక్కిపడి చూశాను.

తేరుకుని చెప్పాను, "అవును, సాక్ష్యాలు ఆమెకే వ్యతిరేకంగావున్న ఈ కేసులో ఆమె డెత్ స్టేట్మెంట్ కీ, వింటున్న విషయాలకీ కొంత తేడా వుంది. అందుకే ఇంతలా అడగాల్సివస్తోంది. మీకు తెలిసినది చెప్తారా ప్లీజ్?" ఈసారి నా రిక్వెస్ట్ లో ఫర్మనెస్ ధ్వనించింది. తల పరికించిందావిడ.

"ఆ అమ్మాయి చాలా మంచిదానిలాగే కనిపించింది, వాళ్ళూ అన్యోన్యంగా వుండేవారు. భర్త కోసం ఎప్పుడూ ఏవేవో వ్రతాలు, ఉపవాసాలు చేస్తూవుండేది కూడా. కడుపుతోవుందని తెలిసాకా, అలాంటివన్నీ వద్దని మేమే కోప్పడి మాన్పించాము. ఆ పరిస్థితిలో కనీసం పుట్టింటికైనా పంపకుండా ఒంటరిగా ఇక్కడే వుంచేసాడని అనుకునేవాళ్లం.

వారు వెళ్ళిన రెండు, మూడురోజులకే పోలీసులొచ్చారు. మీ సహారా వాళ్ళూ వచ్చారు, పేపర్లవాళ్ళూ, టీ.వీ వాళ్ళూ వచ్చి ఏమేమో మాట్లాడారు. వాళ్ళ ఇల్లంతా వెతికారు, తనిఖీ చేసారు. చివరికి కొంత హడావిడి చేసి వెళ్ళిపోయారు.

**ఇంటికి ఫోన్ చేయాలన్నా**, లెటర్ రాయాలనీ అడిగినా చాలా చికాకుపడి, విసుక్కునేవాడని మాత్రం తెలుసు. ఎప్పుడైనా ఒకసారి తనే ఫోన్ చేసిచ్చి ఓ పదినిమిషాలు మాట్లాడనిచ్చి తీసేసుకునేవాడు. పుట్టింటివారికీ, అత్తింటివారికీ దూరంగా, అలా వున్నందుకు కాస్తంత బాధపడుతున్నట్టే కనిపించేది అలాంటి సందర్భాల్లో. ఎక్కువ శాతం తన బాధ బయటపెట్టేది కాదు. కాకపోతే, చిన్న చిన్న మాటల్లో మాకు అర్థమయ్యేది" చెప్పిందావిడ.

బాధని బయటపెడితే అది తులసి ఎందుకవుతుంది? ఎప్పుడూ మౌనంగానే ప్రతీ చిన్నా, పెద్దా ఇబ్బందులని తనలోనే దాచేసుకునే మా తులసి చివరకి తన గుండె గుప్పిట్లో ఏ నిప్పు దాచుకుంద, .అది చివరికి ఏ దావాగ్నిగా మారి ఆమెని నిలువునా దహించేసిందో. ఆ విషయం తెలియకే కదూ మేం ఇలా వెతుక్కుంటూ తిరుగుతున్నాం.

బాధగా అనుకుని, ఆవిడ మాటలమీద దృష్టి పెట్టాను.

"మరిది పెళ్ళని తన భర్త వెళ్ళుంటాడేమో అని ఊహించుకుని తను అలా ఒక్కత్తే వెళ్తున్నప్పుడే మాకనిపించింది, ఏదో ప్రాబ్లెమ్ అయితే వుంది, లేదంటే నెలలునిండిన అమ్మాయిని ఒంటరిగా వదిలి అలా ఎలా వెళ్ళిపోతాడు ఏ భర్తైనా, కనీసం కబురు కూడా చెయ్యకుండా, ఓ ఫోన్ కూడా లేకుండా అని అనుకున్నాం. తన దగ్గర కనీసం ఓ సెల్ ఫోన్ కూడా వుంచకపోవడం వింతగా అనిపించేదిగానీ, వాళ్ళ పరిస్థితులేంటో అనుకుని ఎప్పుడూ అడగకుండా వూరుకున్నాం.

కారణాలేవైనప్పటికీ అన్నాళ్ళూ ఆమె వున్నదీ, మా ఇంట్లో కలిసి కాపురం చేసిందీ తన భర్తతో కాదూ, పరాయివ్యక్తితో, అంటే మాత్రం నమ్మలేకుండావున్నాం. చాలా అసహ్యంగా అనిపిస్తోంది, ఆమెనంతగా నమ్మినందుకు. కానీ, ఆమె గురించి తలుచుకుంటే ఎందుకో ఆమెని పూర్తిగా అసహ్యించుకోనూ లేకపోతున్నాం. బహుశా మీరన్నట్టు ఏదో బలమైన కారణంవుండివుండచ్చేమో?" ఆగింది కాస్తంత బాధగా.

"ఎంత బలమైన కారణం వుంటే మాత్రం" హఠాత్తుగా మాట్లాడింది అప్పటివరకూ మౌనంగావున్న త్రిపాఠీ గారి తల్లి, అప్రయత్నంగా ఆవిడ వైపు చూసాం.

"ఎంత పెద్ద కిలాడీ కాకపోతే అన్నాళ్ళు, వేరేవాడితో కాపురం చేస్తుందీ ? భయపెట్టీ, బెదిరించీ, లేదా ఆశ చూపీ ఎవ్వరూ అన్నాళ్ళపాటు ఓ ఆడదాన్ని కట్టివుంచలేరు. దానంతట అది కోరి కోరి వస్తే తప్ప" అన్నదా ముసలావిడ.

శ్యామ్ తలవంచుకున్నాడు. అభావంగా చూశాను. నా చేతిలో వున్న రికార్డర్ ఎంత నిర్వికారంగా పనిచేసుకుంటూ పోతోందో, నేనూ అంతే మెకానికల్ గా నోట్ ప్యాడ్ లో నాలుగు ముక్కలు రాసుకుని వాళ్ళవైపు చూసి అడిగాను, "వారి కోసం ఎవరైనా వచ్చేవారా, స్నేహితులూ, బంధువులూ?"

"బంధువులంటే ఎవరూ రాలేదు గానీ, అప్పుడప్పుడూ నలుగురైదుగురు స్నేహితులొచ్చేవారు."

"ఫ్యామిలీస్ తోనా?"

"లేదు. అతను ప్రతినెలా షాపు కోసం సరుకులు తీసుకొచ్చినప్పుడు తోడుగా వచ్చేవారు, విడిగా రాగా చూసిన గుర్తులేదు."

"ఎవరిపేర్లైనా, వివరాలైనా?"

"లేదు, ఏదో చూసి ఓసారి పలకరించడం తప్ప పరిచయంలేదు" చెప్పారు త్రిపాఠీగారు.

ఇంకేం అడగాలో అర్ధంకాలేదు, చుట్టుపక్కల ప్రశ్నించాం. అందరి దగ్గరా అదే జవాబు. ఒకరిద్దరు కాస్త విమర్శిస్తే, మరి కొందరు చాలా అసహ్యంగా మాట్లాడారు. అందరికీ ఒకటే కోపం. భార్యాభర్తల్లావుంటూ తామందర్నీ ఫూల్స్ చేసారు అని. తులసి చనిపోయింది కాబట్టి కొంతమంది ఆ జాలి వల్ల ఏమీ అనలేక వూరుకున్నారని అర్ధమైంది.

వాళ్ళు వుండి వెళ్ళిన వాటా చూశాము. వెనకవైపు పెరడునిండా పచ్చటి పూల మొక్కలు, చూడగానే అర్థమైంది తులసి వుండి వెళ్ళిన చోటనీ. తులసి వదిలి వెళ్ళిన తోటనీ.

ఒక్కోమొక్క ముందూ ఆగి చూసి కదులుతున్న నన్ను చూసి త్రిపాఠీగారు అన్నారు, "మీక్కూడా మొక్కలంటే ఇష్టమా?" అంటూ.

తలూపాను.

ఇల్లు చిన్నదే. ఖాళీగా వుండడంతో మరింత విశాలంగా కనిపిస్తోంది. పోలీసులు తీసుకెళ్ళగా మిగిలిన సామాన్లు పడేసి ఇల్లు ఖాళీ చేయించి కడిగించేసామని వారు చెప్పారు.

ఇక ఇక్కడ కూడా తెలుసుకోవలసినది ఏమీ కనిపించలేదు. త్రిపాఠీగారి ఫోన్ నంబర్ తీసుకుని బస్టాండుకి నడిచాము.

మాకు కోమల్ భర్త వేరే వూరు వెళ్ళడంతో అతనితో మాట్లాడడం కుదరలేదు. ఇక ఎక్కువ టైమ్ లేదు. నాన్నా వాళ్ళూ నా పెళ్ళి ముహూర్తం దగ్గరపడుతోందీ, తిరిగిరమ్మంటూ కంగారు పెడుతున్నారు. వారంలో అంతా తెలుసుకోగలిగితే సరే. లేదంటే పెళ్ళి వాయిదా వేయక తప్పేటట్టులేదు. చూడాలి ఏం చేయగలమో?

"సో.. వాట్ నెక్స్ట్?" అడిగాడు శ్యామ్.

"జగదీష్ ప్రకారం తను బిజినెస్ పెట్టడానికి వెళ్ళిన చోటికి వెళ్తున్నాం" చెప్పాను. అయోమయంగా చూసాడు శ్యామ్.

"పర్పస్?"

"జగదీష్ గురించి ఏమైనా తెలియవచ్చు.చూద్దాం" సాలోచనగా చెప్పాను.

మాతా టేక్డీ. ఆ ప్రాంతానికి వెళ్ళడం నిజంగానే చాలా కష్టమైంది. పక్కన వున్నన టౌన్ వరకూ ట్రైన్ లో. తర్వాత బస్ లో. మరి కొంత దూరం కాలి నడక.

బాగా చల్లటి ప్రాంతంలో, దట్టమైన అడవుల్లో ఎప్పట్నుంచో వున్నా భక్తుల రాకపోకలతో ఇప్పుడిప్పుడే ఫేమస్ అవుతున్న కాళీమాత గుడి అది.

పురాతనమైన ఆలయప్రాంగణం, బయట కొన్ని షాపులు, ఓ చిన్న టీ బడ్డీ, దూరంగా అక్కడొకటీ, అక్కడొకటీ చప్పున ఓ పాతిక, ముప్ఫై ఇళ్లు తప్ప మరేమీ లేని అటవీప్రాంతం అది.

"ఇంత రిమోట్ ప్లేస్ లో ఇక్కడేం బిజినెస్ డెవలప్ చేద్దామని వచ్చాడు?" తెల్లబోతూ అన్నాడు శ్యామ్.

"మ్... ఏమో? ఇప్పుడు చాలా ఫేమస్ అయిన పుణ్య క్షేత్రాలన్నీ ఒకప్పుడు ఇలా వున్నవే కదరా అలా ఆలోచించాడేమో?" అన్నాను.

"మైట్ బీ ", భుజాలెగరేస్తూ తేలిగ్గా అన్నాడు.

అక్కడ జగదీష్ షాప్ ని ప్రస్తుతం నడుపుతున్న వ్యక్తిని కలిసాము. అతని పేరు సావంత్ గుప్తా. అతన్ని అడిగాం వివరాలకోసం, జగదీష్ తమ్ముడు వచ్చి కొంత డబ్బుతీసుకుని ఆ షాపు తనకి అమ్మేసి వెళ్ళిపోయాడని చెప్పాడు. మేము ఢిల్లీ నుండి వస్తున్నాము సహారా నుండి అనగానే మాకు తెగ మర్యాదలు చేసాడు.

కాసేపటికి అర్థమైంది మాకు, ఆ మర్యాదల వెనుక సంగతి. అతను మమ్మల్ని సహారా అనే టీ.వీ. ఛానెల్ నుండి వస్తున్నాం అనుకుంటున్నాడని. అంతా టీ.వీ. ఛానెల్ మహత్యం అని. మేము కూడా క్లారిఫై చేసే ప్రయత్నం చేయలేదు, బై హుక్ ఆర్ క్రుక్ వీలైనంత ఇన్ఫర్మేషన్ రాబట్టడమే మాముందున్న ధ్యేయం ఇప్పుడు.

బనారస్ లో కొంచెమన్నావిన్నారు విమెన్స్ ఆర్గనైజేషన్, అదీ అని చెప్తే ఇక్కడ కనీసం చెవుల్తో కూడా వినరు, టైమ్ వేస్ట్ అని చెప్పి, ముందే అవతలకి పొమ్మంటారు, నో డౌట్. గ్యారంటీగా. సో ప్రస్తుతం ఆ టీవీ ఛానెల్ పేరే మా సేవియర్.

జగదీష్ షాప్ ఐడియా, వెరైటీగా బాగుంది., పూజ సామాన్లు అమ్మే చిన్న, చిన్న షాపులు ఇలాంటి పుణ్యక్షేత్రాల్లో చాలానే వుంటాయి, కాకపోతే ప్రసాదాలే కాక, వాటిని భక్తులే స్వయంగా తయారు చేసుకోవడానికి కావలిసిన గిన్నెలూ, నైవేద్యాలు పెట్టుకోవడానికి సామాన్లు వగైరాల దగ్గరనుండీ, అన్నీ సప్లై చేసే షాపు అతనిది.

ఎవరికైనా కావలసివస్తే వీళ్ళే శుచిగా తయారు చేసి ఇస్తారట కూడా. గుడి నుండి పర్మిషన్ కూడా తీసుకున్నారు. దాంతో భక్తులు కూడా ప్రసాదాలకే కాక, చుట్టుపక్కల బస చేసినప్పుడు భోజన ఏర్పాట్లకు కూడా వీరిపై ఆధారపడుతుంటారు. అందువల్ల ఆదాయం బానే వుంది, పోను, పోను ఇంకా బాగుంటుంది అని వారి ఆశ.

మంగళ-శుక్రవారాలూ, అమావాస్య, పౌర్ణమిలప్పటి ప్రత్యేక పూజల రోజుల్లో బాగా రద్దీగానే వుంటుందిట ఈ క్షేత్రం.., మిగతా రోజుల్లో జనసంచారం బాగా తక్కువ. సాయంత్రంవేళల్లో అయితే మనిషిజాడే వుండదు బయట, ఉన్న కొద్దిపాటి ఇళ్ళల్లో జనాలూ గూటికి చేరిపోతారు అడవికదా చుట్టూ అనే భయానికి అంటూ అక్కడి విశేషాలు చెప్పుకొచ్చాడతను.

తొందర్లోనే ఆ క్షేత్రం ఎంతో ఫేమస్ అవుతుందనీ, ఎందరో దర్శనానికి వస్తారనీ, జగదీష్ చెప్పేవాడని కూడా అతని మెన్షన్ చేసాడు. జగదీష్ ఊహించినట్టే ఇప్పటికే సంవత్సర కాలంలోనే భక్తుల రాక రెండితలైందనీ, త్వరలోనే ఇంకా పెరుగుతుందనీ చెప్పాడు.

మా చేతుల్లో ఓ రెండు ఎండిపోయిన వడా-పావ్ లు పెట్టి., కాసేపట్లో వంటచేసే వ్యక్తి వస్తాడనీ, మేము దర్శనం చేసుకునివచ్చేవరకూ వంట రెడీ అవుతుందనీ ఉత్సాహంగా హామీ ఇచ్చాడు."

జగదీష్ గురించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలంటే ఆ రోజు అక్కడ గడపడం కంపల్సరీ అని భావించి ఆ వడాపావ్ లే కష్టపడి తిన్నామనిపించాము. అతని మాట ప్రకారం అక్కడే ఫ్రెష్ అయ్యి దర్శనానికి కూడా కదిలాము.

మేం తిరిగొచ్చేసరికి మాట ప్రకారం సావంత్ డిన్నర్ రెడీ చేయించాడు. భోజనం మాత్రం బాగుంది. టిపికల్ నార్త్ ఇండియన్ ట్రెడిషనల్ ఫుడ్. భోజనం చేసి రాత్రికి అక్కడే వుంటామని చెప్పడంతో మాకో రెండు ఫోల్డింగ్ బెడ్స్ ఇవ్వబడ్డాయి. వాటిని అక్కడవున్న హాల్ లాంటి గదిలో ఓ పక్కకి పరుచుకున్నాం. సావంత్ కూడా మాతో పాటే మరో పక్కగా వున్న బెడ్ మీద కూర్చున్నాడు.

"మీరు రోజూ రాత్రిళ్ళు ఇక్కడే పడుకుంటారా సావంత్ ?" మాటలు కలుపుతూ అడిగాడు శ్యామ్.

"హా.. రష్ వున్న రోజుల్లో ఐతే ఇక్కడే వుంటాను. లేని రోజు ఇంటికి వెళ్ళిపోతాను. ఇక్కడ ఫోన్ సిగ్నల్ కూడా సరిగ్గా రాదు. మనుషులు కనపడకుంటే టీ.వీ, రేడియోలతో ఎంతసేపని వుంటాం చెప్పండి. అలా ఉండడం కష్టం. అందుకే పని వుంటేనే వుంటాము." చెప్పాడు.

"జగదీష్ ఎక్కడవుండేవారు?" అడిగాడు శ్యామ్.

"ఇక్కడే. మాలాగా ఆయన వేరే ఇల్లు తీసుకోలేదు. ఫ్యామిలీ షిఫ్ట్ చేయలేదు. సెటిల్ అయ్యాకే ఫ్యామిలీని తీసుకొస్తానని చెప్పేవారు. ఈ బెడ్, అల్మారు, ఆ సామాను కూడా ఆయనవే" తాను కూర్చున్న పరుపు, చుట్టూ వస్తువులు చూపుతూ చెప్పాడు.

ఉలిక్కిపడి చూశాను. పరిశీలిస్తే ఏమైనా వివరాలు దొరకొచ్చా? నా కుతూహలాన్ని దాచిపెడుతూ అడిగాను "అప్పుడప్పుడంటే పర్లేదుగానీ, రోజూ ఒంటరిగా ఇక్కడే వుండాలంటే కష్టమే.. ఎలా మేనేజ్ చేసేవాడో కదూ!", యధాలాపంగా అన్నట్టు అన్నాను.

"అదేసార్ మేమూ చెప్పిచూసాము, గుడి పూజారులకీ, లోకల్ గా వుండేవారికీ అయితే వారి కుటుంబాలు ఇక్కడే కాబట్టి అలవాటే. మాలా బతుకుతెరువుకోసం వచ్చినవారికి కష్టమే. నేను అలహాబాద్ నుండివచ్చాను. జగదీష్ బాబు బనారస్ నుండి. అంత పెద్ద నగరం నుండి వచ్చి ఇలాంటి చోట ఎలా వుండేవారో ఆయనకే తెలియాలి. పోనీ, అంత కష్టపడి వున్నందుకు ప్రయోజనమూ దక్కలేదు" నిట్టూర్చాడు.

"మీరుసరే, అతని తరపువాళ్ళు వచ్చినప్పుడైనా చెప్పలేదా, ఇలా ఒంటరిగా ఎందుకనీ" వింతగా చూస్తూ అడిగాను.

"ఎవరూ వచ్చేవారు కాదు సాబ్ " చెప్పాడు సావంత్.

తెల్లబోయి చూసాను, "ఏంటీ కనీసం స్నేహితులు కూడా వచ్చేవారుకాదా? అదేమిటి?"

"అదే సాబ్. చిత్రమైన మనిషి. ఆ ఫ్రెండ్ వచ్చినప్పుడే అతనితో కలిసి బయట ఊరికి వెళ్ళి కావలసిన వస్తువులు తెచ్చుకుని వచ్చేసేవాడు. తరువాత తెలిసింది, కనీసం ఇంటికి ఫోన్ కూడా చేసేవాడు కాదుట. చూడండి. ఏదో టీవీలో చూపించే క్రైమ్ సీరియల్స్ లోలాగా ఈయన్ని ఇక్కడ పెట్టి ఎవడో అక్కడ ఇతని పెళ్ళాన్ని లైన్లో పెట్టేసాడు.

ఏదో సాధించి, ఉద్ధరించి అప్పుడు తనవారి ముందుకెళ్ళాలని పెద్దపెద్ద కలలు కన్నాడు, మొదటికే మోసంవచ్చింది. ఇంతకుముందువున్న పరువు కాస్తా కూడా పోయి రోడ్డునపడ్డాడు. మొత్తానికి ఆ దుర్మార్గులిద్దరూ కలిసి ఇతన్ని గాడిదని చేసారు. అసలు వాళ్ళూ", అంటూ రెండు,మూడు నీచమైన నాటు తిట్లతో పూర్తిచేసాడు తన సెంటెన్స్.

గుండె భగ్గున మండి కోపం ముంచుకొచ్చింది ఆ తిట్లు వింటూనే, కానీ, తప్పక నిగ్రహించుకున్నాం. కాసేపు వేరే సంగతులూ, గుడి విశేషాలూ మాట్లాడాకా, వారిద్దరూ నిద్రలోకి జారుకున్నారు.

కాసేపు నిద్ర పట్టించుకోవడానికి ప్రయత్నించి సాధ్యంకాక, బెడ్ మీదనుంచి లేచి బయటకి నడిచాను. షాపు మెట్లమీద కూర్చుని గుడివైపు చూడసాగాను. గుడి బయటున్న ఒక్క స్ట్రీట్ లైటూ, షాపుల బయట మినుకుమనే చిన్న, చిన్న బల్బులూ తప్ప ఏమీ లేవక్కడ. కాస్త దూరంలో గుడిలోపలవైపుగావున్న రెండుమూడు వాటాల్లోని పూజారుల ఇళ్ళల్లోంచి వినిపిస్తున్న గిన్నెల చప్పుడు కూడా కాసేపట్లోనే సద్దుమణిగింది. ఆ నిశ్శబ్దంలో, చిరుగాలి సడి, ఎండిన ఆకులు కదులుతున్న చప్పుడు, ఎక్కడో లీలగా వినిపిస్తున్న రేడియో సౌండ్ తప్ప ఏ సవ్వడీ లేని ఆ ప్రదేశాన్ని గమనించసాగాను.

ఇలాంటి చోట, దాదాపు ఏడాదిన్నరపాటు, కుటుంబానికీ, స్నేహితులకీ, సరదాలకీ, సంతోషాలకీ దూరంగా గడిపిన జగదీష్ గురించి ఆలోచించసాగాను.

తన సొంత బిజినెస్ డెవెలప్ చెయ్యాలనే అతని కోరిక అంత తీవ్రమైనదా? ఓన్లీ దాని కోసం ఇంత కష్టపడ్డాడా? మరి అతని కుటుంబం ఎందుకంత వ్యతిరేకించింది? ఎందుకు అతన్ని ఒంటరివాణ్ణి చేసిందీ విషయంలో? ఎందుకు ఎవరిమీదో తన పెట్టుబడికి ఆధారపడల్సివచ్చింది? ఒకవేళ అందుకోసమే అతను, తెలిసీ, కావాలనే తులసిని ఏదైనా దారుణమైన వ్యవహారంలో ఇరికించీ, బెదిరించీ తన ఎవరితోనైనా పంపలేదు కదా? తుళ్ళిపడి తల విదిల్చాను.

ఛ ఏమిటిలా ఆలోచిస్తున్నాను. ఐనా ఏమో? ఎదగాలనే వ్యామోహం అతన్ని ఎంతకైనా తెగించేలా చేయలేదని గ్యారెంటీ ఏంటి? నాకు తెలిసినది తులసి మాత్రమే. జగదీష్ కాదు. సో హీ కెన్ బీ లైక్. లైక్ ఎనీథింగ్ ఫ్రమ్ ఏన్ ఏంజెల్ టూ ఎ బీస్ట్ చూడాలి. ఐనా తులసి విల్లింగ్ గానే అక్కడుందనే విషయాన్ని నేను విస్మరించకూడదు. కాకపోతే తులసి

పిచ్చిదైతే కాదు కదా అలాంటి డీల్స్ ఒప్పుకోవడానికి, అనుకుంటూ, ఆలోచిస్తూ అలసటగా కళ్ళుమూసుకుని గోడకి జారబడ్డాను.

ముద్ర గుర్తొచ్చింది. తనతో మాట్లాడాలని బలంగా అనిపించింది. కానీ సిగ్నల్ లేదు. మెయిన్ రోడ్ వరకూ వుండదు. వెళ్ళే ఓపిక ఏమాత్రంలేదు. చీకట్లో నాకు దారీ తెలీదు..

ముద్ర ఎలావుందో? పాపం, తను అందర్నీ ఎలా సమాధానపరుచుకుంటోందో? కొద్ది రోజుల్లో పెళ్ళి పెట్టుకుని నేను చేస్తున్న ఈ పనిని ఎవ్వరూ హర్షించరు. తెలుసు. కానీ, లక్కీగా ముద్ర అర్థంచేసుకుంది కాబట్టి సరిపోయింది. లేదంటే నేనింత హేండిల్ చేయగలిగి వుండేవాడినా?

శ్యామ్ వైపు చూసాను. ప్రశాంతంగా నిద్దురపోతున్నాడు, పాపం, కొత్తగా పెళ్ళైనవాడు, హాయిగా ఎంజాయ్ చెయ్యాల్సిన టైమ్ లో ఇలా. కేవలం ప్రీతి సపోర్ట్ చేయబట్టేగా వాడుకూడా ఇక్కడున్నాడు. అడుగడుగునా మగవాడికి స్త్రీ సపోర్ట్ దొరుకుతూనే వుంటుంది, కానీ ఇదే ఓ స్త్రీకి? గడపదాటాలంటే ఎన్ని ఆంక్షలు దాటాలి, ఎన్ని ప్రశ్నలకు జవాబుదారీ వహించాలి.

ఆమెకి సమాజం నుండీ, కుటుంబంనుండీ మగవాడితో సమానంగా కాకపోయినా మినిమమ్ సపోర్ట్ అయినా దొరుకుతోందా?

ఒకవేళ సపోర్ట్ లేకున్నా ముందుకు సాగిన ఏ స్త్రీకైనా కనీస గౌరవం దక్కుతోందా?

యత్ర నార్యస్తు పూజ్యంతే. అంటూ నీతిని, నియమాల్ని ప్రపంచానికి నేర్పిన దేశంలో ఈరోజు నిజంగా స్త్రీ గౌరవింపబడుతోందా?

ముద్రా నువ్విక్కడుంటే బాగుండేది. రియల్లీ.

నేను ఇదంతా సాల్వ్ చేసుకుని వెళ్ళినరోజు అందరికంటే ఎక్కువ సంతోషించేది తనే. నాకు తెలుసు.

కానీ, నేను సాల్వ్ చేయగలనా? అసలు తులసిగురించి ఏమైనా తెలుసుకోగలనా? తను తప్పుచేయలేదని నేను నమ్మితే చాలదనీ, అందరూ నమ్మాలన్న ఈ నా ఆశ అత్యాశ ఐతే కాదుకదా?

"కృష్ణా! ఎలావున్నావ్?", సున్నితంగా నన్ను ఎవరో తడుతూలేపుతున్నారు. అతి కష్టంమీద కళ్ళువిప్పాను. ఏదో టన్నుల కొద్దీ బరువుమోపిన నొప్పి నా రెప్పల్లో. ఎదురుగా చిరునవ్వుతో కూర్చుని వున్నారో వ్యక్తి.

"మీరు..మీరు..", అస్పష్టంగా గొణిగాను.

"రాత్రంతా బయటే పడుకుండిపోయావు. చలిగాలికి జ్వరంతగిలింది. అంతే. అయినా ఏంటీ కంగారు. చెప్పు? ఓ ఆడపిల్లకి న్యాయం జరుగదేమోనని కంగారుపడుతున్నావా? నీ ప్రయత్నం నువ్వు చెయ్యి. ఫలితం దైవాధీనమేకదూ.. కృష్ణుడి పేరుపెట్టుకున్నవాడివి, గీతా సారం నీకు వేరొకరు చెప్పాలా కృష్ణా?" మృదువుగా ప్రశ్నించారాయన.

"అందరూ గ్రహించి, ఆచరించగలిగితే ఈ లోకం ఇలాఎందుకువుంటుంది చెప్పండి " అన్నాను వేదనగా. ఆయన చిన్నగా నవ్వారు. ఆ నవ్వు నాకెందుకో చురుక్కుమని గుచ్చుకున్నట్టుకాగా బాధగా కళ్ళుమూసుకున్నాను.

"కృష్ణా. రేయ్. కృష్ణా.." శ్యామ్ పిలుపుతో దిగ్గున లేచి కూర్చున్నాను. చుట్టూ చూసాను. మెట్లమీదున్నాను. పక్కన శ్యామ్.

మరోసారి చుట్టూ చూశాను.

"ఆయనేరీ?"అడిగాను.

"ఎవరూ?ఎవరూలేరే?" అడిగాడు శ్యామ్.

మరోసారి చుట్టూ చూసాను. " ఓహ్.. గాడ్.. కలగన్నానా. లేక గాడ్ నే కన్నానా?" అస్పష్టంగా అన్నాను.

బిత్తరపోయి చూశాడు శ్యామ్.

"వ్వాట్. గాడ్ ని కనడమేమిట్రా?"

"ఐ.. మీన్.. మెన్ట్.. చూశానా అని. ఇట్ సీమ్డ్ సో రియల్" కళ్లు నులుముకుని మరోసారి చుట్టూ చూశాను.

నాలోవున్న అలజడి నా ముందొక దైవమై నిలబడిందా? లేక అదంతా నా భ్రమా?

"కృష్ణా" నెమ్మదిగా పిలిచాడు శ్యామ్.

"నీ మీద చాలా స్ట్రెస్ పడుతున్నట్టనిపిస్తోంది, వెళ్ళిపోదామా? ఒక్కసారి ఆలోచించు" నా భుజం మీద చేయుంచి నిదానంగా అడిగాడు

**నేను** జవాబివ్వలేదు. ఎందుకో తెలీదు ఒకదానికొకటి పొంతనలేని ఏవేవో ఆలోచనలూ, దృశ్యాలూ నా కళ్ళముందు కదులుతున్నాయి.

"మీరు అతడితో మాట్లాడారుకదా అతనేమన్నాడు?" అడిగాను.

గట్టిగా నవ్వాడు జోగేందర్. "ఏం సాబ్ మా చౌదరిగారు చెప్పినవన్నీ నిజాలనా మీ అభిప్రాయం?"

బిత్తరపోయి చూసాము. "అదేమిటి? అలా అన్నారు. అతడూ", అంటూ ఏదో అడగబోయిన మమ్మల్ని ఆపుతూ చెప్పాడతను "చూడండి సార్ ఆ పండిత్ గారి ఫ్యామిలీ, ముఖ్యంగా సతీష్ నాధ్, చౌదరిగారికి చాలా క్లోజ్. వారి ఇంట్లో ఏ పూజ జరిగినా, హోమాలకీ, శుభకార్యాలకీ అన్నింటికీ వీళ్ళే పెద్దదిక్కు. ఆ పెద్దాయన ఆరోగ్యం మధ్యలో కాస్త

బాలేనప్పటినుండీ అన్నింటికీ సతీష్ నాధే వస్తున్నాడు, కుర్రాడు బాగా తెలివైనవాడు, పెద్దవాళ్ళ పలుకుబడి ఎలా వాడుకోవాలో, ఎక్కడవాడుకోవాలో తెలిసినవాడు వారితో ఎలా మెలగాలో తెలుసుకున్నవాడు..

పండిత్ గారి బాధ చూసి, సతీష్ రిక్వెస్ట్ తో మా చౌదరిగారు ఈ కేసుని మినిమమ్ ఎంక్వైరీతోనే క్లోజ్ చేసారు. అసలు జగదీష్ గానీ, ఆమె లవర్ ది గానీ ఎలాంటి స్టేట్మెంట్లూ ఇవ్వనూలేదు, మేము తీసుకోనూ లేదు"

"వ్వాట్..." అదిరిపడి చూసాను,"బట్ మీ రికార్డ్స్ లో వారిద్దరి స్టేట్మెంట్లూ విత్ సిగ్నేచర్స్ వున్నాయి. ఏదో పేరుతోవుంది కూడా?" అడిగాను.

తేలిగ్గా నవ్వేసాడు, "అలాంటివి వంద దొరుకుతాయి సాబ్ కావాలంటే. ఆ మాటకొస్తే ఆ కుర్రాడిని, జగదీష్ నీ ఈ కేసు టైమ్ లో మేము కలవనేలేదు తెలుసా?"

"జగదీష్ ఎవరినీ కలవట్లేదని విన్నాం, కానీ మీకు కూడా కలవలేదని ఊహించలేదు. ఐనా పోలీస్ ఎంక్వైరీలో జాలి చూపిస్తే న్యాయం ఎలా జరుగుతుంది జోగేందర్?" బాధగా అడిగాను.

ఇబ్బందిగా చూసాడతను, "ఏం చెప్పమంటారు సర్, ఇలాంటి కేసులు మామూలువాళ్ళ ఇళ్ళల్లో రొటీనే గానీ, పండిత్ లాంటి కుటుంబాల్లో జరగవు. జరిగినా పైకి తేలవు. ఇది ఇంత గోలగోల అయిపోయింది. దాంతో ఆయన బాగా క్రుంగిపోయారు. మా చౌదరిగారే కాదు, మొత్తం వారణాశే జాలిపడింది వారి కుటుంబానికి జరిగిన అప్రతిష్టకీ, అవమానానికీ.

అందుకే ఇక వారిని ఎక్కువ బాధపెట్టకుండా సింపుల్ గా ముగించేసారు ఎంక్వైరీ. ఐనా ఆరా తియ్యడానికి కూడా ఏమీ లేదుగా. అవ్వాల్సిన గొడవంతా ముందే అయిపోయింది. ఎవ్రీథింగ్ వాజ్ ఓపెన్. ఏదీ రహస్యంగా జరగలేదు. కుల పెద్దల పంచాయితీయే సాక్ష్యం మొత్తం వ్యవహారానికి" చెప్పాడు.

ఏమీ అనలేక అన్యమనస్కంగా కూర్చున్నాను కానీ, సిస్టమ్ లోని ఈ వ్యవహారాలకి చాలా దిగులుగా అనిపించింది. ఏం చెయ్యలేని పరిస్థితి.

ఐతే జగదీష్ నీ, అతడినీ కలవడం కూడా అవసరమే. ఐనా వారిని కలవకుండా నిజాలు తెలిసేసుకుంటానని ఎలా వూహించాను నేను. హౌ ఫూలిష్. అయామ్ నాట్ కట్ అవుట్ టు డూ దిస్ టైప్ ఆఫ్ ట్రాకింగ్.

తులసికి న్యాయం చేయలేనేనే అనుమానం నాలో మొదట్నుంచీ ఏమూలో వున్నా, ఆ అనుమానం నిజమౌతుందనే భయం మొదటిసారిగా నన్ను కలచివేసింది.

జగదీష్ ని దూరం నుంచి చూస్తూనే నా కాళ్ళు ఆగిపోయాయి. అతికష్టంమీద ఒక్కో అడుగూ వేసుకుంటూ నార్మల్ గా వుండడానికి విశ్వ ప్రయత్నంచేస్తూ డాక్టర్ ప్రణయ్ పక్కన ఛైర్లో కూర్చున్నాను. ఒక్కర్నే తనతో లోపలవుంచుకుంటాను

అని ఆయన చెప్పడంతో నేను మాత్రమే లోపలికి వచ్చాను. చిన్న సెల్ లా వున్న రూమ్ కి మధ్యలో ఓ టేబుల్ కి అటూ ఇటూ ఛైర్స్ వేయబడివున్నాయి. వాటికి ఒకవైపు జగదీష్ కూర్చునివున్నాడు. అతని పక్కన ఓ నర్స్ నిలబడివుంది.

చాలాసేపు ప్రణయ్ ప్రోబ్ చేసిన తర్వాత నన్ను సైకియాట్రిస్ట్ కి అసిస్టెంట్ గా భావించి జగదీష్ ఇచ్చిన స్టేట్మెంట్ నా చెవుల్లో ఇక మారుమ్రోగుతూనేవుంటుంది. వర్డ్ టూ వర్డ్.

"తులసి. నాకు బాగా జ్ఞాపకం. ముఖ్యంగా తన ఫోటో మా అమ్మ నా ముందుంచినప్పుడు నన్ను నేనో క్షణం పూర్తిగా మరిచిపోయాను. చెప్పాలంటే మైమరచిపోయాను.

ముట్టుకుంటే మాసిపోతుందా అనిపిస్తున్న గులాబీ ఛాయ మెరిసే కళ్ళు అమాయకమైన నవ్వు. ఓ వింత వెలుగుంది అమ్మాయి ముఖంలో.

"పేరు తులసి, ఎలావుందిరా?" అన్న అమ్మ ప్రశ్నతో ఈ లోకంలో పడ్డాను.

"ఎందుకమ్మా?" అని విషయం అర్థమైనా ఏమీఎరగనట్టే అడిగాను.

"ఈ అమ్మాయి మీ నాన్నగారికీ, పెదనాన్నగారికీ బాగా తెలిసిన స్నేహితుడి కూతురటరా, మన ఇంటి కోడల్నిచేయాలని ఆయన ఆశట. కైలాష్ అన్నయ్య కోసం అడిగారూ" అంటూ ఆగి నా ముఖం చూసింది.

"ఓ.. అ.. అలాగా" తడబడ్డాను.

అమ్మ దొరికిపోయావన్నట్టుగా చిన్నగా నవ్వి, "సర్లే.., మీ అన్నయ్య ఇప్పట్లో పెళ్ళే చేసుకోనూ, సంబంధాలేవీ చూడద్దూ అన్నాడట. అమ్మాయేమో బాగుందీ, పెద్దవాడికైతే ఏంటీ, చిన్నవాడికైతే ఏంటీ అసలంటూ మన ఇంటి కోడలైతే చాలూ, బాగుంటుందని మీ పెదనాన్నగారే. నీ అభిప్రాయం కనుక్కోమన్నారు. మరి సరే అని చెప్పేదా జగ్గీ?" అంది.

ఆ నిమిషం ఒక్కసారిగా సంతోషంతోనూ అమ్మకి అర్థమైపోయింది నా మనసు అన్న మొహమాటంతోనూ, ఉక్కిరిబిక్కిరయిపోయి ఏం చెప్పాలో తెలీక మౌనంగా వుండిపోయాను.

అమ్మ నా తలమీదో మొట్టికాయవేసి, లేచి మండువాగుమ్మం దగ్గర నిలబడి నాన్నగారికీ, నాకూ వినిపించేలా, "ఇదిగో, విన్నారా ప్రత్యేకంగా నన్ను అడగమన్నారుగానీ ఈరోజు వరకూ మన జగ్గీకి మీ ఎంపిక నచ్చకుండా ఎప్పుడైనా వుందా చెప్పండి. అమ్మాయి తరఫువాళ్ళకి చెప్పేయండిక, తాంబూలాలకి వచ్చేయమని" అని చెప్పి నావైపు చూసి ఫకాలున నవ్వేసింది. అప్రయత్నంగా నేనూ నవ్వేసి, మొఖం తిప్పేసుకున్నాను.

ఆ తరువాత, తాంబూలాలూ, పెళ్ళీ, కొత్త కాపురం, తులసి తో కొత్త జీవితం, అన్నీ ఓ కలలా జరిగిపోయాయి.

తులసంటే ప్రాణం. తనని ఓ సున్నితమైన పూలబొమ్మలా పదిలంగా చూసుకునేవాణ్ణి. నేను చాలా మితభాషిని, పైగా ఎక్కువ ఎక్స్ ప్రెసివ్ కాదు. దానివల్ల నా ప్రేమని పూర్తిగా వ్యక్తపరచలేకపోయేవాడిని. తనూ నాలాగే సిగ్గరి, తన

భావాలనీ, భయాలనీ, ఇష్టాలనీ, అయిష్టాలనీ, అన్నింటినీ మనసులోనే దాచుకునే మనిషి, పైగా మృదుస్వభావి, అందుకే తనని ఎప్పుడూ హర్ట్ చేయకుండా జాగ్రత్తగా చూసుకునే వాడిని.

తనూ చాలా ఒద్దికైన భార్యగా ఎంతో గౌరవంగా, భక్తిగా, అభిమానంతో మెలిగేది. ఎప్పుడూ తనని పెళ్ళిచేసుకుని తప్పుచేసానన్న భావనే రాలేదు, నాకు గానీ, మా ఇంట్లో వారికి గానీ.

పెళ్లై చాలా సంవత్సరాలు గడిచి మాకు పిల్లలు కలుగనప్పుడు కూడా, అది స్త్రీదే తప్పంటూ నిందించే సమాజంలో మెలుగుతూ కూడా ఏరోజూ తులసిని నిందించలేదు, అది ఓ కుటుంబసమస్యగానే భావించి వర్రీ అయ్యాముగానీ, దానికి తనని కారణం చేసి ఒక్కమాటైనా అనాలని ఎవరికీ అనిపించలేనంతగా తనని మాలో కలిపేసుకున్నాము, తనూ అలాగే కలిసిపోయింది.

వ్యాపారం చేయాలన్న పురుగు నా మెదడుని చేరనంతకాలం అంతా బాగుండేది. ఆ తర్వాతే నాలో కోపం మొదలైంది.

నన్ను ఎదగనీయని నా తండ్రి ఆచార నియమాలమీదా, ఆలోచనల మీదా, వాటిని సపోర్ట్ చేస్తూ నాకు నీతులు చెప్పే ఇంట్లో వారిమీదా, బంధువులమీదా. మేం బ్రతుకుతున్న సొసైటీ మీదా. చెప్పాలంటే అందరిమీదా.

ఏదో తెలీని ఉక్రోషంతో రగిలిపోయేవాడిని, అది మెల్లగా అందరిమీదా, ఎక్కువగా తులసిమీద రిఫ్లెక్టవడం మొదలైంది, అరవడం, మాటలనడంలోకి దారితీసింది.

సరిగ్గా అప్పుడే అన్నయ్య తన ట్రావెల్ ప్రోగ్రామ్స్ ముగించుకుని తిరిగివచ్చాడు, రకరకాల వ్యాపారాలు చేసి వచ్చిన అతడి మాటలు నన్ను ఎంతగానో ఆకర్షించాయి. అన్నింటికంటే ఎక్కువగా నచ్చినది, అతడు నా ఆలోచనల పై చూపించిన నమ్మకం, ఆ పైన నన్ను నమ్మి, నేను కోరిన వ్యాపారానికి డబ్బు పెడతాననడం, అన్నీ చాలా అద్భుతంగా తోచాయి. నాకు మా ఫ్యామిలీ ఇవ్వనిదేదో, వారి దగ్గర దొరకనిదేదో అన్నయ్య దగ్గర దొరికినట్టనిపించింది.

మాతా టేక్డీలో ప్రసాదశాల పెట్టి వ్యాపారం చేయాలన్న ఆలోచన అన్నయ్యదే. అయితే అన్నయ్య ఒకటే అనుమానం వ్యక్తం చేసాడు, కనీసం సెల్ సిగ్నల్ కూడా రాని ఆ ప్లేస్ లో, సాయంత్రమయితే పిట్ట కూడా కనపడని ఆ అటవీ ప్రాంతంలో నేనుండగలనా అని. తీరా అంతా సెట్ చేసాకా పదిరోజుల్లోనే పారిపోయి వచ్చేస్తానేమోనని భయపడ్డాడు.

అదే కనుక జరిగితే మొత్తం కులమంతా కోడై కూస్తుంది, 'మేము ముందే చెప్పాము, ఇలా జరుగుతుందనీ, అందుకే వద్దన్నామంటూ', మాటల తూటాలతో పొడిచి పొడిచి చంపుతుందని ఆలోచించాడు. వేరే ప్లేస్ చూద్దామన్నాడు.

ఆ మాట వింటూనే నా పట్టుదల పదింతలైంది. 'వద్దు. అక్కడే వుండి సాధిస్తాను' అని చెప్పాను. కానీ అది సక్సెస్ కాకపోతే అవమానాలపాలౌతాననే భయం ఏమూలో నాకూ వుంది, అందుకే నేను ఎక్కడ, ఏ వ్యాపారం చేయబోతున్నానో ఎవరికీ చెప్పదలుచుకోలేదు, కనీసం తులసికి కూడా.

అందుకే అలా అక్కడ షాప్ కి అడ్వాన్స్ ఇవ్వగానే ఇలా వచ్చి, ఇక్కడ నాన్నతో గొడవపడి తర్వాత ఫోన్ చేస్తానంటూ తులసికి చెప్పేసి ప్లాన్డ్ గానే ఇంట్లోంచి వచ్చేసాను. అన్నయ్యకీ, రఘుపతికీ తప్ప వేరెవ్వరికీ నా వునికే తెలీకుండా, వచ్చేసాను..,

పదిహేడు నెలలు. ఒకటి కాదు, రెండు కాదు. పూర్తిగా పదిహేడు నెలల పాటు. అలా ఎవ్వరినీ కాంటాక్ట్ చేయకుండా గడిపాను. అజ్ఞాతవాసంలా గడిపాను.

రెండు నెలలకి ఒకసారి రఘుపతి వచ్చి నాకూ, నా షాపుకీ కావలిసిన వస్తువులు తెచ్చి ఇస్తుండేవాడు.

నేను కోరుకున్నట్టే నా ఐడియా ఫలించింది, గుడికి వచ్చిన వారందరూ ప్రసాదశాల దగ్గర విశ్రాంతి తీసుకోవడానికి రావడం మొదలైంది, వారు విశ్రాంతి తీసుకోవడానికి బెడ్స్ కూడా అరేంజ్ చేయసాగాము. నెమ్మదిగా ప్రసాదాల ఆర్డర్లు ఇవ్వడం కూడా మొదలైంది.

గుడి పూజారులకి కూడా మామీద గురి కుదిరింది, పూజలకోసం సామగ్రీ, ప్రసాదాల తయారీ, అన్నింటికీ నా షాపుని సజెస్ట్ చేయసాగారు. వీటన్నింటితో మొత్తానికి నేను కోరుకున్న సక్సెస్ లభించింది, నా వ్యాపారమూ పెరగడం మొదలైంది. ఇంక త్వరలో అక్కడొక యాత్రికుల సత్రం, ప్రసాదశాల నా స్వంతంగా ఏర్పాటవుతాయని గ్రహించాను.

నేను అనుకున్నది జరిగింది. దాంతో ఇక ఈ వనవాసం చాలించి దగ్గరలో వున్న వూరికి మకాం మార్చేసి ఫ్యామిలీని అక్కడికి షిఫ్ట్ చేస్తే బాగుంటుందనే ఆలోచన రాసాగింది.

అన్నకి ఆ కబురు పంపాలనుకున్నాను, కానీ రఘుపతి రావడానికింకా చాలా టైముంది, ఒంటరితనం నన్ను భరించలేనంతగా వెంటాడగా, ఇక నా కుటుంబాన్ని విడిచి వుండలేక ఓరోజు వున్నపాటుగా బయల్దేరి ఇంటికి చేరుకున్నాను. అక్కడ చూస్తే వాకిట్లో తమ్ముడి పెళ్ళి మండపం. అది చూసి ఆశ్చర్యపోయాను, నేను లేకుండానే తమ్ముడికి పెళ్ళి తలపెట్టిన నాన్నమీద పీకలవరకూ కోపంవచ్చినా అందరి ఎదుటా అల్లరి ఎందుకని నిగ్రహించుకుని ఇంట్లో అడుగుపెట్టిన నాకు ఎదురైన మొదటి షాక్ నా భార్య లేకపోవడం.

అదీ తను నా దగ్గరుందని మా ఫ్యామిలీ ఒక్క మా ఫ్యామిలీయే కాదు, తులసి తల్లితండ్రులు కూడా భావించడం. పెళ్ళకని వచ్చిన వారికి తులసి నాతో రాకపోవడం ఓ షాకయితే, అసలు అన్నాళ్ళుగా నాతోనే లేకపోవడం అతి పెద్ద షాక్.

నేను, ..నేను.. ఫోన్ చేసి.. రమ్మన్నానంటూ, నేను వెళ్ళిన నెల్లాళ్ళలోపే తులసి వెళ్ళిపోయిందనీ, నేను ఇంకా కోపంగానే వున్నాననీ, త్వరలో నన్ను వొప్పించి, ఇంటికి తిరిగి తీసుకువస్తానంటూ మధ్యలో రెండు, మూడుసార్లు ఫోన్ కూడా చేసిందంటూ మావాళ్ళు చెప్పారు.

ఒక్క క్షణం నేను మా ఇంట్లో వాళ్ళనే అనుమానించాను, పిల్లలు పుట్టట్లేదన్న సాకుతో నేను లేని టైం చూసి తులసినేమైనా వెళ్ళగొట్టారా, లేక తనపట్ల మరేదైనా ఘోరం తలపెట్టారా, అని భయపడ్డాను. బహుశా తులసి పేరెంట్స్ కూడా ఆ సమయంలో అదే అనుకుని వుండవచ్చేమో నాకు తెలీదు.

కారణాలేవైనా తను కనపడట్లేదన్నమాట వాస్తవం, సో పోలీస్ కంప్లైట్ ఇవ్వాలా, లేక మేమే వెతకాలా, కానీ ఎక్కడని వెతకాలీ, అని మేం తర్జనభర్జన పడేంతలోపే, కోదండం మావయ్య నెమ్మదిగా ఓ మాట బయటపెట్టాడు. అది మా అందరికీ తల తిరిగిపోయేంత దారుణమైన మాట, "తులసిని, ఎవరితోనో రామ్ ఘడ్ లో దూరంనుంచి చూసానంటూ. అదీ భార్యాభర్తలంత చనువుగా వున్నారంటూ తాను దగ్గరికి వెళ్ళి పలకరించేలోపు వెళ్ళిపోయారనీ"

ఒక్కసారిగా అక్కడ రకరకాల డిస్కషన్లు, అభిప్రాయాలూ, హేళనతో కూడిన సూచనలూ, అవన్నీ వింటూ అలా చాలా సేపు కూర్చుండిపోయాను.

ఆ మాట వేరెవరైనా అనుంటే వాళ్ళ తల నా చేతుల్లో పగిలిపోయేది, కానీ చెప్పినవాడు వేరెవరో కాదు, మావయ్య కానీ ఐనా భార్యాభర్తలంత దగ్గరగా అని ఆయనెలా డిసైడ్ చేస్తాడు, ఏ కారణంతో తులసి దూరంగా వెళ్ళాల్సివచ్చిందో ఏదో బలమైన కారణంతో తులసిని ఎక్కడో వుండిపోయిందేమో తెలిసీ తెలియకుండా వీరంతా.. ఛ..ఛ.. .. పోయి పోయి తనలాంటి అమ్మాయిమీదా ఈ అభాండాలు.

అదే మాట తీవ్రంగా చెప్పాను వారికి, 'రామ్ ఘడ్ లో వున్నారన్నారు కదా వెళ్దాం. అక్కడికే వెళ్ళి తెలుసుకుందాం. ఏమైందో, ఐనా ఏం జరిగినా సరే, తులసి నాకు ద్రోహం చేయలేదు, చేయదు, ఏదో జరిగింది, అదేంటో మీ ముందే కుండబద్దలు కొడతాను, నాతో ఎవరొస్తారో రండంటూ' బయటికి దారితీసాను.

గుమ్మం దాటుతూనే ఎదురుగా టాక్సీ దిగుతున్న తులసి అదీ నిండు గర్భిణిగా. నేను వెళ్ళిపోయి దగ్గర, దగ్గర ఏడాదిన్నర పైన అవుతుంటే. తొమ్మిది నెలల గర్భిణిగా ఎదురొచ్చింది నా భార్య నా నమ్మకాన్ని ముక్కలు చేస్తూ.

నా నడక నిలిచిపోయింది. నేను నిశ్చేష్టుడిలా నిలబడిపోయాను, ఆ తర్వాత జరిగినవేవీ నా అధీనంలోలేవు నేను కేవలం ఓ ప్రేక్షకుడినై నిలిచాను.

ధీమాగా ఇంట్లోకి రాబోతున్న తులసిని ఆమె తల్లితండ్రులే ముందు నిలువరించారు. ఆపి 'ఇన్ని నెలలూ ఎక్కడున్నావూ, ఎవరితో కాపురం చేసి కడుపు తెచ్చుకుని, ఏ ధైర్యంతో తిరిగొచ్చావంటూ' ప్రశ్నించారు..

నివ్వెరపోయి చూసింది తులసి, నిస్సహాయంగా నావైపు చూసిన, ఆమె చూపు నాకిప్పటికీ గుర్తే. 'మీరుండగా నా మీద ఈ నిందలేమిటంటూ' ప్రశ్నించిన ఆ చూపు, 'అండగా నిలబడమంటూ అర్థించిన ఆ కళ్ళూ' నన్నెప్పటికీ వెంటాడుతూనే వుంటాయి

ఒక్కసారిగా అందరూ ఆమెని నిందించసాగారు, మధ్యలో ఎవరో అన్నారు ఆమె తప్పు ఏదైనా, ఇది కుటుంబగౌరవానికి కాదూ, కులగౌరవానికి సంబంధించిన విషయం, కులపెద్దలని పిలిపించమన్నారు,

ఆఘమేఘాలమీద వారందరూ వచ్చి సమావేశమయ్యారు, తులసిని మా ఇంటి గడపలో అడుగుకూడా పెట్టనివ్వనన్న నాన్నగారి మాటతో ఆరుబయటే పంచాయతీ.

సడన్ గా నేను కదిలాను, నాకు తెలియాల్సినది ఒక్కటే. వెళ్లి తనముందు నిలిచాను. ఒక్కసారిగా అందరి దృష్టీ మా వైపు తిరిగింది, అదంతా నాకిప్పుడు పట్టట్లేదు నా మెదడు పొరల్లో ఏదో మోగుతున్న ఫీలింగ్.

తన ముందు నిలబడ్డ నావైపోసారి తీవ్రంగా చూసింది.

"ఒకే ఒక ప్రశ్న తులసీ. నీ కడుపులో వున్న బిడ్డకి తండ్రెవరు?" సూటిగా అడిగాను.

దెబ్బతిన్నట్టు చూసి, "మీకు తెలీదా?" అంటూ తిరిగి ప్రశ్నించింది.

"ప్రశ్నకి ప్రశ్న సమాధానం కాదు తులసీ జవాబు చెప్పు ఎవరు?" అతి కష్టంమీద నన్ను నేను సంబాళించుకుంటూ అడిగాను.

"మీ బిడ్డకి తండ్రెవరని మీరే అడుగుతున్నారా? అది కూడా ఇలా? చాలా దారుణమైన నిందవేస్తున్నారు జగదీష్ అదీ ఇందరిలో" అంది నావైపే చూస్తూ.

"నేను కాదని నీకూ తెలుసు, నాకూ తెలుసు. ఎవరు తులసీ, దీనికి కారణం ఎవరు? ఎందుకు చేసావిదంతా? అసలు ఎందుకు? ఎందుకు తిరిగొచ్చావ్ తులసీ? నన్ను చంపడానికా" అరుస్తూ నిస్సహాయంగా పక్కనున్న కిటికీ ఊచలకేసి నాచేతిని బలంకొద్దీ కొట్టాను.

నావైపు నిస్సహాయంగా చూసింది, చెంపలమీదుగా కారిపోతున్న కన్నీటిని తుడుచుకుంటూ చుట్టూ చూసింది, గుమిగూడిన జనం, గుసగుసలాడుతున్న బంధుజనం, నిలబడి గమనిస్తున్న పంచాయితీ పెద్దలు.

నెమ్మదిగా నాకేసి తిరిగి, "మీరెందుకిలా చేస్తున్నారో నాకు అర్థం కావట్లేదు జగదీష్. ప్లీజ్. అందరిముందూ ఈ తమాషా ఆపండి. మనం లోపలికెళ్ళి మాట్లాడు" అంటున్న తన మాటలు తుంచేస్తూ,

"చాలు తులసీ. ఇక చాలు. నువ్వు ఏ ధైర్యంతో ఇక్కడిదాకా వచ్చావో నాకు తెలీదు గానీ ఇంక నీకు–నాకు మధ్య మన అనేదేదీ లేదు. ఈ ఇల్లు కూడా" అని చెప్పేసాను.

తీక్షణంగా చూసింది నావైపు, "ఒకవేళ మీ అనుమానం అదే అయితే దానికి ఇదికాదు విధానం. వేరే దారులున్నాయ్. చదువుకున్నారు కావలంటే మీరు డీ.ఎన్.ఏ." అంటున్న ఆమెని చేతితో వారిస్తూ చెప్పాను,

"చాలిక. నీ కథలువినే ఓపిక నాకు లేదు తులసీ, ఎంతో మేనేజ్ చేసినదానివి బహుశా నీకది పెద్ద విషయంకాదులే. ఐనా ఫర్ యువర్ ఇన్ఫర్మేషన్. నేను నిన్నొదిలి వెళ్ళి 17నెలలు అయ్యింది. గుర్తుందా? సంవత్సరాల తరబడి ఏబిడ్డా తల్లి కడుపులో ఐతే వుండడనుకుంటాను. కాదూ?

ఐనా నువ్వు ఎవరితోపోయావో, ఎక్కడేంచేసావో తెలుసుకుని మాత్రం నేను ఏం చేస్తాను చెప్పు?. చేసిన రభస, తీసిన పరువు చాలు. ఇనఫ్ ఇక బయల్దేరు" అంటూ చేతులు జోడించాను.

ఏదో తీవ్రమైన గాయమైనట్టు విలవిల్లాడుతూ తను చూసి చూపుని, ఆ పెద్ద-పెద్ద కళ్ళలో కనిపించిన బాధని చూసి ఒక్క క్షణం నాకే జాలేసింది. అంతలో ఆమె చేసిన మోసం నా కళ్ళముందు కనిపించి గుండె మండించగా ముఖం తిప్పేసుకున్నాను.

నిశ్చేష్టురాలై అలాగే నిలబడింది. నెమ్మదిగా తలదించుకుంది.

తను తలెత్తి నావైపు చూడలేదు, తనింకేం మాట్లాడుతుందో అని నేను ఆగనూ లేదు.

వెంటనే వెనుదిరిగి అక్కడినుండి ఇంట్లోకి నడిచాను. నిర్వికారంగా, నిర్లిప్తంగా నడుస్తూ వెళ్ళి నా గదిలోకి వెళ్లి తలుపులు మూసుకున్నాను.

బయట ఆమెకి ఏశిక్ష వేయాలీ, ఆమెతో సంబంధం వున్నందుకు మా కుటుంబాలకే శిక్ష వేయాలీ అంటూ వారు చర్చ మొదలుపెట్టారు.

అంతలో అమ్మా, నాన్నలూ, అక్కా-బావా, సతీష్, ఆమె తల్లితండ్రులూ, దగ్గరి బంధవులూ అందరూ ఆమె పై మాటల తూటాలు సంధించారు..,

"ఇంత దారుణం ఎలా చేసావు? ఏం తక్కువైంది నీకు? ఎవడు వాడంటూ" నిలదీసారు.

"ఇన్నాళ్ళూ ఎక్కడికి వెళ్ళావు, ఎక్కడున్నావంటూ" నిలేసారు.

"పెళ్ళయివుండీ మరొకరితో సంబంధం ఏర్పరుచుకోవడానికి సిగ్గుగా లేదూ? నీకు ఆ అక్రమసంబంధం ఎప్పుడు ఏర్పడింది? అసలు తిరిగి ఎందుకు వచ్చావ్? అలాంటి బిడ్డనిగానీ, నిన్నుగానీ జగదీషైనా, అతని కుటుంబమైనా ఎలా స్వీకరిస్తారనుకున్నావు?

నీ తల్లితండ్రులకు ఇది ఎంత అవమానమో తెలుసా? మన కులానికెంత చెడ్డపేరు తెచ్చావో నీ నీచపు పని తో నీకేమైనా అర్థమయ్యిందా?

ఎవడితోనో పోతానంటే మేమాపుతామా ఇలా పెళ్ళి మండపంలోకి తిరిగొచ్చి ఏం సాధించాలనుకున్నావ్?" అంటూ ప్రశ్నలమీద ప్రశ్నలు కురిపించారు.

తను ఎవ్వరికీ ఏ జవాబూ చెప్పలేదు, ఏమనీ నోరువిప్పలేదు.

నాకు తెలుసు తను నాకోసమే చూస్తోంది. నేనొచ్చి వారిస్తానని చూస్తోంది. తనని చూడకపోయినా నాకు తెలుసు.. ఈ రోజుకీ ఆ చూపుల్లో పదును నాకు గుచ్చుకుంటూనే వుంది. కానీ, ఎలా? ఎందుకు వారించాలి?

చాలా సేపటివరకూ అడిగీ, అడిగీ ఇక జవాబు రాదని అర్థమై వాళ్ళ పంచాయితీ వాళ్ళు మొదలు పెట్టేసారు. తులసిని కులం నుంచి వెలేసారు..

నాన్నా, పెదనాన్నా, చిన్నాన్న, అందర్నీ పౌరోహిత్యం నుంచి తొలగించారు.

ఇక మేమెవ్వరం గుడి పౌరోహిత్యానికి, పెద్దరికానికీ, పూజలకీ–పునస్కారాలకీ పనికిరామని తీర్మానించారు. తులసి తండ్రి ఈ రాష్ట్రానికి చెందినవాడు కాదు కాబట్టి ఆయనని కేవలం ఎప్పుడూ ఇక్కడ అడుగు పెట్టవద్దని చెప్పారు.

కిటికీలోంచి ఆగొడవంతా నా చెవులకి చేరుతోంది. మనసు మాత్రం స్పందించడం మానేసింది. తలుపు తీసుకుని లోపలికి వచ్చిన అక్కలూ, బావలూ, అమ్మా, మావయ్యా, ఎవరెవరో నా పక్కన చేరి ధైర్యం చెప్తున్నారు, ఆమె నాకు తగదనీ, జరిందో పీడకలనీ చెప్తున్నారు.

అంతలో బయట సడన్ గా వాతావరణం గోలగోలగా మారింది. ఏదో జరిగింది, ఎవరో లోపలికి వచ్చి చెప్తున్నారు, ఇంకా వారలా మాట్లాడుతుండగానే తులసి నిలబడ్డచోటే కుప్పకూలిపోయింది. తను పడిపోయిందని.

అవును, తులసి పడిపోయింది. నా దృష్టిలో.

ఒక్కసారిగా కంగారుగా తనకోసం వెళ్ళబోయి, తను నొప్పులతో కేకపెట్టడం అర్థమై ఆగిపోయాను. ఆ బిడ్డ నాబిడ్డ కాదనే చేదు నిజం నాలో మానవత్వాన్నీ, ప్రేమనీ కమ్మేయగా కిటికీ అంచుమీద చేయుంచి అలాగే నిలబడిపోయాను.

అంతలో తనని జనంలో కొందరు ఆంబులెన్స్ పిలిపించి ఎక్కించసాగారు, చివరిగా స్ట్రెచర్ మీదనుండి లీలగా, కిటికీలోంచి దూరంగా కనిపించినదే తన ఆఖరి చూపునాకు.

మూడురోజుల తరువాత చెప్పారు, తులసి చనిపోయిందని. వాళ్ళకి తెలీదు కదా. నా వరకూ తులసి ముందే చనిపోయిందని."

చెప్పడం పూర్తిచేసి, టేబుల్ మీద తల పెట్టి నిశ్శబ్దంగా రోదించసాగాడు.

అలాగే కూర్చుండిపోయాను.

కాసేపటి క్రితంవరకూ నా దృష్టిలో జగదీష్. తులసిని అన్యాయం చేసినవారిలో మొదటివాడు. ఆమెని అర్థం చేసుకోని ఒక దుర్మార్గుడైన భర్త. కానీ ఇక్కడ నా ముందున్నది కేవలం ఒక సామాన్యమైన వ్యక్తి. పరిస్థితులకి బలైన ఓ మామూలు మనిషి.

అతడి తప్పల్లా భార్యని కష్టంలో ఆదుకోలేకపోయాడు, ఆమె వలన తనకి మోసం జరిగిందనే వుక్రోషంలో నిజం తెలుసుకునే ప్రయత్నం చేయలేకపోయాడు. చెప్పాలంటే బహుశా ఆ పొజిషన్ లో ఎవరైనా అలాగే రియాక్టవుతారేమో. చాలా రేర్ వ్యక్తులు తప్ప.

కానీ, ఇప్పుడు తులసిని తల్చుకుని అనుక్షణం విలపిస్తున్నాడు.

కష్టంలో ఆమె పక్కన తోడుగా నిలువలేకపోయానే అనే బాధలో దహించుకుపోతున్నాడు. సరిగ్గా నాలాగే.

తలవిదిల్చాను. కంపారిజన్ ఎక్కడ. అతడు తులసి భర్త. నేనెవర్ని?!

అంతలో డాక్టర్ ప్రణయ్ నావైపు వెళ్ళమన్నట్టుగా చూడడంతో తేరుకుని లేచాను.

జగదీష్ ని 'అతడి' గురించి ప్రశ్నించాలనే నా ప్రయత్నాన్ని విరమించుకుంటూ. గాడ్జెట్స్, పేపర్స్ తీసుకుని బయటికి నడిచాను.

డోర్ వరకూ వెళ్ళి, "డాక్టర్ టూ మినిట్స్ ప్లీజ్" అంటూ బయటకి పిలిచాను.

జగదీష్ భుజం తడుతూ ఏదో చెప్తున్న డాక్టర్ ప్రణయ్ చిన్నగా నుదురు చిట్లించి, ఇక తప్పదన్నట్టు బయటకి వచ్చాడు, "సారీ డాక్టర్. తప్పలేదు. మా ఎంక్వైరీ వల్ల అతను చాలా డిస్ట్రబ్ అయినట్టున్నాడు. వి ఆర్ వెరీ సారీ. ప్లీజ్ టేక్ కేర్ ఆఫ్ హిమ్" నిజాయితీగా చెప్పాను.

ఆశ్చర్యంగా చూసి, "ఇట్స్ ఆల్ రైట్ కృష్ణా. హీ ఈజ్ అవర్ పేషెంట్. అఫ్కోర్స్. వియ్ విల్ టేక్ కేర్ ఆఫ్ హిమ్. సమ్ హౌ తులసి మీద మా టీం కి కూడా చాలా జాలేస్తోంది. పూర్ సోల్ వీ పిటీ హర్. బట్ కుడున్ట్ డూ ఎనీథింగ్. బట్ మే బీ మీరు చేయగలరు. ట్రై టూ గివ్ బ్రింగ్ ఇన్ సమ్ జస్టిస్ టూ హర్ డెత్. ఎనీవేస్. వియ్ సపోర్ట్ యూ ఫర్ హర్. గుడ్ బై. టాక్ టూ యూ లేటర్" చెప్పేసి లోపలికి వెళ్ళిపోయాడు.

చిన్నగా నిట్టూర్చి అక్కడినుండి కదిలాను. క్యారిడార్ చివర నిలబడి, నాకోసం చూస్తున్న శ్యామ్ వైపు దారితీసాను.

నా ఎంక్వైరీ లిస్ట్ లో మిగిలింది ఇక రఘుపతి మాత్రమే. అయితే అక్కడ్నుంచి మాకు ఏదైనా హెల్ప్ అయ్యే సమాచారం దొరుకుతుందనే ఆశ కూడా తక్కువే. వాళ్ళ మోస్ట్ నమ్మకమైన అసిస్టెంట్.

కోమల్ భర్త ప్రకారం జగదీష్ కి బిజినెస్ పెట్టుకోవడానికి సాయంచేసిన పెదనాన్నగారు రామేశ్వర్ పండిత్, ఆయన కొడుకుతో మాట్లాడితే ఏమైనా తెలియవచ్చని.

శ్యామ్ వుద్దేశ్యంలో వారిని కలవడం గ్రాండ్ వేస్ట్ ఆఫ్ టైమ్. దానిబదులు తులసి వాళ్ళ ఇంటి చుట్టుపక్కవారితో, పని వాళ్ళతో మాట్లాడదాం అన్నాడు.

వారితో కూడా మాట్లాడదాం. కానీ, ఒక్కసారి వీరినీ విడిగా కలిస్తే వేరే వివరం ఏకొంచెమైనా తెలుస్తుందేమో చూడాలనిపించింది.

ముఖ్యంగా జగదీష్ మేనమామ, ఎవరైతే తులసితోపాటూ 'అతడి'ని చూసానని చెప్పాడో ఆయన్ని కలవాలి.

ఇంతమంది అంటున్న ప్రకారం. తులసికీ 'అతడి'కీ చాలా బలమైన బంధమేవుంది. అంతే కదా ఏ రిలేషన్ లేకుండా ఎవరైనా అంతదూరం వెళ్తారా? దాని మూలం తెలుసుకోవాలి. అసలు తులసి అతడితో ఎందుకు రామ్ గఢ్ వెళ్ళడానికి సిద్ధపడింది? భయమా? బ్లాక్ మెయిలా? లేక మరేమిటి? తెలుసుకోవాలి.

అతడిని తులసి ప్రేమించిందా? అయివుండచ్చేమో? లేకుంటే ఆరోజు రామ్ గఢ్ లో త్రిపాఠీ గారి తల్లి చెప్పినట్టు తనుగా వుండకపోతే ఎవరు సంవత్సరన్నర పాటు ఒక స్త్రీని బందీగా వుంచగలరు.

కానీ అలా సీక్రెట్ గా చేయవలసిన అవసరం తులసికేముంది? పోనీ అలాగే అనుకున్నా మళ్ళీ తిరిగి ఎందుకు వచ్చింది? కోమల్ కి రాసిన లెటర్స్ చదివితే అతడు జగదీషే అని తెలుస్తోంది. జగదీష్ ఏదైనా డ్రామా చేస్తున్నాడా? తెలుసుకోవాలి.

జగదీష్ మామ గురించి మే బీ అతడి పెదనాన్నగానీ, కజిన్స్ గానీ చెప్పగలరేమో చూడాలి.

నా తల పగిలిపోతోంది ఆలోచనలతో. అంతా తిరిగి మొదటికి వచ్చినట్టనిపిస్తోంది.

నాన్న-సుందరం అంకుల్ చెప్పినవే కాస్త డీటెల్డ్ గా తెలిసాయి. నథింగ్ ఇంపార్టెంట్.

రఘుపతినుంచి వీలైనంత సమాచారం రాబట్టాలి. తర్వాత ఇక వారి ఇతర బంధువులని కూడా ఎంక్వైర్ చేయాలి..

పెద్ద మండువాతో దాదాపు పది, పన్నెండు పోర్షన్స్ గా వున్న ఇల్లది. చుట్టూ చూసాము. చాలామందే వున్నారక్కడ. ఎవరి హడావిడిలో వారు.

"వీళ్ళల్లో ఎవర్ని, ఏమని అడగుతాంరా. డౌటొస్తే చంపేస్తారు" నావైపు ఒరిగి చెవిలో గొణిగినట్టు అన్నాడు శ్యామ్.

"ఏం చేయలేం శ్యామ్. అతడి గురించి తెలుసుకోవడానికి ఇదొక్కటే దారి. డూ ఆర్ డై" చెప్పాను అంతే లోగొంతుకతో.

మెల్లగా ముందుకు నడిచాం. ఒక్కో వాటా దాటుకుంటూ, అక్కడున్నవారిని చూస్తూ. వారెవ్వరూ మమ్మల్ని పెద్దగా పట్టించుకోవడంలేదు. ఎవరింటికో వచ్చామనుకున్నట్టున్నారు. ఓసారి మావైపు చూసి మళ్ళీ వారి పనిలో వారు మునిగిపోతున్నారు. ఇబ్బందిగా ముందుకు కదిలాము. చివరగా తాళంవేసి వున్న ఓ వాటా ముందు ఆగాము.

బహుశా ఇదే ఇల్లైవుండచ్చు అనుకున్నాను. నా ఆలోచన కరక్టే అన్నట్టు అప్పటివరకూ మమ్మల్ని పెద్దగా పట్టించుకోనివారంతా వున్నట్టుండి మావైపు చూడసాగారు. ఆ సడెన్ అటెన్షన్ కి ఏం చేయాలో అర్థంకాక, ఇబ్బందిగా ఒకరినొకరం చూసుకున్నాం.

"ఎవరు మీరు?" శుద్ధమైన ఉత్తరాది హిందీ లో ప్రశ్న వినపడినవైపు చూసాము. ఓ మధ్యవయస్కుడు మా వైపు పరికించి చూస్తున్నాడు.

"మేము.. నా పేరు కృష్ణ, ఇతడు శ్యామ్" తడబాటుగా చెప్పాను.

నా వంక విచిత్రంగా చూసి, "సరే, ఎవరికోసం వచ్చారూ, చూడబోతే ఇక్కడి వాళ్ళలాలేరు?" తిరిగి ప్రశ్నించాడతను.

నేను జవాబు చెప్పేలోపల పక్కనుండీ ఖంగుమందో పెద్దావిడ గొంతు, "అదేం నిలదీయడం భగవాన్ పాపం ఎంత దూరం నుండి వచ్చారో ఏమో? తాగడానికి కాస్తంత మజ్జిగ (ఠండా..) ఇవ్వుముందర" మందలింపుగా అంది. అంతే ఆ భగవాన్ అన్న సదరు క్యాండేట్ చాలా భక్తిగా, "ఏమీ అనుకోకండి బాబూ, ముందిలా కూర్చోండి, మీకేమైనా తాగడానికి తెస్తాను" అంటూ అక్కడున్న మోడా స్టైల్ కుర్చీలు చూపించి, మేం రెస్పాండయ్యేలోపు మెరుపులా అక్కడినుంచి మాయమయ్యాడు.

"ఇలా కూర్చోండి, మొహమాటపడకండి" చెప్పిందావిడ మావైపు చూస్తూ. ఎక్కడికి వెళ్ళినా చిరాకైన ముఖాలనే చూస్తున్న మాకు ఈ అనుకోని ఆతిథ్యం, మర్యాద చాలా ఆశ్చర్యాన్ని కలుగజేసాయి. బహుశా, మేము వచ్చిన పని తెలియగానే ఈ అతిథి మర్యాద కాస్తా మాయమౌతుందో ఏమో?

ఆవిడకి నమస్కరించి ఆవిడకి ఎదురుగా నేలమీద కూర్చున్నాం. చిన్నగా నవ్విందామె "మర్యాద తెలుసున్న కుర్రాళ్ళే. నాకోసం కిందకూర్చున్నారా! బట్టలు పాడౌతాయి. పైన కూర్చోండయ్యా. మర్యాద మనసులోవుంటే చాలదూ" అంది ఆప్యాయంగా.

ప్రతిగా నవ్వుతూ, "పర్లేదు మామ్మగారూ, ఎక్కడైతే ఏముంది చెప్పండీ" చొరవగా అన్నాను.

అంతలో భగవాన్ పెద్ద పెద్ద గ్లాసులతో మజ్జిగ తీసుకొచ్చాడు. అందుకొని, కాస్తంత సిప్ చేసి, అతని వైపు చూసి, "థాంక్యూ..చాలా బాగుంది" చెప్పాను. భగవాన్ ముఖం చాటంతైంది. తలూపాడు సంతోషంగా.

"ఇంత మర్యాద చేస్తున్నారు, మనం ఎందుకొచ్చామో తెలిస్తే తరిమి, తరిమి కొడతారేమో" గొణిగాడు తెలుగులో శ్యామ్.

"ఊరుకో, అలాగని దాచలేం కదా" అన్నాను లోగొంతుకతో. ఇక వచ్చిన పని దాచి ప్రయోజనం ఏంటని అడగడానికి సిద్ధ పడి మామ్మగారి వైపు తిరిగాను.

"అమ్మా! రఘుపతిగానీ, రామేశ్వర్ పండిత్ కుటుంబం గానీ ఎక్కడున్నారో?" తటపటాయిస్తూ ఆగిపోయాను.

ఆవిడ భ్రుకుటి ముడిపడింది. భగవాన్ ముఖంలో మేం రెగ్యులర్ గా చూసే చిరాకు ఎక్స్ ప్రెషన్ ప్రత్యక్షమైంది.

"పత్రికలవాళ్ళా?" ప్రశ్నించిందావిడ. అవునంటే బెటరా, కాదంటే బెటరా అని ఒక్క మొమెంట్ కి గింజుకుని, "కాదమ్మా" అంటూ సహారా గురించి చెప్పాను. తలపరికించింది. పక్కన పెట్టిన పోకల కత్తెర తీసుకుని ముందున్న పోకలని కత్తిరిస్తూ "ఏం తెలుసుకుంటారూ, ఏం రాస్తారూ? అంతా అయిపోయాకా" అంటూ అందరిలాంటి ఎక్స్ ప్రెషనే ఇచ్చి నిట్టూర్చింది.

మేం జవాబిచ్చేంతలో తనే తిరిగి అంది, "వాళ్ళెక్కడికి వెళ్ళారో ఎవ్వరికీ తెలీదు, రఘుపతీ తిరుగుతూ వుంటాడు, ఓ నిలకడైన ఇల్లంటూ లేదు వాడికి, అతడే వచ్చి గత మూడు నెలలుగా అద్దెవసూలు చేసుకుని పోతున్నాడు. మళ్ళీ నెల పదో తారీకున రండి, రఘుపతిని కలవచ్చు.."

"లేదమ్మా. ఆలస్యమైపోతుంది, అంత టైమ్ లేదు మాదగ్గర. వారి గురించీ, చెప్పాలంటే ముఖ్యంగా రామేశ్వర్ గారి అబ్బాయి గురించి మీకు తెలిసింది చెప్తారా, అతడే జగదీష్ కి బిజినెస్ లో సాయం చేసాడంటున్నారు?" అడిగేసాను సూటిగా.

"తెలిసిందంటే ఏముందీ? ఎన్నో ఏళ్ల క్రితం చాన్నాళ్ళు కలిసిమెలిసి వుండేవాళ్ళం. పాపం అప్పటికి, రమకి పిల్లలు పుట్టడం ఆలస్యమైందన్న బాధ తప్ప వారికేలోటూ లేదు..

రామేశ్వర్ తన తమ్ముడి కొడుకుని దత్తు తెచ్చుకున్నాకా వారికో ఆడపిల్ల పుట్టింది. మీకు పిల్లలు లేరని నా కొడుకునిచ్చానూ, ఇప్పుడు అమ్మాయి వుందిగా నా పిల్లవాడిని నాకు ఇచ్చేయమంటూ సావిత్రి గొడవచేయడంతో వాళ్ళు పిల్లలని తీసుకుని, చాలా ఏళ్ళపాటు ఇక్కడినుండీ దూరంగా వెళ్ళిపోయారు..

ఆ పిల్లలు బాగా పెరిగి పెద్దవారయ్యాకా తిరిగొచ్చారు. ఇక ఆ కైలాష్ కి, అదే వాళ్ళ కొడుక్కి. చెప్పాలంటే కాలు నిలకడే లేదు, ఎప్పుడూ వూళ్ళు పట్టుకుని తిరుగుతూ వుండేవాడు. కానీ మహా తెలివిమంతుడు, సంపాదనాపరుడు. వాళ్ళు తిరిగొచ్చాకా మెల్లగా రాకపోకలు మొదలయ్యాయి రెండిళ్ళ మధ్యలో.

కాకపోతే అప్పుడప్పుడూ పండిత్తూ, కొడుకులూ వచ్చేవారు, సావిత్రిగానీ, కూతుళ్ళుగానీ, ఆఖరికి ఆ కోడలు పేరేంటి భగవాన్. ఆ.. తులసి కదూ. ఆమెగానీ రావడం చూడలేదు..

ఏదో పెళ్ళిలో చూసాను, అమాయకంగా, రబ్బరుబొమ్మలా వుంటుంది. అంతకు బరితెగించిందా ఆ పిల్ల అంటే నమ్మలేకున్నాను.., అయినా నాకెందుకులే. అదంతా.. హర హరా..., ఈ వయసులో నాతో ఏమేం మాట్లాడిస్తున్నావు తండ్రీ!!", అంటూ పైకి చూసి దేవుడికి చేతులు జోడించి, మళ్ళీ దించి, మావైపు చూసి కొనసాగించింది.

"ఏం చెప్తున్నానూ. ఆ పాపం, ఆ గొడవయ్యాకా ఈ వయసులో పాపం ఆ విశ్వేశ్వర్–రమా, మళ్ళీ దూరంగా వెళ్ళిపోయారు, ఎక్కడికి వెళ్ళారో ఏమో? తప్పలేదు ఐనా జరిగినదేమీ తక్కువ విషయంకాదు కదా చాలా ఘోరమైన అవమానం అది, కాదూ!

దత్తుడైనా, నెత్తిమీద పెట్టుకుని పెంచారు వాడిని, చివరకు అంత అప్రతిష్ఠ తెచ్చిపెట్టాడు, సొంత తమ్ముడి భార్యని హవ్వ మరదల్ని లేపుకుపోయి, ఎక్కడో కాపురం పెట్టి, కడుపుచేయడం అంటే.. అయ్యో..ఎంత దారుణం? "

నివ్వెరపోయి చూసాము. అంటే తులసి వెళ్ళింది విశ్వేశ్వర్ గారి కొడుకుతోనా. అతడు అంటే పండిత్ గారి పెద్దకొడుకేగా. అందుకేనా అంతగా ఆపేసారు ఏ ఇంక్వైరీ లేకుండా డామ్..

"వాడి పుణ్యమా అనీ, అటు పౌరోహిత్యమూ – ఇటు పరువూ, రెండూ పోయాయి, అంత పెద్ద పూజారులకి, పైగా నలుగురికీ చెప్పేవారికి, ఆ నలుగురి ముందే తలకొట్టేసినంత అవమానం" నిట్టూర్చింది బాధగా.

విసుగ్గా చూసాను, ' చాలు వినీ, వినీ విసిగిపోయాను వీరందరి పరువు మర్యాదల గురించి, అవతల ఒక నిండు ప్రాణం పోయిందన్న మినిమమ్ కన్ సెర్న్ లేదెవ్వరికీ' నిస్సహాయంగా చూసాను.

ఏం అడగాలి? సడన్ గా ఏదో స్ట్రైక్ అయింది, "మామ్మగారూ తమ్ముడు అంటే? విశ్వేశ్వర్ గారు తెచ్చుకున్నది పండిత్ గారి కొడుకునా? అంటే కైలాష్ పండిత్ కొడుకా?" అడిగాను.

గట్టిగా నవ్విందావిడ, "సర్లే రామాయణం అంతా విని రాముడికి సీత ఏమౌతుందన్నట్టుంది నీ కథ. అంతేకదా సావిత్రి, పండిత్ భార్య. కైలాష్ వారి పెద్ద కొడుకు. అర్ధమైందా కృష్ణ బాబూ?" అడిగింది.

తలూపాను యాంత్రికంగా, నా తల తిరిగిపోతోంది, 'అందుకేనన్నమాట వారెవ్వరూ కైలాష్ పేరెత్తనిది, అతగాడి తప్పుని ఎంచనిది, మొత్తం నేరాన్ని తులసి మీద మోపి, తనని మాత్రమే దోషిని చేసింది ఇందుకా. వాడు కూడా ఆ ఇంటి కొడుకేకదా. అందుకే పోలీస్ ఎంక్వైరీ వద్దని వాళ్లు చౌదరిగార్ని రిక్వెస్ట్ చేసిన దాని వెనుక వున్న రహస్యం ఇదన్నమాట. వాళ్ళూ–వాళ్ళూ ఒకటే..

పాపం తులసి ఏంజరిగిందనిగానీ, అతడెలా నిన్ను దగా చేసాడని గానీ ఎవ్వరూ అడగలేదు..

ఎందుకు తులసీ మన సొసైటీలో ఆడవాళ్ళకి ఇంత దారుణమైన పరిస్థితా? కనీసం వారి మొర, వారి పక్షపు వాదన వినేవారెవరూ కూడా వుండరా?

లేదు, వదలను, నేను వెతికి పట్టుకుంటానా కైలాష్ ని. తెలుసుకుంటాను, ఏం చెప్పి? బెదిరించా లేక భయపెట్టా? ఏం మాయ చేసి తనతో తీసుకుపోయాడు మా తులసిని.

శ్యామ్ నా భుజంమీద చేయుంచాడు, అర్థమైంది, ఇక ఇక్కడ తెలుసుకునేదేమీలేదు, వున్నకొద్దీ మళ్ళీ వాళ్ళు తులసి గురించి చెడుగా మాట్లాడడం వినవలసిరావడం తప్ప ఇంకేమీ లేదు, గాఢంగా నిట్టూర్చి మామ్మగారికీ, భగవాన్ కీ కృతజ్ఞతలు తెలిపి అక్కడినుండి కదిలి బయటికి వచ్చి, టాక్సీ ఎక్కి కూర్చున్నాము.

రఘుపతి ద్వారా ఇక కైలాష్ ని దొరకబుచ్చుకోవడం తప్ప వేరే మార్గం లేదు. కానీ అతణ్ణి ఎక్కడని వెతికేది, ఎలా వెతికేది? ఒకవేళ వెతికితే అతడు మాకు దొరికినా మాకెందుకు నిజం చెప్తాడు. అసలు మాతో ఎందుకు మాట్లాడతాడు,

మేము సహారా అని చెప్పినా, మరేమని చెప్పినా ఎలా లొంగుతాడు? ఏం అవసరం అతనికి మాదగ్గర లొంగేందుకు? ఐనా అసలా మనిషి ఎక్కడ దొరుకుతాడు, ఎలా, ఎక్కడని వెతికాలి?ఎలా పట్టుకోవాలి?

తలవిదిల్చాను. హఠాత్తుగా .. నాలో తెరలు తెరలుగా ఏదో విడిపోతున్న ఫీలింగ్.

ఒక్కవుదుట్న నడుస్తున్న కారు డోర్ తీసాను, కీచుమన్న శబ్దంతో కారాగింది, బిత్తరపోయిచూస్తున్న డ్రైవర్ నీ, శ్యామ్ నీ కూడా చూడకుండా, దిగి వెనక్కిపరిగెట్టాను, "ఏమైంది కృష్ణా!", అంటూ కంగారుగా నా వెనకే శ్యామ్.

పరుగున వెనక్కి వచ్చిన మావైపు అయోమయంగా చూసారు మామ్మగారు, అతికష్టంమీద ఊపిరి తీసుకుని, పక్కనున్న స్తంభాన్ని వూతంగా పట్టుకుని, రొప్పుతూ అడిగాను. "జగదీష్ కైలాష్ అన్నదమ్ములంటే ఎలా? మామ్మగారూ, వారు.. క.. కవలలు కదూ.. ఒకేలా వుంటారు కదూ?"

విచిత్రంగా చూసిందామె. "అవునూ. అది కూడా తెలియకుండా ఏం ఎంక్వైరీ చేస్తున్నారయ్యా మీరు. అందుకేకదా ఇదీ విషయం అని తెలిసిన దగ్గరనుంచీ మాకందరికీ ఆశ్చర్యం. వాడిలో లేనిది వీడిలో ఏంచూసిందా ఆ అమ్మాయి అనీ" అంటూ ఆవిడేదో చెప్పుకుపోతోంది.

అలసటగా స్తంభాన్ని ఆనుకుని కళ్ళుమూసుకున్నాను. ఒక్కో మబ్బూ విడిపోసాగింది.

తులసి కోమల్ కి రాసిన వుత్తరాలలో మాటల వెనుక మీనింగ్ అర్థమౌతోందిప్పుడు.

'ఆయన లో ఏదో మార్పు' అంటూ రాసుకుందా పిచ్చితల్లి. ఆయనే మారిపోయాడని తెలియక.

**కైలాష్** ని ఎన్నడూ చూడలేదు తులసి అందువల్ల అతడే జగదీష్ అని మనఃస్ఫూర్తిగా నమ్మింది. కైలాష్ కే ముందు తులసి సంబంధం చెప్పారు అని జగదీష్ మాటలు గుర్తొచ్చాయి. తులసి అద్భుతమైన అందమే తన శత్రువన్న అమ్మ మాటలు అర్థమవ్వసాగాయి.

కైలాష్ ట్రాప్ అర్థమైంది. జగదీష్ ని దూరంగా పంపాడు బిజినెస్ అంటూ. రఘుపతి సాయంతో తులసిని తనదగ్గరకి రప్పించుకున్నాడు రామ్ గఢ్. తను నమ్మింది. భర్త రూపంలో మరొకరుంటారని ఏ స్త్రీ అనుకుంటుంది.

తనుగా ఏ తప్పూ చేయలేదు. తను దారుణంగా మోసపోయానని తెలిసేసరికీ అందరిముందూ తానే దోషైంది. మే బీ తనకి అసలా సంగతి అర్థం అయివుండకపోవచ్చుకూడా.

అసలేం జరిగింది తల్లీ? అంటూ ఏ ఒక్కరు. కనీసం ఒక్కరు అడిగివున్నా, ఆలోచించివున్నా ఈరోజు మా తులసి ప్రాణాలతో వుండేది.

అడగనిదే సంజాయిషీ ఇవ్వడం తులసికేనాడూ తెలియని పని కదూ. అయినా చెప్పింది. ఎవ్వరూ నమ్మలేదు కనీసం ఆలోచించలేదు. భర్త,తల్లి–తండ్రి, అయినవాళ్ళూ.

ఎవ్వరూ నమ్మని క్షణాన, నిజంగా నేనే తప్పూ చేయలేదంటూ ఎక్కడోవున్న నాకు ఓ కాగితం ముక్కలో చెప్పుకుంది. పిచ్చి పిల్ల. అయ్యో.. తులసీ.

స్తంభం పట్టుకుని అలాగే కూలిపోయాను. నా పక్కనే శ్యామ్ కూడా. అలా ఎంతసేపు వుండిపోయామో మాకే తెలీదు.

జరిగినదేమిటో అర్థమౌతుంటే నా కన్నీళ్ళు నాలోనే ఇంకిపోసాగాయి. నాలోని బాధ మొత్తం కోపంగా, ఆక్రోశంగా మారుతుండగా విసురుగా లేచి బయటకు నడిచాను.

నా అణువణువూ ఆవేశంతో రగిలిపోతోంది.

మేం ఇచ్చిన రిపోర్ట్ చూసిన చౌదరిగారి ముఖం ఒక్క బొట్టు రక్తంలేనట్టుగా పాలిపోయింది.

"తులసి గురించి తప్పుగా ప్రచారం కావడానికి ముఖ్యమైన కారణం కేవలం మీరు. మీరు ప్రోపర్ గా ఇంక్వైరీ చేయకపోవడమే అన్నింటినీ మార్చేసింది. తన మరణానికి సరిగ్గా కారణాలు తెలుసుకోకపోవడమే కాకుండా, తప్పు చేసాననే గిల్ట్ వల్ల సూసైడ్ చేసుకుందంటూ తీర్పు తీర్చేస్తారా? హౌ కెన్ యూ? హౌ కేన్ యూ డూ దట్ డామ్ ఇట్?" అంటూ బలంగా నా ముందున్న టేబుల్ మీద చరిచాను. నా ఆవేశానికీ, కోపానికీ ఆ టేబులే కాదు చౌదరిగారూ కదిలిపోయారు.

"లేదు కృష్ణ గారూ తప్పు చేశాం. చెప్పాలంటే సరిదిద్దుకోలేని తప్పు. ముఖ్యంగా నేను. ఐ అడ్మిట్ ఇట్. జగదీష్, కైలాష్ లని ప్రశ్నించడం అంటే ఏదో పండిత్ గారి ఫ్యామిలీకి చేసే అన్యాయంగా భావించి.. ఛ.. కాకపోతే అది అప్పుడువున్న పరిస్థితిలో అనవసరం అనిపించింది. ఎందుకంటే, అందరిముందూ ఆ పిల్ల సారీ, ఆమె అదే తులసి తప్పు ప్రూవ్ అయిపోయినప్పుడూ" ఆగాడు.

"తులసి తప్పు చేసానని చెప్పలేదు, ఎక్కడా, ఎప్పుడూ. తనతప్పేమీ లేదని మాత్రమే చెప్పింది తులసి. అంతే చెప్పింది. దట్ ఈజ్ ఆల్ షీ సెడ్. అదే తను ఒప్పుకున్నది" గొంతు చిట్లిపోయేలా అరిచాను. నా కళ్ళల్లోంచి నీళ్ళు వెచ్చగా రాలి స్టేషన్ ని, అక్కడి వాతావరణాన్ని మరింత వేడెక్కించాయి.,

"ఐనా తప్పుచేసానని ఏ ఆడది, రాదర్ ఏ మనిషి ఒప్పుకుంటారు సర్. ఆమె భర్త అంత క్లియర్ గా చెప్పేసరికి ఆమె తల్లితండ్రులు కూడా నమ్మలేదు తను నిజం చెప్తోందని."

కన్నీళ్ళతో తలెత్తాను "అసలు.. అసలు జరిగిందేంటో తులసికి కనీసం అర్థమై కూడా వుండదు చౌదరిగారూ. పాపం ఆ పిచ్చిపిల్లకేం తెలుసు తనతో అన్నాళ్లుగా కలసివున్నది నేను కాదూ అని భర్త చెప్తే ఎంత షాక్ తిని వుంటుంది? ఎంత మధనపడివుంటుంది? జరిగిందేమిటో అర్థంకాక, తనతప్పేంటో తెలియక ఆ క్షణం తన గుండె ఎంత

పగిలివుంటుంది? ఆ స్థితిలో ఆమెకే జవాబు తెలియని, అర్థంకాని, ఆ నిస్సహాయస్థితిలో పాపం ఆమె దానినుండి తేరుకునే లోపు, ఆ పిచ్చిపిల్లమీద ఏవేవో ప్రశ్నలు గుప్పించి జవాబులు కూడా వాళ్ళే వూహించుకుని, మాటల ఈటెలతో హింసించీ, శిక్షవిధించీ, అదీ నడిరోడ్డుమీద అతి దారుణంగా అవమానించీ ఆమెని మానసికంగా అక్కడే ఆరోజే చంపేసారు. మూడురోజుల తర్వాత పోయింది ఆమె భౌతిక శరీరం మాత్రమే చౌదరిగారూ.

ఇట్స్ ఇన్డీడ్ ఎ మర్డర్, ఎ మాస్ మర్డర్. దాన్ ఎ సూసైడ్. యూ ఆల్ రాదర్ వీ ఆల్ కిల్డ్ హర్. ఒక తప్పు జరిగిందీ అనగానే అది ఆ సిట్యుయేషన్ లో వున్న స్త్రీది మాత్రమే అని అంటగట్టే మనం, ఏ తప్పులో ఐనా స్త్రీని మాత్రమే బ్లేమ్ చేసే మనం, మనందరం కలిసి చంపేసాం సగర్వంగా, నిర్లజ్జగా. వీ ఆల్ కిల్డ్ హర్.

మా తులసి కేవలం జగదీష్ ప్రశ్నకు తనకు అర్థమైన జవాబు చెప్పింది, నిజం చెప్పింది, నిజమే చెప్పింది. కానీ, తను.. తనేతప్పూ చేయలేదు. భర్తనుకుంది పాపం. నిజమే చెప్పింది తనూ" దుఃఖంతో గొంతు, గుండె మూగబోయి ఇక మాట్లాడలేక, టేబుల్ దన్నుతో ముందుకు తూలాను.

చప్పున నాకు ఆసరాగా ఓ భుజం నా భుజాన్ని చుట్టుకుంది. తెలుస్తునేవుందది శ్యామ్ చేయి అని, వాడి కన్నీటిని కూడా చూసే ధైర్యంలేక కళ్ళు మూసుకున్నాను. నా భుజానికి తలాన్చిన అతని శ్వాసలో ఉద్వేగం, షర్ట్ ని తడుపుతూ నా గుండెని చేరుతున్న వాడి కన్నీటి వేడికి నా గుండె మరింత మండింది. కానీ ఇక వివరించే ఓపికలేక అలసటగా అక్కడున్న ఛైర్ లోకి జారిపోయాను.

బాధగా చూసారు చౌదరిగారు మా వైపు "లేదు, లేదు కృష్ణగారూ, మీరిద్దరూ.. వద్దు ప్లీజ్.. అంతలా బాధపడకండి. నాకు ఒక్కరోజు టైమ్ ఇవ్వండి చాలు, కేవలం ట్వంటీ ఫోర్ అవర్స్. రేపు ఈవెనింగ్ న్యూస్ చూడండి. కైలాష్ లేదూ, జగదీష్ లేదు, సతీష్, పండిత్ గారూ ఎవ్వర్నీ లెక్కచేయం, తులసికి జరిగిన అన్యాయాన్ని బయటపెడతాం, మా పొరపాటు కాదు, కాదు మా తప్పుని కరెక్ట్ చేసుకుంటాం.

ఒక్క అవకాశం ఇవ్వండి. వి ఆర్ అషేమ్డ్. ఈవెన్ టు సే సారీ ఆర్ అపాలజైజ్. పోయిన ప్రాణాన్ని తిరిగి తేలేము, జరిగిన నష్టాన్నీ పూడ్చలేము. కానీ.. మా ", చేయెత్తి ఆయన్ని ఆపుతూ చెప్పాను "మాటలొద్దు సర్ ఏం చేస్తారో చేయండి, చేసి చూపించండి. 24 అవర్స్ ఎదురూ చూస్తాము. అలాగే వారణాసి న్యూస్ కూడా" అంటూ లేచి విసురుగా బయటకు నడిచాను.

చుట్టూ చూసాను, చౌదరిగారు ఏర్పరిచిన పబ్లిక్ పంచాయితీ వన్స్ అగైన్ అబౌట్ తులసి నో ఫర్ తులసి. బట్ ఇన్ హర్ ఆబ్సెన్స్ అందరూ వున్నారు, జగదీష్, సతీష్, పండిత్, భార్య, కూతుళ్ళు, కోడలు, అల్లుళ్ళూ, రామేశ్వర్ పండిత్,

ఆయన సంతానం, కైలాష్ తప్ప. వారి ఇతర బంధువులు, పంచాయితీ సభ్యులూ, చుట్టుపక్కలవాళ్ళూ, చౌదరిగారూ, సహారా నుంచి ప్రత్యేకంగా వచ్చిన నిజమైన వాలంటీర్లు.

కైలాష్ ని మాత్రం ఎట్టిపరిస్థితుల్లో పట్టుకుని కేస్ బుక్ చేసి, శిక్షపడేలా చేస్తానని చౌదరిగారు మాటిచ్చారు. అందరూ వచ్చారని ఆయన సైగతో లేచాను,

"కంగ్రాట్యులేషన్స్ టూ యూ ఆల్. మీ అందరికీ ముందుగా నా అభినందనలు" చెప్పాను వెగటుగా చూస్తూ.

కోపంగా లేచాడు సతీష్ నాథ్ "ఏదో ముఖ్యమైన విషయమన్నారు, అన్నయ్యని కూడా హాస్పిటల్ నుండి తీసుకువచ్చారు, దేనికీ మీటింగ్. మీ వెటకారాలు వినే టైమ్, ఓపికా మాకు లేదు" అంటూ.

"ఉండాలి మిస్టర్ సతీష్ నాథ్. వుండి తీరాలి. కల్చర్ ముసుగులో ఎందరినో సఫర్ చేయించిన వీరందరికీ, వీరి నిర్ణయాలని సమర్థించి, ఆచరించే మీ అందరికీ మేము చెప్పేది వినే ఓపిక కూడా వుండాలి. బెటర్ బీ సీటెడ్. కనీసం మిమ్మల్ని రోడ్డుమీద నిలబెట్టలేదు.. ఆరోజు మీరు తులసిని నిలబెట్టినట్టు" తీవ్రంగా చెప్పాను.

"ఆ అమ్మాయి తప్పు చేసిందయ్యా" అన్నాడొకడు పంచాయితీ పెద్దల గుంపులోంచి.

"ఆహా! తప్పులు ఎవరు చేయరో కాస్త చెప్తారా? తప్పులు అందరితోనూ జరుగుతాయి. కానీ అసలైన క్షమించరాని తప్పుల్ని చేసింది మాత్రం మీరే. సరైన విచారణే లేకుండా శిక్షలు విధించిన వీరి విధానాలే మా తులసి మరణానికి కారణం.

మీరు సరిగ్గా తెలుసుకుని వుంటే మాత్రం. భర్తని ముమ్మూర్తులా పోలిన వ్యక్తి మరొకరున్నారని తెలియక తనతో వున్నవాడు తనభర్తే అని ఒకనాటి పతివ్రత అహల్యలా అమాయకంగా నమ్మిన మా తులసి గురించి తెలిసేది.

చివరికి, జరిగిన విషయం అర్థమైనా కూడా, దత్తతవెళ్ళిన తమ కొడుకు కోసం – ఇదీ జరిగిందని బయటకి చెప్పని ఆ పండిత్ కుటుంబపు స్వార్థచింతన తెలిసేది.

ఒకవేళ అది తప్పే అయినా, అదే మన బిడ్డ చేస్తే కడుపులో పెట్టుకోమూ. అదేగా మీరు చేసింది. అంటే మీ ఇంటి బిడ్డ కాబట్టి వాడు చేసిన మోసం సమ్మతం. మోసపోయిన పిచ్చిపిల్ల జీవితం నాశనమా? అదేం న్యాయం?

తను చేసిన తప్పల్లా వారిద్దర్నీ వేరు అని పోల్చుకోలేకపోవడం కాదు, తనని పతనమయ్యావని తీర్పు తీర్చిన మిమ్మల్నందర్నీ వెలివేసి తను దూరంగా జరగకపోవడం.

పాపమా రోజుల పసిగుడ్డుని వదిలి, ఇలాంటి కుంచించుకుపోయిన కుళ్ళిపోయి ఆలోచనా పరులవల్ల, తన తప్పే లేని చోట విలువైన ప్రాణాలని వదిలేయడం అది తన తప్పు.

మిమ్మల్నందర్నీ ఒకే ప్రశ్న వేస్తున్నా. ఒకే తప్పుని గారాల కూతురు చేస్తే క్షమించగలిగిన మనం మన జీవితభాగస్వామి చేస్తే ఎందుకు క్షమించకూడదు?

ధార్మికతకు నిలువెత్తు నిదర్శనం సాక్షాత్తూ ఆ ఆదిశంకరాచార్యులవారే మనిషిని, మనిషి వెలివేయడం అధర్మమని చెప్తే, ఆయన్ని గౌరవిస్తున్నామంటూ మీరు చేస్తున్నదేమిటి?

ఒక్క మనిషిని వెలివేయడమే తప్పైతే మీరు ఓ కుటుంబాన్నే అగౌరవపరిచారు. మరి మీ నేరానికే శిక్షవిధించాలి?" అడిగాను తీవ్రంగా చూస్తూ. అందరూ స్తబ్దంగా వున్నారు.

"సర్ జగదీష్ చంద్రబోస్ గారి ప్రకారం మొక్కలకి కూడా భయమూ, బాధా తెలుస్తాయట. వాటిని బాధపెట్టకూడదనన్నారాయన. మన దగ్గర ఓ అమ్మాయి ఓ మొక్కపాటి కూడా చేయదు, నిర్మొహమాటంగా హక్కుతో బాధపెడతాము.

బాధ్యతలంటూ ముళ్ళకిరీటాలతో అలంకరిస్తాము, అనుక్షణం ఆంక్షలతో కట్టేయాలని చూస్తాము, నువ్విలాగే వుండాలనీ, ఇది తప్పనీ ఒప్పనీ చెప్పడానికి మనమెవరం..?

మన పిల్లలని వేరే దేశాలకి పంపాలి. అభివృద్ధి చెందాలి.., అదే అభివృద్ధి మీ ఆలోచనల్లో తెచ్చుకోవడానికి ప్రయత్నించండి,

మీకు నీతులు చెప్పట్లేదు, ఆర్డర్ వేయట్లేదు, చేతులు జోడించి వేడుకుంటున్నాను. మీరు మారితే, మీ విధానాలు మార్చుకుంటే కనీసం వాటివల్ల క్షోభిస్తున్న ఎందరో తులసులకది మనఃశాంతి.. మా తులసి కది ఆత్మశాంతి..",

చెప్పడం పూర్తిచేసి, కన్నీళ్ళతో కదిలాను. నిశ్శబ్దంగా నా వెంట శ్యామ్ కూడా.

"తులసి నిజమే చెప్పింది.. తనుగా ఏ తప్పూ చేయని ఆ తులసి లాగే మా తులసీ దేవతే. పవిత్రమైన పునీత మా తులసి."

**ఉపసంహారం**

"దిస్ ఈజ్ రియల్లీ ఎ మాన్స్ వర్ల్డ్ అని క్రిష్ పదే పదే అంటుంటాడు, నిజం కదూ ప్రీతీ, వాట్ యూ సే" అడిగింది ముద్ర.

సాలోచనగా చూసింది ప్రీతి, "అలా ఎందుకు అంటున్నావ్ డియర్. తులసికి జరిగిన ట్రాజిడీ గురించా?"

"నో నో అయామ్ నాట్ టాకింగ్ అబౌట్ ఇట్. అలా ఐతే అక్కడ అన్యాయం చేసిన జెండర్, న్యాయం కోసం ఫైట్ చేసిన జెండర్ రెండూ ఒకటే కదా?" తిరిగి అడిగింది ముద్ర మృదువుగా.

"రైట్. మరైతే వై? ఎందుకలా అన్నావ్ సడెన్ గా?" కుతూహలంగా చూస్తూ అంది ప్రీతి.

"త్రూ అవుట్ ది సీరీస్ లో అందరూ ఒకటే ప్రశ్న క్రిష్ ని అడుగుతూనే వున్నారు తులసిని ప్రేమించాడా అని" అంటూ ఆగి నెమ్మదిగా అంది "కానీ, ఎవ్వరూ.. ఎవ్వరూ తులసిని అడిగనేలేదుకదూ, తను క్రిష్ ని ప్రేమించిందా అనీ" అంది ముద్ర జాలిగా.

ఉలిక్కిపడింది ప్రీతి. ఎవ్వరూ తరచిచూడని యాంగిల్. "యాహ్.. అవును కదూ.." అప్రయత్నంగా.

ముద్ర కంటిన్యూ చేస్తూ అంది "కనీసం క్రిష్ తో సహా ఏ ఒక్కరూ అడగలేదు. ఎవ్రీవన్స్ కాన్ సన్ ట్రేషన్ వాజ్ వాట్స్ ఆన్ కృష్ణాస్ మైండ్. తులసి నుండి కేవలం తన రెస్పాన్స్ అడిగారు, రియాక్షన్ కోసం చూసారు, కానీ, తన మనసులో ఏముందో ఎవరూ అడిగే ప్రయత్నం చేయలేదు ఎందుకని? ఎందుకంటే ఒకబ్బాయిగా అతని ఒపీనియన్ మాటర్స్. మరి తనో. ఊహూ. పూర్ గర్ల్ " నిట్టూర్చింది ముద్ర.

" అంటే నువ్వనేది తులసి కృష్ణని "

"మ్మ్.. మే బీ, ఆర్ మే నాట్ బీ. నాకెందుకో అలా అనిపించింది. ఫీలింగ్ వెరీ సారీ ఫర్ హర్. స్లైట్లీ గిల్టీ టూ" కొద్దిపాటి దిగులు ధ్వనిస్తున్న గొంతుకతో అంది.

చిన్నగా తలూపి, "ఐ కెన్ అండర్ స్టాండ్, కేవలం ఆమె మౌనం వల్లనే క్రిష్ ఈరోజు నీతో వున్నాడేమో అని కదూ..", అడిగింది ప్రీతి నెమ్మదిగా.

కాస్తంత బాధగా చూసి తలూపింది ముద్ర.

"అదేమీ ఆలోచించకు ముద్రా. ఎవ్రీ థింగ్ ఈజ్ ప్రీ డిసైడెడ్. ఐనా తన మనసులో వున్నదేమిటో ఎవరికి తెలుసు? క్రిష్ అన్నట్టు శ్యామ్ ఎలాగో, తులసీ తనకి అంతే అని. బహుశా ఆమెదీ అదే ఫీలింగ్ ఏమో? అందుకే తనూ ఏమీ చెప్పలేదు.

ఐనా తులసి కోసం మీరిద్దరూ చేసిన సాహసం సామాన్యమైనదేమీ కాదు, అదీ పెళ్ళి నెలరోజుల్లో పెట్టుకునీ. తనలైఫ్ కి ఓ గౌరవం, తను పోగొట్టుకున్న గౌరవం తిరిగిచ్చారు అది చాలు. తనుంటే హ్యాపీ గా మిమ్మల్ని బ్లెస్ చేసేది. అవునా కాదా చెప్పూ. ఇంకెదుకా గిల్ట్ వదిలెయ్, సో ఫర్గెట్ ఎవ్రీథింగ్ అండ్ బీ హ్యాపీ. ఛీరప్. పద వెళ్దాం వాళ్ళొచ్చేసుంటారీపాటికి" అంటూ లాలనగా ఆమె భుజం తట్టింది ప్రీతి.

పార్టిషన్ కి అవతలి పక్కనున్న స్పేస్ లో వున్న నేను స్తబ్దంగా వుండిపోయాను. ముద్రకి తెలియని విషయం ఒకటే. ఆ ప్రశ్న నేను ఏనాడో అడిగానని. ఏళ్ళక్రితమే. నా గురించేమనుకుంటోంది, తనెవర్నైనా ప్రేమిస్తోందా అంటూ కబురు పంపాను.

కానీ జవాబు తెలుసుకునే పరిస్థితులే రాలేదు. అందుకే ఎన్నడూ మళ్ళీ అడగలేదు.

తులసి కృష్ణని ప్రేమించిందా?

సమాధానం తెలిసినది ఇద్దరికే ఒకరు తులసి. తను చెప్పలేదు. మరొకరు శ్యామ్. అతడిక చెప్పడు.

కానీ. మరి నన్ను నేను కూడా. ఆ ప్రశ్న. కనీసం కలలో కూడా వేసుకునే ప్రయత్నమే చేయలేదు. ఎందుకు? బహుశా జవాబు నా మనసుకి తెలుసేమో? ఉలిక్కిపడి తలవిదిల్చాను.

కాస్త దూరంలో కూర్చుని నిశ్చలంగా నన్నే చూస్తున్న శ్యామ్ వైపు చూసాను, "పద వెళ్దాం" నాలోనుండి గతాన్ని మనసు గదిలో ఓ మూలకి దాచిపెట్టి శాశ్వతంగా మూసేయడానికే నిర్ణయించుకుని, ఆ ఆలోచనలలోంచి తేరుకుంటూ స్థిరంగా చెప్పాను.

తులసి బిడ్డని శ్యామ్–ప్రీతి దత్తత తీసుకుంటున్నారారీరోజు. అది అటెండ్ చేయడానికే ముద్ర వచ్చింది. తనతోపాటే తిరిగి వెళ్ళాలిమేమంతా. ఎందకంటే ఎక్కువ టైం లేదు మా పెళ్ళికి.

లేచి నావైపు వచ్చి లాలనగా నా భుజం తట్టి చిరునవ్వు నవ్వాడు శ్యామ్.

నా అంచనా తప్పుకాదు, నా మౌనాన్ని సైతం చదవగలిగింది ఇద్దరే. ఒకరు శ్యామ్. మరొకరు.. ఇక నా మౌనంలోనే ఇమిడిపోయి నిలిచిపోయిన నా ఆప్తురాలు తులసి.